
అక్టోబర్, 2009

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 9 పేజీలు: 64 వెల: రూ. 20/-



## మహాజన హృదయనేత మహాభినిష్క్రమణం

# గ్రామ స్వరాజ్యంపై
# అపార అనురాగం
# ఆయన సొంతం

"స్వతంత్ర భారతదేశం తప్పనిసరిగా పంచాయితీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటుంది."

–గాంధీజీ, (8 జూన్, 1947 హరిజన్ పత్రిక)



# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 9

అక్టోబర్, 2009



ఎడిటర్

**ఫణి కుమార్**

ఎడిటోరియల్ బోర్డు

**డి. రామకృష్ణ,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**కె. అంబరీష్,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**సెబాస్టియన్ రాజు** ఎ.పి.ఏ.ఎస్. (రిటైర్డ్)

**బ్రిగేడియర్ డి.వి. రావు**

**మహమ్మద్ తకీయుద్దీన్**

**ఎమ్.ఎ. కుమార రాజా**

**హెచ్. కూర్మారావు**

**డాక్టర్ ఇ.వి. స్వర్ణలత**

**ఎన్. విజయ కుమార్**

**బి. నరేంద్రనాథ్ రావు**

**ఆర్. సూర్యనారాయణ రెడ్డి**

**డాక్టర్ వి.ఎస్.ఎస్. ప్రసాద్**

**డాక్టర్ సి. కృష్ణ మోహనరావు**

**డాక్టర్ వి.ఎన్.వి.కె.శాస్త్రి**



కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
మాస్టర్ మల్టీమీడియా, హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. అపార్డ్
రాజేంద్రనగర్
హైదరాబాద్–500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040–24018656
ఫ్యాక్స్ : 040–24017005

E-mail ID : Phanikumar@ap.gov.in


# విషయ సూచిక


సంపాదకీయం .......... 2

మూడు రోజుల ఉత్సవం దీపావళి .......... 3

సర్వ జనాభివృద్ధి సంకల్పానికి నిలువెత్తు నిదర్శనం..
డాక్టర్ వై.యస్. రాజశేఖర రెడ్డి .......... 6

కళాత్మక విన్యాసాల కళాక్షేత్రం చీరలు .......... 10

గాంధీజీ గ్రామ స్వరాజ్యం .......... 11

ఇ-గవర్నెన్స్‌కు ఆకాశమే హద్దు .......... 15

మన గ్రామం – మన చట్టం .......... 22

మహాజన హృదయనేత మహాభినిష్క్రమణం .......... 25

మెరుపు వేగంతో నిర్ణయాలు, అదే వేగంతో అమలు .......... 29

జనం కోసం జలం – అదే వై.యస్. నిరంతర తపన .......... 30

నిండు రూపం నిండైన వ్యక్తిత్వం .......... 32

ప్రజల సమస్యలు తెలుసు – తీర్చే విధానమూ తెలుసు .......... 35

ఆరని దుఃఖం – తీరని సంతాపం .......... 39

దండారి .......... 42

స్థానిక ప్రభుత్వాలు – జనన మరణ రిజిస్ట్రేషన్ల ఆవశ్యకత .......... 46

బుడిగె జంగాలు .......... 48

తెల్ల కాగితాల (సాదా బైనామాల) ద్వారా జరిగిన భూమి
కొనుగోళ్లు క్రమబద్ధీకరించుకోవాలంటే .......... 50

గ్రామీణ ప్రాంతాలలో వరికి ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా
సక్రమ నీటి యాజమాన్యము .......... 51

నవకవనంలో నానారకాలు (శ్రీ రమణ పేరడీలు) .......... 53

ముఖ్యమంత్రిగా శ్రీ రోశయ్య ప్రమాణం .......... 57

చదరంగపు రారాణి కోనేరు హంపి .......... 58

మహనీయుల చతురోక్తులు .......... 62

గ్రామీణాభివృద్ధి పథకాలపై ఫిర్యాదులకు
టోల్ ఫ్రీ నెంబరు 155321 .......... 63

కీర్తి శేషులు డా. పి. సుబ్రహ్మణ్యం గారు
గిరిజనాభివృద్ధికై చేసిన కృషి .......... 64

సంపాదకీయం..

# పల్లెకు పట్టం కట్టిన పల్లెమనిషి

పల్లె సమస్యలను స్పృశించిన ఆ చేతులు నిశ్చలనమయ్యాయి. సమయం దొరికినప్పుడల్లా, సందర్భం కుదిరినప్పుడల్లా పల్లెకు పయనం కట్టిన ఆ కాళ్లు అచేతనమయ్యాయి. పల్లెవాసుల కష్టాలు అర్థం చేసుకున్న ఆ గుండె కొట్టుకోవటం మానేసింది. అందుకే, ముఖ్యమంత్రి డాక్టర్ వై. యస్. రాజశేఖరరెడ్డి హఠాన్మరణంతో పల్లెలు ఒక్కసారిగా మూగపోయాయి. పల్లె మనిషి ఇక లేడే అని గుండెలవిసేలా రోదించాయి. పల్లె కష్టాలు అర్థం చేసుకుని, పల్లె ప్రజల కన్నీళ్లు తుడవటం వల్లనే ఆయన మరణం వారిలో తీరని శోకం కల్గించింది. పల్లెలే కాదు, పట్టణాలకు, అక్కడి ప్రజలకు ఆయన చేపట్టిన కార్యక్రమాలు తక్కువేమీకాదు.

మన గ్రామాల సౌభాగ్యం వ్యవసాయంపైనే ఆధారపడి ఉండగా, ఆ వ్యవసాయం నీటిపారుదల సౌకర్యాలపై ఆధారపడి బతుకుతోంది. మొదటిసారి అధికారంలోకి రాగానే ఆయన చేసిన తొలి సమీక్ష నీటిపారుదల సౌకర్యాల కల్పన పైనే. రెండవసారి అధికారంలోకి వచ్చినప్పుడు కూడా అదే పనిచేశారు. లక్ష కోట్ల రూపాయలతో 81 ప్రాజెక్టులను నిర్మించి కోటి ఎకరాలకు నీరందించాలనే బృహత్తర లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. వీటిలో కొన్ని పూర్తయి, రైతుల పంట పొలాలకు నీరందిస్తుండగా, మరి కొన్ని నిర్మాణంలో ఉన్నాయి.

ఇక ఉచిత విద్యుత్ గ్రామాల కష్టాలు తీరడానికి ఎంతో దోహదపడింది. 2004లో అధికారంలోకి రాగానే ఆయన చేసిన తొలి సంతకం రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చే ఫైలు పైనే. రైతుల విద్యుత్ బకాయిలను కూడా మాఫీ చేశారు. రెండవసారి అధికారంలోకి రాగానే రైతులకు 9 గంటలపాటు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేసే ఫైలు పైనే తొలి సంతకం పెట్టారు. రైతులు చెల్లించే వడ్డీలపై మారటోరియాన్ని విధించిన ఘనత వై.యస్.కే దక్కుతుంది.

కేంద్రప్రభుత్వ పథకమైన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అత్యంత సమర్థవంతంగా మన రాష్ట్రంలో అమలు చేయించారు దివంగత ముఖ్యమంత్రి. సామాజిక తనిఖీ ప్రక్రియ ఈ పథకాన్ని మన రాష్ట్రంలో కొత్త పుంతలు తొక్కించింది. గ్రామాల్లో సంపద సృష్టికి, పల్లెవాసుల ఉపాధికి దోహదపడింది.

అంతేకాక, పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా అడిగిన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయ బృందాల మహిళలకు, రైతులకు పావలా వడ్డీకే రుణాలు, నిరుపేదలకు కార్పొరేట్ చికిత్సలు అందించిన ఆరోగ్యశ్రీ, 108, 104 అంబులెన్స్ సర్వీసులు, ఇంజనీరింగ్, మెడికల్ మొదలైన వివిధరకాల కోర్సులకు ఫీజుల రీయింబర్స్‌మెంట్, పేదలకు 2 రూపాయలకు కిలోబియ్యం, మహిళలకు 'అభయహస్తం' ఫించన్ ఏర్పాట్లు, అభాగ్యులకు పెంచిన ఫించన్ మొత్తాలు తదితర పథకాలెన్నో పల్లెలకు ఊపిరిపోశాయి. ప్రజా సంక్షేమమే శ్వాసగా పాలన సాగించిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై. యస్. రాజశేఖరరెడ్డికి బాధాతప్త హృదయంతో ఇదే మా వినమ్ర పూర్వక నివాళి.

# మూడు రోజుల ఉత్సవం దీపావళి

**ఏ పండగనైనా గుర్తించలేకపోవచ్చేమో గాని దీపావళిని మాత్రం ఒక నెల ముందు నుండే గమనించవచచ్చు. టపాకాయల ఢాంఢాంలతోనూ, తుపాకుల టప్పుటప్పు మోతలతోనూ.**

**అయితే నిజమైన చెప్పుకోదగిన అంశమేమంటే దీపావళి మనమనుకునేటట్టుగా రెండ్రోజుల పండుగ కాదు. మూడు రోజుల ఉత్సవం ఉన్న పండుగ. వరసగా విశేషాలని చూసుకుంటూ వెడదాం!**

## మొదటిరోజు బలిత్రయోదశి

ఈరోజు తెల్లవారు జామునే పిల్లల్నందర్నీ నిద్రలేపి వాళ్ల మాడు (తల మధ్యభాగం) మీద కన్నతల్లి తన కుడి చేతి మూడు నాలుగు వేళ్లతో కేవలం నువ్వుల నూనెని మాత్రమే ఒత్తుతూ పెట్టాలి. ఆ నువ్వుల నూనెని అద్దేటప్పుడు తనకిష్టమైన ఆశీర్వచనాలని (విద్యాభివృద్ధిరస్తు - దీర్ఘాయుష్యమస్తు...) ఇయ్యాలి. సంస్కృతంలో మాకెలా వస్తుంది దీవించడం? అనుకోనక్కర్లేదు. మనకొచ్చిన భాషలో గుండెనిండుగా వాళ్లని ఆశీర్వదిస్తే, అవి ఫలిస్తాయని ప్రతి తల్లీ భావించి దీవించాలి.

లోకంలో తల్లి దీవెనకి మించిన మంత్రం లేనే లేదు (న మాతు: పరదైవతమ్) కాబట్టి, పిల్లలకి తల్లులు ఇలా ఆశీర్వదింప జేసుకోవడం అలవాటు చెయ్యాలి.

ఆ వెంటనే శరీరం నిండుగా గట్టిగా మర్దిస్తున్నట్లుగా నువ్వులనూనెని పట్టించాలి. ఒక గంటపాటు వాళ్లని నాననియ్యాలి ఆ నూనెతో. దాంతో శరీరంలో ఉన్న ప్రతి రోమకూపం కింద ఉన్న చిన్న చిల్లుల్లో ఉన్న మట్టీ ఈ నూనె కారణంగా నానుతుంది. గంట అయి పిమ్మట సున్నిపిండితో గట్టిగా ఒంటిని నలవాలి. ఇలా మర్దించి నలిస్తే, ప్రతి రోమరంధ్రంలో దాగి ఉన్న మట్టి ఒక ముద్దలా అయి మన చేతిలోనికి రావడమే కాక, ప్రతి వెంట్రుక కింద ఉన్న చిన్నరంధ్రమూ కూడ తెరుచుకోబడుతుంది.

ఇంటికున్న కిటికీలని తెరిచినట్లయితే ఎలా గాలీ, వెలుతూరూ ఇంట్లోకి ప్రవేశిస్తూ రాకాపోకా సాగించగలవో అదే తీరుగా శరీరంలో ఏ వ్యర్థ పదార్థాలున్నాయో అవన్నీ స్వేదరూపంగా శరీరం నుండి మెల్లగా బయటికి వెళ్లిపోతాయి. లేని పక్షంలో వ్యాధిగా మారుతాయన్న మాట.

ఇలా మర్దించడం వల్ల శరీరంలోని ప్రతి కేశనాళికకీ కూడ ఒత్తిడి కలిగి రక్తప్రవాహమనేది ఎక్కడా ఆగడమనేది ఉండనే ఉండదు. అంతేకాక నువ్వులనూనెకి శరీరంలోనికి వెళ్లగల జిడ్డుతనం కూడ ఉన్న కారణంగా శరీరంలోనికి పోయి కందెనలా పనిచేసి ఎక్కడెక్కడ శరీరంలో సంధులు (మోచేయి, మెకాలు, భుజాలు వంటి రెండు రెండు భాగాల అతుకులు) న్నాయో వాటిని సులభం చేసి చక్కగా కదిలేలా చేస్తుంది.

పూర్వకాలంలో వాళ్లకి మోకాళ్ల నొప్పులూ, మోచేతి నొప్పులూ ఈ కాలం వాళ్లంత లేకపోవడానికి కారణం ఈ అభ్యంగ స్నాన పద్ధతే. ఒక

వాహనాన్ని ఎంతగా శ్రద్ధ తీసుకుని తుడిచి కడుగుతున్నామో కనీసం అంతమాత్రపు జాగ్రత్త కూడ మనం మన శరీర విషయంలో చూపడమే లేదు. ఆ ఫలితమే ఈ నొప్పులు.

ఈ విధంగా నలిచాక వాళ్ల తలని కుంకుడు పులుసుతో మాత్రమే రుద్దాలి. కుంకుడుకాయలో ఒక విధమైన చేదుతనం ఉంటుంది. ఆ చేదు కారణంగా క్రిమికీటకాలు రావు. ఆ కుంకుడుపులుసు చేదుతనం తలకి గట్టిగా పట్టి సహజంగా తలలో కన్పించే చుండ్రు, పేలు, ఈపెలు మొదలైన వ్యాధులు దరిచేరనే చేరవు. ఎప్పుడు తలంటు పోసుకున్నా వేడినీటినే వాడాలి. కుంకుడుపులుసు ద్వారా ప్రాణాన్ని కోల్పోబోయే ఆ క్రిములకి ఈ వేడినీళ్లు మరింత చావుని కల్గిస్తాయి కాబట్టి గుడ్డు దశలో ఉండి కుంకుడు పులుసుని పీల్చలేని క్రిములు కూడ మరణిస్తాయి. అదీ కాక ఒంటిని మర్దించి నూనెని రాయడం, నలుగు పెట్టేప్పుడు మళ్లీ మర్దించడం, తలని గట్టిగా రుద్ది తోమడం... వంటి ఇన్ని మర్దనల కారణంగా వేడినీటిని ఒంటిమీద పోస్తే పిల్లలకి చక్కటి నిద్ర (సుఖ) వస్తుంది. సుఖనిద్ర అనేది వ్యాధి లేని తనానికి నిదర్శనం.

ఇదంతా పండుగ వెనుక దాగిన వైద్యరహస్యం. ప్రాచీనులు పండుగని వేరుగానూ, ఆరోగ్యానికి సంబంధించిన వైద్యాన్ని వేరుగానూ చెప్పి ఉండలేదు. ఈ రెంటినీ మేళవించే చెప్పారు. వైద్య విశేషమయింది కాబట్టి ఆధ్యాత్మిక విశేషానికొద్దాం!

ఈ రోజు సూర్యాస్తమయ వేళలో ఇంటికి సంబంధించిన కుటుంబపు పెద్ద తన సంతానం అందరినీ ఇంట్లో ఉన్న దైవమందిరం వద్దకి పిలవాలి.

అక్కడ ప్రమిదలూ, వత్తులూ, నూనె అప్పటికి సిద్ధంగా ఉండాలి. అప్పుడు కుటుంబపు పెద్ద తన సంతానమందరికీ తనకి ఎవరెవరు ఏయే కాలంలో ఏయే తీరుగా సహాయపడి తనని ఈ తీరు ఉన్నత స్థితికి తెచ్చారో వాళ్ల వాళ్ల సహాయాలని (ఆ పెద్దలు మరణించిన పక్షంలో మాత్రమే) పేరుపేరునా వివరించి చెప్పాలి. చెప్తూ ఒక్కొక్కరిని గురించి వివరించాక ఒక్కో దీపాన్ని వెలిగింపచెయ్యాలి. ఇది ఫలాని వారి పేరిట వెలిగించబడిన దీపం. . . ఇది ఫలాని వారి దీపం. . . అని ఈ తీరుగా అన్ని దీపాలనీ వెలిగించాక 'నా ఇంట్లో కృతజ్ఞతా పూర్వకంగా పెద్దల పేరిట దీపాలని వెలిగించాననడానికి సాక్ష్యంగా' మరొక సాక్షి దీపాన్ని (కొద్ది పెద్ద పరిమాణంలో) వెలిగించాలి.

ఈ దీపాలన్నింటినీ భగవంతునికి చూపించి ఆ సాక్షి దీపాన్ని మనకి సమీపంలో ఉన్న దేవాలయంలో ఇచ్చి రావాలి. అలా ప్రతి కుటుంబం నుండీ వచ్చిన అన్ని సాక్షి దీపాలతోనూ ఆ దేవాలయం నిండి అది దీప+ఆవళి. దీపాల సమూహం అవుతుంది. అదే నిజమైన దీపావళి తప్ప, జంతువు చనిపోగా లేదా చంపగా వచ్చిన కొవ్వుతో చేయబడిన వత్తిని వెలిగించి ఏవిధమైన గుర్తింపు దానికి లేకుండా వరసగా వెలిగిస్తే అది దీపావళి కాదు – కానేకాదు.

ఈ తీరుగా మనం చేయడం వల్ల మన పిల్లలందరికీ ఓ విశేషం తెలుస్తుంది. మన ఈ అభివృద్ధి అనేది ఈనాటికి ఈనాడే వచ్చింది కాదనీ, ఇందరు మన అభివృద్ధికి కారకులయిన కారణంగా మనమీ స్థితిలో ఉన్నామనీ, అలా మనకి సహాయపడిన వాటికి కృతజ్ఞతా పూర్వకంగా నమస్కరిస్తూ దీపాలని వెలిగించి పరమేశ్వరుని సన్నిధానానికి పంపించాలనీ తెలుస్తుంది.

పిల్లలకి ఈ తీరు కృతజ్ఞతా భావాన్ని మనం నేర్పని పక్షంలో రేపటిరోజున మనకి కూడ గుర్తింపు ఉండనే ఉండదు. ఇలా ఆ పెద్దలపేరిట దీపాలని వెలిగించి పరమేశ్వరునికి సమర్పించడాన్ని 'బలి దీపాలు' అంటారు. ఈ మొత్తం ప్రక్రియంతా జరిగేది త్రయోదశినాడైన కారణంగా దీన్ని 'బలి త్రయోదశి' అని వ్యవహరించారు పెద్దలు.

## రెండవరోజు నరక చతుర్దశి

నిన్నటి రోజునలాగే ఈ రోజున కూడ పిల్లల్ని నిద్ర తెలవారుజామునే లేపాలి. తలారా స్నానం చేయించడానికి ముందు 'నరకు'డనే రాక్షసుణ్ణి దహించాలి. ఇదొక ప్రత్యేక కార్యక్రమం ఈ రోజున.

శ్రీహరికీ భూదేవికీ పుట్టి రాక్షస లక్షణాలతో పెరిగినవాడు నరకుడు. వాడు లోకంలో ఉండే అందరినీ ఏడ్పించుకు తింటుండడంతో (నరాన్ కాయతే) 'జనుల్ని కాల్చుకు తినేవా'డనే అర్థం వచ్చేలా 'నర–కుడు' అని పేరు పెట్టారు అప్పటివాళ్లు. అది వాడి దుష్కృత్యాలకి అనుగుణంగా వచ్చిన పేరు వాడికి.

ఎంతైనా తల్లి సహనమూర్తి కాబట్టి, ఎప్పటికైనా, మంచిమాటలతో వాణ్ణి మారుద్దామనుకుని ప్రయత్నించిందామె. అదెక్కడా సాధ్యం కాలేదు ఆమెకి. చెప్పినకొద్దీ – ఇతరుల్ని బాధించడంతో వచ్చే పాపాన్నీ, తత్ఫలితాన్నీ వివరిస్తున్న కొద్దీ వాడి ఆగడాలు మించాయి. దాంతో ఇక ఉపేక్షించి ప్రయోజనం లేదని భావించిన ఆమె తన భర్త అయిన శ్రీహరిని సమీపించి 'లోకజనుల రక్షణకోసం సుఖశాంతుల కోసం తమబిడ్డ అయిన నరకుణ్ణి చంపవలసింది' గా శ్రీహరిని వేడింది.

లోకంలో ఎక్కడైనా నేరాలు చేస్తున్నది తమ పుత్రుడే అని తెలిసిన పక్షంలో ఆ పిల్లవానికి శిక్షపడకుండా లక్షలు కోట్లు ఖర్చు చేసే తల్లిదండ్రుల్ని మనం చూస్తాంగాని, తన పిల్లవాణ్ణి చంపి లోకాన్ని రక్షించవలసిందని పల్కే తల్లినంటూ మనం చూస్తే ఆమె భూదేవి మాత్రమే. అలా వధించి రక్షించిన నిజమైన పరిపాలకుడు శ్రీహరి మాత్రమే. ఇలాంటి ఉత్తమ చరిత్రకల దేశం, సంప్రదాయం కూడ మన భారతం మాత్రమే. ఇతర దేశాల్లో కనపడదు.

ఆ నరకుని బొమ్మని సిద్ధంచేసి ఉంచుతారు నడివీధిలో. ఆ ప్రదేశానికి

అందరూ విచ్చేసాక తగులబెట్టడంలో ఎవరి వెకిలితనాన్ని వాళ్లు చూపడం కాక, నరకుడు చేసిన దారుణాలూ, ఆ కారణంగా వాడికి లభించిన నికృష్టపు వధా, ఆ ఫలితంగా ప్రతి ఇంటివారూ వాణ్ణి నిందిస్తూ చేసే ఈ దహన కార్యక్రమం గూర్చి పిల్లలందరికీ వివరించి ఆ మీదట తగులబెట్టించాలి.

దాంతో పిల్లల్లో ఒక క్రమశిక్షణ ధోరణి, ఇలా ఉండకూడదనే ఆలోచన. . . ప్రారంభమౌతాయి. కాబట్టి నిన్నటి బలిదీపాలు సహాయానికి కృతజ్ఞతలని తెలియచెప్పే మంచి అలవాటుని చెప్పే పండుగైతే, నేడు దుర్మార్గుణ్ణి వధించి సత్పురుషులని రక్షించే లక్షణమున్న వాడు శ్రీహరి అనే యదార్థం మనకి బోధపడుతుంది.

ఈ కార్యక్రమమయ్యాక తలారా స్నానం చేయించాలి పిల్లలందరితో.

మళ్లీ సాయంత్రం సూర్యాస్తమయ వేళ నిన్నటిలాగానే (బలిదీపాలు) దీపాలని పేరుపేరునా వెలిగిస్తూ వాళ్లు చేసిన సహాయాలని మళ్లీ నెమరు వేసుకోవాలి, వేయించాలి. పిల్లలకి ఒకమారు చెప్పేసి వదిలేస్తే పెద్దగా గుర్తుండదు. వాళ్లకి మన జీవిత రహస్యం తెలిసితీరాలి. అందుకని ఈ రెండవ రోజున కూడ ఇలా చెప్పి వెలిగించే కార్యక్రమాన్ని చేసి ఆ సాక్షి దీపాన్ని దగ్గర్లో ఉన్న దేవాలయానికి చేర్చి రావాలి.

## మూడవరోజు దీపావళి

ఈ తెల్లవారుజామున కూడ ఖచ్చితంగా పిల్లల్ని నిద్ర లేపాల్సిందే. చక్కగా వాళ్లందరికీ తలారా స్నానం చేయించాలి.

దైవం దగ్గర కూచోబెట్టి ఏ బట్టలనయితే తల్లిదండ్రులు పిల్లలకి ఈయబోతున్నారో వాటిని ముందుగా పరమేశ్వరుని ముందుపెట్టి ఆ మీదట పిల్లలకి ఇయ్యాలి. పిల్లలు వాటిని తీసుకుబోయే ముందు తల్లిదండ్రులకి పాదాభివందనాన్ని చెయ్యాలి. తల్లిదండ్రులు అక్షతులతో వాళ్లని ఆశీర్వదించాలి.

పిల్లలకి పాదాభివందనాన్ని నేర్పాల్సిందే. తల్లిదండ్రులు అక్షతలతో ఆశీర్వదించాల్సిందే. ఇవేమీ అనాగరకమైన పద్ధతులు కానేకావు. పిల్లలకి కృతజ్ఞతా భావాన్ని నేర్పే చక్కని పద్ధతులు కదా! తప్పేముంది?

ఈ సాయంత్రం మళ్లీ పిల్లలతో పెద్దలు దైవమందిరం వద్దకి చేరి జరిగిన రెండ్రోజుల లాగానే పెద్దల సహాయాలని తలుచుకుంటూ దీపాలని పెట్టి సాక్షి దీపాన్ని చేరువలో ఉన్న దేవాలయానికి అందించాలి. ఇదంతా ఒక ఎత్తు. ఇక దీపావళి నాటి రాత్రి లక్ష్మీ పూజని చేయాలనేది ఒక ఎత్తూను.

అర్ధరాత్రి వేళ ఇంటిని శుభ్రం చేసి ఇంటికి సరిగ్గా మధ్యలో ధాన్యాన్ని పోసి దానిమీద లక్ష్మీప్రతిమని ఉంచి ఆమెకి షోడశోపచార పూజని చెయ్యాలి నిజానికి.

- ఆ తల్లిని మా యింటికి రావలసిందని ఆహ్వానించడం ధ్యానం (1)
- ఆ మీదట మన వద్ద ఓ కలశాన్ని పెట్టి ఆ కలశంలోనికి ఆవహించవలసిందని ప్రార్థించడం ఆవాహనం (2)
- ఆమె ఆవహించినట్లు భావించి ఆమె చేతులకి అర్ఘ్యజలం (పూజ్యులయిన వారినిగా గుర్తించినట్లు ఇచ్చే జలం పేరు అర్ఘ్యం) ఇయ్యడం అర్ఘ్యప్రదానం (3)
- ఆమె పాదాలని కడగడం పాద్యం (4)
- ఆమెకి చక్కని ఆసనాన్ని సమర్పించడం ఆసనం (5)
- ఇంటికి వచ్చిన ఆ తల్లికి నమస్కరిస్తూ తాగడానికి అందిచ్చే పరిశుభ్ర జలం ఆచమనీయం (6)
- ఆ మీదట ఆమె స్నానం కోసం పంచామృతాలనీ (ఆవుపాలు, ఆవునెయ్యి, ఆవుపెరుగు, తేనె, పంచదార) ఏర్పాటు చేసి ఆమెకి వస్త్రాలని సిద్ధం చేయడం వస్త్రం (7)
- ఆమె స్నానం చేసన్తాన్నంతసేపు శ్రీ సూక్తానే పఠించడం స్నానసమారాధనం (8)
- ఆమెకి మళ్లీ శుభ్రవస్త్రాలని ఇచ్చి కట్టుకోవలసిందిగా ప్రార్థించడం వస్త్ర సమర్పణం (9)
- ఆమె స్నానమై వచ్చాక శరీరానికి వేడిమి తగిలేందుకు, సువాసన పట్టేందుకూ ఇచ్చే 'నీరాజనం' (10)
- ఆ తల్లి మనింట తన అనుష్ఠానాన్ని చేసుకోడానికై సమర్పించేది యజ్ఞోపవీతం (11)
- ఆ మీదట ఆ తల్లికి నివేదించేది ఉపాహారం (ఫలాలని ఆహారంగా సమర్పించడం (12)
- దీపం (13)
- ధూపం (14)
- గంధం (15)
- వింజామరం (16)

తో షోడశోపచారాలూ అవుతాయి.

అక్కడి నుండి ఆ తల్లికి లక్ష్మీ సహస్రనామాలని గాని లక్ష్మీ అష్టోత్తర నామాలని గాని మన అవకాశాన్ని బట్టి చేయాలి.

నిజమైన దీపావళి చేయాల్సిన విధానం ఇది. బాణాసంచాని కాల్చాలనే నియమం ఏ శాస్త్రంలోనూ లేదు. అయితే బాణాసంచాని కాల్చడం తప్పని చెప్పడం లేదుగాని అది మాత్రమే ప్రధానమంటూ ఈ సంప్రదాయాల నన్నింటినీ తోసిపుచ్చడం మాత్రం నేరమే.

– మైలవరపు శ్రీనివాసరావు




# సర్వ జనాభివృద్ధి సంకల్పానికి నిలువెత్తు నిదర్శనం..... డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి

గౌరవనీయ ప్రధానమంత్రి డాక్టర్ మన్‌మోహన్‌సింగ్ గారు, కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయితీ రాజ్ మంత్రి డాక్టర్ సి.పి. జోషిగారు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి గారు, రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రులు, ప్రణాళికా సంఘం సభ్యులు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి, కేంద్ర పంచాయితీరాజ్ శాఖ కార్యదర్శి, కేంద్ర రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి, పంచాయితీరాజ్ శాఖలకు చెందిన సీనియర్ అధికారులు, సోదర సోదరీమణులందరికీ నమస్కారం.

రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి, పంచాయితీరాజ్ శాఖల మంత్రుల ఒకరోజు సమావేశంలో పాల్గొనే అవకాశం, గౌరవనీయ ప్రధానమంత్రి, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఇచ్చే విలువైన సందేశం వినే అవకాశం కలగటం నా అదృష్టంగా భావిస్తున్నాను.

అయితే, నేనిక్కడకి భారమైన హృదయంతో వచ్చాను. డాక్టర్ వై. యస్. రాజశేఖరరెడ్డి గారి మరణంతో స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత మనకు లభించిన గొప్ప రాజకీయ నాయకుల్లో ఒకరిని పోగొట్టుకున్నట్లయింది. అంతేకాదు, ఆయన మరణంతో నేను నా గురువుని కోల్పోయాను. మా రాష్ట్ర ప్రజలు తమ ఆత్మబంధువుని, తమకు గొప్ప మేలు చేకూర్చిన మహా నాయకుడిని కోల్పోయారు.

ఒక ఐదేళ్ల కాలంలో మన దేశంలోని ఏ రాష్ట్ర చరిత్రలో కూడా డాక్టర్ వై. యస్. రాజశేఖరరెడ్డి గారి నాయకత్వంలో చేపట్టినన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిన ఉదంతాలు లేవు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారిగా ప్రజలందరికీ ఆహారభద్రత, ఇళ్లు, సామాజిక భద్రత పింఛన్లు, ఆరోగ్య, విద్యా సదుపాయాలను కల్పించాలని నిర్ణయించటం జరిగింది. రాష్ట్ర జనాభాలో 80 శాతం మందికి ఒక్కొక్కరికి రెండు లక్షల వంతున ఆరోగ్య భీమా సదుపాయాన్ని కల్పించటం జరిగింది. అభివృద్ధి ఫలాలు అందరికీ చేరాలనే సంకల్పానికి నిలువెత్తు నిదర్శనం డాక్టర్ రాజశేఖరరెడ్డిగారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన విశ్వసించేవారు. బలహీనవర్గాల ప్రజలకు 67 లక్షల ఇళ్లు కట్టించాలని మేం ధ్యేయంగా పెట్టుకోగా, ఇప్పటికి 35 లక్షల ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలినవి నిర్మాణంలో ఉన్నాయి. సామాజిక భద్రతా సదుపాయాలు అందరికీ 'సంతృప్త' స్థాయిలో అందాలనే భావనతో, వృద్ధులు, వితంతువులు, వికలాంగులు తదితరులు 55 లక్షల మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేయటం జరిగింది.

'ఆహారభద్రత' కింద రాష్ట్ర జనాభాలో 80 శాతం మందికి రెండు రూపాయలకు కిలో బియ్యాన్ని మేం సరఫరా చేస్తున్నాం. ఎస్.సి., ఎస్.టి., ఒబిసి., మైనారిటీలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల్లోని అర్హులైన విద్యార్థులకు మొత్తం ట్యూషన్ ఫీజును ప్రభుత్వం చెల్లించే పథకాన్ని కూడా అమలు చేస్తున్నాం. రైతులకు ఉచితంగా ఏడాదికి 1500 కోట్ల యూనిట్ల విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం. అంతేకాక పంటరుణాలపై వారికి ఏడాదికి 4 శాతం వంతున వడ్డీ సబ్సిడీ చెల్లిస్తున్నాం. డాక్టర్ రాజశేఖరరెడ్డి గారి ప్రభుత్వం సాధించిన విజయాలు కేవలం వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి రంగాలకు మాత్రమే పరిమితం కాలేదు. ఆయన నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా ఆవిర్భవించింది.

అటువంటి నాయకుడిని కోల్పోవటం దురదృష్టకరం. ఆంధ్రప్రదేశ్‌లో ఆయన నడిచిన బాటలోనే నడవాలని మేం కంకణం కట్టుకున్నాం. పేదల కోసం ఆయన చేపట్టిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిస్థాయిలో పూర్తి చేయాలని భావిస్తున్నాం. ఆయనకు మేమిచ్చే నిజమైన నివాళి ఇదే.

పేదరిక నిర్మూలనలో ఆంధ్రప్రదేశ్ అనుభవాలను మీతో పంచుకోవటానికి, జాతీయ గ్రామీణ జీవనోపాధుల కార్యక్రమంపై అభిప్రాయాలు తెలియజేయటానికి అవకాశం దొరకటం నాకు లభించిన గౌరవంగా భావిస్తున్నాను.

గ్రామీణ పేదమహిళల శక్తి సామర్థ్యాలను వెలికితీసి, వారిని పేదరికం నుంచి బయటకు తీసుకుని రావటానికి వారిని స్వయం సహాయ బృందాల కింద సమీకరించటం అవసరమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుర్తించింది. ఈ లక్ష్యాన్ని సాధించడానికి ప్రభుత్వం అందుకోసమే ఉద్దేశించబడిన ఒక రాష్ట్ర స్థాయి పేదరిక నిర్మూలన మిషన్‌ను నెలకొల్పింది. దీనికి ప్రత్యేకమైన

జిల్లాస్థాయి యూనిట్లు, మండల స్థాయి యూనిట్లు కూడా ఉంటాయి. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో గల పేదలందరినీ సమీకరించటం, పేదమహిళలతో కూడిన పటిష్టమైన బృందాల నెట్‌వర్క్‌ను తయారుచేయటం, వారు పేదరికం నుంచి బయటపడే వరకు వారికి నిరంతరాయంగా తోడ్పాటునందించటం ఈ మిషన్ లక్ష్యాలు.

ఈ నెట్‌వర్క్‌లో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి పేదకుటుంబం భాగంగా ఉండాలని డాక్టర్ రాజశేఖరరెడ్డి భావించారు. ఆయన దార్శనికత, పట్టుదల కారణంగా ఒక కోటి మంది పేద మహిళలను 8,50,000 స్వయం సహాయ బృందాలలో సమీకరించగలిగాం. ఈ బృందాలు గ్రామీణ స్థాయి స్వయం సహాయ బృందాల సమాఖ్యలతో అనుసంధానమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి సమాఖ్యలు దాదాపు 35,525 ఉన్నాయి. రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ఇవి కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. ఈ సమాఖ్యలు మళ్లీ 1099 మండల సమాఖ్యలతో, 22 జిల్లా స్థాయి సమాఖ్యలతో అనుసంధానమయ్యాయి. ఏ కార్యక్రమమైనా 'సంతృప్త' స్థాయిలో అమలుజరపాలనే ధృకృఢంతో దాదాపు 90 శాతం గ్రామీణ పేద కుటుంబాలను ఈ కార్యక్రమ పరిధిలోకి తీసుకుని వచ్చాం.

పేదల అవసరాల ప్రాతిపదికగా, నిరంతర సామర్థ్య పెంపుదల కార్యక్రమాల ద్వారా బలోపేతం చేసినప్పుడే ఈ స్వయం సహాయ బృందాల ఏర్పాటుకానీ, సమాఖ్యల ఏర్పాటు కాని అర్థవంతంగా ఉండగలదు. స్వయం సహాయ బృందాలు, వాటి సమాఖ్యలు, రాష్ట్ర స్థాయి పేదరిక నిర్మూలనా మిషన్ సిబ్బంది, ఇతర సంబంధిత శాఖల సిబ్బందిలో సామర్థ్యాల పెంపుదలకు ఆంధ్రప్రదేశ్ గత 9 సంవత్సరాల్లో 680 కోట్ల రూపాయలు వ్యయం చేసిందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. మా రాష్ట్రంలో మహిళా సాధికారత కార్యక్రమం అంత ఉత్సాహభరితంగా సాగడానికి భారీస్థాయిలో చేసిన ఈ వ్యయమే కారణం.

పేదమహిళల శక్తియుక్తులపై, చిన్న అవకాశాలను కూడా అందిపుచ్చుకుని వాటిని దైనందిన ఆదాయ వనరులుగా మార్చుకోగల వారి సామర్థ్యంపై మా దివంగత ముఖ్యమంత్రికి అచంచలమైన విశ్వాసం ఉండేది. బ్యాంకు రుణాలను సక్రమంగా చెల్లించే స్వయం సహాయ బృందాలకు వారు చెల్లించే వడ్డీపై సబ్సిడీ ఇవ్వటానికి 'పావలావడ్డీ' పథకాన్ని ఆయన ప్రవేశపెట్టారు. ఏడాదికి మూడు శాతం పైబడి వారు చెల్లించే వడ్డీని రాష్ట్ర ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది.

ఈ పథకం వల్ల బ్యాంకర్లు కూడా స్వయం సహాయ సంఘాల వారికి ఉదారంగా రుణాలు ఇవ్వటానికి ముందుకొచ్చారు. 'పావలావడ్డీ' పథకాన్ని ప్రవేశపెట్టడానికి ముందుగల ఐదు సంవత్సరాల కాలంలో అంటే 1999-2004 మధ్య సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బ్యాంకులన్నీ కలిసి 1600 కోట్ల రూపాయలను స్వయం సహాయ బృందాల వారికి రుణంగా అందచేశాయి. అంతే, 'పావలావడ్డీ' పథకాన్ని ప్రవేశపెట్టిన తరువాత ఐదు సంవత్సరాల కాలంలో అంటే 2004-2009 సంవత్సరాల మధ్య బ్యాంకులు 19,200 కోట్ల రూపాయలను స్వయం సహాయ బృందాలకు రుణంగా అందజేశాయి. అంటే, ఐదేళ్లలో ఈ మొత్తం 12 రెట్లు పెరిగిందన్నమాట.

స్వయం సహాయ బృందాలకు రుణాలు ఇవ్వటంలో బ్యాంకర్లు ఇంత ముందుకు రావటానికి అనేక కారణాలు దోహదం చేశాయి. రుణాల చెల్లింపు ప్రక్రియకు మా ముఖ్యమంత్రి ఇచ్చిన గట్టి భరోసాతో పాటు, రాష్ట్ర స్థాయి పేదరిక నిర్మూలన మిషన్, జిల్లాస్థాయి, మండల స్థాయి సమాఖ్యలు అందించిన తోడ్పాటు కూడా ఇందుకు దోహదపడింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సాధించిన మరొక అద్వితీయ విజయం రుణాల మార్పిడి పథకం. కొన్ని ఎంపిక చేసిన గ్రామాల్లో స్వయం సహాయ బృందాల ఏవైనా అప్పుల ఊబిలో ఉన్నట్లయితే, వడ్డీ వ్యాపారుల నుంచి అధికవడ్డీతో తీసుకున్న ఆ రుణాలను పూర్తిగా చెల్లించడానికి బ్యాంకర్లు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేయటమే ఈ రుణాల మార్పిడి పథకం. ఒక్కొక్క బృందానికి బ్యాంకులు 5 లక్షల రూపాయల వరకు ఆర్థిక సహాయం చేస్తాయి. ఇప్పటివరకు 6000 గ్రామాల్లో ఈ పథకం అమలు జరిగింది. రానున్న మూడు సంవత్సరాల్లో రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ఈ పథకాన్ని అమలు చేస్తాం.

కటిక పేదరికం నుంచి బయటపడటానికి 5 నుంచి 8 సంవత్సరాల కాలంలో స్వయం సహాయ బృందాల్లోని ఒక్కొక్క సభ్యురాలికి చిన్న, పెద్ద రుణాల రూపంలో కనీసం లక్ష రూపాయల పెట్టుబడి అవసరమవుతుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అంచనా. అందువల్లనే, స్వయం సహాయ బృందాల్లోని ప్రతి ఒక్క మహిళా సభ్యురాలిని లక్షాధికారిని చేస్తామని మా దివంగత ముఖ్యమంత్రి వారికి మాటిచ్చారు. ఆయన కలను సాకారం చేయడానికి ఆర్థిక సంస్థల నుంచి రానున్న 5, 6 సంవత్సరాల్లో 80,000 కోట్ల రూపాయలను మేం సమీకరించవలసి ఉంది.

ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి, ప్రైవేటురంగంలో ఉద్యోగాలు కల్పించటం ద్వారా గ్రామీణ యువత నైపుణ్యాలను పెంచటం వల్ల ప్రత్యేక విధానంలో పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుర్తించింది. ఈ కార్యక్రమం చేపట్టినప్పటి నుంచి గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన ఉపాధికల్పన, మార్కెటింగ్ మిషన్ విభాగం ఆధ్వర్యంలో మేం ఇప్పటివరకు 2 లక్షల మంది యువతకు శిక్షణ ఇచ్చి, నెలవారీ వేతనాలతో వారికి పట్టణ ప్రాంతాల్లో ఉద్యోగాలు ఇప్పించగలిగాము.

స్వయం సహాయ బృందాల సభ్యుల సంక్షేమం, సామాజిక భద్రత గురించి మా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖరరెడ్డి చాలా శ్రద్ధ తీసుకునేవారు. ఈ దిశలో ఆయన చేపట్టిన పథకమే 'అభయహస్తం'. ప్రభుత్వం, స్వయం సహాయ బృంద సభ్యురాలు ఈ పెన్షన్ పథకానికి ఏడాదికి 365 రూపాయల వంతున చెల్లిస్తారు. 60 సంవత్సరాలు నిండిన తరువాత ప్రతి సభ్యురాలు నెలకు 500 నుంచి 2200 రూపాయల వరకు నెలవారీ పెన్షన్ పొందుతుంది. స్వయం సహాయ బృంద సభ్యురాలు రోజుకి రూపాయి వంతున ఏడాదికి 365 రూపాయలు పొదుపు చేయగా, ప్రభుత్వం కూడా తన వంతు సహాయంగా ఒక్కొక్క సభ్యురాలికి ఏడాదికి 365 రూపాయలను ఇస్తుంది. ఈ రెండు మొత్తాలను పెన్షన్ ఫండ్‌లో పెట్టుబడిగా జమచేయటం జరుగుతుంది.

ఈ 'అభయహస్తం' పథకం ప్రజల్లో విస్తృతంగా వ్యాపించింది. ఈ పథకంలో దాదాపు ఒక కోటి మంది మహిళలు సభ్యులుగా చేరనున్నారు. ప్రపంచంలో అసంఘటిత రంగ కార్మికులకు అమలుచేస్తున్న అతి పెద్ద కో-కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం ఇదే. ఈ పథకంలో భీమా సదుపాయం కూడా ఉంది.

గ్రామీణ ప్రాంతాలు త్వరితగతిన అభివృద్ధి చెందాలంటే, ప్రభుత్వంలోని అన్ని సంబంధిత శాఖలు స్వయం సహాయ బృందాలు, వాటి సమాఖ్యలతో సన్నిహితంగా పనిచేయాలని డాక్టర్ రాజశేఖరరెడ్డి గారు అభిప్రాయపడుతుండేవారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో సంబంధం ఉన్న వ్యవసాయ శాఖ, భూ పరిపాలనా శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మొదలైన అన్ని శాఖలూ ఇప్పుడు స్వయం సహాయ బృందాల సమాఖ్యలతో గణనీయంగా అనుసంధానం చెందటం వల్ల, ఉపాధి హామీ పథకం కింద

వార్తల్లో 'అపార్డ్'

## గ్రామీణ విశ్వవిద్యాలయంగా 'అపార్డ్'

సెప్టెంబర్ 11, 2009 నాడు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కె. రోశయ్య గారి అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో ఎ.యం.ఆర్. ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీ (అపార్డ్)ను గ్రామీణ విశ్వ విద్యాలయంగా స్థాయి పెంచాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు శ్రీ వట్టి వసంత కుమార్, గ్రామీణాభివృద్ధి శాఖ, పశుసంవర్ధక శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, ఆర్థిక శాఖ, వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ, వ్యవసాయ, మార్కెటింగ్ మరియు సహకార శాఖ కార్యదర్శులు, అధికారులు, రంగారెడ్డి జిల్లా కలెక్టరు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధికి సంబంధించిన అన్ని శాఖల శిక్షణా వసతులకు ఒకే దగ్గర భవనాలు నిర్మించి వాటిని పూర్తి స్థాయిలో ఉపయోగించాలని నిర్ణయించారు. దీని కోసం గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గారి అధ్యక్షతన ఒక కమిటీని నియమించారు. అపార్డ్ స్థాయిని గ్రామీణ విశ్వవిద్యాలయంగా పెంచేందుకు తగు చర్యలు వెంటనే చేపట్టాలని గౌ॥ ముఖ్యమంత్రి ఆదేశించారు.

లభించే అన్ని సదుపాయాలను స్వయం సహాయ బృందాల సభ్యులు పొందగలుగుతున్నారు.

ఇక జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ విషయానికి వస్తే, ఈ పథకానికి హృదయపూర్వకంగా స్వాగతం పలుకుతున్నాము. ఈ పథకం అమలుకు ప్రతిపాదించిన వ్యూహం, వ్యవస్థాగత ఏర్పాట్లు, విధులు, నిధుల ఏర్పాటు మొదలైన అన్నిటితో ఏకీభవిస్తున్నాము. మాకు సంబంధించినంత వరకు, ఇటువంటి ఏర్పాట్లు కొత్తకాదు. మేం చాలా కాలంగా ఇటువంటి మిషన్ తరహాలోనే పనిచేస్తున్నాము. ఇటువంటి వైఖరివల్ల లభించే ఫలితాలు బాగుంటాయని మేం అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాం.

స్వయం సహాయ బృందాలను, వాటి సమాఖ్యలను ప్రోత్సహిచటం వల్ల సుదీర్ఘకాలంగా మాకు కలిగిన అనుభవాల ఆధారంగా నేను కొన్ని సూచనలు చేయదలిచాను. అందుకు అనుమతిస్తే, నేను వాటిని మీ ముందుంచుతాను.

### 1. సరళత్వం

జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ పథకాన్ని అమలు చేయటంలో మనం గుర్తుంచుకోవలసింది సరళత్వం. ఎందుకంటే, ఈ విషయంలో వివిధ రాష్ట్రాలు, వివిధ అభివృద్ధి స్థాయిల్లో ఉన్నాయి. వాటికి వివిధ ప్రాధాన్యతలు ఉన్నాయి. అందువల్ల, పథకం అమలులో సరళత్వం పాటించినట్లయితే, వివిధ రాష్ట్రాల అవసరాలు, ప్రాధాన్యతలకు తగినట్లుగా పథకంలో మార్పులు చేసుకునే వీలు ఉంటుంది.

### 2. బలమైన సమాఖ్యలు

ప్రతి సభ్యురాలికి బ్యాంకుల నుంచి తగిన ఆర్థికవనరులు అందుబాటులోకి వచ్చి, సుస్థిరమైన జీవనోపాధి లభించాలంటే, స్వయం సహాయ బృందాలకు, స్వయంసహాయ బృందాల సమాఖ్యలకు 10 నుంచి 12 సంవత్సరాల పాటు సహాయం కొనసాగించవలసిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ అనుభవం నిరూపిస్తోంది. గ్రామాలు, మండలాలు, బ్లాకులు, జిల్లా ల స్థాయిల్లోని స్వయం సహాయబృందాల సమాఖ్యలకు తగిన సహాయ సహకారాలు అందించాలి.

### 3. కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు

స్వయం సహాయ బృందాల సభ్యుల్లో అత్యుత్తమైన వారిని పెద్ద సంఖ్యలో కమ్యూనిటీ రిసోర్సుపర్సన్లుగా అభివృద్ధి చేశాం. ఇందుకు పెద్దమొత్తంలో నిధులు వ్యయం చేశాం. అందువల్లనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో అతి తక్కువ కాలంలో కార్యక్రమాన్ని అమలు చేయగలిగాం.

### 4. వడ్డీపై సబ్సిడీ

ఆంధ్రప్రదేశ్‌లో స్వయం సహాయ బృందాల విజయంలో వడ్డీపై ఇచ్చిన సబ్సిడీ అత్యంత కీలకమైన పాత్ర పోషించింది. స్వయం సహాయ బృందాల ఉద్యమంలో ఇదొక ముఖ్యమైన మలుపు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటున్న అన్ని స్వయం సహాయ బృందాలకు ఈ వడ్డీపై సబ్సిడీ సదుపాయాన్ని కల్పించాలి.

### 5. విపత్తుల నిర్వహణ

గ్రామీణ కుటుంబాలు తిరిగి పేదరికంలోకి జారిపోకుండా ఉండాలంటే విపత్తు సమయాల్లో సహాయ సహకారాలు లభించటం అవసరం. ఆమ్ ఆద్మీ బీమా యోజన, జనశ్రీ బీమా యోజన, ఆరోగ్య బీమా పథకాలు, మొదలైన జీవిత బీమా పథకాల అమలుకు జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ ఒక నోడల్ ఏజన్సీగా వ్యవహరించాలి.

### 6. స్పందించే సహాయక సంస్థ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నేర్చుకున్న అత్యంత కీలకమైన గుణపాఠం ఏమిటంటే, పేదలకు అవసరమైన చేయూత విషయంలో ఇదిక వరకటి పేదరిక నిర్మూలనా పథకాలు చాలా తక్కువ అంచనా వేశాయి. రాష్ట్ర, జిల్లా , బ్లాక్(మండల) స్థాయిల్లో అంకిత భావంతో నిండిన ప్రత్యేకమైన వ్యవస్థలు అవసరం. మా రాష్ట్రంలో మేం అటువంటి కృషి చేసి, అందుకు అవసరమైన మొత్తాన్ని వెచ్చించాం. ఇప్పుడు ఫలితాలను అందుకుంటున్నాం. పథకం వ్యయంలో 5 శాతంగా ఉన్న పరిపాలనా వ్యయాన్ని 10 శాతానికి పెంచాలని అందువల్లనే మేం గట్టిగా కోరుతున్నాము. సమర్థవంతమైన, మంచి మానవవనరులను పెంపొందించటంలో మనం పెట్టుబడులు పెట్టకపోతే, పథకం అమలుకు పెద్ద మొత్తంలో వెచ్చించే పెట్టుబడుల వల్ల కోరుకున్న ఫలితాలు పొందలేము.

### 7. పట్టణ మిషన్

పట్టణ పేదలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇది వరకే ఒక మిషన్‌ను ఏర్పాటు చేసింది. ఇదే తరహాలో దేశవ్యాప్తంగా పట్టణాల్లోని పేదలకు ఒక మిషన్‌ను నెలకొల్పటానికి చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

### జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం

దేశవ్యాప్తంగా అమలు చేసిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 2006 ఫిబ్రవరి 2వ తేదీన యుపిఎ ఛైర్ పర్సన్ శ్రీమతి సోనియాగాంధీ, ప్రధానమంత్రి డాక్టర్ మన్‌మోహన్‌సింగ్ ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రారంభించారు. ఈ పథకాన్ని రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేయటానికి మా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి గారు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. ఉపాధి పనులు చేయాలనుకునే

వారి హక్కులు, సదుపాయాలు అమల్లోకి తేవటానికి ఆయన అందివచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకున్నారు. జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకంఅమలులో అనుసరించవలసిన సూత్రాలను ఎటువంటి రాజీలేకుండా అనుసరించారు...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పేదరిక ముఖచిత్రాన్ని మార్చటానికి జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఉపయోగపడగలుగుతుందని మా దివంగత ముఖ్యమంత్రి స్పష్టంగా తెలుసుకున్నారు. ఆయన గ్రామాల సందర్శనకు వెళ్లినప్పుడు గ్రామప్రజలతో మాట్లాడే సందర్భాలలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలుగురించి అట్టడుగుస్థాయి పేద ప్రజలనుంచి అభిప్రాయాలను సేకరించేవారు.

ఆయన ఇంతటి ప్రోత్సాహం, మద్దతు ఇచ్చారు కాబట్టే, జాతీయ గ్రామీణ ఉపాది హామీ పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ఆదర్శవంతమైన స్థాయిలో నిలిచింది. మొదటిరోజు నుంచే కూలీ చెల్లింపు, పోస్టల్ సేవింగ్స్ బ్యాంక్ అకౌంట్ల ద్వారా కూలీ చెల్లింపు, పథకం లావాదేవీలన్నిటిని నిర్వహించడానికి కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ వినియోగం, ఒక్క పైసా కూడా దుర్వినియోగం కాకుండా లబ్దిదారులకు అందే ఏర్పాటు, మొదలైన ఉత్తమ విధానాలను రాష్ట్రగ్రామీణాభివృద్ధి శాఖ అభివృద్ధి పరిచింది.

గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధుల స్థాయిని విస్తరించే దిశలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్యక్రమానికి నిధులు వెచ్చించింది, ఈ పథకం కింద 3.25 లక్షల ఎకరాల్లో ఉద్యానవన పంటలను, పండ్లతోటలను చేపట్టటం జరిగింది. 8000 మధ్యస్థాయి నీటిపారుదల చెరువులను పూర్తి స్థాయిలో పునరుద్దరించాము. పేదలకు చెందిన 5.91 లక్షల ఎకరాల భూములను అభివృద్ధి పరిచాము.

రాష్ట్రంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలులో సామాజిక తనిఖీ ప్రక్రియను చేపట్టటానికి డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి గట్టి రాజకీయ మద్దతును అందించారు. పథకం అమలుపై సామాజిక తనిఖీ చేపట్టటానికి అవసరమైన నిబంధనలను రాష్ట్రప్రభుత్వం రూపొందించింది. అంతేకాక, సామాజిక తనిఖీ, బాధ్యతాయుత విధానాలు, పారదర్శకత మొదలైన ప్రక్రియల అమలుకు ఒక స్వతంత్ర సంస్థను కూడా నెలకొల్పి, ప్రతి ఆవాసప్రాంతంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సామాజిక తనిఖీ చేయటానికి తగిన బడ్జెట్‌ను కూడా ప్రభుత్వం సమకూర్చింది.

షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల సంక్షేమం పట్ల డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి గారు అత్యంత నిబద్ధతను, అంకితభావాన్ని కనబర్చేవారు. తత్ఫలితంగా, ఎస్.సి, ఎస్.టి, ప్రజల భూములు అభివృద్ధి చెందే విధంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను ఖర్చుచేయటం జరిగింది. ఎక్కడెక్కడ అవకాశం ఉందో అక్కడల్లా ఎస్.సి, ఎస్.టి. ప్రజలకు చెందిన భూములను నీటిపారుదల సదుపాయాలు కల్పించటానిక, హార్టికల్చర్ అభివృద్ధి చేయటానికి సహాయపడటం జరిగింది. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద తూర్పుగోదావరి జాల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల కోసం 30,000 ఎకరాల్లో రబ్బరు తోటలను అభివృద్ధి పరిచాము. విశాఖపట్నం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు ఒక లక్ష ఎకరాల్లో కాఫీ తోటలను అభివృద్ధి చేశాము.

మహబూబ్‌నగర్ జిల్లాలోని వెట్టికార్మికుల పునరావాసానికి, సహాయానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మా దివంగత ముఖ్యమంత్రి ఒక ప్రత్యేక ప్యాకేజీని రూపొందించారు. ఈ పథకం కింద ఏజెన్సీ ప్రాంతాల్లోని జీవనోపాధులను విస్తరించటానికి కూడా ప్రత్యేక ప్యాకేజీని ఉపయోగించారు.

ఈ సందర్భంగా, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు కీలకంగా మారిన కొన్ని అంశాలపై తక్షణమే చర్య తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి కోరుతూ, ఆ అంశాలను మీ ముందుంచుతున్నాను.

1. కూలీలకు నేరుగా వేతనం చెల్లించటం ద్వారా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సాధించిన విజయం చాలా ప్రస్తుతించదగినది. అయితే, సాంకేతిక మానవ వనరులు అందుబాటులో లేకపోవటం వలన, ఈ వ్యయాన్ని గణనీయమైన ఉత్పాదక ఆస్తులుగా మార్చుకోలేకపోతున్నాం. ఈ పథకం కింద సాధించే విజయాలు సుస్థిరంగా నిలిచిపోవాలంటే, పేదలకు శాశ్వతమైన ఆస్తుల ఏర్పాటుకు దారితీసే విధంగా ఉపాధికల్పన సాగాలి. అందువల్ల, అర్హతకలిగిన ఇంజనీర్లతో సాంకేతిక వనరులను, నాణ్యతా నియంత్రణ బృందాలను ఏర్పాటు చేసేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి.

2. రెండవ ప్రధాన సమస్య ఏమిటంటే, వేతన చెల్లింపులను సకాలంలో చెల్లించలేకపోవటం. ఇందులో ఎదురవుతున్న ఆలస్యానికి గల కారణాలపై లోతైన పరిశీలన చేయగా, సబ్‌పోస్టాఫీసులు, బ్రాంచి పోస్టాఫీసుల్లో డెలివరీ స్థాయిలో ఉన్న పోస్టల్ సిబ్బందికి కోట్లాది మంది లబ్దిదారుల అకౌంట్లను నిర్వహించటం వారి శక్తిని మించినదిగా మారిందని తేలింది. అందువల్ల, ఈ అకౌంట్లను కంప్యూటరీకరించడానికి, తగినంత సిబ్బందిని ఇవ్వటానికి, నగదు చెల్లింపు ప్రక్రియలను మెరుగుపరచటానికి యుద్ధప్రాతిపదికన ఎంతో చేయవలసిఉంది.

3. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద చేపట్టే పనుల పరిధిని పెంచవలసిందని విజ్ఞప్తి చేస్తున్నాను.


1. బలహీన వర్గాల ప్రజల గృహనిర్మాణాన్ని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో అనుసంధానించవచ్చు.
2. గ్రామంలోని పారిశుధ్యాన్ని నిర్వహించటానికి ప్రతి ఆవాస ప్రాంతంలో కనీసం ఇద్దరు, ముగ్గురు కార్మికులకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వేతనం చెల్లించవచ్చు.
3. అనుమతించదగిన పనుల విభాగంలో వ్యవసాయ కార్యకలాపాలను కూడా చేర్చవచ్చు.
4. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మాణాన్ని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టవచ్చు.

అంతేకాక, పట్టణ ప్రాంతాల్లో గల నైపుణ్యం లేని కార్మికులకు ప్రయోజనం చేకూర్చడానికి ప్రతి వ్యక్తికి 100 రోజుల ఉపాధిని కల్పించే కార్యక్రమాన్ని చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

చివరిగా, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ మంత్రులతో నిర్వహిస్తున్న ఈ కాన్ఫరెన్స్ ప్రతిపాదిత జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ పథక రూపకల్పనకు ఇతోధికంగా సహాయపడుతుందని, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమల్లో ఎదురవుతున్న సమస్యలను కూలంకషంగా చర్చిస్తుందని ఆశిస్తూ, ముగిస్తున్నాను.

*(09-09-09న న్యూఢిల్లీలో జరిగిన రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి, పంచాయితీరాజ్ శాఖల మంత్రుల సమావేశంలో మన రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ వసంత్‌కుమార్ చేసిన ప్రసంగ పాఠపు అనువాదం* **– గొట్టిపాటి సుజాత )**

# కళాత్మక విన్యాసాల కళాక్షేత్రం చీరలు



భారతీయ పట్టుచీరల సముద్ధరణకు భరత నాట్యకళాప్రవీణ, పద్మభూషణ రుక్మిణీదేవి అరండేల్‌గారి కృషి అతి విశిష్టమైనది. ఆంగ్లేయుల పాలనతో విదేశీ వ్యామోహం కారణంగా మన సాంప్రదాయక చీరలకు ఆదరణ తగ్గటం, రుక్మిణీ దేవిగారికెంతో బాధ కల్గించింది. మన గ్రామీణ చేనేత కళానిపుణులకు సముచితమైన ప్రోత్సాహం, సహకారం అందించాలని ఆమె ఆశయం.

1937లో మద్రాసులో కళాక్షేత్రం నృత్య సంగీత కళాశాల స్థాపించిన మరుసటి ఏడే కళాక్షేత్రం ఆవరణలో, చేనేత కేంద్రం ప్రారంభించారు కంచి చీరల మాదిరి చేనేత చీరల నేతపని ప్రారంభించారు. అమ్మలు, అమ్మమ్మలు, బంధువులు, మిత్రుల ఇంటి పెట్టెలలో భద్రపరచిన పాత పట్టుచీరలను వెలికి తీయించిన రుక్మిణీదేవి, ఆనాటి సాంప్రదాయక డిజైన్‌లతో ఒక పుస్తకం ప్రచురించారు. చేనేత కేంద్రంలో పనిచేసేవారికి ఆ పుస్తకాలనందించారు. నైసర్గిక రంగుల పట్టిక తయారు చేయించారు. డిజైన్‌లలో పరస్పర విన్యాసాలతోపాటు తమ కల్పనను కూడా చేర్చి సాంప్రదాయక పద్ధతులలో కొత్త కొత్త విన్యాసాలను రూపొందించారు.

కళా క్షేత్ర చీరలు క్రమంగా ప్రజలను ఆకర్షించాయి. కళాక్షేత్రంలోని మగ్గాల సంఖ్య నానాటికీ పెరుగుతూ ప్రజాభిమానాన్ని చూరగొన్నాయి. మద్రాసు (చెన్నై) నుండి 125 కి.మీ. దూరంలోని కళాక్షేత్రానికి, చేనేత నిపుణులు చేరారు.




శ్రీ రుక్మిణీ దేవి అరండేల్

స్వదేశీ ఉద్యమం ముమ్మరమయ్యేందుకు కళాక్షేత్రం చీరలు ప్రాముఖ్యత నందుకొన్నాయి. కళాక్షేత్రంలోని విద్యార్థులకు వివిధ కళావిన్యాసాలకు కావలసిన కొత్త రూపురేఖల చీరలు, కళాక్షేత్రానికి చెందిన చేనేత కేంద్రంలో తయారు చేసేవారు.

స్వాతంత్ర్యానంతరం, చేనేత పనివారు తమసొంత ప్రాంతాలకు వెళ్ళడంతో కళాక్షేత్రంలోని మగ్గాల నేతకు, పనివాళ్ల కొరత ఏర్పడింది. 1960–70 నాటికి కళాక్షేత్రంలో చీరల ఉత్పత్తి బాగా తగ్గింది. సంపన్న కుటుంబాలకు చెందిన స్త్రీలు, కళాక్షేత్రంలో తయారైన పట్టు చీరలు ధరించడం తమహోదాకు చిహ్నమని భావించేవారు. మార్కెట్‌లో కళాక్షేత్రం పట్టుచీరలు లభించనప్పుడు చీరలు కావలసినవారు కళాక్షేత్రం వెళ్ళి తమకు కావలసిన రంగు, డిజైన్ చీరల తయారీకి ముందస్తు పైకం చెల్లించేవారు. కళాక్షేత్రం చీరలకోసం నెలల తరబడి వేచివుండేవారు. చేనేత పనివారి సంఖ్య తరిగిందే కాని, కళాక్షేత్రం చీరలకు గిరాకి ఏ మాత్రం తగ్గలేదు. కళాక్షేత్రంలో తయారైన చీరలు అద్భుత కళావిన్యాసంతో స్త్రీలను ఎక్కువగా ఆకర్షించేవి.

నేటికీ కళాక్షేత్రంలోని చేనేత పనివారు కళాత్మకమైన చీరలను నేస్తున్నారు. కాని వారి సంఖ్య క్షీణిస్తున్నది. పట్టు చీరల అందచందాలను పెంచిన కీర్తి ప్రతిష్ఠలు రుక్మిణీదేవి అరండాల్ గారికి చెల్లును.

– **జానమద్ది హనుమచ్ఛాస్త్రి,** కడప

# గాంధీజీ గ్రామ స్వరాజ్యం

"స్వతంత్ర్య భారత దేశం తప్పని సరిగా పంచాయితీ రాజ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటుంది."

*– గాంధీజీ, (8 జూన్, 1947 హరిజన్ పత్రిక)*

పై వాక్యం గ్రామ పంచాయితీలపై గాంధీజీకి గల అపారమైన అనురాగాన్ని తెలుపుతుంది. స్వరాజ్ అనేది పంచాయితీల ద్వారా సురాజ్యంగా మారగలదన్న ధృఢమైన విశ్వాసాన్ని వ్యక్తం చేస్తుంది.

భారత దేశాన్ని చూడాలంటే గ్రామాలకు వెళ్ళమన్నాడు గాంధీ మహాత్ముడు. "కేంద్రంలో ఇరవై మంది కూర్చుని శాసించే పద్ధతి సిసలైన ప్రజాస్వామ్యం కాదు. ప్రతి గ్రామంలోని ప్రజలు దిగువ స్థాయి నుంచి నడిపేదే అసలైన ప్రజాస్వామ్యం" అని జాతిపిత ప్రబోధించాడు.



"ఒకరి అభిప్రాయాన్ని మరొకరు గౌరవించడం, ఒక్కరి కోసం అందరం, అందరి కోసం ఒక్కరు అన్న భావనే ప్రజాస్వామ్యానికి మూల సూత్రం. ప్రజాస్వామ్యం ఒక జీవన విధానం. దానికి కావలసిన వ్యవస్థల్ని ఏర్పాటు చేసుకోవాలి" అని గాంధీజీ పిలుపునిచ్చారు.

## గ్రామ స్వరాజ్యం గూర్చి గాంధీజీ ఏమి చెప్పారు?

"ప్రతీ గ్రామం సర్వస్వతంత్ర్యంగా నిలబడి, తన ప్రజల అవసరాలను స్వయంగా తీర్చుకోగలిగి, సాధ్యమైన మేరకు ప్రతీ కార్యకలాపం సహకార విధానంలో నిర్వహించుకోగలగటమే నా ఉద్దేశ్యంలో గ్రామ స్వరాజ్యం" అని గాంధీజీ చెప్పారు. అందు నిమిత్తం ప్రధానంగా భారత ప్రాచీన గ్రామీణ పంచాయితీ వ్యవస్థలను పునరుద్ధరించాలని బోధించారు. ప్రతీ గ్రామం తప్పనిసరిగా నిర్వహించాల్సిన కర్తవ్యాలను ఆయన క్రింది విధంగా తెలిపారు.

☆ గ్రామంలోని ప్రతి బాలుడికీ, బాలికకూ విద్యనందించగలగడం ☆ పారిశుధ్యం ☆ వైద్యావసరాలను తీర్చడం ☆ గ్రామంలోని బావులు, చెరువుల్ని నిరంతరం అభివృద్ధి పరచటం ☆ అస్పృశ్యుల అవసరాలను తీర్చడం, వారిని పైకి తీసుకురావడం ☆ స్థానిక వ్యాజ్యాలను పరిష్కరించటం – అందువల్ల సత్వర న్యాయంతో పాటు ఖర్చు తగ్గుతుంది. వారికి పోలీసు, సైన్యం అవసరం ఉండదు" అని చెప్పారు. గాంధీజీ దృక్పథంలో భారతదేశం అంటే "గణతంత్ర గ్రామాల కూడిక".

73 వ రాజ్యాంగ సవరణ గాంధీజీ ఊహలకు, భావనలకు ప్రతి రూపంగా నిలిచింది. స్వయం ప్రతి పత్తిగల గ్రామ ప్రభుత్వాలు ఏర్పడటానికి ఇది దోహదపడింది. అధికార వికేంద్రీకరణకు, పరిపాలన, నిర్ణయాధికారం ప్రజల చేతికి రావటానికి బాటలు వేసింది. భారత రాజ్యాంగ రూపకల్పన దశలోనే పంచాయితీ రాజ్ సంస్థలకు స్వయం ప్రతి పత్తి కల్గించాలని గాంధీజీ చెప్పారు.

## రాజ్యాంగ రూపకల్పనలో గాంధీజీ ప్రభావం

పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం పెరగాలంటే స్థానిక ప్రజలు గ్రామ పంచాయితీని, గ్రామ పంచాయితీలు తాలూకా పంచాయితీని, తాలుకా పంచాయతీలు జిల్లా పంచాయితీని ఎన్నుకునే విధంగా నిర్మాణం జరగాలని గాంధీజీ కోరారు. జవహర్‌లాల్ నెహ్రూకు వ్రాసిన లేఖలో గ్రామం నుంచి కేంద్రం వరకూ ప్రజల భాగస్వామ్యం పాత్రను గుర్తించాలని గట్టిగా చెప్పారు. అధికారాలు, సంపద వికేంద్రీకరణలో పాటు ప్రభుత్వం ప్రజల ఆస్తుల రక్షణకు ధర్మకర్తగా ఉండాలని కోరారు.

రాజ్యాంగ రచనా సంఘ సభ ఏర్పడ్డ తర్వాత సభ్యులంతా గాంధీజీ భావాల్ని రాజ్యాంగంలో ప్రతిఫలించాలన్నారు. ప్రధాని నెహ్రూ మాట్లాడుతూ, గాంధీ ప్రజల నాయకుడు, జాతిపిత, సభానిర్మాణ కర్త అన్నాడు. అల్లాడికృష్ణ స్వామి మాట్లాడుతూ, భారత రాజకీయ పదనిర్దేశకుడు గాంధీ అన్నాడు.

గాంధీజీ కోరినట్లు అస్పృశ్యతా నిర్మూలన, మత సామరస్యం, పని హక్కు, సామాజిక న్యాయం, లింగ వివక్షతలేని సమాన హక్కులు, అందరికీ విద్య మొదలైనవి ప్రాధమిక హక్కుల్లో చేర్చబడ్డాయి. జీవించే హక్కు, న్యాయస్థానాన్ని ఆశ్రయించే హక్కులు ప్రాధమిక హక్కుల్లో చేర్చబడి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతగా చెప్పబడ్డాయి. రాజ్యాంగ ప్రతిని ఆమోదించటానికి జరిగిన ప్రప్రథమ సమావేశం తేది 4-11-1948 నాడు సభ ఏకగ్రీవంగా "గాంధీజీ స్ఫూర్తి, జీవితం, ఆశయాల మార్గదర్శకంగా భారత రాజ్యాంగం పని తీరు, పరిపాలన సాగుతుందని" తీర్మానించడం జరిగింది. దీని రూపమే 73వ రాజ్యాంగ సవరణ.

స్థానిక సంస్థలు సేవలనందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఏజెన్సీలుగా కాక, ప్రజల భాగస్వామ్యలతో నడిచే స్థానిక ప్రభుత్వాలుగా గాంధీజీ ఆశించిన గ్రామ స్వరాజ్యాలుగా రూపొందాయి.

ఈ వ్యాసంలో గాంధీజీ ఆశించిన గ్రామ స్వరాజ్య స్వభావాల పరిధినీ, 73 రాజ్యాంగ సవరణ ద్వారా నిర్లక్ష్యం చేయబడ్డ వర్గాల ప్రాతినిధ్యాన్ని, నిర్ణయాధికారాల్ని స్థానిక ప్రభుత్వాల అధికారాలు బలోపేతం దిశగా వికేంద్రీకృత భావనతో పాటు గాంధీజీ దృషితో పంచాయితీల అధికారాలు, విధులు, బాధ్యతల పరిధినీ అంచనా వేయడానికి ప్రయత్నం చేయటం జరిగింది.

## వికేంద్రీకరణ

అధికారాలు ప్రజల నుండి ప్రారంభమై ప్రజలకే ఫలితాలు చేరడం అనేది వికేంద్రీకరణ సూత్రం. గ్రామంలోని ప్రజలు గ్రామ సభలు నిర్వహించడం ద్వారా చేసిన నిర్ణయాలు, గ్రామ పంచాయితీ తీర్మానాల రూపంలో మధ్య పంచాయితీలకు, జిల్లా పరిషత్‌కు తద్వారా రాష్ట్ర ప్రభుత్వాల నుండి కేంద్ర ప్రభుత్వానికి చేరటానికి ఇప్పుడు గ్రామ సభ ప్రాతిపదిక అయ్యింది.

అధికారాలు, నిర్ణయాలు 'పై నుంచి కిందకు', కాక 'కింది నుంచి పైకి' అనే సూత్రం ఇప్పుడు ఆచరణ సాధ్యమయింది. 74వ రాజ్యాంగ సవరణ జిల్లా ప్రణాళికల ఏర్పాటును స్థిరం చేసింది.

## సామాజిక ఐక్యత, రాజకీయ ప్రాతినిధ్యం

సమాజం విభిన్న కులాల, మతాల సంగమం, సాముహిక, సంఘటిత చర్యలు సామాజిక ఐక్యతకు, సంఘ అభివృద్ధికి, దేశాభివృద్ధికి దోహదపడతాయి. పరిపాలనలో, నిర్ణయాలలో ప్రజల భాగస్వామ్యం కల్పించబడింది. యస్.సి. యస్.టిలకు, వెనుకబడిన వర్గాలకు వారి జనాభా ప్రాతిపదికన, మహిళలకు మొత్తం స్థానాల్లో మూడో వంతు, మండల, జిల్లా పరిషత్తుల్లో మైనారిటీల ప్రాతినిధ్యం చట్టబద్ధం చేయబడింది. జిల్లా ప్రణాళికా సంఘాల్లోనూ ఈ వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించబడింది. ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం 1984 సెక్షన్ 40 లబ్ధిదారుల కమిటీలు, ఫంక్షనల్ కమిటీల ఏర్పాటును చట్టబద్ధం చేసింది.

## అస్పృశ్యతా నిర్మూలన

సమాజంలో అంటరాని తనం అనేది ఒక దురాచారంగా పరిణమించింది. అందుకే హరిజనోద్ధరణను గాంధీజీ ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. స్వరాజ్యం సాధించాలంటే ఈ అడ్డంకుల్ని అధిగమించాల్సి ఉందని గాంధీజీ చెప్పారు. భారత రాజ్యాంగంలోని అధికరణం 17 అస్పృశ్యతా నిర్మూలనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేర్చి అమలు చేయాలని చెప్పింది. భారత ప్రభుత్వం వివిధ చట్టాల ద్వారా ఈ దురాచారాన్ని నిర్మూలించటానికి కృషి చేస్తున్నాయి. పౌర హక్కుల చట్టం 1956, ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం 1989 మొదలైన ఎన్నో ప్రతిష్టాత్మిక చట్టాలు చేశాయి. పంచాయితీ రాజ్ చట్టం 1994 సెక్షన్ 47 (XXVI) మరియు (XXVII) సంఘ సామరస్యాన్ని సాధించే చర్యల గూర్చి చెప్పింది.

## మద్యపాన నిర్మూలన

"స్వరాజ్య సాధనకు అహింసను ఆదర్శవంతమైన మార్గంగా, ఉన్నత స్థానాన్ని యిచ్చాం. మద్యపానం అనేది ఆ ఉన్నత అశయ సాధనకు అడ్డంకి. మద్యం, మత్తు సమాజాన్ని హింసా మార్గం వైపు నడిపిస్తుంది. వైద్య రంగంలో పని చేసేవారు, దృఢ చిత్తంగల కార్యకర్తలు పూనుకుని ఈ మద్యాన్ని సంఘం నుండి పారద్రోయాలి."


ఈ మాటలు దాదాపు అరవై సంవత్సరాల క్రిందట బాపూజీ చెప్పారు. మద్య నియంత్రణ కోసం పలు చట్టాలు చేయడంతో పాటు పంచాయితీరాజ్ సంస్థలు మద్య నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకునే దిశగా చట్టంలో అధికారాలు కల్పించబడ్డాయి.

## ఖాదీ, ఇతర గ్రామీణ పరిశ్రమలు

ఖాదీ అనేది భారతీయ ప్రాచీన కళానైపుణ్యానికి, జీవన విధానానికి ప్రతీక, ఆధునిక యంత్రాలతో నేసిన దుస్తుల కన్నా ఇవి మేలైనవి. భారతీయ భౌగోళిక, వాతావరణ స్థితిగతులకు అనువైనవి.

అలాగే, ఇతర గ్రామీణ వృత్తులైన కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, సబ్బుల తయారీ, పేపర్ తయారీ, అగ్గి పెట్టెల తయారీ, మట్టి బొమ్మల తయారీ, కొయ్య బొమ్మల తయారీ, కలంకారి, అద్దకం, నూనె ఉత్పత్తులు మొదలైన వాటిని ప్రోత్సహించటం ద్వారా గ్రామంలోని ప్రజలందరికీ చేతినిండా పని, ఏడాదికి సరిపడా ఆదాయం లభించేలా చూడాలని గాంధీజీ పిలుపునిచ్చారు.

అన్నింటినీ మించి, ఖాదీ, ఇతర గ్రామీణ పరిశ్రమల్ని ప్రోత్సహించడం



ఆర్థిక, పారిశ్రామిక ఉత్పత్తి వికేంద్రీకరణకు దోహద పడుతుంది. విదేశీ వస్త్రాలను బహిష్కరించమని గాంధీజీ ప్రబోధించటం వెనుక స్వదేశీ ఉత్పత్తులకు ప్రోత్సాహం, దేశాభిమానం, స్వరాజ్య సాధనకు ప్రేరేపించడం మొదలైనవి ప్రాతిపదికగా చెప్పవచ్చును.

73వ రాజ్యాంగ సవరణ తర్వాత ఏర్పడ్డ పంచాయితీ రాజ్ సంస్థలకు ఖాదీ, ఇతర గ్రామీణ పరిశ్రమలను, ఉత్పత్తులను ప్రోత్సహించడం ప్రధాన బాధ్యతగా చెప్పబడింది. తద్వారా గాంధీజీ చెప్పినట్లు "గ్రామం తన అవసరాలను తనంత తాను తీర్చుకుంటూ, తనకు సాధ్యం కాని వాటి కొరకు మాత్రమే ఇతరులపై ఆధారపడే విధంగా బలోపేతం చేయాలన్న" ఆశయం నెరవేరుతుంది.

## గ్రామీణ పారిశుద్ధ్యం – వ్యక్తిగత మరుగు దొడ్లు

గాంధీజీ దృష్టిలో మానవ మేధస్సు, శారీరక శ్రమ రెండూ సమతుల్యంగా పని చేయకపోతే అటువంటి నేరపూరిత నిర్లక్ష్యం, అశుభ్రత, మురికి రూపంలో గ్రామంలో ప్రత్యక్షమవుతుంది. మనలో సామాజిక, జాతీయ పారిశుద్ధ్య దృష్టి లేకపోవడమే అందుకు ప్రధాన కారణం అని గాంధీజీ చెప్పారు.

మనం, చెరువులు, నదుల్లో స్నానాలు చేసి పాపవిముక్తులం అవుతున్నాం కానీ వాటిని మనం అపవిత్రం చేస్తున్నామని కానీ, వాతావరణ కాలుష్యానికీ, రోగాల వ్యాప్తికీ కారణమవుతున్నామని కానీ గుర్తించలేకపోతున్నాం. కాబట్టి ముందు మనం గ్రామీణ పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని గాంధీజీ చెప్పారు. అంతేకాక, మనం ఈ రోజు మాట్లాడుకునే వ్యక్తిగత మరుగు దొడ్ల గూర్చి తాను అరవై ఏళ్ళ క్రిందటే స్వయంగా ఉపయోగించి చూపారు.

ఈనాడు జాతీయ స్థాయిలో పారిశుద్ధ్యం ప్రాధాన్యత పెరిగింది. ఉద్యమ స్ఫూర్తితో, జాతీయ స్థాయిలో గ్రామీణ పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ప్రచారం చేయడం జరుగుతుంది. అంతేకాక "పరిశుభ్రత భారత్ నిర్మాణ్" దిశగా దేశం అడుగులు వేస్తున్నది. ఈ పారిశుద్ధ్యం అంటే ఏమిటి, అది లోపిస్తే వ్యక్తికి ఏ రకమైన శారీరక అనారోగ్యం వస్తుంది? అది వ్యక్తి మానసిక స్థితిపై ఎలా ప్రభావం చూపుతుంది, అనారోగ్య వ్యక్తుల సమూహం సమాజాభివృద్ధిపై, అంతిమంగా దేశాభివృద్ధిపై ఎటువంటి దుష్ప్రభావాన్ని చూపుతుందో విశదపరిచే విధంగా ప్రచారం చేయబడుతుంది.

వ్యక్తిగత మరుగుదొడ్లతో పాటు సాముహిక మరుగుదొడ్ల నిర్మాణం, ముఖ్యంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి మరుగు దొడ్ల నిర్మాణానికి రాయితీలు, పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలు, పారిశుద్ధ్య కాంప్లెక్సుల

నిర్మాణాలు భారీ ఎత్తున చేపట్టటంతో పాటు గ్రామ స్థాయి మండల తాలుకా, జిల్లా , రాష్ట్ర స్థాయిల్లో నీరు, పారిశుధ్య కమిటీల నిర్మాణం చేయడం జరిగింది. పారిశుధ్యాన్ని అత్యుత్తమ పద్ధతుల్లో నూరు శాతం సాధించిన గ్రామాలకు, సంస్థలకు, వ్యక్తులను నిర్మల గ్రామ పురస్కార అవార్డులను ఏటా ప్రదానం చేయడం జరుగుతుంది.

## ఆరోగ్య విద్య, పారిశుధ్యం

గాంధీజీ దృష్టిలో ఆరోగ్యం, విద్య అనేవి చాలా ముఖ్యమైనవి. ఆరోగ్యం, పారిశుధ్యం పరస్పరాధారితాలు. అయితే ఆరోగ్యం, పారిశుధ్యాన్ని వేరువేరుగా చూడగలిగితే, ఆ రకమైన చైతన్యాన్ని ప్రజలకు అందించగలిగితే వ్యక్తుల్ని, సమాజాన్ని అనారోగ్యం బారినపడకుండా కాపాడుకోవచ్చు. తద్వారా, సమయం, డబ్బు, శ్రమ ఆదా అవుతుందని గాంధీజీ చెప్పారు. పటిష్టమైన సంఘంలోని పౌరులు ఆరోగ్య సూత్రాల్ని పాటించగలుగుతారు. శాఖాహారం, పాలు, అప్పుడప్పుడు ఉపవాసం వల్ల ఆరోగ్యాన్ని మెరుగు పరచుకోవచ్చునని గాంధీజీ చెప్పారు. ఆకలిచావులు సంభవించేది దారిద్ర్యం వల్లనే. కాని సక్రమమైన, సమర్థవంతమైన ఆరోగ్య విద్య, జ్ఞానాన్ని అందించటం ద్వారా పేదరికాన్ని తగ్గించవచ్చని, మరణాల రేటును తగ్గించవచ్చని గాంధీజీ చెప్పారు.

గాంధీజీ మరణించిన అరవై సంవత్సరాల తర్వాత మనం మితాహారం వైపు, ఆరోగ్య సూత్రాలవైపు, శాఖాహారపు ప్రాముఖ్యత వైపు ఆశగా చూస్తున్నాం. ఆరోగ్యాన్ని, పారిశుధ్యాన్ని పెంచే విద్యను అందించాలని ప్రణాళికలు వేస్తున్నాం. ఇది శుభ పరిణామంగా చెప్పుకోవాలి.

## మహిళా సంక్షేమం

"స్వరాజ్య పోరాటంలో మహిళల శ్రమ, కృషిని పురుషులతో సమంగా అంచనా వేయాలి. కాని పురుషులు ఆ విషయాన్ని విస్మరించారు. మొత్తం మానవ ప్రగతి ప్రస్థానంలో స్త్రీ అణచివేతకు ఆచారాలు, చట్టాలతో పాటు పురుషుడు కూడా బాధ్యుడు. అహింసతో కూడిన జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని నిర్మించటంలో పురుషుని కంటే స్త్రీదే ప్రధాన భూమిక. మహిళను సేవకురాలిగా కాక, తన సహచరిగా పురుషుడు భావించాలని గాంధీజీ ప్రబోధించాడు.

భారత రాజ్యాంగంలోని అధికరణం 14, భారత పౌరులందరికీ జాతి, మత, లింగ వివక్షత లేకుండా సమాన హోదా ఇచ్చింది. పనిలో, వేతనంలో, గౌరవంలో, పదవులలో పురుషులతో పాటు సమానంగా స్త్రీలను గుర్తిస్తూ పలు చట్టాలు చేయబడ్డాయి. వరకట్న నిషేధంతో పాటు, గృహహింస నిరోధక చట్టం మొదలైనవి వచ్చాయి. పంచాయితీరాజ్ సంస్థల పదవులతో 1/3 వ వంతు పదవులు మహిళలకే కేటాయించబడ్డాయి.

ప్రస్తుతం 50 శాతం పదవులు మహిళలకు కేటాయించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ చట్టంలో మార్పులు తెచ్చే చర్యలు చేపట్టారు. శాసనసభ, పార్లమెంటు పదవుల్లో కూడా స్త్రీల ప్రాతినిధ్యం పెరిగింది. 1/3 వంతు పదవులు మహిళలకు కేటాయించే బిల్లు చట్టరూపం దాల్చలేదు. ఆ దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయి.

## అందరికీ ప్రాథమిక విద్య

విద్యాభ్యాసం పిల్లల్ని జాతి, మత, కుల, రంగు వివక్షతలకతీతంగా దగ్గర చేస్తుంది. భవిష్యత్తుకు కొత్త రంగును, రూపాన్ని ఇస్తుంది. భారతీయులందరూ ఒక్కటే అన్న జాతీయతా భావాన్ని, ఆత్మీయతా బంధాన్ని ప్రోదిచేస్తుంది.

ప్రాథమిక విద్య దేశమంతటా ఒకే విధంగా ఉంటే, పట్టణం, గ్రామీణ పాఠశాలల్లోని పిల్లలలో బీద, ధనిక భేదం లేకుండా సోదర భావం పటిష్టమవుతుంది. భవిష్యత్తు దేశ ప్రయోజనాల్ని విశాల దృష్టితో ఆలోచించి, జాతి అవసరాలకై బాధ్యతలను తమ భుజస్కందాలపై మోయటానికి సన్నద్ధం చేస్తుంది అని గాంధీజీ చెప్పారు.

భారత రాజ్యాంగంలోని 45వ అధికరణం అందరికీ విద్యను, నిర్బంధ ప్రాథమిక విద్యను తప్పనిసరి చేసింది. దేశంలోని 6 సం॥ నుండి 14 సం॥లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా విద్యనందించడం ప్రభుత్వ బాధ్యతగా చెప్పబడింది. గాంధీజీ కలల ప్రతిరూపమే నేడు 'సర్వశిక్ష అభియాన్ పథకం'గా రూపుదిద్దుకొంది. మహిళా సాక్షరతా మిషన్ పేరుతో స్త్రీ విద్యకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాథమిక విద్యా కేంద్రాలు, జిల్లా పరిషత్ పాఠశాలలపై పంచాయితీ రాజ్ సంస్థలకు అజమాయిషీ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విద్యా కమిటీ చైర్మన్‌లుగా సర్పంచు, మండల అధ్యక్షులు, జిల్లా పంచాయితీ అధ్యక్షులు ఆయా స్థాయిల్లో వ్యవహరిస్తారు.

## వయోజన విద్య

"నిరక్షరాస్యతే మన పరాధీనతకు కారణం. వయోజనులంతా విద్యావంతులైనట్లయితే మరెంతో సులువుగా స్వరాజ్యం సిద్ధించేది" అని గాంధీజీ చెప్పారు. వయోజన విద్య అంటే అక్షరాభ్యాసం కాదు. ముందు ఉచ్చారణ, తర్వాత రాయటం నేర్పాలి. వివిధ ప్రత్యేక పద్ధతుల ద్వారా దీన్ని చెయ్యాలి. వృత్తుల్ని, కళల్ని ప్రాతిపదికగా తీసుకోవాలని గాంధీజీ చెప్పారు.

దేశంలో అక్షరాస్యతా శాతాన్ని, వయోజన విద్యను ప్రోత్సహించడం పంచాయితీ రాజ్ సంస్థల బాధ్యతగా చట్టంలో చెప్పబడింది. ముగ్గుల పోటీలు, వివిధ వస్తువుల ఆకృతుల్ని ముందు నిరక్షరాస్యుల వయోజనుల చేత రాయించి, అభ్యాసం చేయించి తర్వాత అక్షరాలు నేర్పిస్తున్నారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు ఈ కార్యక్రమాలలో భాగస్వామ్యం చేయబడ్డాయి.

## జాతీయ, ప్రాంతీయ భాషలు

భారతదేశం విభిన్న భాషల, సంస్కృతుల సమ్మేళనంతో కూడినది. భౌగోళిక విస్తృతి కలిగినది. జాతి విశాల ప్రయోజనాల రీత్యా ప్రజల మధ్య భావాల వారధిగా ఒక భాష ఉండాలి. అది నిస్సందేహంగా హిందీ అని గాంధీజీ చెప్పారు. అలాగే ఇంగ్లీషు భాషపై మోజుపడి మనం ప్రాంతీయ భాషల్ని మరవరాదని చెప్పారు.

విద్యావంతులు, ఆధునికులు, పట్టణ ప్రజలు ఆంగ్ల భాషపై వ్యామోహం పెంచుకుంటే, పేదలు, గ్రామీణులు, ప్రాంతీయ భాషలో వ్యవహరిస్తుంటే ఆ అగాధం మరింత పెరిగే ప్రమాదముందని హెచ్చరించారు గాంధీజీ.

జాతీయ భాషగా హిందీని, ప్రాంతీయ అధికార భాషలుగా వివిధ భాషల్ని రాజ్యాంగం గుర్తించినా, గాంధీజీ హెచ్చరించినట్లు ఆంగ్ల భాష ప్రభావం మన సమాజంపై అధికం ఉంది.

అయితే పంచాయితీ రాజ్ సంస్థలు ఏర్పడ్డాక, గ్రామసభ వ్యవహారాలు స్థానిక భాషలోనే జరపాలనీ, తీర్మానాలు స్థానికులకు అర్థమయ్యే వాడుక భాషలో చేయాలనే ఉత్తర్వులు ఇవ్వబడ్డాయి. అధిక భాషలో రాష్ట్ర భాషలో రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించటానికి రాష్ట్ర అధికార సంఘం ఏర్పాటు చేయబడింది.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీ (అపార్డు), గిరిజన ప్రతినిధులకు శిక్షణ యిచ్చేటప్పుడు స్థానిక, గిరిజన భాషలోనే శిక్షణ ఇవ్వడం జరుగుతుంది.

## ఆర్థిక సమానత్వం

ఆర్థిక సమానత్వం కోసం ప్రయత్నించటమంటే పెట్టుబడికి, శ్రమకు మధ్య వైరుధ్యాన్ని తగ్గించటమన్న మాట. అనగా సంపదను తమ చేతిలో కేంద్రీకృతం చేసుకున్న కొందరి స్థాయిని తగ్గించి దిగువ స్థాయిలో ఉన్న కోట్లాది ప్రజల నిరసన నిలపటం. ఈ వైరుధ్యాన్ని ఒక్క రోజుతో తొలగించలేకపోయినా, సాధ్యమైనంత త్వరగా, ఈ కార్యాన్ని సాధించటానికి ప్రభుత్వాలు దృష్టి కేంద్రీకరించాలని గాంధీ చెప్పారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాజికాభివృద్ధి పథకాలు, పంచవర్ష ప్రణాళికలు మొదలైన బృహత్తర కార్యక్రమాల ద్వారా ఆర్థిక సమానత్వాన్ని సాధించే ప్రయోగాలు చేస్తూనే ఉన్నాయి. అయితే అతి పేదరికంతో పాటు అలసత్వం, ఇతర రాజకీయ, సాంఘిక సమస్యలు ఈ కార్యక్రమాల విజయాన్ని ఆశించిన ఫలితాన్ని అడ్డుకుంటున్నాయి.

73వ రాజ్యాంగ సవరణ తర్వాత ప్రణాళికలు గ్రామస్థాయిలోనే తయారు చేయడం, అమలు, పర్యవేక్షణ ప్రజలకే వదిలి పెట్టాలని నిర్ణయించటం జరిగింది. పరిమిత స్థాయిలోనే అయినా ఈ దిశగా అడుగులువేయడం జరుగుతున్నది.

## రైతులు

రైతులను విస్మరించిన రాజ్యం స్వరాజ్యం కానేరదని గాంధీజీ చెప్పారు. వారు శక్తిని వారు గుర్తించగలిగితే ఈ భూమిపై వారిని ఏ శక్తి అడ్డుకోలేదు. అయితే, రైతులను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దని గాంధీజీ చెప్పారు. చంపారన్ ఉద్యమంలో తమ రైతులందరూ అహింసా మార్గంలో నడిపిన ఉద్యమం ఇచ్చిన సానుకూల ఫలితాల ఆధారంగా, ఏ రైతు ఉద్యమం కూడా హింసాపూరితంగా నడవాల్సిన అవసరం లేదని గాంధీజీ చెప్పారు.

పంచాయితీరాజ్ సంస్థలు రైతు ప్రయోజనాలకై చేపట్టాల్సిన ఎన్నో చర్యల్ని ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం 1994లో చెప్పబడ్డాయి. తదనుగుణంగా పంచాయితీలకు అధికారాల బదలాయింపు పూర్తి స్థాయిలో జరగాల్సి ఉంది. ఆ దిశగా ప్రభుత్వం కృషి చేస్తున్నది.

## కార్మికులు

అహ్మదాబాద్ కార్మిక సంఘంతో పరిచయాల వల్ల గాంధీజీకి కార్మిక వర్గపు సమస్యలు ఆకళింపు అయ్యాయి. గాంధీజీ ఆ యూనియన్ పట్ల ఆకర్షితుడయ్యాడు. అహింసా మార్గంలో వ్యక్తి నుండి వ్యక్తికి ప్రచారం ద్వారా బలపడిన ఈ సంఘం ఎన్నో ఉత్తమ ఫలితాల్ని సాధించింది. స్వంతంగా పాఠశాల, వైద్యశాల, ప్రింటింగ్ ప్రెస్సు, ఖాదీ డిపో, నివాస గృహాలు మొదలైనవి అక్కడ ఈ యునియన్ ద్వారా సమకూరాయి. గ్రామంలోని ప్రజలంతా ఇటువంటి శాంతియుత సంఘటిత శక్తిగా మారాలని గాంధీజీ చెప్పారు.

## ఆదివాసీలు

పూర్ణ స్వరాజ్ లేదా సంపూర్ణ స్వాతంత్ర్య దేశంలో ఆదివాసీల సేవ కూడా ఒకటిగా గుర్తించాలని గాంధీజీ చెప్పారు. విభిన్న జాతుల సమ్మేళనమైన మన దేశంలో ప్రతీ జాతి యొక్క అస్తిత్వాన్ని గుర్తిస్తూ, దేశమంతా ఒకే జాతిగా ఎదగడానికి దోహదం చేయాలని చెప్పారు. పంచాయితీరాజ్ సంస్థలు గిరిజన ప్రాంతాలకు వర్తించే క్రమంలో రాజ్యాంగం వారి ఆచారాలు, సంస్కృతుల కొనసాగింపునకు తగిన సముచిత స్థానాన్ని కల్పించటం జరిగింది. 'పీసా' చట్టం ద్వారా వారి గ్రామసభకు ప్రత్యేక అధికారాలు ఇవ్వబడ్డాయి.

## గ్రామ స్వరాజ్యం దిశగా గ్రామ పంచాయితీలు

గాంధీజీ చెప్పినట్లు ప్రతి గ్రామం తన అవసరాలు తీర్చుకునే విధంగా వృత్తులు బలపడి, వంటలు, పరిశ్రమలు పరస్పర ఆధారితాలుగా ఎదగాలంటే పంచాయితీలు స్వయం సమృద్ధిగా ఎదగాలి.

73వ రాజ్యాంగ సవరణ ద్వారా అనుబంధం 11లో చెప్పబడిన 29 అంశాలు, ఆ అంశాలను నిర్వహించే శాఖలు అయినటువంటి భూసంస్కరణలు, చిన్న తరహా సాగునీటి నిర్వహణ, పశు, పాడి, కోళ్ళ పరిశ్రమలు, మత్స్య పరిశ్రమలు, సామాజిక అటవీ పెంపకం, తోటల పెంపకం, చిన్న తరహా అటవీ ఉత్పత్తులు, ఆహార ప్రోసెసింగ్, పరిశ్రమలు, ఖాదీ, గ్రామీణ పరిశ్రమలు, గ్రామీణ గృహ నిర్మాణం, మంచినీటి నిర్వహణ, ఇంధనం, పశుగ్రాసం, రోడ్లు కల్వర్టులు, వంతెనలు కాల్వలు, జల మార్గాలు, ఇతర కమ్యూనికేషన్ విధానాలు, గ్రామీణ విద్యుదీకరణ, పంపిణీ, సాంప్రదాయేతర ఇంధన వనరులు, దారిద్ర్య నిర్మూలనా కార్యక్రమాలు, ప్రాథమిక విద్య, సెకండరీ పాఠశాలలు, సాంకేతిక శిక్షణ, వృత్తి విద్య, వయోజన విద్య, గ్రంథాలయాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మార్కెట్లు, సేవలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, కుటుంబ సంక్షేమం, స్త్రీ శిశు అభ్యుదయం, సాంఘిక సంక్షేమం, వికలాంగుల సంక్షేమం, బలహీన వర్గాల సంక్షేమం, ప్రజా పంపిణీ వ్యవస్థ, సామాజిక ఆస్తుల నిర్వహణ మొదలైన మొత్తం గ్రామీణ భారతం పంచాయితీ రాజ్ సంస్థల అజమాయిషీలోకి రాగానే గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం అవతరిస్తుంది.

కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నుండి అధికారాల బదలాయింపు అంగీకార పత్రాల్ని తీసుకుంటున్నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పైన పేర్కొన్న వీటిలో 10 శాఖల్ని బదలాయిస్తూ ఉత్తర్వులు వెలువరించింది. కేంద్ర ప్రభుత్వం తీర్మానించినట్లు పంచాయితీరాజ్ సంస్థలలో మహిళల ప్రాతినిధ్యాన్ని 50% పెంచే ప్రతిపాదనకు, పార్లమెంటులో ప్రవేశ పెట్టబడిన న్యాయ పంచాయితీల స్థాపన బిల్లుకు అందరికంటే ముందుగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్ఫూర్తిదాయకంగా అంగీకరిస్తున్నట్లు తెలిపింది.

గ్రామ న్యాయాల స్థాపన దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోబోతున్నట్లు న్యాయ శాఖ మంత్రి తెలిపారు.

సమీప భవిష్యత్తులో విధులు, విధానాలు, అధికారాలు, సిబ్బంది, వనరులు మొదలైన మొత్తం బదలాయింపు ప్రక్రియ అమలు జరుగుతుందనీ, గాంధీజీ కలలుగన్న, ప్రబోధించిన గ్రామ స్వరాజ్యం భవిష్యత్తు భారతంలో ఆవిష్కృతమవుతుందనీ ఆశిద్దాం.

పూజ్య గాంధీజీ ఆశించిన గ్రామ స్వరాజ్యం 73వ రాజ్యాంగ సవరణ ద్వారా సాధ్యమయ్యే దిశలో ప్రయాణిస్తోంది.

అక్టోబర్ 2, 1959 నాడు రాజస్థాన్‌లోని నాగూర్ గ్రామంలో అప్పటి ప్రధానమంత్రి కీ॥శే॥ జవహర్‌లాల్ నెహ్రూ పంచాయితీరాజ్‌ను ప్రారంభించారు. ఇప్పటికి 50 సంవత్సరంలో 50 సంవత్సరాలు నిండింది.

***– ఎ. గవర్రాజు,*** *ఫ్యాకల్టీ, సిడిపిఎ, అపార్డు*



# ఇ-గవర్నెన్స్‌కు ఆకాశమే హద్దు

ఆధునిక ప్రభుత్వ పరిపాలనా యంత్రాంగంలో ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ లేదా ఐటి అనేది తన ప్రభావాన్నీ, ప్రాభవాన్నీ చాటిచెబుతోంది. నేడు మనదేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లో ఎలక్ట్రానిక్ మాధ్యమం ద్వారా ప్రజాసేవకు శ్రీకారం చుట్టడం జరిగింది. ఇలా ప్రజాసేవలన్నింటినీ ఎలక్ట్రానిక్ మాధ్యమం ద్వారా ఒకే త్రాటిపై తెచ్చి, లభింపజేయడమే 'ఎలక్ట్రానిక్ పరిపాలన' లేదా 'ఇ-గవర్నెన్స్'!

ప్రభుత్వాలు తమ పరిపాలనలో భాగంగా వివిధ అంశాలగురించిన సమాచారాన్ని అందరికీ అందుబాటులోకి తేవాల్సి ఉంటుంది. సజావైన పరిపాలనకు ఇదెంతో కీలకం కూడా! ఎలాంటి జాప్యమూ లేకుండా సజావైన సుపరిపాలన కావాలీ అంటే, దానికి 'సమాచారం' ఎంతో కీలకం. ప్రభుత్వాల మనుగడకు పన్నుల వసూళ్ళు సక్రమంగా జరగాలి. వాటిపై సరైన పర్యవేక్షణ కూడా ఉండాలి. చాలాసమయాల్లో, ఉద్యోగస్తులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపడంవల్లో, మరో కారణం వల్లో పని జరగడంలో ఆలస్యం, అలసత్వం నెలకొనడం జరుగుతుంది. తద్వారా ప్రభుత్వరంగ లక్ష్యానికే విసుగు కల్గిస్తుంది. 'జాప్యం', 'లంచగొండితనం', 'రెడ్‌టేపిజం' - ఇలాంటివన్నీ దానికి తోడవడంతో 'అగ్నికి ఆజ్యం పోసినట్లు' అయి, ప్రజల్లో ఒకరకమైన విసుగూ, కోపమూ, నిరాసక్తతా ఏర్పడి పోయిందిప్పటికే!

'ఐటి' రంగప్రవేశంతో ప్రభుత్వం పనితీరులో సైతం మార్పు చోటుచేసుకొంది. ఐటికి ఈ రకమైన సమస్యలను పరిష్కరించి, పనులను చక్కబెట్టి, సమర్థవంతమైన పరిపాలనను అందించే సామర్థ్యం ఉండటం వల్ల ప్రభుత్వాలు తమ తమ శాఖలను కంప్యూటరీకరించడం ఆరంభించాయి. ఈ క్రమంలో ప్రభుత్వశాఖలు పనితీరులో వ్యతిరేక అంశాల ఒత్తిడిని అధిగమించడం కూడా జరిగింది. సరైన రికార్డులను నెలకొల్పి, నిర్వహించడం, సమాచారాన్ని వెదకడం, వాటిని ప్రజలకు అందించడం, ఇవన్నీ ప్రభుత్వ విభాగాలను 'ఆలస్యం' నుంచీ, 'అలసత్వం'నుంచీ దూరంగా ఉంచి, 'అప్ టు డేట్' గా, 'స్మార్ట్'గా ఉండేలా చూస్తున్నాయి. ఇవన్నీ ఇ-గవర్నెన్స్ చొరవలవల్లే సాధ్యమయ్యిందన్నమాట! సాంఘిక సంక్షేమం, ప్రజాభాగస్వామ్యంతో ప్రభుత్వ పాలన - ఇదే కదా ప్రజాస్వామ్య లక్ష్యాలు! ప్రజల కొరకు, ప్రజలచేత... ఎలక్ట్రానిక్ మాధ్యమం ద్వారా ప్రభుత్వాన్ని నిర్వహించడమే 'ఇ-గవర్నెన్స్' అది గ్రామం నుంచీ నగరందాకా ఎక్కడైనా సుసాధ్యమే! కావల్సిందల్లా కంప్యూటర్స్, నెట్‌వర్క్ ఇంటర్నెట్, వెబ్‌సైట్స్ వగైరా! ప్రజలు సదా ప్రభుత్వంతో కొంచెం 'టచ్'లో ఉండొచ్చన్న మాట!

## సుపరిపాలన కోసం ఇ-గవర్నెన్స్

ప్రభుత్వ పరిపాలనలో మొదట సాధారణ సమాచార వితరణ, నిర్వహణలకోసం కంప్యూటరీకరణ ఆరంభమైంది. ఉద్యోగులకు తొలుత ఉద్యోగ అభద్రతా భావం నెలకొని కొన్ని ఏళ్ళు ఆలస్యం అయినా, ఇంటర్నెట్ ప్రాభవంతో 'కంప్యూటరీకరణ' లాభాలేమిటో తెల్సిరావడంతో, ఉద్యోగాలకు ఒకనాడుండిన ఆ అభద్రతాభావం తొలగిపోవడంతో నెమ్మదిగా ఇ-మెయిల్స్‌తో మొదలైంది ప్రభుత్వ పాలన. అది నేడు ఇ-గవర్నెన్స్ దాకా విస్తరించింది. దీనివల్ల గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల కోసం కల్పిస్తున్న పథకాలు, సేవలు, ప్రోత్సాహకాల గురించి అవగాహన అవగాహన కల్పించడం, అవినీతిని దశలవారీగానైనా తొలిగించడం వంటి పరిణామాలకు దారితీయడం జరిగింది. నేడు ప్రజలకు 'ఇ-సేవ', ఇ-గవర్నెన్స్ వంటి ఎన్నో ఐటి ఫలాలు ఇతోధికంగా సేవ చేస్తున్నాయి. ఇ-గవర్నెన్స్‌కు ప్రాధాన్యత పెరిగింది. అటు ప్రజలకీ, ఇటు ప్రభుత్వానికీ వారధిగా, అటు సిబ్బందికీ ఇటు వ్యాపారానికీ చేయూతగా నిల్చింది ఇ-గవర్నెన్స్!




ప్రభుత్వం తన పని

తీరులో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని వాడుతూ, తద్వారా ★ సులభమైన, ★నీతివంతమైన ★జవాబుదారీయైన ★స్పందించేరీతిన ★ పారదర్శకమైన

సుపరిపాలనను అందించడమే ఇ-గవర్నెన్స్ లక్ష్యం. దీన్నే ఇంగ్లీష్లో 'స్మార్ట్' గవర్నెన్స్ అంటారు.

నేడు మొబైల్ ఫోన్ల వాడకం పెరగడంతో ఇ-గవర్నెన్స్ మొబైల్ సేవలు కూడా ఆరంభమైనాయి. వీటినే 'మొబైల్ ఇగవర్నెన్స్' లేదా మొబైల్ గవర్నెన్స్ లేదా క్లుప్తంగా 'ఎం...గవర్నెన్స్' అని వ్యవహరిస్తున్నారు.

ఇ-గవర్నెన్స్ సేవలను ప్రధానంగా నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి

★ జి2జి - గవర్నమెంట్ టు గవర్నమెంట్ - అంటే రెండూ ప్రభుత్వాల / ప్రభుత్వ శాఖల మధ్య లావాదేవీలు

★ జి2ఇ - గవర్నమెంట్ టు ఎంప్లాయీస్ - ప్రభుత్వానికీ, దాని ఉద్యోగుల కీ మధ్య లావాదేవీలు

★ జి2సి - గవర్నమెంట్ టు సిటిజన్ - ప్రభుత్వానికీ ప్రజలకీ మధ్య లావాదేవీలు

★ జి2బి - గవర్నమెంట్ టు బిజినెస్ - ప్రభుత్వానికీ వ్యాపార/వాణిజ్య సంస్థలకీ మధ్య లావాదేవీలు



భారత ప్రభుత్వ సంచార, సమాచార మంత్రిత్వశాఖ ఈ వివిధ సేవలను అందించడం కోసం ఎన్నో చర్యల ను తీసుకొంది. అన్ని రాష్ట్రాలకూ మార్గదర్శకాలు జారీ చేసింది. ఆయా రాష్ట్రాల్లో స్వయంగా డేటా సెంటర్లు ఏర్పాటు చేసుకొని నిర్వహించుకొనేలా మార్గదర్శకాలు రూపొందాయి.

## కొన్ని జనరంజకమైన ఇ-గవర్నెన్స్ సేవలు

### ఆంధ్రప్రదేశ్

***ఇ-సేవ:*** 2001, ఆగస్ట్ 25న ఆంధ్రదేశంలో ప్రవేశపెట్టిన ఇ-సేవ, నిజానికి 1999 లోనే జంటనగరాల్లో 'ట్విన్స్' పేరున ఆరంభించారు. నేడు ఇదెంత ప్రజాదరణ పొందిందో అందరికీ తెలుసు.

***కార్డ్ :*** ఆంధ్రదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన ఇగవర్నెన్స్ ప్రాజెక్ట్ ఇదే. 'కంప్యూటరైజ్డ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్మెంట్' లేదా కార్డ్ (CARD) - భూమి, ఇళ్ళ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో విప్లవాత్మకమైన మార్పు తెచ్చింది.

***రాజీవ్ :*** రాజీవ్ ఇంటర్నెట్ విలేజి (Rajiv) ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ఖర్చుతో, వేగంగా, సమర్థవంతంగా అన్ని రకాలుగా ప్రభుత్వ సేవలను అందించే ఇ-గవర్నెన్స్ కార్యక్రమం 2003లోనే ఆరంభమైంది. అన్ని రకాల జి2సి, బి2సి సేవలు దీని ద్వారా అందుతున్నాయి.

***ప్రజావాణి*** : ప్రజలవద్దకు పాలన, ప్రజాపథం వంటి ఎన్నో కార్యక్రమాలకు భిన్నంగా ఆధునిక పరిజ్ఞానంతో తెలుగులో సులభంగా వాడేలా అమలు జరుగుతోన్న సి2జి తరహా ఇగవర్నెన్స్ ప్రాజెక్ట్ 2007లో ఆరంభమైంది.



దీనిద్వారా ప్రజలు తమ సమస్యలను జిల్లా కలెక్టరు కార్యాలయానికి వెళ్ళనవసరంలేకుండా ఇంటర్నెట్ కియోస్కుల్లో తమ సమస్యలను నమోదు చేసుకోవచ్చు పరిష్కరించవచ్చు. ప్రస్తుతం 12 జిల్లాల్లో విజయవంతంగా అమలౌతోంది.

### ఉత్తరప్రదేశ్

***లోక్వాణి :*** 2004లో ఆరంభమైన ఈ ప్రాజెక్టు ద్వారా వివిధ ప్రభుత్వ సేవలను 'సీతాపూర్' లో ఆరంభించారు. నేడు దాదాపు ఉత్తరప్రదేశ్ అంతా విస్తరించింది.

***రియల్ ఇ- గవనర్నెన్స్*** : ఫైజాబాద్ ప్రజలకోసం మొబైల్ ఇ-సేవలను ఈ పథకం కింద ఆరంభించారు. ఇలాగే అనంత్ సంపర్క్ అనేదీ ఆరంభమైంది. దీనిలో వైర్లెస్ పరిజ్ఞానం వాడతారు. జనన మరణ, ఆదాయ, భూ రి కార్డుల వంటి ఎన్నో విషయాలకు చెందిన సమాచారాన్ని అందుకోవచ్చు.

### తమిళనాడు

***రెజినెట్:*** వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లోని డేటా అందరికీ అందుబాటులోకి తేవడం, ఆస్తివివరాలు తెలియజేయడం కోసం సబ్రిజిస్ట్రార్ కార్యాలయాల న్నిటినీ అనుసంధానం చేసి, వివిధ సేవలను అందించడమే దీని లక్ష్యం.

***సార్వజనీక దరఖాస్తుఫారాల సైటు :*** వివిధ సేవల కోసం అవసరమయ్యే సార్వజనీక దరకాస్తులన్నిటినీ ఒకే చోట లభించేలా చూడటం దీని ఉద్దేశ్యం.

***విస్ట్ :*** గ్రామీణ ప్రాంతాలకు ముఖ్యంగా బలహీన వర్గాల కోసం గ్రామీణ టెక్నో మధ్యవర్తులను తయారు చేయడం దీని లక్ష్యం. టెలిమెడిసిన్, టెలి ఎడ్యుకేషన్, రిమోట్ సెన్సింగ్, వ్యవసాయ సలహాలు, వాతావరణ సూచనలూ, జల నిర్వహణ, ఆన్లైన్ సలహాలు వంటి అనేక సేవలను సింగిల్ విండో ద్వారా అందిస్తున్నారు. దీన్ని ప్రస్తుతం 35 గ్రామాలదాకా విస్తరించడం జరిగింది.



## హిమాచల్‌ప్రదేశ్

***హిమరిస్ :*** సకాలంలో ఒక రిజిస్ట్రేషన్ చేయడం, తదితర సేవలను అందించి రిజిస్ట్రేషన్‌తో పారదర్శకత, వేగం, నమ్మకం కల్గించేదే ఈ ప్రాజెక్ట్. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే 'కార్డు' పేరుతో అమలు అవుతున్న ప్రాజెక్టును పోలిందీ హిమరిస్.

***అలీస్ :*** వివిధ ఆయుధాల లైసెన్సు జారీ, రెన్యూవల్ వంటి సేవలను అందించడం, నకిలీల ఆటకట్టించడం వంటి విషయాల్లో 'అలీస్' ఇతోధికంగా విజయవంతమైనట్లే.

***వాహనాల రిజిస్ట్రేషన్ :*** వాహనాల రిజిస్ట్రేషన్, టాక్స్ వివరాలు, ఫిట్‌నెస్ రిపోర్టులు, గడువుతేదీని పర్మిట్‌లేని వాహనాల వివరాలు వంటి కీలకమైన సేవలు ఇందులో వీలయ్యింది.

***డాక్‌నెట్ :*** జి2జి, బి2బి, ఒ2సి వంటి విభిన్న సేవలను రైతులకోసం, వ్యవసాయ భాగస్వాముల కోసం మాత్రమేకాక ఉద్యోగులను బలోపేతం చేసి, ఉత్పాదకతను పెంచి ఆర్థిక సేవలను మెరుగుపరచడం – ఒకేచోట అన్ని సేవలూ అందించడం దీని ఉద్దేశ్యం. తొలుత హిమాచల్‌ప్రదేశ్‌లో మాత్రమే అమలైనా, విజయవంతం కావడంతో నేడు దేశంలో అన్ని రాష్ట్రాల్లోనూ అమలు జరుగుతోంది.

## హర్యానా

***హారిస్:*** హారిస్ అనేది 'కార్డు', 'హిమరిస్' లాంటిదే. రిజిస్ట్రేషన్ లావాదేవీలను క్రమబద్ధీకరించి, రాబడిని సైతం పర్యవేక్షించే రీతిలో రూపొంది అమలు అవుతోంది.

***జమాబందీ/భూలేఖ్ :*** భూ రికార్డులకు సంబంధించి వివరాలు, పరివర్తనా రిజిస్టర్‌ను నిర్వహించడం, డాక్యుమెంట్ల నకళ్ళను పొందేలా చూడటం – ఇవన్నీ ఈ ప్రాజెక్టు ద్వారా సుసాధ్యమైంది. ఇలాంటి ప్రాజెక్టు భూభారతి అనీ, దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ అమలౌతోంది. భూమి పేరున కర్ణాటకలో అమలౌతోంది కూడా!

## కర్ణాటక

***భూమి :*** దాదాపు 70 లక్షల మంది రైతులకు చెందిన 200 లక్షల భూమి రికార్డుల వివరాలు తాజాగా అందించడం దీని లక్ష్యం, నకళ్ళను క్షణాల్లో 15 రూపాయలకు జనం ఇట్టే పొందగల్గడంతో దళారీలబెడద తొలగిపోయింది.

***నెమ్మది :*** అన్ని రకాల ధృవీకరణ పత్రాలు జారీ చేయడానికి, ఇతర సేవలను సమీకృతం చేసి ఒకే చోట లభింపజేయడం 'నెమ్మది' ఉద్దేశ్యం. మనరాష్ట్రంలో 'ఇసేవ' విజయవంతం అయ్యాక దాని తరహాలో కర్ణాటకలో 'నెమ్మది' ఆరంభమై విజయవంతమైంది.

## బెంగుళూరు

ఎపుడైనా, ఎక్కడైనా, ఎవరైనా సరే తమ నెలవారీ బిల్లుల చెల్లింపులు సులభంగా చేసుకోవడానికి మనరాష్ట్రం 'ఇ-సేవ' తర్వాత అంత ప్రజాదరణ పొందిన ఇగవర్నెన్స్ ప్రాజెక్టు 'బెంగళూరు'.

***ఖజానా-కావేరి :*** రాష్ట్రంలోని 250 ట్రెజరీలను నెట్‌వర్క్ ద్వారా కలిపి, అకౌంటింగ్ వ్యవస్థను సమూలంగా ఆధునీకరించి కంప్యూటరీకరించిన ప్రాజెక్ట్ 'ఖజానా'. ఖాతాలో జమ, చెల్లింపు – అంతా ఆన్‌లైన్, కావేరి ద్వారా స్టాంపుల విక్రయం, భూమి రిజిస్ట్రేషన్ వగైరా జరుగుతోంది. కావేరి మన రాష్ట్రంలోని 'కార్డు' ప్రాజెక్టు లాంటిదే.

## ఛత్తీస్‌గఢ్

***ఇ-సంపర్క్, జనసంపర్క్ :*** ఎక్సైజు, టాక్స్, రవాణా, ఇంజనీరింగ్, సాంఘికసంక్షేమం, గృహనిర్మాణం, పాస్‌పోర్టు – వంటి వివిధ శాఖల సేవలను ఒకే చోట 'ఇ-సంపర్క్' ద్వారా అందించడం జరుగుతోంది. చెల్లింపులు, ధృవీకరణ పత్రాలు పొందడం లాంటివి జనసంపర్క్ ద్వారా లభిస్తున్నాయి. ఇవి ఇంచుమించు 'ఇ-సేవ' లాంటిదే. ఇసంపర్క్ ప్రాజెక్టులో ఇ-జనసంపర్క్ కేంద్రాలద్వారా సేవలు అందిస్తున్నారు.

***ఇ-పంచాయితీ :*** వివిధ పంచాయితీ కంప్యూటరీకరణ ద్వారా గ్రామీణాభివృద్ధి పథకాలను ఆన్‌లైన్‌గా పర్యవేక్షించడం, వివిధ అంశాల గురించిన సమాచారాన్ని అందివ్వడం దీని ఉద్దేశ్యం. ఇలాంటిదే ఇపంచాయితీ పేరున ఆంధ్ర రాష్ట్రంలోనూ కొన్ని ఎంపిక చేసిన జిల్లాల్లో అమలవుతోంది.

***భూనియా :*** 'భూమి' లాంటి ప్రాజెక్టే ఇది. తాసీలు స్థాయిలో అమలవుతోంది. ఛత్తీస్‌గఢ్ భాషలో భూనియా అని అంటే 'భూమి' అనే అర్థం.

***ఛాయిస్ :*** 'ఇ-సేవ'ను పోలిన ఇ-గవర్నెన్స్ చొరవకే ఛత్తీస్‌గఢ్‌లో ఛాయిస్ అని పేరుపెట్టారు. ఛాయిస్ ద్వారా 130 ప్రభుత్వ సేవలు లభిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్ ఆన్‌లైన్ ఇన్ఫర్మేషన్ ఫర్ సిటిజన్ ఎంపవర్‌మెంట్ అనడానికి క్లుప్త రూపమే ఛాయిస్ (choice).

***ఇ-గ్రామ్ సూరజ్ :*** పంచాయితీ, గ్రామీణాభివృద్ధి శాఖ సింప్యూటర్లనే స్వదేశీ కంప్యూటర్ పరిజ్ఞానం సాయంతో గ్రామ సర్పంచులు సరైన

కాలంలో సరైన నిర్ణయాలు తీసుకొనే రీతిలో దీన్ని రూపొందించారు. స్వర్ణజయంతి రోజ్‌గార్‌యోజన, సంపూర్ణ స్వరాజ్ రోజ్‌గార్ యోజన వగైరా పథకాలకు చెందిన అన్ని పథకాలకు సంబంధించిన 'డేటాబేస్' రూపొందించి, తాజా సమాచారాన్ని అందించడంలో సఫలమైన ప్రాజెక్టు ఇది.

## మధ్యప్రదేశ్

***జ్ఞానదూత్***: 'ఇ-సేవ'ను పోలిన తక్కువ ఖర్చుతో గ్రామీణ అవసరాల కోసం రూపొందించిన ఇ-గవర్నెన్స్ ప్రాజెక్టు ఇది. యువతలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కూడా ఏర్పాటు చేశారు.

## రాజస్థాన్

***జనమిత్ర :*** 'ఇ-సేవ'ను పోలిన ఇగవర్నెన్స్ చొరవ ఇది.

## మహారాష్ట్ర


***సరిత :*** ఆంధ్రదేశంలో 'కార్డు' విజయవంతమయ్యాక, అది వివిధ రాష్ట్రాలకు మార్గదర్శకమైంది. కార్డ్‌ను పోలిన 'సరిత' మహారాష్ట్రలో 4.5 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో, 35 జిల్లా కార్యాలయాల్లో, 8 డివిజినల్ కార్యాలయాల్లో విజయవంతంగా అమలౌతోంది.

***సేతు :*** 'ఇ-సేవ' ను పోలిన 'సేతు' కేంద్రాలు సమీకృత పౌర సేవా కేంద్రాలే, 28 జిల్లాలలో 298 తాలూకాలలో ఆరంభించారు.

***ప్రగతి :*** దాదాపు 2.5 లక్షల జనాభాను వైర్‌లెస్ ద్వారా అనుసంధానం చేసి ఒకే నెట్‌వర్క్‌పై తేవడం దీని ఉద్దేశ్యం. 10 కి.మీ. వ్యాసార్థం గల విస్తీర్ణంలోని దాదాపు 50 గ్రామాలలోని హైస్కూళ్ళను అనుసంధానం చేసి, ఉపాధ్యాయుల సలహాలనూ, బోధనలనూ అందుబాటులోకి తేవడం, అత్యవసరస్థితిలో ప్రజల ముంగిటే వైద్య సేవలందివ్వడం దీని ప్రధానోద్దేశ్యం.

***రోజ్‌గార్ వాహిని :*** ఉపాధి, స్వయం ఉపాధి శాఖల ద్వారా రూపొందిన ఈ పోర్టల్‌లో వృత్తిపరమైన సలహాలు, ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధి కోరే వారికి సూచనలూ, వివిధ ఉచిత సేవలూ దీనిద్వారా ప్రజలకు అందుతున్నాయి.

ఇవీ వివిధ రాష్ట్రాల్లో అమలు జరుగుతోన్న వివిధ ఇ-గవర్నెన్స్ చొరవలు. ఈ జాబితా సమగ్రం కాదు. ఇంకా ఎన్నెన్నో ప్రాజెక్టులు అమలు జరుగుతున్నాయి. జార్ఖండ్, ఒరిస్సా, బీహార్, పశ్చిమబెంగాల్, పుదుచ్చేరి, గోవా వంటి ఇతర రాష్ట్రాలలో కూడా ఎన్నెన్నో విజయవంతమైన ఇ-గవర్నెన్స్ ప్రాజెక్టులు నడుస్తున్నాయి. అన్నిటినీ ఇంత చిన్న వ్యాసంలో ప్రస్తావించడం సాధ్యంకాదు. చెప్పాలంటే, కేరళలో వివిధ కలెక్టరేట్లను 'ఇ-గవర్నెన్స్' రెడీనెస్‌తో ఉంచడానికి 'దిసిసూట్' అన్న ఇ-గవర్నెన్స్ ప్రాజెక్టు ఎంతో ఆదరణ పొందింది. ఆన్‌లైన్‌లో బిల్లుల చెల్లింపులు, పరీక్షా ఫలితాలు, ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీల్లో సీట్ల అడ్మిషన్ ప్రక్రియ, రైల్వే రిజర్వేషన్, బస్ రిజర్వేషన్ ఇవన్నీ కూడా ఇ-గవర్నెన్స్ ప్రాజెక్టుల్లో ఎన్నో ప్రజాదరణ పొందినవే.



గ్రామీణ సృష్టిని, అనుభవాన్నీ చవిచూడటానికి వీలుగా రూరల్ బజార్ అనే ఒక 'ఇ-షాపు' కూడా నెలకొంది. ఇది పూర్తిస్థాయి ఇ-కామర్స్ వేదిక. భారతీయ గ్రామీణ వస్తువులను అమ్మడానికీ, కొనడానికీ ఈ వేదిక ఎంతో బాగా వినియోగిస్తుంది. ఇందులో రెడీగా వాడుకొనే ఉత్పత్తుల కేటలాగు, ఉత్పత్తుల అమ్మకం, ఉత్పత్తుల గురించి సమాచారాన్ని అందించడం, ఉత్పత్తిదారు ఎకౌంటుకు సొమ్ము బదలాయింపు, ఇలా ఎన్నో సౌకర్యాలున్నాయి.

మరికొన్ని ఇ-గవర్నెన్స్ ప్రాజెక్టుల వివరాలు (క్లుప్తంగా) ఇలా ఉన్నాయి.

**భారతీయ రైల్ ఆన్‌లైన్ – www.indianrail.gov.in –** ప్రయాణీకుల/పిఎన్ఆర్ స్థితి, రెండు ముఖ్య ప్రదేశాల మధ్య నడిచే రైళ్ళ వివరాలు, టికెట్ ధర, విడిది సౌకర్యాలు, భారతీయ రైల్వే మ్యాప్, ఇంటర్నెట్ రిజర్వేషన్, ప్రయాణీకుల పథకాలను, చార్టులను అప్‌గ్రేడ్ చేయడం, రైల్ ఎస్ఎంఎస్ సేవలు మొదలైన ఆన్‌లైన్ సమాచార సేవలను తన వెబ్‌సైట్ ద్వారా భారతీయ రైల్వే అందిస్తోంది.

**పరీక్షా ఫలితాల ముఖద్వారం – www.results.nic.in –** వివిధ విద్య, ప్రవేశ, ఉద్యోగ పరీక్షా ఫలితాలను తెలుసుకోవడానికి ఏకైక పోర్టల్‌గా ఇది రూపొందింది. దీనిలో ప్రకటించే అనేక ఫలితాలలో సిబిఎస్‌సి, రాష్ట్ర విద్యాబోర్డ్‌లు, విశ్వవిద్యాలయాలు, ఇతర వృత్తి విద్యా సంస్థలు (ఇంజనీరింగ్, వైద్య, ఎంబిఎ, సిఎ వగైరా) సంబంధ ఫలితాలను చూడొచ్చు.

**ఇండియాలోని జిల్లాలు – http://districts.nic.in/ –** భారతదేశంలో ఉన్న వివిధ జిల్లాల గురించి సమగ్ర సమాచారాన్నందించే ఏకైక పోర్టల్ ఇది.

**భారత ప్రభుత్వ వెబ్ డైరెక్టరీ – http://goidirectory.nic.in/ –** ఇదొక సమగ్రమైన భారత ప్రభుత్వ కార్యాలయాల వెబ్‌సైట్ల వివరాలున్న డైరెక్టరీ. ఇందులో అన్ని కేంద్ర, రాష్ట్ర, కేంద్ర పాలిత రాష్ట్రాల కార్యాలయాల వెబ్‌సైట్ల వివరాలున్నాయి.

**ఇ-పోస్ట్ సేవ – http://indiapost.nic.in/login/login.jsp –** ఇ-పోస్ట్ అనేది దేశంలోని 1,56,000 పోస్టాఫీస్‌ల ద్వారా ప్రజలు తాము స్కాన్ చేసిన బొమ్మలను ఇ-మెయిల్ ద్వారా పంపుకోవచ్చు. అందుకోవచ్చు. ఇది ఇంటర్నెట్, ఇ-మెయిల్ లేని ప్రజలకెంతో ఉపయుక్తం. దీని ద్వారా ప్రజా సమాచార వ్యవస్థలో డిజిటల్ డివైడ్‌ని తగ్గించవచ్చనేది ముఖ్యోద్దేశం.

**ఇన్‌స్టెంట్ మనీయార్డర్ సేవ - http://www.indiapost.gov.in/imodetails.html** - ఇండియా పోస్ట్ అందిస్తున్న ఇన్‌స్టెంట్ మనీ ఆర్డర్ (ఐఎంఓ) సేవ ఆన్‌లైన్‌గా ప్రజలు డబ్బును నమ్మకంగా, వేగంగా, ఎక్కడనుంచి ఎక్కడికైనా బదిలీ చేసేందుకు తోడ్పడ్తుంది.

**అగ్‌మార్క్ నెట్ (ఆన్‌లైన్ క్రాప్ మార్కెట్ ఇన్‌ఫర్మేషన్) - http://www.agmarknet.nic.in/** - అగ్‌మార్కెట్ అనేది వ్యవసాయ ఉత్పత్తులను, దేశంలోని హోల్‌సేల్ మార్కెట్‌లను అనుసంధానం చేసి మార్కెట్ సమాచారాన్ని పంచుకొనేందుకు ఉద్దేశించింది. వ్యవసాయ సంబంధ ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలను, రైతులను, వ్యాపారస్థులను, ఎగుమతిదార్లను, ప్రణాళికావేత్తలను, విద్యా సంస్థలను కలిపి నడిచేందుకు వీలునిస్తోంది.

**పాస్‌పోర్ట్ అండ్ వీసా సేవలు** - http://passport.nic.in/ - పాస్‌పోర్ట్, వీసాలగురించిన సమగ్ర సమాచారం కోసం ఈ పోర్టల్‌ని చూడొచ్చు. దరఖాస్తు, దాన్ని నింపే విధం, ఫీజు వివరాలు, ఎలా ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలి, తత్కాల్ పథకం, అఫిడవిట్లు, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు - వీటి గురించిన సమాచారం ఈ వెబ్‌సైట్‌లో లభ్యమౌతుంది.




**న్యాయ సమాచార వ్యవస్థ - http://www.judis.nic.in/** - జుడిస్ అనేది ఒక ఆన్‌లైన్ కేస్‌లా గ్రంథాలయం. ఇందులో భారతీయ అత్యున్నత న్యాయ స్థానం, తదితర రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాలు వెలువరించిన తీర్పులను చూడొచ్చు.

**భారత ఉన్నత న్యాయస్థానంలో ఇ-కేస్ ఫైలింగ్- http://tempweb97.nic.in/scefiling/login.jsp** - భారతీయ అత్యున్నత న్యాయస్థానం ఇ-ఫైలింగ్ విధానాన్ని అక్టోబర్ 2, 2006 నుంచి ఆరంభించింది. ఇంటర్నెట్ మాధ్యమం ద్వారా ఎవరైనా సరే తమ కేసులను నమోదు చేయవచ్చు. దీనికి ఎలాంటి అడ్వొకేటు సాయం అక్కర్లేదు. ఈ సేవను సామాన్య ప్రజలూ, రిజిస్టర్ చేసుకొన్న అడ్వొకేట్లూ వినియోగించుకోవచ్చు.

**పాన్‌కార్డ్ కోసం ఆన్‌లైన్‌గా అప్లై చేసుకోవడం - http://www.utitsl.co.in/pan/Form49AOnline.html** - ఇండియాలో ఆదాయపన్ను చెల్లింపునకి, డిమ్యాట్ అకౌంట్ నిర్వహణకు పాన్ కార్డ్ తప్పనిసరి. ఈ వెబ్‌సైట్‌లో పాన్‌కార్డ్‌కు సంబంధించిన వివరాలు లభ్యమౌతాయి. అంతే కాదు, పాన్ / టాన్ కార్డ్ దరఖాస్తు స్థితి తెలుసుకోవడం, ఇ-రిటర్నుల రిజిస్ట్రేషన్ స్థితి తెలుసుకోవడం, పాన్‌కు సంబంధించిన ఫిర్యాదులు చేయడం, పాన్ డేటాలో మార్పు, చేర్పులు (ఎన్ఎస్‌డిఎల్ ద్వారా) చేసుకోవడం కూడా సాధ్యమౌతుంది.

**ఆన్‌లైన్‌గా ఆదాయపుపన్ను ఫైల్ చేయడం** Online filing of Income Tax http://incometaxindiaefiling.gov.in - ఇందులో కింది అంశాలపై ఆన్‌లైన్ సమాచారం లభిస్తుంది : ఇన్‌కంటాక్స్ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకోవడం, నమోదు ప్రక్రియను పూర్తిగా తెలుసుకోవడం, ఫారం 2ఎఫ్‌ను డౌన్‌లోడ్ చేసి, నింపడం, ఇ-రిటర్న్‌లను అప్‌లోడ్ చేయడం, ఎక్స్ఎంఎల్ ఇ రిటర్న్ ఫైల్‌ను తయారు చేయడం, రసీదును ముద్రించుకోవడం వగైరా.

**http://www.courtnic.nic.in/courtnicsc.asp** కేసు స్థితి వెబ్‌సైటు ద్వారా సుప్రీం కోర్టు లేదా ఏ ఇతర హైకోర్టులో నైనా ఒక కేసు స్థితిగతుల గురించిన వివరాలు తెలుసుకోవచ్చు. ఈ సైటులో దినవారీ ఆర్డర్లూ లభ్యమౌతాయి.

*ఈ కేసుల స్థితిగతులు కింది వాటిపై వెదకవచ్చు:*

- కేసు సంఖ్య
- టైటిలు (ఫిర్యాదుదారు / ఫిర్యాది పేరు)
- అడ్వొకేట్ పేరు
- దిగువ కోర్టు వివరాలు

**http://causelists.nic.in/sccause/index1.html** కాజ్ లిస్ట్ అనేది రేపు ఏ కేసులు కోర్టులో వాదనకొస్తాయో వివరిస్తుంది. సుప్రీం కోర్టు, హైకోర్టులలో, వాటి బెంచ్‌లలో దినవారీ, వారాలవారీ కాజ్‌లిస్ట్‌లు తయారవుతాయి.

*ఇందలి సౌకర్యాలు:*

- అడ్వొకేట్లు తమ కేసులకు సంబంధించిన కాజ్ లిస్ట్‌లను తామే తయారు చేసుకోవచ్చు.
- ఫిర్యాదుదారు / ఫిర్యాది పేరుపై కేసు వివరాలను వెదకవచ్చు.
- కోర్టువారీ జాబితాలను తారు చేయవచ్చు.
- జడ్జీల వారీ జాబితాలను తయారు చేయవచ్చు.
- అవసరాన్నిబట్టి మొత్తం కేసు వివరాలను ముద్రించుకోవచ్చు.
- కేసు సంఖ్యల వారీగా వివరాలు వెదకవచ్చు.

ఈ సేవ ద్వారా ఆసక్తిగల ఫిర్యాదుదారు / ఫిర్యాది లేదా అడ్వొకేట్లు సుప్రీం కోర్టు లేదా ఏ ఇతర హైకోర్టులోనైనా ఒక కేసు స్థితిగతుల గురించిన వివరాలు ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ వ్యవస్థ ద్వారా ఉచితంగా తెలుసుకోవచ్చు. దీనికి **011-4362062, 4360112** అనే నెంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

**http://www.ejustice.org.in/home.do**

***సౌకర్యాలు:***

- న్యాయ పర వివరాలు పొందవచ్చు.
- కావలసిన వివరాలను ముద్రించుకోవచ్చు.
- సిజిజి, లీగల్ సర్వీసెస్ అథారిటీలలోని న్యాయ నిపుణులకు ప్రశ్నలను పంపుకోవచ్చు.
- మీ న్యాయ సమస్యకు సంబంధించిన దరఖాస్తును ఆన్‌లైన్‌గా సంబంధిత అధికారులకు పంపుకోవచ్చు.

- మీ కేసు స్థితిగతుల గురించిన వివరాలు, అంటే సంబంధిత న్యాయ శాఖ అంగీకరించిందీ లేనిదీ తెలుసుకోవచ్చు.

**http://indiancourts.nic.in/index.html**

సుప్రీం కోర్టు, 21 హైకోర్టులు, తత్సంబంధ బెంచీలకు సంబంధించిన వెబ్‌సైట్స్‌లను అనుసంధించి ఒకే చోటనించి వాటిని చూసే వీలునిచ్చేదే ఈ ఇండియన్ కోర్ట్స్ అనే పోర్టల్. సుప్రీం కోర్టు లేదా ఏ ఇతర హైకోర్టులోనైనా ఒక కేసు స్థితిగతుల గురించిన వివరాలు ఈ పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చు. సుప్రీం కోర్టు లేదా హైకోర్టులలో వివిధ అంశాలకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు తాజాగా తెలుసుకోవచ్చు. అలాగే, కోర్టుల చరిత్ర, న్యాయ పరిధి, నియమావళి, గత, వర్తమాన న్యాయమూర్తుల వివరాలు ఇందులో పొందవచ్చు.

**http://www.mca.gov.in/**

ఎంసిఏ-21 అనేది అటు ప్రజలకూ, ఇటు వ్యాపారస్థులకూ వివిధ అవసరాలను తీర్చేలా కంపెనీ అఫైర్స్ మంత్రిత్వ శాఖ ఆరంభించిన చొరవ. అధీకృత సర్టిఫైంగ్ అథారిటీ వారిచ్చే 2అండ్3 తరగతి డిజిటల్ సంతకాల ధృవపత్రాల ఆధారంగా ఈ అప్లికేషన్ పనిచేస్తుంది.

దీని ద్వారా యూసర్లు ఇ-ఫైలింగ్, ఆన్‌లైన్‌గా కంపెనీలను ఇన్‌కార్పొరేట్ చేయడం, రిజిస్ట్రేషన్ చేయడం, ఎప్పుడైనా, ఎక్కడనుంచైనా రుసుముల విలువలను సరి చూసుకోవడం, పబ్లిక్ డాక్యుమెంట్స్‌ను చూడటం, సర్టిఫైడ్ కాపీలను పొందడం, ఫిర్యాదులను నమోదు చేయడం, వివిధ లావాదేవీల స్థితిగతులను తెలుసుకోవడం సాధ్యమౌతుంది.

భారతదేశంలో, జాతీయ విజ్ఞాన కమీషన్ (**National Knowledge Commission**) ఇ-గవర్నెన్స్ అమలు గురించి తన వంతు కృషిని చేస్తోంది. ఇటీవల ఈ కమీషన్ కొన్ని సిఫార్సులను చేసింది కూడా. ఇ-గవర్నెన్స్ పద్ధతులు, ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, సంస్థలకు సంబంధించిన ఆ సిఫార్సులు క్లుప్తంగా ఇలా ఉన్నాయి.

- కంప్యూటరీకరణకు ముందే ప్రభుత్వ శాఖల పనితీరుని సమీక్షించి మార్పులు చేయడం.
- కనీసం 10 నించి 20 కీలకమైన సేవలను గుర్తించి అమలు చేయడం.
- వివిధ రాష్ట్రాల్లో ఇ-గవర్నెన్స్ పథకాల అమలుకు ఒకే రకమైన ప్రమాణాలు ఉండేలా చూడటం.
- ఇప్పటికి అమలౌతున్న వాటిలో 'బెస్ట్' ప్రాక్టీస్‌లను, అనుభవాలను అందరికీ తెలియజేసి అందుబాటులోకి తేవడం.
- ఏ భాషలోనూ, సంస్కృతిలోనూ, పరంపర, ఆర్థిక స్థితులలోనూ సంబంధం లేకుండా జాతీయ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడం.
- వెబ్ ఆధారిత సేవలను ఏర్పాటు చేయడం.
- ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్‌లను ఏర్పాటు చేయడం.
- స్పెషలిస్ట్ ఐటిఓ (చీఫ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ ఆఫీసర్) లను ప్రతి రాష్ట్రంలోనూ ఏర్పాటు చేయడం.
- జాతీయ కార్యక్రమాలను వెబ్ ఆధారిత సేవలుగా అమలుచేయడం.
- జాతీయస్థాయిలో ఇ-గవర్నెన్స్ నిర్వహణకోసం ఒక సంస్థని ఏర్పాటు చేయడం.

ఇవన్నీ చక్కగా ఆచరణలోకొస్తే, అటు ఐటి పరిశ్రమ, ఇటు ప్రభుత్వాలే కాక, ప్రజలు కూడా ఎంతో లాభపడతారు. జీవన ప్రమాణాల్లో 'నాణ్యత'ను మెరుగుపరచడానికి ఇదెంతో కీలకం. ఈ ఇ-గవర్నెన్స్ సేవలు అందరికీ అందుబాటులోకి రావాలీ అంటే, గ్రామాల్లో, మారుమూల ప్రాంతాల్లో సైతం విద్యుత్, కంప్యూటర్, ఇంటర్నెట్ సౌకర్యాలు ఏర్పడాలి. అందుకే ఈ ప్రక్రియలో భాగంగా కేంద్ర ప్రభుత్వం సమీకృత పౌరసేవా కేంద్రాలను ఏర్పాటు చేయడానికి పటిష్టమైన ప్రణాళికను రూపొందించింది. వీటినే సిఎస్‌సి లేదా కామన్ సర్వీస్ సెంటర్స్ అంటున్నారు. అన్నిరకాల సేవలనూ పౌరులకోసం ఒకే 'విండో'లో లభించేలా చూడటమే దీని ప్రధానోద్దేశ్యం.

ఐడిసి సంస్థతోబాటు డేటాక్వెస్ట్ పత్రిక ఏటా నిర్వహించే 'బెస్ట్ ఇ-గవర్నడ్ స్టేట్' ఉత్తమ ఇ-గవర్నెన్స్ రాష్ట్రం సర్వేలో 2008-09కి గాను తమిళనాడు మొదటిస్థానంలో నిలిచింది. (గత ఏడాది తమిళనాడుది 4వ స్థానం). హిమాచల్ ప్రదేశ్ రెండో స్థానంలో, ఢిల్లీ, హర్యాన రాష్ట్రాలు వరసగా 3,4 స్థానాల్లో నిలిచాయి. ఒకానొక కాలంలో 'టాప్'లో ఉన్న ఆంధ్రప్రదేశ్ 5వ స్థానంలో నిలిచింది. గత ఏడాది టాప్ వన్ స్థానంలో ఉండిన ఢిల్లీ ఈ ఏడాది 3వ స్థానానికి పడిపోయింది. అదే, హర్యానా రాష్ట్రం గత ఏడాది 18వ స్థానంలో ఉండింది. 14 మెట్లు ఎక్కి 4వ స్థానానికి వచ్చి నిల్చింది. ఇది ఆ రాష్ట్రంలో ఇగవర్నెన్స్ పథకాల మలు తీరును చూపుతోంది.

కేంద్ర ప్రభుత్వం 2008-09కి 1480 కోట్ల నిధులను ఐటి ప్రాజెక్టుల అమలు కోసం కేటాయించింది. గత ఏడాదిలో పోలిస్తే, ఇది 12 శాతం ఎక్కువ. లక్ష పౌర సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడం, ప్రతి రాష్ట్రంలోనూ ఒక స్టేట్ వైడ్ ఏరియా నెట్‌వర్క్ ను ఏర్పాటు చేయడం, ఒక స్టోరేజి ఏరియా నెట్‌వర్క్ లేదా డేటాసెంటర్‌ను ఏర్పాటు చేయడం ఇందులో భాగం. ఇప్పటికే ఆయా రాష్ట్రాలు గణనీయమైన ప్రగతిని సాధించాయి.

హర్యానా, హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు, చండీగఢ్, ఢిల్లీ రాష్ట్రాల్లో SWAN ఏర్పాట్లు పూర్తికాగా, మరో 9 రాష్ట్రాల్లో SWAN ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం 450 కోట్లు SWAN కోసం, 275 కోట్లు రాష్ట్ర డేటాసెంటర్ల కోసం, 75 కోట్లు పౌర సేవా కేంద్రాల కోసం నిధులు కేటాయించింది. కేంద్ర మంత్రిత్వ విభాగమైన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ (DIT) ఇప్పటికే అన్ని రకాల ఇ-గవర్నెన్స్ పథకాల అమలుకూ ప్రమాణాలను, విధివిధానాలనూ ఖరారు చేసింది. నెట్‌వర్క్, సమాచార రక్షణ, స్థానిక భాషలు, మెటాడేట, డేటా ప్రమాణాలు, నాణ్యతా ప్రమాణాలు వంటి వివిధ ప్రమాణాలనిప్పటికే రూపొందించింది. ఇ-గవర్నెన్స్ ఫ్రేంవర్క్ మార్గదర్శకాలు ఇప్పటికే అన్ని రాష్ట్రాలకూ DIT అందుబాటులోకి తెచ్చింది.

ఇగవర్నెన్స్ పథకాల అమలు విషయంలో మన దేశం ఎంతో ముందంజ వేసింది. ఎన్నో చక్కని ప్రాజెక్టులు అమలౌతున్నాయి. ఐతే కొన్ని పనులు 'డూప్లికేట్' కావడంవల్ల, చేసిన పనినే మళ్ళీ మళ్ళీ వివిధ

రాష్ట్రాలు చేయడం, కేంద్ర విభాగాలు చేయడం (సెన్సస్, వోటర్ ఐడి, పాన్‌కార్డ్ వగైరా) వల్ల ఎంతో డబ్బు సమయమూ వృధా అవుతోంది.

ఇ-గవర్నెన్స్ తాజా చిత్రం ఎలా ఉందో, ఒక్కసారి చూద్దాం. గ్లోబల్-ఇ-గవర్నమెంట్ 207 అనే విశ్వవిద్యాలయం చేసిన అధ్యయనం, దాని ఫలితాలు చాలా ఆసక్తికరంగా ఉన్నాయి. ఇందులో తొలి నాలుగు స్థానాల్లో మూడు స్థానాలు ఆసియాదేశాలవే. దక్షిణ కొరియా మొదటి స్థానంలో ఉండగా, సింగపూర్ రెండో స్థానంలో, తైవాన్ మూడో స్థానంలో ఉన్నాయి. ఆ తర్వాతే అమెరికా, గ్రేట్‌బ్రిటన్, కెనెడా దేశాలు నిల్చిఉన్నాయి.

ఇ-గవర్నెన్స్ పథకాల అమలు చేయడంలో దాదాపు 24 అంశాల ను పాటించాల్సి ఉంది. ప్రభుత్వ వెబ్‌సైటులు ముఖ్యంగా వికలాంగులు వాడే వీలుకల్పించాలి. ప్రచురణలు, డేటాబేస్‌లూ ఉండాలి. ప్రైవసీ పాలసీలను, సెక్యూరిటీ పాలసీలను విధిగా ఉంచాలి. సంప్రదింపుల సమాచారం, ఆన్‌లైన్ సేవల సంఖ్య వంటివి కూడా వీటిలో ప్రముఖమైన అంశాలు.

ఇ-గవర్నెన్స్ అంతిమలక్ష్యం ఒక్కటే. ప్రజలకు అన్ని రకాల సేవల నూ చకాగా అందించగల్గాలి. వెబ్‌సైట్లను ప్రమాణాలను అనుగుణంగా రూపొందించాలి. తక్కువ, కనీస జ్ఞానంతో సులభంగా వాడేలా ఉండాలి. అటు సాధారణ ప్రజలూ, ఇటు వ్యాపార వాణిజ్య రంగంవారూ సులభంగా వాడేలా ఉండాలి.

ప్రభుత్వోద్యోగులులు సైతం వీటిని సరైన రీతిలో సదా 'అప్‌డేట్' చేసే బాధ్యతాయుతమైన రీతిలో వ్యవహరించాలి. జవాబుదారీ తనం పెరగాలి. పోర్టల్స్, వెబ్‌సైట్లను రూపొందించడంలో (డిజైనింగ్) సరళమైన, సమర్ధవంతమైన శైలిని వాడాలి. తద్వారా అన్నిసేవలనూ ప్రజలకు సులభంగా అందించగల్గాలి. లేకపోతే, అన్ని సేవలను అందరూ అందుకోలేరు. ఇ-గవర్నెన్స్ ప్రమాణాలను అనుసరించి వీటిని చిత్తశుద్ధితో అమలు చేయాల్సిన అవసరం చాలానే ఉంది.

వివిధ ఏజెన్సీల పోర్టల్స్ ప్రమాణీకరించే దిశగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేసేలా చూడాలి. ఒక వ్యక్తి ఆన్‌లైన్ సేవలను పొందగోరితే, అతనికి ఏ సేవ ఎక్కడ, ఎలా లభిస్తుందో ఇట్టే తెలియాలి. అపుడు వాడటం సుల భం. ఈ రకమైన రీతిలో ఆస్ట్రేలియా ప్రభుత్వం వెబ్‌సైట్లను రూపొందించి పనిచేయడం గమనార్హం. వివిధ శాఖలను పోర్టల్‌లో ఉంచి వాటికి ఒకే రకమైన టెంప్లేట్‌ను వాడటం ఇందులో చూడొచ్చు. స్వీడన్ దేశపు వెబ్‌సైట్ కూడా ఇదే రీతిలో రూపొందింది.

ఇ-గవర్నెన్స్ సేవలనందించే వెబ్‌సైట్లలో వెబ్‌సైట్ల ప్రమాణాలు అనుసరించాలి. తద్వారా మౌలికమైన యాక్సెసింగ్ వసతులను ఖచ్చితంగా అమలు చేయవచ్చు. కంటి చూపు సమస్య ఉండే వారికి ఫాంట్ సైజు పెంచుకొనే సౌకర్యం, చూడలేని వారికి చదివి వినిపించే (ఆడియో) సౌకర్యం, టెక్స్ కలర్, స్పేసింగ్ - ఇవన్నీ యూజర్స్‌కి కావల్సిన రీతిలో మల చ్చుకొనే వీలుతో యాక్సెస్ సౌకర్యాలుండాలి. ఇలాంటి సకల సౌకర్యాలతో ఉండే వెబ్‌సైట్లు చాలాతక్కువనే చెప్పాలి. వీటిలో స్వీడన్ ప్రభుత్వ వెబ్‌సైట్స్ ప్రముఖంగా చెప్పుకోవచ్చు.

గ్లోబల్ ఇ-గవర్నెన్స్‌లో ప్రభుత్వ వెబ్‌సైట్స్ అన్నిటిలోనూ ఎదురయ్యే జఠి లమైన సమస్య 'డేటా/సమాచారం' పూర్తిగా పాతబడి ఉండటం. యూజర్స్ సౌలభ్యం కోసం ఆయా పేజీల్లో ఆ సమాచారం చివరిసారిగా ఎప్పుడు అప్‌డేట్ అయ్యిందో సూచించాలి. వ్యక్తిగత విభాగాలు సూచించడమూ అవసరమే! వెబ్‌సైట్స్‌లో ప్రతి యూజర్‌కీ తనదైన రంగంలో ఉదాహరణకు టూరిజమ్, సిటిజన్, హిస్టరీ - ఇలా సెట్ చేసుకొనే వీలును ఏర్పరచాలి. దీనివల్ల ఆయా రంగాలపై శ్రద్ధ కల్గినవారికి చక్కని వెబ్‌సైట్‌ను చూసిన అనుభూతి నివ్వడమేకాక తద్వారా సమగ్ర సమాచారాన్ని అందించడానికీ వీలౌతుంది. ఈ రకం వెబ్‌సైట్లతో బెల్జియం పోర్టల్‌ను చక్కని ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

వెబ్‌సైట్లలో ఆన్‌లైన్‌గా చేయవచ్చు. ఒకేచోట వివరించాల్సిన అవసరం ఎంతో ఉంది. ఆయాసేవల జాబితానివ్వాలి. ఆస్ట్రేలియా పోర్టల్ దీనికి చక్కని ఉదాహరణ. ఆన్‌లైన్ సేవలు అనే ప్రధాన సేవ చాలా సౌకర్యంగా ఉంది. వివిధ డౌన్‌లోడ్ ఫారమ్‌లను డౌన్‌లోడ్ చేసుకోడానికి అవకాశం ఉంది. ఇదే రీతిలో మలేషియా పోర్టల్ కూడా చక్కగా ఉంది. ఒక పోర్టల్‌లో 'టాప్' 5 లేదా 10 సేవలను ప్రధానంగా చూపాలి. దీనివల్ల యూజర్లకు సేవలు త్వరితంగా పొందే అవకాశం ఉంటుంది.

ఇంటరాక్టివ్ 'పరిజ్ఞాన సహకారాన్ని' సైతం పోర్టల్ స్వరూపం అందించగల్గాలి. దీనికి 'పెరూ' దేశం పోర్టల్, మెక్సికో ఆర్థిక మంత్రిత్వ శాఖ పోర్టల్ - ఈ రెండూ చక్కని ఉదాహరణ. ముఖ్యంగా ఇ-గవర్నెన్స్ సైట్లలో వ్యాపార ప్రకటనలు ఉంచుకుంటేనే మంచిది. వ్యాపార ప్రకటనలు జొప్పించితే, ఆయా శాఖలపై ప్రజలకుండే 'నమ్మకత' తగ్గిపోతుంది. పైగా ప్రభుత్వ సాయాన్ని కోరే ప్రజలు ప్రకటనలంటే ఇష్టపడరుకూడా. బాగా విసిగించే విషయం ఏమిటంటే, ఆయా పోర్టల్స్‌లో లింక్స్ పనిచేయకపోవడం. 'డెడ్' లింక్స్‌గా పేరుబడ్డ ఇలాంటి లింక్స్‌ను సరిచేయడమో లేక తొలగించడమో చేయాల్సిన అవసరమెంతో ఉంది. ప్రభుత్వ స్థాయి వెబ్‌సైట్స్/పోర్టల్స్ లో 'భాష' ప్రధాన అడ్డంకి. అందువల్ల ఆయా పోర్టల్స్ ఇంగ్లీష్‌లో మాత్రమే కాకుండా స్థానిక భాషల్లో సైతం ల భ్యం కావాలి.

ప్రారంభంలో ఎన్నో అడ్డంకులు, అవరోధాలు, సమస్యలు ఉత్పన్నం కావడం దేనికైనా సహజమే. వాటన్నిటినీ అధిగమించి ఇ-గవర్నెన్స్ ప్రాజెక్ట్ అమలవుతున్నాయి. ఆంధ్రదేశంలోనేకాదు, యావత్ భారతదేశంలోనే విజయవంతమౌతున్నాయి. ప్రజలు పాల్గొనడమే ఆ విజయరహస్యం. ఆర్టీసీ బస్, రైల్వే రిజర్వేషన్ల నుంచి మున్సిపాలిటీ బిల్లులు, టెలిఫోన్ బిల్లుల దాకా చెల్లించే సౌకర్యాలతో ఇ-సేవ లాంటివి ఎన్నో పోర్టల్స్, ఇ-గవర్నెన్స్ ప్రాజెక్ట్స్ అమలులో ఉన్నాయి.

దేశంలో ప్రస్తుతం అమలవుతున్న ప్రాజెక్టల గురించి చెప్పాలంటే ఒక పెద్ద గ్రంథమే అవుతుంది. ఇ-గవర్నెన్స్‌కి ఆకాశమే హద్దు. పాలనా విధానాలను, పనితీరునూ ఇ-గవర్నెన్స్ సమూలంగా మార్చి వేస్తుంది. ప్రజలు కనీస అక్షరాస్యతను సాధించాలి. ఏది తప్పు, ఏది ఒప్పు అనేది తెల్సుకోగల్గాలి. కంప్యూటరీకరణపై అపోహలు తొలగించుకోవాలి. ప్రాంతీయ, స్థానిక భాషల్లో ఇ-గవర్నెన్స్ ప్రాజెక్ట్ అమలు కావాలి. అపుడే టెక్నాలజీ జనాలకు మరింత చేరువగా అవుతుంది.

– డా॥ రమణ



# మన గ్రామం - మన చట్టం

**భారత రాజ్యాంగంలోని పదకొండవ షెడ్యూల్‌లో గ్రామ పంచాయితీలకు ఇవ్వబడిన అధికారాలు వాటిని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం 1994 లోని ఒకటవ షెడ్యూల్‌లో పునర్లిఖించిన విషయం గత సంచికలోని 'మన గ్రామం - మన రాజ్యం' వ్యాసంలో వివరించడం జరిగింది.**

**గ్రామ పంచాయితీ అధికారాలు, అవి చేపట్టివలసిన పనులు, వాటి ఆస్తులకు సంబంధించిన అంశాలను పంచాయతీరాజ్ చట్టంలోని రెండవ అధ్యాయంలో పొందుపర్చారు. 45వ సెక్షనులో కొన్ని అంశాలకు సంబంధించి గ్రామ పంచాయితీల విధులను పేర్కొన్నారు. అవి:**

- ★ పంచాయతీ రోడ్లు, భవనాల నిర్వహణ, వాటి మరమత్తులు, అట్టి రోడ్ల మీద ఉన్న కల్వర్టులు, వంతెనలు, డామ్‌లు మరియు కాజ్‌వేల నిర్వహణ.
- ★ రోడ్లు, బహిరంగ ప్రదేశాలలో ఉన్న విద్యుత్ సౌకర్యాలు
- ★ డ్రైన్‌ల నిర్మాణం, వాటి నిర్వహణ, disposal of drainage water and sullage
- ★ రోడ్ల పరిశ్రుభత
- ★ మరుగు దొడ్ల నిర్వహణ
- ★ శ్మశానాల నిర్వహణ, అనాధ శవాలను దహనం చేయటం, జంతువుల కళేబరాలను తొలగించటం
- ★ మలేరియా వంటి అంటు వ్యాధుల (epidemic) నివారణ చర్యలు
- ★ బావుల త్రవ్వకం, నిర్వహణ, చెరువుల త్రవ్వకం, మరమ్మత్తులు, నిర్వహణ, నీటి సరఫరా, త్రాగటానికి రక్షిత నీటి సరఫరా
- ★ ఎరువుల వనరుల వినియోగం, ఎరువుల అమ్మకం (sale of manure).
- ★ జనన మరణాల రిజిస్ట్రేషన్
- ★ బందెల దొడ్ల (cattle ponds) ఏర్పాట్లు, నిర్వహణ
- ★ ఈ చట్టంలో గాని లేదా ఇతర చట్టాల్లో గ్రామ పంచాయతీ బాధ్యతలుగా పేర్కొనబడిన అంశాలు.

గ్రామ పంచాయితీలు గ్రామస్థాయిలో వనరుల ప్రణాళిక (resource planning) రూపొందించాలి. ఇవిగాక మరో 27 ఇతర అంశాలకు సంబంధించి కూడా గ్రామ పంచాయితీలకు అధికారాలు పంచాయతీరాజ్ చట్టంలోని 46వ సెక్షనులో పేర్కొనబడ్డాయి. అవి:

❁ ప్రయాణీకుల కొరకు ధర్మశాలలు, సత్రాలు, విశ్రాంతి గృహాల నిర్మాణము, నిర్వహణ.

❁ రోడ్లకు ఇరువైపులా, ఇతర బహిరంగ ప్రదేశాలలో మొక్కలను

నాటడం వాటిని పెంచడం.

❁ ప్రీప్రైమరీ విద్యను, ప్రాథమిక విద్యను, సాంఘిక, ఆరోగ్య విద్యను, కుటీర పరిశ్రమలను, వ్యాపారాన్ని అభివృద్ధి చేయటం.

❁ ఆసుపత్రుల ఏర్పాటు, వాటి నిర్వహణ, గ్రామీణ వైద్యులకు సబ్సిడీలు చెల్లించటం

❁ వైర్‌లెస్ రిసీవింగ్ సెట్స్, ఆట స్థలాలు, akhadas, క్లబ్బులు, ఇతర రిక్రియేషన్, శారీరక సాంస్కృతిక (physical culture) కేంద్రాల ఏర్పాటు, వాటి నిర్వహణ.

❁ పార్కుల ఏర్పాటు, నిర్వహణ.

❁ గ్రంథాలయాలు, రీడింగ్ రూమ్‌ల ఏర్పాటు, నిర్వహణ.

❁ వికలాంగులు (crippied), destitutes, రోగుల (sick) సౌకర్యాల కొరకు చర్యలు తీసుకోవటం.

❁ నర్సరీలు, మేలు రకం విత్తనాలు, వ్యవసాయ పరికరాల కేంద్రాలు (stores), మేలు రకం విత్తనాలు, ఎరువుల, మందుల ఉత్పత్తి పంపిణీ, పశువుల ప్రదర్శనలతో సహా వ్యవసాయ ప్రదర్శనలను ఏర్పాటు చేయటం.

❁ మేలు రకం ఉత్పత్తిని సాధించటానికి అనుసరించవలసిన పద్ధతులు ప్రదర్శించటానికి అనుగుణమైన ప్లాట్లను ఏర్పరచటం (laying out of demarcation of plots with a view to increasing production) తో సహా మేలు రకం వ్యవసాయ పద్ధతులను ప్రచారం చేయటం.

❁ గ్రామాల్లో భూముల సహకార యాజమాన్యాన్ని, ఉమ్మడి సహకార వ్యవసాయాన్ని నిర్వహించడం (organization of joint cooperative farming), ప్రోత్సహించటం, కేంద్ర ప్రభుత్వం రూపొందించిన (sponsored) గ్రామీణ గృహ పథకాలలో పేర్కొన్న ఇటుకలు, పెంకులు, మడతబందులు (hinges), తలుపులు, కిటికీలు, rafters లేదా ఇతర భవన నిర్మాణ సామాగ్రి తయారు చేయటానికి సహకార సంస్థల (cooperatives) ను ఏర్పరచటం.

❁ గోదాముల (ware houses and granaries) ఏర్పాటు, నిర్వహణ.

❁ పశువుల చావిళ్ళ (cattle sheds) ఏర్పాటు, నిర్వహణ.

❁ గ్రామ స్థలాల విస్తరణ (extension of village sites).



❁ stud bulls కొనుగోలు, నిర్వహణతో సహా పశువుల అభివృద్ధి, పశువైద్య సౌకర్యాలు

❁ సంతలు, జాతర్లు, పండుగల నియంత్రణ.

❁ గ్రామంలో సముదాయ అభివృద్ధి కార్యక్రమాలకు స్వచ్ఛంద కృషిని రూపొందించటం (organization of voluntary labour for community development works in the village).

❁ ప్రసూతి, శిశు సంక్షేమ కేంద్రాలను ఏర్పరచి నిర్వహించటం

❁ కాపలా నిర్వహణ (organization of watch and ward).

❁ కరువు, తదితర వైపరీత్యాల నుండి రక్షణ చర్యలు (relief provisions) చేపట్టటం

❁ ఊర కుక్కలను (stary and owner less dogs) నిర్మూలించటం

❁ నిరుద్యోగ గణాంకాలను తయారు చేయుట

❁ బహిరంగ మార్కెట్లను (public markets) ఏర్పరచి నిర్వహించటం

❁ కబేళాలను (public slaughter houses) ప్రారంభించి నిర్వహించుట.

❁ Consolidation of holdings and soil conservation తో సహా భూసంస్కరణల చర్యలను అమలు జరపటం.

❁ వివిధ సాంఘిక సమూహాలు (communities) మధ్య సద్భావనను (good will), సామాజిక సౌహార్ద్రతను (social harmony) పెంపొందించటానికి, అస్పృశ్యతా నివారణకు, హరిజనులకు ఇళ్ళ పట్టాలను ఇప్పించటానికి, అవినీతి నిర్మూలనకు, మద్యపానం, ఆరోగ్యానికి హానికరమైన మందుల నిషేధానికి, జూదాన్ని, లిటిగేషన్‌ను నివారించటానికి సంస్థలను (organisation) ఏర్పరచటానికి

❁ గ్రామ ప్రజల రక్షణ, ఆరోగ్యం, సౌకర్యం, నైతిక, సాంఘిక, భౌతిక సంక్షేమం పెంపుదలకు అవసరమైన ఇతర ప్రజాప్రయోజన చర్యలు చేపట్టటం.

రెండు లేదా అంతకంటే ఎక్కువ గ్రామ పంచాయితీలు కలసి ఉమ్మడిగా ఆసుపత్రులను, శిశు సంక్షేమ కేంద్రాలను నిబంధనలకు లోబడి ఏర్పాటు చేసుకొనవచ్చునని పంచాయితీ రాజ్ చట్టం 47వ సెక్షన్‌లో పేర్కొనబడింది.

## అటవీ యాజమాన్య బదిలీ

గ్రామ పంచాయితీకి ఆనుకొని ఉన్న అడవుల యాజమాన్యాన్ని గ్రామ పంచాయితీ నిబంధనలకు లోబడి బదిలీ చేయటానికి గ్రామపంచాయితీ యాజమాన్యంలో ఉన్న అడవిని అట్టి గ్రామపంచాయితీ నుండి మినహాయించటాన్ని ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా చేయవచ్చునని పంచాయతీ రాజ్ చట్టం 48వ సెక్షన్‌లో పేర్కొన్నారు. అటవీ యాజమాన్యం గ్రామపంచాయితీకి బదిలీ చేసినప్పుడు అట్టి అడవి మీద వచ్చే ఆదాయాన్ని, అటవీ నిర్వహణకు అయ్యే ఖర్చును గ్రామపంచాయితీ, ప్రభుత్వం నిర్దేశించిన విధంగా పంచుకోవాలని కూడా ఇందులో పేర్కొన్నారు.

## సంస్థల యాజమాన్యం లేదా పనుల నిర్వహణ బదిలీ

ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, రెవిన్యూ డివిజనల్ అధికారి, మండల పరిషత్ లేదా జిల్లా పరిషత్ లేదా ఎవరైనా వ్యక్తిగాని లేదా సంస్థ (body of persons) గాని, గ్రామపంచాయితీ అమోదంతో అంగీకరించిన నిబంధనలకు లోబడి ఏదైనా సంస్థ యాజమానాన్ని (management of any institution), లేదా ఏదైనా పనిని పూర్తిచేసి నిర్వహించటాన్ని, ఏదైనా అధికారాన్ని వినియోగించటాన్ని (exercise of any power) లేదా విధులను నిర్వహించటాన్ని గ్రామపంచాయితీ బదిలీ చేయవచ్చును అని ఈ చట్టంలోని 49వ సెక్షన్‌లో పేర్కొన్నారు.

అనాధీనంగా ఉండి ప్రభుత్వానికి దాఖలు పడిన ఆస్తులను గ్రామపంచాయితీ బదిలీ చేయటానికి బదిలీ చేయబడ్డ ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకోటానికి లాండ్ రెవెన్యూ కమీషనర్‌కు ఈ చట్టంలోని 50వ సెక్షను అధికారాన్ని కల్పిస్తుంది. ఈ సెక్షనులోని 'అనాధీనం' అంటే వారసులు లేకుండా చనిపోయిన వ్యక్తి యొక్క ఆస్తిని గాని లేదా హక్కుదారుడైన యజమాని లేని ఆస్తులని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

గ్రామ పంచాయితీకి ధార్మిక విరాళాలు సేకరించే అవకాశాన్ని 51వ సెక్షనులో కల్పించారు.

## బందెల దొడ్ల నిర్వహణ

గ్రామ పంచాయితీకి బదిలీ చేయబడ్డ లేదా గ్రామపంచాయితీచే ఏర్పరచబడిన బందెల దొడ్ల (cattle pounds) ను గ్రామపంచాయితీలోనే నిర్వహించాలని, దాని కాపలాదారుని గ్రామపంచాయితీలోనే నియమించాలని, దాని ఆదాయాన్ని గ్రామపంచాయితీ నిధికి జమకట్టాలని 52వ సెక్షనులో పేర్కొన్నారు.

## పంచాయతీ రోడ్లు

జాతీయ ప్రధాన రహదారికి (హైవే), రాష్ట్ర ప్రధాన రహదారి, జిల్లా పరిషత్ లేదా మండల పరిషత్ రోడ్లు మినహా గ్రామంలోని అన్ని రోడ్లు గ్రామపంచాయితీకి చెందుతాయని 53వ సెక్షనులో పేర్కొన్నారు.

54వ సెక్షను ప్రకారం, గ్రామ పంచాయితీచే సేకరించబడిన చెత్త గ్రామ పంచాయితీకే చెందుతుంది.

55వ సెక్షను ప్రకారం, సాంప్రదాయకంగా గ్రామపంచాయితీకి చెందిన గ్రామ ప్రజలందరి కోసం నిర్వహించబడుతున్న ఏదైనా ఆస్తి లేదా ఆదాయం గ్రామపంచాయితీకి చెందుతుంది. అట్టి వాటిని గ్రామ ప్రజల ప్రయోజనాల కొరకు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ సెక్షనులోని 'సాంప్రదాయంగా' అనే పదం ప్రాధాన్యత కలిగి ఉంది. ప్రజా ప్రయోజనాల కొరకు గ్రామ పంచాయితీకి దాఖలు పర్చబడిన పార్కులు, పాఠశాలలు, ఆసుపత్రులు వంటివి ఈ సెక్షను క్రిందకు రావు. ప్రజాప్రయోజనాల కొరకు సంప్రదాయంగా పంచాయితీ అజమాయిషీ క్రింద ఉన్న ఆస్తులు లేదా ఆదాయం అని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

## నీటి వనరుల నిర్వహణ

గ్రామంలోని నీటి వనురులను కాపాడటానికి వాటిని నిర్వహించటానికి గ్రామ పంచాయితీకి ప్రభుత్వం బదిలీ చేయ వచ్చునని 56వ సెక్షనులో పేర్కొనబడింది.



పంచాయతీ పరిధిలో గల చెరువుల్లో (minor irrigation tanks) చేపల పెంపకం, వేట (fishery) హక్కులు, అట్టి చెరువుల్లో చెత్త, నీటిమొక్కల (weeds and reeds) వేలం, చెరువు గట్లపై చెట్లను నాటి, పెంచి, ఫలసాయాన్ని తీసుకోటానికి గ్రామ పంచాయితీలకు అధికారం ఇవ్వబడింది.

ఒక ఆసక్తికరమైన విషయమేమంటే, ఆంధ్రప్రదేశ్ (ఆంధ్రా ఏరియా) నిర్బంధ శ్రామిక చట్టం 1858 ప్రకారం చెరువు, కాలువ నది గట్టుకు తెగే ప్రమాదం వచ్చినప్పుడు గ్రామంలో శారీరక ధారుఢ్యం (able bodies) గల పురుషులందరూ వచ్చి గట్ల రక్షణ కార్యక్రమంలో ఖచ్చితంగా పాల్గొనాలి. ఏ వ్యక్తి అయినా అలా చేయటానికి నిరాకరించినా, నిర్లక్ష్యం చేసినా అతనికి రూ.100 జరిమానా, నెల రోజుల జైలు శిక్ష విధించబడుతుంది. ఇట్టి కృషిలో పాల్గొన్న వారందరికీ వేతనం చెల్లించబడుతుంది. పంచాయితీ రాజ్ చట్టంలోని అంశాలు నిర్బంధ శ్రామిక చట్టానికి మినహాయింపు కాదని కూడా స్పష్టం చేశారు.

100 ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణం కలిగిన చెరువులు గ్రామపంచాయితీ పరిధిలోకి రావని 1997లో మన రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చింది.

గ్రామ పంచాయతీ రోడ్లను అనుసంధానం చేసే రవాణా పడవల (ferries) నిర్వహణ గ్రామ పంచాయితీకే ఇవ్వబడిందని 57వ సెక్షనులో పేర్కొనబడింది. ఒకటి కంటే ఎక్కువ గ్రామపంచాయితీల పరిధిలో ఉన్న పంచాయితీ రోడ్డును అనుసంధానం చేసే ఫెర్రీలను సంబంధిత గ్రామపంచాయితీల ఉమ్మడి కమిటీ నిర్వహించాల్సి ఉంటుంది.

గ్రామంలోని పచ్చికబయళ్ళు, స్మశానాలు తదితర పోరంబోకు భూములను ప్రభుత్వం గ్రామ పంచాయితీలకు దాఖలు పర్చవచ్చునని 58వ సెక్షనులో పేర్కొన్నారు. అట్లా దాఖలు పర్చిన వాటిని ప్రభుత్వం తిరిగి తీసుకోవచ్చునని కూడా ఇందులో పేర్కొన్నారు.

గ్రామ పంచాయితీకి అవసరమైన భూమిని, భూసేకరణ చట్టం 1894 ప్రకారం నష్టపరిహారం చెల్లించి సేకరించిన భూమి గ్రామపంచాయితీకే చెందుతుందని 58వ సెక్షను చెప్పబడింది.

ఈ విధంగా భారత రాజ్యాంగంలోని పదకొండవ షెడ్యూలులో పేర్కొన్న అంశాలన్నీ దాదాపుగా ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం 1994లో భాగమైనాయి.

***– వి.రఘు,*** *న్యాయవాది*

# మహాజన హృదయ నేత మహాభినిష్క్రమణం



**పల్లెప్రజలకు జవజీవాల్ని అందించిన ఆ చైతన్యం ఆగిపోయింది. అపర భగీరథుడిగా మారి జలయజ్ఞాన్ని చేపట్టిన ఆ వజ్రసంకల్పం నిస్తేజమైంది. రాజకీయ వినీలాకాశంలో ఉజ్వలంగా ప్రకాశించిన ధ్రువతార నేలరాలింది. పట్టుదలే ఊపిరిగా, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సాగిన ఒక మహా ప్రజాప్రస్థానం ముగిసింది. ప్రజల చెంతకు బయలు దేరిన ఆ నడక మార్గమధ్యంలోనే నిలిచిపోయింది.**

**అదొక మహా విషాదం. యావత్ దేశమంతా దిగ్భ్రమకు గురై దిగులు పడిన ఘోర సంఘటన. రాష్ట్రంలోని ప్రతి కంటిగడపలో 'జల'యజ్ఞం జరిగి, లోగిళ్లన్నీ కన్నీటి సముద్రాలుగా మారిన విషాద సన్నివేశం.**

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల ప్రియతమ నేత, వారి హృదయాలను దోచిన ముఖ్యమంత్రి డాక్టర్ యెదుగూరి సందింటి రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఒక పాదయాత్ర పథకుని ప్రస్థానం శాశ్వతంగా ఆగిపోయింది. జనం గుండె తలుపులు తట్టి, జనం గుండె చప్పుడుకి పట్టం కట్టిన వై.యస్. వెళ్లిపోయారు. ప్రజా జీవనంలో ఆయనది విభిన్న పంథా, ఒక విలక్షణ శైలి. రాజకీయానికి సాహసం నేర్పిన వై.యస్. ఎప్పుడూ ప్రజల పక్షాన నిలిచిన ప్రజల మనిషి.**

కర్నూలు జిల్లా వెలుగోడు మండలం రుద్రకోడూరు గ్రామ సమీపంలో సెప్టెంబర్ 2వ తేదీ ఉదయం హెలికాప్టర్ కూలిన ప్రమాదంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖరరెడ్డితో పాటు, మరో నలుగురు దుర్మరణం చెందారు. ప్రమాదంలో ప్రిన్సిపల్ సెక్రటరీ సుబ్రహ్మణ్యం, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఏఎస్‌సీ జాన్ వెస్లీతోపాటు, పైలట్ ఎస్.కె. భాటియా, కో-పైలట్ ఎంఎస్‌రెడ్డి మృతి చెందినట్లు 3వ తేదీ ఉదయం లోకానికి తెలిసింది.

చిత్తూరు జిల్లాలో రచ్చబండ కార్యక్రమంలో పాల్గొనేందుకు 2వ తేదీ ఉదయం 8.45గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరిన ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖరరెడ్డి ప్రత్యేక హెలికాప్టర్ గల్లంతైంది. ఆ తర్వాత సీఆర్పీఎఫ్ బలగాలు, పోలీసులు, ప్రత్యేక హెలిక్టాపర్లు, విమానాలతో గాలింపు జరిపినా ఫలితం లేకపోయింది. నల్లమల అటవీ ప్రాంతంలో ఏదో ఒక చోట ముఖ్యమంత్రి, ఇతర ముఖ్య అధికారులు క్షేమంగా ఉంటారని కోట్లాది మంది ప్రజలు భావించారు.

3వ తేదీ ఉదయం కర్నూలు జిల్లా కేంద్రం నుంచి రెండు ఆర్మీ హెలికాప్టర్లు నల్లమల అడవుల్లో చక్కర్లు కొట్టి గంటల తరబడి

గాలింపు చర్యలు చేపట్టి కొండల పైభాగంలో హెలిక్టాపర్ నిలిచి ఉన్నట్లు సమాచారం అందించారు. వెలుగోడు, వేంపెంట మధ్య కొండ పైభాగంలో హెలికాప్టర్ ఉన్నట్లు గుర్తించామని, పూర్తి సమాచారం మరో 20 నిమిషాల్లో చెబుతామని ఆర్మీ కమాండెంట్ సాగర్ భారతి 8.45 గంటలకు అధికారికంగా ప్రకటించారు. దీంతో వై.యస్, ఇతర అధికారులు క్షేమంగా ఉంటారని రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు, వై.యస్ అభిమానులు ఆనందంలో మునిగిపోయారు. అయితే ఆర్మీ కమాండర్ సాగర్ భారతి ప్రకటించి గంట కూడా కాకముందే విషాదకరమైన వార్త రాష్ట్ర ప్రజల చెవినపడింది.

ఇంగ్లీష్ ఛానల్స్‌లో హెలికాప్టర్ కూలినట్లు వార్తలు రావడం, అందులో ప్రయాణిస్తున్న వారు బతికే అవకాశాలు తక్కువగా ఉన్నాయని వార్తా కథనాలు ప్రకటించడంతో విషాదకరమైన వాతావారణం నెలకొంది. ఆ తరువాత కొద్ది నిమిషాల్లోనే హెలికాప్టర్ నల్లమల అడవుల్లో కూలిపోయినట్లు ఐదు మృతదేహాలు గుర్తించినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఒక్కసారిగా వై.యస్ అభిమానులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, రాష్ట్ర ప్రజలు దు:ఖసాగరంలో మునిగిపోయారు.

## ఘోరప్రమాదం

ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖరరెడ్డి, ఇతరుల మృత దేహాలను తీసుకొచ్చేందుకు రుద్రకోడూరు దగ్గరలోని కొండ పైభాగాన్ని చేరేందుకు ఆర్మీ హెలికాప్టర్లలో వెళ్లిన సైనికులు, పోలీసులు, ఇతర సిబ్బంది మొదట వాతావరణం అనుకూలించకపోవడంతో వెనక్కి వచ్చారు. అనంతరం ఉన్నతాధికారుల సూచన మేరకు ఉదయం 11 గంటల ప్రాంతంలో స్ట్రెచర్లు, తాళ్లతో మరోసారి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే స్థానిక చెంచు యువకులు మరో దారిలో కొండపైకి చేరుకున్నారు. వైమానిక దళ సిబ్బంది, కమాండోలు కూడా తాళ్ల సాయంతో కిందకు దిగారు.

అప్పటికి అక్కడ పరిస్థితి హృదయ విదారకంగా ఉంది. పూర్తిగా కాలిపోయిన మృతదేహాలు హెలికాప్టర్‌కు 10 మీటర్ల దూరంలో చెల్లాచెదురుగా, గుర్తు పట్టలేని విధంగా పడి ఉన్నాయి. ముఖ్యమంత్రి ధరించే పంచె, బట్టతల, వాచీ ఆధారంగా ఆయన భౌతికకాయాన్ని గుర్తుపట్టారు. మృతదేహాలను అతి కష్టం మీద గుడ్డలో కట్టి హెలికాప్టర్‌లోకి చేర్చారు.

అక్కడినుంచి మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో కర్నూలులోని ఏపీఎస్పీ క్యాంపుకు తరలించారు. ఛిద్రమైన ఐదు పార్థివ దేహాలకు హెలికాప్టర్‌లోనే పంచనామా నిర్వహించారు. ఏపీఎస్పీ మైదానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గుడారాల్లో పోస్టుమార్టం నిర్వహించారు.

అనంతరం సాయంత్రం ఐదున్నర గంటల ప్రాంతంలో పార్థివ దేహాలను బేగంపేట విమానాశ్రయానికి తీసుకొచ్చారు. అక్కడినుంచి రాష్ట్ర మంత్రి వర్గ సహచరులు, అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు వై.యస్. పార్థివ శరీరాన్ని క్యాంపు కార్యాలయానికి తరలించారు. విషయం తెలుసుకున్న ప్రజానీకం ముఖ్యమంత్రిని చివరిసారి చూసేందుకు తండోపతండాలుగా క్యాంపు కార్యాలయానికి తరలివచ్చారు. వివిధ పార్టీల నాయకులు, సినిమారంగ ప్రముఖులు, వివిధ రంగాల నిపుణులతో పాటు, పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు వచ్చి జననేతకు అశ్రునివాళులర్పించారు. వై.యస్ మరణవార్తతో హైదరాబాద్‌లో గణేష్ నిమజ్జనానికి విగ్రహాలను తరలిస్తున్న భక్తులు కూడా 'వై.యస్. అమర్‌రహే' అని నినాదాలు చేస్తూ ఆ మహానేత పట్ల తమ భక్తి చాటుకున్నారు.

### ద్రవ్య వినిమయ బిల్లు, ఉపాధ్యాయుల ఫైళ్లపై చివరి సంతకం...

ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్ రాజశేఖరరెడ్డి చిత్తూరు జిల్లా పర్యటనకు బయల్దేరి వెళ్లడానికి ముందు బేగంపేట విమానాశ్రయంలో మూడు ఫైళ్లపై చివరిగా సంతకాలు చేశారు. అందులో ద్రవ్య వినిమయ బిల్లు ఫైలు, మరో రెండు ఫైళ్లు ఉపాధ్యాయుల అంశాలకు సంబంధించినవి కావడం గమనార్హం. సాధారణంగా పత్రికల్లో వచ్చే వార్తలపై ఆయన ముఖ్యకార్యదర్శి జన్నత్‌హుస్సేన్, శాంతిభద్రతల అంశానికి సంబంధించి నిఘా విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ అరవిందరావు ముఖ్యమంత్రికి ఉదయాన్నే వివరిస్తారు. ఈ మేరకు 2వ తేదీ ఉదయం వారు బేగంపేట ఎయిర్‌పోర్టులో ముఖ్యమంత్రికి బ్రీఫింగ్ ఇచ్చారు. ☆

## మంత్రుల దు:ఖం

వై.యస్. మరణ వార్త తెలుసుకున్న రాష్ట్ర మంత్రుల దు:ఖానికి అంతేలేదు.. కేబినెట్‌లోని ప్రతి ఒక్కరూ కన్నీళ్లు పెట్టుకున్నారు. తమలో స్ఫూర్తిని నింపిన మహనీయుడు తమకు కాకుండా వెళ్లిపోయాడని రోదించారు. మంత్రులే కాక, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు, సామాన్య ప్రజానీకం ఆయన మరణవార్తను తెలుసుకుని విలపించారు. గాంధీభవన్‌తో పాటు తెలుగుదేశం, పీఆర్పీ, టీఆర్ఎ-స్ పార్టీల కార్యాలయాలు విషాదంలో మునిగిపోయాయి. ఆయా పార్టీల నేతలు అందుబాటులో ఉన్న నేతలతో సమావేశమై వై.యస్.కు నివాళులర్పించారు.

## 24 గంటల తర్వాత ఆచూకీ

ముఖ్యమంత్రి హెలికాప్టర్ మాయమైన 24 గంటల తర్వాతగానీ శకలాల్ని అధికారులు గుర్తించలేకపోయారు. చిత్తూరు జిల్లాలో రచ్చబండ కార్యక్రమంలో పాల్గొనేందుకు వై.యస్ మే 2వ తేదీ ఉదయం 8.45 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం నుంచి బయలుదేరారు. హెలికాప్టర్ నల్లమల గగనతలం పై ఎగురుతుండగా.. . 9.15 గంటలకు దాన్నుంచి సంకేతాలు నిలిచిపోయాయి. ఆ వెంటనే అధికార యంత్రాంగం అప్రమత్తమై సైన్యం, వైమానికదళం, నౌకాదళాన్ని రంగంలోకి దించింది. ఇస్రో ఉపగ్రహం, అమెరికా ఉపగ్రహం సాయం తీసుకుంది. దాదాపు 11 హెలికాప్టర్లు ఈ గాలింపులో పాల్గొన్నాయి. ఆత్మకూరుకు 45 కిలో మీటర్ల దూరంలో, రుద్రకోడూరుకు 15 కిలోమీటర్ల దూరంలో సముద్రమట్టానికి 600 అడుగుల ఎత్తులో నాలుగు కొండలు ఉన్నాయి. ఇక్కడే ప్రమాదం జరిగింది. ఈ కొండలపై దట్టమైన చెట్లు, పొదలు అల్లుకుని ఉన్నాయి.

ముఖ్యమంత్రి హెలికాప్టర్ ఆత్మకూరు సమీపానికి చేరుకునే వరకు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌తో సంబంధాలు ఉన్నాయి. 9.35కు ఏటీసీతో సంబంధాలు తెగిపోవడంతో ముఖ్యమంత్రి ముఖ్య భద్రతా అధికారి వెస్లీ కూడా సెల్‌ఫోన్‌లో మాట్లాడడానికి ప్రయత్నించారు. ఆత్మకూరు సమీపంలోని

పాములపాడు వద్ద ఉన్న బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ఆ సిగ్నల్లను గుర్తించింది. ఆ తర్వాత సెల్ నెట్‌వర్క్ సంబంధాలు కూడా తెగిపోవటంతో ఆత్మకూరు సమీపంలో హెలికాప్టర్ ల్యాండింగ్ చేసేందుకు పైలట్ ప్రయత్నించారని, దీనిలో భాగంగానే కిందకు తీసుకొచ్చారని తెలుస్తోంది. అంతలోనే మళ్లీ ఏ టీసీతో సంబంధాలు ఏర్పడటంతో దిగే ఆలోచన మానుకొని హెలికాప్టర్‌ను పైకిలేపి ముందుకు వెళ్ళారని సమాచారం.

మరో విశ్లేషణ ప్రకారం అదే సమయంలో వర్షం పడి.. దట్టమైన మేఘాలు కమ్ముకోవడంతో హెలికాప్టర్‌ను ముందుకు తీసుకువెళ్లడం పైలట్‌కు కష్టమైంది. ల్యాండింగ్‌కు వీలులేకపోవడంతో 60 మీటర్ల ఎత్తుకు దింపి ముందుకు నడిపించారు. ఆత్మకూరుకు 30 కిలో మీటర్ల దూరం వరకు దట్టమైన అటవీ ప్రాంతం లేదు. ఆ తరువాత నుంచి దట్టమైన అటవీ ప్రాంతం మొదలైంది. పావురాల గుట్టలు ఉన్న ప్రాంతంలోకి వచ్చేటప్పటికి ఎగరడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. భారీ వర్షంతో పాటు దట్టమైన మేఘాలు అలుముకొని ఉండడంతో చిమ్మచీకటి ముసురుకుని ఉంది. ఏ ప్రాంతం వైపు తీసుకువెళ్లాలో పైలట్‌కు అర్థంకాలేదు. దీంతో ఎత్తయిన కొండలు ఆవరించి ఉన్న పావురాల గుట్ట దగ్గర ఆరు రౌండ్లు చక్కర్లు కొట్టినట్లు సమాచారం. అప్పటికీ ముందుకెళ్లే దారి కన్పించకే పావురాల గుట్టపై భాగంలో ఏపుగా బలంగా పెరిగి ఉన్న చిరుమాను చెట్టును ఢీకొట్టారు. దాంతో హెలికాప్టర్‌లో మంటలు రేగాయి. అదే సమయంలో అది ముక్కలు ముక్కలైంది. ఇంజిన్ , తోక భాగం రెండుగా విడిపోయి రెండు ప్రాంతాల్లో పడ్డాయి.

## శకలాలను గుర్తించిన నౌకాదళం

హెలిక్టాపర్ శకలాలను 3వ తేదీ ఉదయం 8 గంటలకు నౌకాదళం హెలికాప్టర్ గుర్తించింది. సుఖోయ్ యుద్ధ విమానం తీసిన ఫొటో ఆధారంగా నౌకాదళం హెలికాప్టర్ ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని గుర్తించింది. ఆ సమాచారాన్ని నౌకాదళ అధికారులు ఉన్నతాధికారులకు అందించారు. అప్పటికే గ్రేహౌండ్స్ బలగాలు హెలికాప్టర్ కూలిపోయిన పావురాలగుట్ట ప్రాంతంలో గాలిస్తున్నాయి. నౌకాదళం అందించిన అక్షాంశాలు, రేఖాంశాల వివరాలను అధికారులు సమీపంలోని గ్రేహౌండ్స్ బలగాలకు అందజేశారు. దాంతో గ్రేహౌండ్స్ కమెండోలు తమ వద్ద ఉన్న జీపీఎస్ వ్యవస్థను ఉపయోగించి పావురాలగుట్టకు చేరుకున్నారు. ముందుగా ఐదు మృతదేహాలను వేరు వేరుగా మూట గట్టి హెలికాప్టర్ ద్వారా కర్నూలుకు పంపించారు. శకలాలను రెండు బస్తాలలో నింపి మరో హెలికాప్టర్‌లో పంపారు.

## ప్రియ నేతకు కన్నీటి వీడ్కోలు

ప్రియతమ నాయకుడిని కడసారి కళ్లారా చూద్దామని వచ్చినవారూ

# ఆఖరు క్షణం వరకు అదే ధ్యాస, అదే శ్వాస

ప్రజాహితం కోసం రాత్రీపగలూ పరితపించే రాష్ట్ర ముఖ్యమంత్రి డా. వై.యస్.రాజశేఖరరెడ్డి.... ఆకస్మిక మరణానికి గురయ్యేందుకు కొన్ని గంటల ముందు... చివరిసారిగా మాట్లాడిన మాటలివి. 2వ తేదీ ఉదయం రచ్చబండ కార్యక్రమం కోసం చిత్తూరు బయలుదేరే ముందు మీడియాతో మాట్లాడుతూ ఆయన ఏమన్నారంటే ..."ప్రభుత్వ యంత్రాంగం పనితీరును పరిశీలించేందుకు రచ్చబండ కార్యక్రమ్యం తలపెట్టాం. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు రాష్ట్రమంతటా ఎలా అమలవుతున్నాయో తెలుసుకోవడం నాకొక్కడికే సాధ్యం కాదు కదా.. అందుకే నెల్లో రెండు మూడు రోజులపాటు జిల్లాల్లో పర్యటించాలని అనుకుంటున్నా. ప్రతి పక్షాలు చేస్తున్న విమర్శల్లో నిజమెంత, ఉందో తెలుసుకోవడానికి, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో లోటుపాట్లు ఉంటే వాటిని గుర్తించి సరిదిద్దడానికి ఇది ఉపయోగపడుతుంది. గ్రామాల్లో అర్హులకు రేషన్‌కార్డులు అందుతున్నాయా? లేదా? ఇళ్ల నిర్మాణంలో సమస్యలేమైనా ఉన్నాయా? ఇళ్లు మంజూరు కాని వాళ్లు మిగిలి ఉన్నారా? వంటి విషయాలను స్వయంగా పరిశీలిస్తాను. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందుతున్నాయా? బోగస్ ఏమైనా ఉన్నాయా? అన్నది కూడా ఈ పరిశీలన ద్వారా స్పష్టమవుతుంది."

"గతంలో 'పల్లెబాట'లో ఒకేసారి 20-40 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల వివరాలు ఒకే వేదికపై తెలుసుకునేవాళ్లం. అప్పట్లో ప్రజలతో రోడ్డు పక్క సమావేశాలను నిర్వహించాం. రచ్చబండలో సమావేశాలేమీ ఉండవు. నేరుగా గ్రామ ప్రజల నుంచే వారి సమస్యలేమిటన్నది వినాలని




అనుకుంటున్నా. కడప జిల్లాలో కరువు, ఉపాధి హామీ పనులు ఎలా జరుగుతున్నాయో, గ్రామాల్లో పశుగ్రాసం, తాగునీటి పరిస్థితి ఏమిటన్న దానిపై ప్రత్యేకంగా దృష్టి పెడతా. గ్రామాల్లో వాస్తవ పరిస్థితులేమిటన్నది తెలియాలంటే పర్యటనలు ఆకస్మికంగానే ఉండాలి. ముందుగానే తెలిస్తే కిందిస్థాయిలో జరిగే తప్పులను సరిదిద్దే వీలుండదు. అందుకే నేను సందర్శించే గ్రామాల వివరాలు ఉదయం అయిదు గంటలకు మాత్రమే భద్రతాధికారులకు చెప్పా." ☆



లక్షలాదిగా ఇడుపులపాయకు తరలి వచ్చారు. తమకు దారి చూపించిన నాయకుడికి అశ్రు తర్పణం అర్పించారు.

ఈ జన ప్రవాహాన్ని దాటుకుని అగ్రనేతలు అనేకమంది ముందుకు కదలలేకపోయారు. ఇడుపులపాయకు చేరుకోలేకపోయారు. మార్గమధ్యంలోనే మనస్సులోనే జోహార్లు అర్పిస్తూ వెనుదిరగాల్సి వచ్చింది.

ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్, యు.పి.ఐ. ఛైర్‌పర్సన్ శ్రీమతి సోనియాగాంధీ, పార్లమెంట్ సభ్యులు శ్రీ రాహుల్‌గాంధీ, భారతీయ జనతాపార్టీ అధినేత శ్రీ ఎల్.కె. అద్వానీ, అనేకమంది కేంద్రమంత్రులు, ఇతర ప్రముఖులు క్యాంపు ఆఫీసులో డాక్టర్ రాజశేఖరరెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

ముందుగా డాక్టర్ మన్మోహన్‌సింగ్, శ్రీమతి సోనియా, శ్రీ రాహుల్ గాంధీలు ముఖ్యమంత్రి నివాస గృహంలోకి వెళ్ళి రాజశేఖరరెడ్డి సతీమణి శ్రీమతి విజయలక్ష్మిని, కుమారుడు జగన్‌ని, కోడల్ని, కుమార్తెని, మనమల్ని, ఇతర కుటుంబసభ్యుల్ని, వై.ఎస్.కి ప్రాణమిత్రుడు డాక్టర్ కె.వి.పి. రామచంద్రరావుని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సి.ఎం. క్యాంపు ఆఫీసు నుంచి భౌతికకాయం బయలుదేరినప్పుడు రాజధాని రోడ్లు జనంతో నిండిపోయాయి. ఉదయం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరిన అంతిమయాత్ర నగర వీధులగుండా సాగి గాంధీభవన్ మీదుగా ఎల్బీ స్టేడియం చేరుకుంది. ఎల్బీ స్టేడియంకు ఉదయం నుంచే జనం రావడం ప్రారంభమైంది. వైయస్ పార్థివ దేహం స్టేడియంకు చేరుకునేసరికి గ్రౌండ్ అంతా జనంతో నిండి క్రిక్కిరిసిపోయింది. స్టేడియం నలు దిక్కులా, చుట్టూ ఉన్న రహదారుల ప్రక్కనా ఎటు చూసినా జనమే. "వైఎస్సార్ అమర్ రహే" అని నినదిస్తూ చివరి చూపుకోసం తపించిపోయారు. భౌతిక కాయాన్ని ఎల్బీ స్టేడియంలో గంట కంటే ఎక్కువ సమయం ప్రజల సందర్శనార్థం ఉంచడానికి వీలు కాలేదు. నిర్ణీత సమయానికి ఇడుపులపాయ చేరుకోవడానికి సమయాన్ని కుదించక తప్పలేదు. ఇడుపులపాయలోని వాతావరణమే ఇందుకు కారణం.

వైఎస్సార్ పార్థివ దేహం, ఆయన కుటుంబ సభ్యులను ఇడుపులపాయలో చూడగానే అక్కడ చేరిన లక్షలాది జనం రోదనలతో ఆ ప్రాంతం మార్మోగింది. "వైఎస్సార్ అమర్ రహే" అన్న నినాదాలు మిన్నంటాయి. సాయంత్రం అయిదున్నర గంటలకు అంత్యక్రియలు ముగిశాయి.

రాష్ట్ర చరిత్రలోనే ఇది అతిపెద్ద అంతిమ వీడ్కోలు యాత్ర. అభిమాన నేతకు కడసారి వీడ్కోలు చెప్పేందుకు లక్షల్లో జనం తరలివచ్చారు. ప్రజలు ఉదయం ఆరు గంటల నుంచే ఇడుపులపాయకు చేరుకోవడం ప్రారంభించారు. దాదాపు 15 కిలోమీటర్ల వరకూ ట్రాఫిక్ స్తంభించడంతో చాలామంది కొండలు గుట్టలూ ఎక్కారు. పాపాఘ్ని నదిలో నడుచుకుంటూ, పుట్టలూ... పొలాలూ... దాటుకుంటూ ఖనన ప్రాంతానికి చేరుకున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఇడుపుల పాయకు వెళ్లే రహదారి జనంతో క్రిక్కిరిసిపోయింది. పదిహేను కిలోమీటర్ల దూరం వరకూ వాహనాలు నిలిచిపోయాయి.

*- వై.ఎస్.*

# మెరుపు వేగంతో నిర్ణయాలు, అదే వేగంతో అమలు



**జాప్యం లేకుండా నిర్ణయాలు తీసుకోవడమే కాదు, అంతే వేగంగా జనంలోకి తీసుకెళ్లగల సామర్థ్యం ఉన్న నేత వై.యస్. ఏ పథకం ప్రవేశపెడితే జనాన్ని తనతో తీసుకెళ్లొచ్చో గుర్తించడమే కాదు, అలాంటి పథకాలను వేగంగా అమలు చేయడంలోనూ ఆయన దిట్ట. రెండు రూపాయలకు కిలో బియ్యం, అభయహస్తం, ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇలా ఏ పథకం అమలును పరిశీలించినా ఇదే పరిస్థితి. రెండు రూపాయల కిలో బియ్యాన్ని ప్రకటించినపుడు అందరూ ఆశ్చర్యపోయారు. అందుబాటులో ఉన్న సమాచారాన్ని బట్టి, ఎంతటి కీలక నిర్ణయాన్నైనా వెంటనే తీసుకోవడం ఆయనకు అలవాటు. ఎక్కువ నిర్ణయాలు ఒక సమావేశంలోనే, కాదంటే రెండవ సమావేశంలో తప్పనిసరిగా తీసుకొనేవారు.**

అట్లా వచ్చిందే అభయహస్తం. కోటిమంది మహిళలకు ఉద్దేశించిన ఈ కార్యక్రమం అతి తక్కువ కాలంలో రూపుదిద్దుకోవడమే కాదు. వెంటనే అమలుకు నోచుకొంది. ఏదైనా కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయం తీసుకొన్నాక, ఎన్ని విమర్శలు వచ్చినా పట్టించుకోకుండా, దానిని ముందుకు తీసుకెళ్లే తత్వం వై.యస్.ది. సహకార సేద్యంపై విపక్షాలు, వ్యవసాయరంగ నిపుణులు అభ్యంతరాలు వ్యక్తంచేసినా, సంక్షోభంలో ఉన్న రైతులను ఆదుకోవడానికి అవసరమంటూ దానిని మరింత గట్టిగా అమలు చేయడానికి నిర్ణయించారు. నిధుల అందుబాటును పట్టించుకోకుండా కొత్త ప్రాజెక్టుల ను చేపడ్తున్నారంటూ విమర్శలు వచ్చినా, వాటిని పక్కనబెట్టి ప్రాణహిత-చేవెళ్ల, దుమ్ముగూడెం-టేల్‌పాండ్, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి లాంటి పథకాలను చేపట్టారు.

ఏ పథకాన్ని చేపట్టినా దాని ఫలితాలు ప్రజలందరికీ చేరే వరకు అమలు చేయాలంటూ ఇందిరమ్మ గృహ నిర్మాణం లాంటి కార్యక్రమాలను వై.యస్. పెద్ద ఎత్తున చేపట్టారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రభుత్వ పథకాల వల్ల లబ్ధి పొందినవారు ఉండాలంటూ దానికి తగ్గట్లుగా కార్యక్రమాలు రూపకల్పన చేశారు. ఏదైనా అంశం గురించి క్షుణ్ణంగా తెలిసిన వారు కొత్త కార్యక్రమాలు, ఉన్నవాటిలో మార్పులు సూచించినా, వాటి గురించి వెంటనే సంబంధిత అధికారులతో చర్చించేవారు. ఏ అంశం గురించైనా ఒకసారి చర్చించాక దానిని అర్థం చేసుకొని అవుననో, కాదనో వెంటనే చెప్పేవారని అధికారుల వ్యాఖ్య.

వై.ఎస్. ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. రైతులకు పావలావడ్డీ, విద్యార్థుల ఫీజుల రీయింబర్స్‌మెంట్‌లు, 108 అంబులెన్స్‌లు . . . ఇలాంటి అనేక పథకాలను చేపట్టారు. వీటన్నిటిని జనంలోకి విస్తృతంగా తీసుకెళ్ళారు.

## అంతులేని ఉదారత

"ప్రజలకు సేవ చేయడమంటే దేవుడికి చేసినట్లే! పేదలు, అవసరస్థితిలో ఉన్న వారికి సహాయం చేయడాన్ని పవిత్రమైన బాధ్యతగా ప్రభుత్వం భావిస్తోంది. ఆరోగ్యపరంగా ఇబ్బందుల్లో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.." ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కి విరాళాలను కోరుతూ వై.యస్.రాజశేఖరరెడ్డి ఇచ్చిన పిలుపు ఇది. సహాయనిధి ద్వారా నిరుపేదలకు సాయం చేయడంలో ఆయన ఎనలేని ఉదారత ప్రదర్శించేవారు.

సీఎంఆర్ఎఫ్ కింద సాయం అందించాలని ఎవరడిగినా, వై.యస్. వెంటనే స్పందించేవారు. రూ. లక్ష వరకు పరిమితి ఉన్నా దాన్ని మించి ఒక్కోసారి రూ. అయిదేసి లక్షల వరకు సాయాన్ని మంజూరు చేశారు. ప్రతిపక్ష సభ్యులు వచ్చినా ఆయన కాదనలేదు. ఏడాదికి రూ.100 కోట్ల వరకూ ఈ పథకానికి వెచ్చించారు.

వై.యస్ అధికారం చేపట్టిన నాలుగేళ్ల కాలంలో లక్ష మందికి రూ. 400 కోట్లను మంజూరు చేశారు. దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లో నిధి మంజూరు చేశారు. సి.యం. ఉదార నిర్ణయం కారణంగా ప్రతీ రోజూ 200 మంది వరకు ఆయన కార్యాలయానికి వచ్చి సాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. సాయాన్ని సత్వరం అందించేందుకు మంజూరు సమయాన్ని ఆరు గంటలకు కుదించాలని ఆదేశించారు.

తాను జిల్లాలు, ఇతర ప్రాంతాల పర్యటనలకు వెళ్లినప్పుడు దరఖాస్తుల మంజూరులో జాప్యం జరగకుండా ఆన్ లైన్ విధానం ప్రవేశ పెట్టాలని ఆయన ఆదేశించారు. దీనివల్ల ... హృద్రోగ శస్త్రచికిత్సలు, మూత్రపిండాల మార్పిడి తదితర అత్యవసర సమయాల్లో సాయమందించేందుకు వీల వుతుందని చెప్పారు. ఆన్‌లైన్ దరఖాస్తులను పరిశీలించి అప్పటికప్పుడు డిజిటల్ సంతకం చేయాలని సి.యం. నిర్ణయించారు. ఆరోగ్యశ్రీ పథకం చేపట్టాక సహాయనిధిని అందులో విలీనం చేశారు.

– ఆర్.కె

**వై.** యస్. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించక ముందు నుంచే తపించిన రంగం ఏదైనా ఉందంటే... అది నీటిపారుదలే. 2004 మే 14న ముఖ్యమంత్రిగా తొలిసారి బాధ్యతలు స్వీకరించే ముందు లేక్‌వ్యూ అతిథిగృహంలో తొలి సమీక్షను చేసింది నీటిపారుదల రంగం గురించే. రెండో సారీ అలాగే సమీక్షించారు. తన పాలనాకాలంలో నీటిపారుదల రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. ముఖ్యమంత్రిగా జలయజ్ఞానికి పూనుకునే ముందు తల్లి జయమ్మ చెప్పిన మాటలే ఆయనకు స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. "పులివెందులకు నీటికరువు తీర్చు నాయినా. లింగాల మండల ప్రజలను ఆదుకో. నా కోరిక అదే" అంటూ జయమ్మ తన మనసులో మాటను వెల్లడించారు.

2003లో జరిపిన చారిత్రాత్మక 1600 కి.మీ. పాదయాత్ర (ప్రజాప్రస్థానం)లో నీటి కోసం ప్రజల గుండెలు తపించిన తీరు కూడా వైఎస్‌ను తీవ్రంగా ప్రభావితం చేసింది. అందుకే. . సీఎం అవ్వగానే 'అమ్మకోసం. . .జనం కోసం' జలయజ్ఞాన్ని చేపట్టారు. రూ.46 వేల కోట్లు ఖర్చుపెట్టి 12 ప్రాజెక్టుల నిర్మాణం పూర్తిచేశారు. జలయజ్ఞం అన్ని ప్రాంతాలకు విస్తరించింది. తెలంగాణ, ఆంధ్ర, ఉత్తరాంధ్ర, రాయలసీమ. . అన్నింటా ప్రాజెక్టులు చేపట్టారు. "రైతు పొలాల్లో నీళ్లు పారితే వారి కళ్లలో ఆనందం తాండవిస్తుంటే చూడాలన్నదే నా కోరిక. . లక్ష్యం" అన్నది వైయస్ నినాదం. పనుల రూపంలో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తయ్యి, సముద్రం పాల వుతున్న నీరు రైతు గడపను తాకితేనే వైయస్‌కు మనమిచ్చే నిజమైన జల నివాళి.

# జనం కోసం జలం

## అదే వై.యస్. నిరంతర తపన





వై.యస్. కోరిక పూర్తిగా వాస్తవరూపం దాల్చక ముందే ఆయన దుర్మరణం పాలయ్యారు. కృష్ణానది మిగులు జలాలను పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా గండికోట రిజర్వాయర్‌కు తీసుకెళ్లి, అక్కడనుంచి కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు తరలించాలన్న కోరిక తీరకుండానే ఈ లోకాన్ని విడిచిపెట్టారు. మరి కొన్ని నెలలు గడిస్తే. . ఈ ప్రక్రియకు ఆయనే శ్రీకారం చుట్టేవారు. లింగాల కాల్వ (చిత్రావతి కుడికాల్వ) తవ్వకం పూర్తి కావొచ్చింది. గండికోటకు కృష్ణాజలాలను తరలించి, అక్కడ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా చిత్రావతి రిజర్వాయర్‌కు తరలించి లింగాల కాల్వకు నీటిని విడుదల చేయడమే మిగిలింది.

దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టేందుకు వైయస్ తలపెట్టిన జలయజ్ఞం లక్షలాది ప్రజల భవిష్యత్తును సమూలంగా మార్చివేసే సమయం సుదూరంలో ఉండగానే జలం మీదుగా జనం మధ్యకు వెళుతూ దుర్మరణం చెందారు. చెప్పిన హామీలను నెరవేర్చకపోతే నీటి మీద రాతలంటారు.

కానీ వైయస్. . నీటి రాతనే మార్చేశారు. ఎటువైపు, ఏ దిక్కు నడవాలో నడక నేర్పే బాటలు (ప్రాజెక్టులు, కాల్వలు) వేశారు. సముద్రం పాల వుతున్న నీటిని కొంతైనా ఒడిసి పట్టి పొలాల్లో పరుగులెత్తించాలనుకున్నారు. జలయజ్ఞంతో నీటి రాతను మార్చే ప్రయత్నాన్ని మొదలుపెట్టినా. .విధి రాత నుంచి తప్పుకోలేకపోయారు. ఏ కృష్ణా నదీ జలాల కోసమైతే పరితపించారో– ఆ నది పరివాహక ప్రాంతం ఒడిలోనే విగతులయ్యారు.

## అనుమతుల రికార్డు. . .

వైయస్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సాధించిన మరో రికార్డు. . . దాదాపు 25 ప్రాజెక్టులకు 120 రకాల అనుమతుల ను సాధించడం. . అందులో అత్యంత కీలకమైనవి పోలవరం, వెలిగొండ, దేవాదుల, శ్రీరాంసాగర్ వరద కాల్వ ప్రాజెక్టులు. వంశధార ఫేజ్1 స్టేజి–2, తోటపల్లి, తాడిపూడి, పుష్కరం, భూపతిపాలెం, ముసురుమిల్లి, తారకరామ తీర్థసాగర్, 'పోలవరం, గుండ్లకమ్మ, వెలిగల్లు, బీమా, గుత్ప, అలీసాగర్, ఎస్సారెస్పీ స్టేజి2, వరదకాల్వ, దేవాదు, పాలెం వాగు, రాలివాగు, నీల్వాయి, మత్తడివాగు, కొమురంభీం, గొల్లవాగు, పెద్దవాగు (జగనానధపోర్), వెలిగొండ, సోమశిల మొదలైన ప్రాజెక్టులకు వివిధ రకాల అనుమతులు వచ్చాయి. భూ సేకరణలోనూ ఇలాంటి రికార్డు నమోదైంది. 2004 లో మొదలుపెట్టిన జలయజ్ఞానికి అవసరమైన భూసేకరణ 6,88,247 ఎకరాలు. ఇప్పటి వరకు దాదాపు 4,76,792 ఎకరాల భూమి సేకరణ పూర్తయింది.

## ఉచిత విద్యుత్‌తో చెరగని ముద్ర

'ఉచిత విద్యుత్'తో వై.యస్. రాజశేఖరరెడ్డి రాష్ట్ర రైతాంగంపై చెరగని ముద్రవేశారు. రైతుల నాడిని కచ్చితంగా పట్టుకున్నారు. పంజాబ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉచిత విద్యుత్ హామీని అమలు చేయడంలో విఫలమైన అనుభవం కళ్ల ముందున్నా ఆయన సాహసం చేశారు. ఈ నిర్ణయం ఫలితంగా. . రైతులకు కొన్ని ప్రయోజనాలు చేకూరగా, రాజకీయంగా వై.యస్.ను తిరుగులేని నాయకునిగా నిలిపింది.

మరో కీలకమైన అంశం. . ఉచిత విద్యుత్ విషయంలో ప్రపంచ బ్యాంకు సూచనలను తోసిపుచ్చడం. ఉచిత విద్యుత్ ఇస్తే ప్రభుత్వంపై 3000 నుంచి 4000 కోట్ల రూపాయల వరకు భారం పడుతుందని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు వాదిస్తూ వచ్చారు. వాస్తవం ఇందుకు భిన్నమైనది. వ్యవసాయ విద్యుత్ ద్వారా రైతుల నుంచి ఏటా వసూలయ్యే బిల్లుల మొత్తం అప్పటికి రూ. 436 కోట్లే. . .! ఈ మొత్తం కోల్పోయినంత మాత్రాన రాష్ట్రం తల్లకిందులైపోదన్న విషయాన్ని వైఎస్ గట్టిగా పట్టుకున్నారు.

వై.యస్. పదవి చేపట్టిన తర్వాత రైతుల విద్యుత్ బకాయిల ను మాఫీ చేసి ఐదేళ్లపాటు ఉచిత విద్యుత్ ఇచ్చారు. వై.యస్. హయాంలో వ్యవసాయ విద్యుత్ సరఫరాలో నాణ్యత తగ్గినా, ఉచిత విద్యుత్‌తో రైతులు సంతృప్తిపడటానికి ప్రధాన కారణం. . . వేధింపులు లేకపోవడమేనని విద్యుత్ రంగ విశ్లేషకుడు ఒకరు అభిప్రాయపడ్డారు. రెండో కీలకమైన అంశం. . ప్రపంచ బ్యాంకు చొరబాటును విద్యుత్ రంగంలో నివారించడం.

వై.యస్.అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ రంగం కోసం ప్రపంచ బ్యాంకు నుంచి కొత్తగా రుణం తీసుకోలేదని విద్యుత్‌శాఖ అధికారులు పేర్కొన్నారు. దీని ఫలితంగానే జెన్‌కో, డిస్కామ్‌లు ప్రైవేటుపరం కాకుండా ఆగాయన్నది వారి భావన. చివరిగా తొమ్మిది గంటలపాటు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయాలన్నది ఆయన సంకల్పం. ఈ ఫైలుపై ఆయన రెండోసారి సీఎం ప్రమాణం చేసిన వెంటనే సంతకం కూడా పెట్టారు. అయితే, దీనిని అమలు చేయాలంటే మరో 2000 మెగావాట్లు అవసరమవుతుందని అధికారులు అంటున్నారు.

వీటీపీఎస్‌లో చేపట్టిన 500 మెగావాట్ల ఉత్పత్తి లక్ష్యం నెరవేరితే, తన హామీని నెరవేరుస్తానని వైయస్ ఇటీవలే అసెంబ్లీలో ప్రకటించారు. ఇక. . . జెన్‌కో చేపట్టిన ఇతర ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేసి, దీనిని అమలు చేస్తే, అదే వై.యస్.కు నిజమైన నివాళి అవుతుంది.

– రాధాకృష్ణ

**వెన్ను చూపని యోధుడు... మడమ తిప్పని నాయకుడు... ఓటమి ఎరుగని మేరునగధీరుడు... ప్రజల నాడి తెలిసిన వైద్యుడు... ప్రజల కోసం అహరహం శ్రమించే నాయకుడు. ఒక్క ముక్కలో చెప్పాలంటే... పేదల పాలిట దేవుడు. ఆయనే శ్రీ యెడుగూరి సందింటి రాజశేఖరరెడ్డి.**

**ఆప్తులకు, అభిమానులకు ఆయన వై.యస్. అడిగిన వారికి లేదనరు. నమ్మిన వారిని పొమ్మనరు. జనం నుంచి ఎదిగారు. జనం కోసం బతికారు. జనం కోసమే బయలుదేరారు. జనం నుంచి దూరమయ్యారు. మాటలో సూటిదనం, నడకలో చురుకుదనం, నడతలో ముక్కుసూటిదనం... ఆయన సొంతం. సాహసమే ఆయన పథం.**

ధవళ వస్త్రాలతో, తెలుగుదనం ఉట్టిపడే పంచెకట్టుతో, తేటతెలుగు నుడికారపు పలుకులతో ఆ నిండు వ్యక్తిత్వం కదలి వస్తుంటే ఓ మలయమారుతం గుండెను చల్లగా తాకి, ఆత్మీయంగా పలకరిస్తున్నట్టు ఉండేది. మధ్యతరగతి రైతు కుటుంబంలో పుట్టిన శ్రీ యెడుగూరి సందింటి రాజశేఖరరెడ్డి స్వయంకృషితో అగ్రాసనం అధిష్టించారు.

# నిండు రూపం... నిండైన వ్యక్తిత్వం

జనం భాష, యాస, ప్రయాస తెలిసినవాడు కాబట్టే వై.యస్.ను రాష్ట్ర ప్రజలు మనోడు, మన మంచిని చూసేవాడని సొంతం చేసుకున్నారు. ఇంగ్లీషు చదివినా అచ్చతెనుగు పలకరింపు మరిచిపోలేదు. ఊరి దారులు మసకబారలేదు. పల్లెన్నా, పచ్చని పొలాలన్నా ఆయనకు ప్రాణం. ఇడుపుల పాయ ఎస్టేటే ఇందుకు నిదర్శనం.

డాక్టర్ చదువు ఆధునికత అద్దితే.. పల్లెతనం మనిషితనాన్ని గట్టిగా నిలిపింది. మనిషన్నాక మార్పు ఉండాలని నమ్మేవారిలో వైయస్ మొదటివారు. అందుకే పాదయాత్ర తనను పూర్తిగా మార్చివేసిందని అంటుండేవారు. అంతకుముందు వైయస్ ఆవేశపరుడిగానే తెలుసు. పాలనా పగ్గాలు చేతికందాక హుందాతనానికి చిరునామా అయ్యారు. తాను మంచి అనుకున్న పనిని చేసేందుకు ఎంతటి శ్రమనైనా లెక్కచేయనితనమే జలయజ్ఞంలాంటి పెద్ద పనులకు వెన్నుదన్నుగా నిలిచింది. 30 ఏళ్లకు పైగా జనం మధ్య నడుస్తున్న వైయస్‌కు తెలియనిది విసుగు.

### ఓటమి ఎరుగని ఏకైక నేత

కడప గడ్డపై పుట్టిన వై.యస్. ఆంధ్రప్రదేశ్ ప్రజలకే ముద్దు బిడ్డగా ఎదిగారు. ఆయన 1949 జులై 8న జమ్మలమడుగులోని క్రైస్తవ మిషనరీ ఆస్పత్రిలో కన్ను తెరిచారు. వైఎస్ రాజారెడ్డి, జయమ్మలకు ఆయన రెండో కుమారుడు. ఆది నుంచీ ప్రజలతో మమేకమైన కుటుంబమది. ప్రజలను కలుస్తూ, ప్రజల సమస్యలను తెలుసుకుంటూనే వైఎస్ పెరిగారు. పులివెందులలో, కర్ణాటకలోని బళ్లారిలో 10వ తరగతి వరకు, విజయవాడలో ఇంటర్మీడియట్ చదివారు. కర్ణాటకలోని గుల్బర్గాలో ఎంబీబీఎస్ చదివారు. అప్పుడే ఆయన విద్యార్థి సంఘ నాయకుడిగా పనిచేశారు. తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కాలేజీలో హౌస్ సర్జన్ చేశారు. అప్పుడు కూడా హౌస్ సర్జన్ అసోసియేషన్‌కు ఆయనే నాయకుడు. తాను కన్ను తెరిచిన జమ్మలమడుగు మిషన్ ఆస్పత్రిలోనే ఆయన వైద్యుడిగా జనం నాడి పట్టారు.

మూడు పదులు కూడా నిండని వయస్సులో రాజకీయ అరంగేట్రం చేశారు. వైయస్ తలపండిన నేతలతో తలపడి నిలబడ్డారు. ఎంబీబీఎస్ చదివే రోజుల్లోనే రాజకీయాల వైపు మొగ్గిన వై.యస్. 1975లో కడప జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా ప్రత్యక్ష రాజకీయాల్లో అడుగుపెట్టారు. 1978 అసెంబ్లీ ఎన్నికల్లో రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా ఆవు-దూడ గుర్తుపై పోటీ చేసి జనతా పార్టీ అభ్యర్థి దేవిరెడ్డి నారాయణరెడ్డిపై గెలిచి నాడే రాజకీయ ప్రస్థానంలో తొలి విజయాన్ని నమోదు చేసుకున్నారు. తర్వాత ఇందిరా కాంగ్రెస్‌లో చేరారు. ఇక వెనుదిరిగి చూసుకోలేదు.

1983 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్టీఆర్ ప్రభంజనంలో మహామహులెందరో గడ్డిపరకల్లా కొట్టుకుపోయినా 13 వేల మెజార్టీతో గెలిచి తన వ్యక్తిగత ఆకర్షణ ఎలాంటిదో రాష్ట్రానికి చాటి చెప్పారు. 1989, 1991, 1996, 1998 లోక్‌సభ ఎన్నికల్లో కడప లోక్‌సభ స్థానం నుంచి, 1978, 1983,



1985, 1999, 2004, 2009 ఎన్నికల్లో పులివెందుల శాసనసభ స్థానం నుంచి విజయం సాధించి ప్రత్యక్ష ఎన్నికల్లో ఓటమి ఎరుగని నేతగా కీర్తి గడించారు. 1980 చివరి నుంచి 1983 జనవరి మొదటి వారం వరకూ రాష్ట్ర మంత్రివర్గంలో సహాయ, కేబినెట్ మంత్రి హోదాలో గ్రామీణాభివృద్ధి, ఎక్సైజ్, విద్యా శాఖలను నిర్వహించారు.

1983-85 మధ్య మొదటిసారి, 1998-2000 మధ్య కాలంలో రెండోసారి పీసీసీ అధ్యక్షుడుగా, 1985లో సీఎల్పీ ఉపనేతగా, 1998-2003 మధ్య కాలంలో సీఎల్పీ నేతగా వై.యస్. పనిచేశారు.

### వినూత్నం ఆ ప్రజాప్రస్థానం

తెలుగుదేశం వరుస విజయాలతో 2003 నాటికి కాంగ్రెస్ నీరసించింది. వరుస కరువులతో ప్రజానీకం విలవిలలాడుతోంది. అదే

సమయంలో విపక్షనేతగా ఉన్న వై.యస్. ఓ వినూత్నమైన, సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. అది... 'ప్రజాప్రస్థానం'. ప్రజల్లోకి ప్రస్థానం. ప్రజల్లోకి స్వయంగా వెళ్లి.. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు చేపట్టిన కాలినడక ప్రయాణం. ఎర్రటి ఎండలను ఎదిరించి... మట్టిదారిలో, డొంక రోడ్డులో, తారు రోడ్డుపై... పంచె బిగించి, తలపాగా కట్టి ఆయన ముందుకు కదులుతుంటే అడుగడుగునా జన నీరాజనాలే.

కరువుతో దెబ్బతిన్న ప్రాంతాల్లో విస్తృతంగా చేపట్టిన ఈ పాదయాత్ర 2004 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు విజయాన్ని చేకూర్చింది. ఈ యాత్రలో 68 రోజులపాటు 11 జిల్లాల పరిధిలోని 1470 కిలోమీటర్లు అవిశ్రాంతంగా కాలినడకన పయనించారు. ఈ యాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది.

*ప్రస్థానం జరిగిన తీరు . ..*

★ ***తొలివారం:*** 2003 ఏప్రిల్ 9 నుంచి15 వరకూ రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో 159 కి.మీ. ★ ***రెండోవారం:*** ఏప్రిల్ 16 నుంచి 22 వరకూ మెదక్, నిజామాబాద్ జిల్లాలో 160 కి.మీ. ★ ***మూడోవారం:*** ఏప్రిల్ 23 నుంచి 29 వరకూ నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో 181 కి.మీ. ★ ***నాలుగో వారం:*** ఏప్రిల్ 30 నుంచి మే 6 వరకూ కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో 170 కి.మీ. ★ ***ఐదో వారం :*** మే 7 నుంచి 13 వరకూ ఖమ్మం, పశ్చిమగోదావరి జిల్లాల్లో 166 కి.మీ. ★ ***ఆరో వారం :*** మే 14 నుంచి మే 29 వరకూ ఉభయగోదావరి జిల్లాల్లో 103 కి.మీ. ★***ఏడో వారం:*** మే 21 నుంచి 27 వకకూ తూర్పుగోదావరి జిల్లాల్లో 95 కి.మీ ★ ***ఎనిమిదో వారం :*** మే 28 నుంచి జూన్ 3 వరకూ తూర్పుగోదావరి, విశాఖ జిల్లాల్లో 156.5 కి.మీ. ★ ***తొమ్మిదో వారం :*** జూన్ 4 నుంచి 10 వరకూ విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 166 కి.మీ. ★ ***పదో వారం :*** జూన్ 11 నుంచి 15 వరకూ శ్రీకాకుళం జిల్లాలో 114 కి.మీ.

మండుటెండ సైతం లెక్కచేయకుండా 56 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1470 కి.మీ. పాదయాత్ర విజయవంతంగా పూర్తి చేశారు.

2004లో జరిగిన ఎన్నికల అనంతరం మే నెలలో ముఖ్యమంత్రి అయి

## జీవన పథం

***పేరు :*** యెడుగూరి సందింటి రాజశేఖరరెడ్డి

★ 1949, జూలై 8న వై.యస్. రాజారెడ్డి, జయమ్మ దంపతులకు కడప జిల్లా జమ్మలమడుగులోని క్రిస్టియన్ మిషనరీ ఆసుపత్రిలో రాజశేఖరరెడ్డి జన్మించారు.

***విద్యాభ్యాసం :*** పులివెందుల, బళ్లారి, విజయవాడ, గుల్బర్గా

★ విజయవాడ లయోలా కళాశాలలో పీయూసీ, కర్ణాటకలోని గుల్బర్గాలో ఎంబీబీఎస్ చదివారు. ఎస్.వి. మెడికల్ కళాశాలలో హౌస్ సర్జన్ చేశారు. అప్పుడు హౌస్ సర్జన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు.

***తొలికొలువు :*** జమ్మలమడుగు ఆస్పత్రిలో మేనత్త రత్నమ్మ వద్ద వైద్యుడిగా శిక్షణ

★ కొద్దికాలం జమ్మలమడుగు మిషన్ ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేశారు. 1973లో తండ్రి పేరిట పులివెందులలో 70 పడకల ఆసుపత్రి నిర్మించారు. నాలుగేళ్లు వైద్యసేవలు అందించారు.

***వివాహం :*** 1972 ఫిబ్రవరి 9న సింహాద్రిపురం మండలం అంకాళమ్మ గూడూరుకు చెందిన పోచంరెడ్డి రామానుజులరెడ్డి కుమార్తె విజయలక్ష్మితో...

***సంతానం:*** జగన్మోహన్‌రెడ్డి, షర్మిల

***విశ్వాసం :*** వై.యస్. తాత హయాంలోనే ఆయన కుటుంబం క్రైస్తవం పుచ్చుకుంది. హిందూమతంపైనా వైఎస్‌కు అపార విశ్వాసం ఉంది.

***రాజకీయం... పదవులు...***

★ 1975లో రాజకీయ రంగప్రవేశం

★ 1978లో ఎమ్మెల్యేగా తొలిసారి ఎన్నిక

★ 1981లో అంజయ్య మంత్రివర్గంలో గ్రామీణాభివృద్ధి మంత్రిగా బాధ్యతలు

★ ఎక్సైజ్ శాఖ, విద్యా శాఖ, వైద్య ఆరోగ్య శాఖా మంత్రి విధి నిర్వహణ

★ రెండుసార్లు సీఎల్పీ నేతగా విధులు

★ 1978 నుంచి 2009 దాకా... ఆరుసార్లు శాసనసభ్యుడిగా విజయం

★ 1989, 1991, 1996, 1998 పార్లమెంటు ఎన్నికల్లో వరుస విజయాలు.

★ 2004 మే 14న ముఖ్యమంత్రిగా తొలిసారి పదవీ బాధ్యతలు

★ 2009 మే 20న ముఖ్యమంత్రి రెండోసారి ప్రమాణ స్వీకారం

★ మొదట్లో కమ్యూనిస్ట్ భావాల పట్ల ఆకర్షితులు. 1978లో కాంగ్రెస్ (ఆర్)లో పనిచేశారు. పులివెందుల నుంచి 29 ఏళ్ల వయసులోనే అసెంబ్లీకి ఎన్నికయ్యారు.

★ 33 ఏళ్ల ప్రాయంలోనే పీసీసీ నేతగా బాధ్యతల స్వీకారం. 1983-85, 1998-2000 మధ్య రాష్ట్ర కాంగ్రెస్ (పీసీసీ) సారథిగా ఉన్నారు. 1999 నుంచి 2004 వరకు రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత.

★ రాయలసీమ నీటి సంక్షోభ నివారణకు ఎమ్మెల్యేలతో కలిసి అమరణ నిరహారదీక్ష చేపట్టారు. అనంతపురం జిల్లా లేపాక్షి నుంచి కర్నూలు జిల్లా పోతిరెడ్డిపాడు వరకు పాదయాత్ర చేశారు.

★ ఆగస్టు 2000లో ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా తన సహచర శాసనసభ్యులతో కలిసి 14 రోజులు నిరహారదీక్ష చేసి సంచలనం సృష్టించారు.

★ 2003లో మండువేసవిలో రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు సుమారుగా 1,400 కిలోమీటర్ల దూరం రెండు నెలలకు పైగా పాదయాత్ర చేశారు. అదే కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చింది.

★ 2004 మే 14న రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. రైతులకు ఉచిత విద్యుత్ బిల్లుపై మొదటి సంతకం చేశారు.

★ 14 మంది కాంగ్రెస్ ముఖ్యమంత్రులు పనిచేయగా, కాసు బ్రహ్మానందరెడ్డి, జలగం వెంగళరావుల తర్వాత నాలుగేళ్లకు పైగా ముఖ్యమంత్రి పదవిలో ఉన్న కాంగ్రెస్ నేతగా గుర్తింపు పొందారు. రెండవసారి రాష్ట్ర ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన మొదటి కాంగ్రెస్ నేతగా రికార్డు సృష్టించారు. రాష్ట్రంలో పదవిలో ఉండగా మరణించిన మొదటి ముఖ్యమంత్రి కూడా ఆయనే.

★ వైద్యుడైన వై.యస్. పేదల కోసం 'ఆరోగ్యశ్రీ' ప్రారంభించారు.

★ 2009, సెప్టెంబర్ 2న పల్లెబాటలో భాగంగా రచ్చబండ సమావేశాల్లో పాల్గొనడానికి ఉదయం 8 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరారు. గంట తర్వాత ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ఆచూకీ తెలియకుండా పోయింది.

★ 2009, సెప్టెంబర్ 2న రాజశేఖరరెడ్డి ఆయనతో పాటు ఉన్న మరో నలుగురు హెలికాప్టర్ ప్రమాదంలో కన్నుమూశారు. ☆

# కెవీపీతో 40 ఏళ్ల ప్రాణ స్నేహం



**స్నేహానికి చిరునామా వీరే. వై.యస్., కేవీపీ అంటూ భౌతికంగా ఇద్దరున్నా... వారిద్దరి ఆత్మ ఒకటే. విద్యార్థి దశలో స్నేహితులుగా మారిన వీరు జీవన ప్రస్థానంలో కూడా కలిసిమెలిసి అడుగులు వేశారు. ఒకరి కోసం ఒకరు త్యాగం చేస్తూ, ఒకరి అభ్యున్నతికి మరొకరు పాటు పడుతూ విడదీయలేని స్నేహబంధంతో ముందుకెళ్లిన చరిత్ర వీరిది.**

### కెవీపీలేని వై.యస్.ని ఊహించటం కష్టం

వై.యస్.జీవితంలో కేవీపీ లేని అధ్యాయం ఊహించడం కష్టం. ఆరవ దశకంలో మొగ్గ తొడిగిన వారి స్నేహం వై.యస్. మరణం దాకా చెక్కు చెదరకుండా సాగింది. కడప జిల్లాలోని పులివెందులకు చెందిన వై.ఎస్. రాజశేఖరరెడ్డి, కృష్ణా జిల్లా అంపాపురానికి చెందిన కే.వీ.పీ. రామచంద్రరావు తొలిసారిగా కలుసుకున్నది పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో... గుల్బర్గా వైద్య కళాశాలలో బీజాలు పడిన వారి స్నేహం ఆ తరువాత ఆంధ్రప్రదేశ్‌లోనూ పరిఢవిల్లింది. నలభై ఏళ్లుగా రాజకీయాల్లో అడుగడుగునా పరస్పరం వెన్నంటి సాగిన ఈ మిత్రద్వయం ఒడిదుడుకులన్నింటినీ కలిసికట్టుగా అధిగమించింది. వై.యస్.తొలుత ఏ అంశమైనా 'క్యాప్‌స్టన్'తోనే మాట్లాడేవారు. చర్చించేవారు... (రామచంద్రరావు చదువుకునే రోజుల్లోనే ఖరీదైన 'క్యాప్‌స్టన్' సిగరెట్ కాల్చేవారు... దాన్నే ఆయన నామధేయంగా వై.ఎస్ మార్చేశారు). కేవీపీ కూడా తానున్నదే రాజశేఖర్ కోసమేనన్నట్లుగా వ్యవహరిస్తూ వచ్చారు. ముప్ఫై ఐదేళ్ల కిందటే సొంత ఊరి నుంచి హైదరాబాద్‌కు తరలి వచ్చిన కేవీపీ వైఎస్‌కు చివరిదాకా చేదోడువాదోడుగా ఉన్నారు.

### 'కేవీపీ నా ఆత్మ'

గుల్బర్గా వైద్య కళాశాలలో వై.ఎస్ 1964- 65 బ్యాచ్ విద్యార్థిగా చేరితే, రామచంద్రరావు ఆ మరుసటి సంవత్సరం వైద్యవిద్యలో చేరారు. సీనియర్ అనే భేషజం ఏ మాత్రం లేకుండా కలివిడిగా అందరితో కలిసి పోయే మనస్తత్వం గల వై.ఎస్.కు కె.వి.పి సహజంగానే దగ్గరయ్యారు. కె.వి.పి మిత్రులతో గడుపుతూ ఏ అర్థరాత్రికో నిద్ర పోయి ఉదయం అలస్యంగా 11 గంటలకు లేవడం అలవాటు. వై.ఎస్ అందుకు పూర్తిగా వ్యతిరేకం పగలంతా మిత్రులతో ఎంత తిరిగినా రాత్రి 8 గంటల య్యేటప్పటికి తన రూంలో చదువులో మునిగిపోయే వారు. కె.వి.పితో ఉండే వారిని ఎపుడూ 'తిరిగే బ్యాచ్' అనీ, వై.ఎస్‌తో ఉండే వారిని 'చదివే బ్యాచ్' అనీ పిలిచే వారు. వై.ఎస్ నిర్ణీత కాలంలోనే మెడిసిన్ పూర్తి చేస్తే కె.వి.పి డాక్టర్ పట్టా పుచ్చుకోవడానికి చాలా కాలం పట్టింది.

కె.వి.పి వేరు, నేను వేరు కాదు, ఆయనతో మాట్లాడితే నాతో మాట్లాడినట్లే, అయన ఉంటే నేనున్నట్లే... అని వై.ఎస్.రాజశేఖరరెడ్డి పలు సందర్భాల్లో అనేవారు. దీన్ని బట్టి వారి స్నేహం ఎంత గాఢమైందో తెలుస్తోంది. కాంగ్రెస్‌లో పార్టీ పరంగా జరిగే అన్ని కీలక సమావేశాలకూ కె.వి.పి వై.ఎస్ ప్రతినిధిగా హాజరయ్యారు. కె.వి.పి తనకు ఎంత కావల్సిన వాడైందీ చెప్పడానికి వై.ఎస్ ఎపుడూ వెనుకాడలేదు. అధిష్ఠాన వర్గానికి కె.వి.పిపై గిట్టని వారు ఫిర్యాదు చేసినపుడు కూడా ఆయన వెనక్కి తగ్గలేదు. ఇకసారి "కె.వి.పిని బయటకు పంపితే మనిద్దరం మాట్లాడుకుందాం" అని చెన్నారెడ్డి చేసిన ప్రతిపాదనను వై.ఎస్ తోసి పుచ్చుతూ "కె.వి.పి నా ఆత్మ... ఆయన నాతోనే ఉంటాడు... మా మధ్య దాపరికాలు లేవు" అని కుండబద్దలు కొట్టారు. ☆

రాజకీయ జీవితంలో అత్యున్నత శిఖరాన్ని అధిరోహించారు. ఒకప్పుడు ఒక్క రూపాయి ఫీజు తీసుకుని 'రూపాయి డాక్టర్'గా పేరొందిన వైఎస్... ముఖ్యమంత్రిగా మారి ఆ ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా రైతులకు విద్యుత్తు అందించారు. కరువు కష్టాలకు ప్రాజెక్టులే పరిష్కారమని తలచి 'జలయజ్ఞం' చేపట్టారు. ఆ ఐదేళ్లు చేసిన అసమాన ప్రజాసేవకు ఫలితంగా 2009లో జరిగిన ఎన్నికల్లో కూడా ప్రజలు ఆయనకే పట్టంకట్టారు.

### ముఖ్యమంత్రిగా రాజీవ్ పల్లెబాట (2004)

అధికారం చేపట్టాక కూడా వై.యస్ ప్రజలకు చేరువ కావడానికి యాత్రలను కొనసాగించారు. ప్రజాసమస్యలు స్వయంగా అర్థం చేసుకోవడానికి జూన్ 13, 2004లో 'రాజీవ్ పల్లెబాట' కార్యక్రమానికి శ్రీకారం చేట్టారు. సుమారు 40 వేల వినతులను అందులో స్వీకరించారు.

### రాజీవ్ నగర బాట (2005)

పల్లెబాట అనంతరం సెప్టెంబరు1, 2005 నుంచి నగరబాట మొదలు పెట్టారు. పట్టణ ప్రాంత ప్రజల కష్టనష్టాలు నేరుగా తెలుసుకోవడానికి నగరబాటను వై.యస్. వేదికగా చేసుకున్నారు.

### రచ్చబండ (2009)

రెండోసారి అధికారం చేపట్టాక ప్రజావినతులను స్వయంగా వినడానికి తాజాగా రచ్చబండ కార్యక్రమానికి నాంది పలికిన ముఖ్యమంత్రి సెప్టెంబర్ 2వ తేదీ ఉదయం చిత్తూరు జిల్లాకు హెలికాప్టర్‌లో బయలదేరారు. ఆ హెలికాప్టర్ ప్రమాదానికి గురవడంతో వై.యస్. దుర్మరణం పాలయ్యారు.

### రాజకీయ యోధుడు

తెలుగుదేశాన్ని ఓడించేందుకు వైఎస్ 2004లో మిగిలిన అన్ని పార్టీలను ఏకం చేశారు. ఐదేళ్ల తర్వాత అవే పార్టీలు తెలుగుదేశంతో కలిశాయి. అయినా... వైఎస్‌ను ఓడించలేకపోయాయి. 2004లో, 2009లో గెలిచింది కాంగ్రెస్! కానీ... గెలిపించింది వైఎస్!

ఐదేళ్లలో అసమ్మతి అన్నదే లేకుండా చేసి, ఎదురైన అన్ని సమస్యలను తనదైన శైలిలో పరిష్కరించి... 'రాజకీయ చదరంగం'లో తనను మించిన యోధుడు లేడని నిరూపించుకున్నారు. వచ్చే ఐదేళ్లలో అధికారాన్ని సుస్థిరం చేసుకునేందుకు తొలి ఐదేళ్లలోనే ఆయన చర్యలు తీసుకున్నారు. ఉచిత, విద్యుత్తు, జలయజ్ఞం, పెన్షన్లు, పక్కా ఇళ్లు, ఆరోగ్యశ్రీ, 108, పావలావడ్డీ, ఫీజుల రీ ఇంబర్స్‌మెంట్... ఇలా ఒక్కటేమిటి! ప్రతి పథకం ఆయనను జన సామాన్యానికి చేరువ చేసింది. ఇవన్నీ ఆయనకు తిరుగులేని విజయాన్ని సొంతం చేశాయి. అంతలోనే... అనుకోని విధంగా అనంత లోకాలకు వెళ్ళిపోయారు. ఆయన బలం జనం. ఆయన బలహీనత జనం. జన బలంతోనే ఎదిగారు. జనాన్ని కలిసి తీరాలనే బలహీనతతోనే వెళ్లారు.

*- వై. సరోజ*

# ప్రజల సమస్యలు తెలుసు - తీర్చే విధానమూ తెలుసు

**ఆయన జన నేత. వారికేం కావాలో ఆయనకు తెలుసు. ప్రజల సమస్యలు ఆయనకు తెలుసు. వాటిని ఎలా తీర్చాలో కూడా ఆయనకు తెలుసు. అందుకే. . . అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిపైనే దృష్టి సారించారు. ప్రజా సంక్షేమమే శ్వాసగా పరిపాలన సాగించారు. అరకొరగా పథకాలను అమలు చేయడం కాకుండా... సంతృప్తి స్థాయిలో అందరికీ అన్నీ ఇవ్వాలనే సంకల్పంతో ఆయన ముందుకు సాగారు. జనంతో మమేకమయ్యేందుకు... వారి దగ్గరకి వెళుతూనే ఆయన చివరి శ్వాస విడిచారు. ఆయనే వై.యస్. రాజశేఖరరెడ్డి.**

## ఉచిత విద్యుత్ ఫైలుపై తొలి సంతకం

ప్రజల సమస్యలను పూర్తిస్థాయిలో తెలుసుకునేందుకు ఆరేళ్ల కిందట ఆయన 'ప్రజా ప్రస్థానం' పేరిట పాదయాత్ర చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా 1400 కిలోమీటర్లు కాలినడకన తిరిగి ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు. అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే వాటిని నెరవేర్చేందుకు, ప్రజల సంక్షేమానికి ఆయన ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తొలిరోజే ఉచిత విద్యుత్తు, విద్యుత్తు బకాయిల మాఫీపై సంతకం చేశారు. తొమ్మిదేళ్లపాటు కరువుతో అతలాకుతలమైన రైతన్నలకు అభయహస్తం అందించారు. సాగు చేసుకోవడంలో రైతన్నలకు ఏమాత్రం భారం కల్పించకూడదనే ఉద్దేశంతో ఉచిత విద్యుత్తును అందించడమే కాకుండా విద్యుత్తు బకాయిలనూ మాఫీ చేశారు. ప్రధాని వ్యతిరేకించినా. . . అధినేత్రి సోనియా వారించినా ఈ పథకాన్ని ప్రవేశపెట్టి ఏడు గంటలపాటు ఉచిత విద్యుత్తును అందించారు. అంతేనా. . రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత తొమ్మిది గంటల పాటు ఇస్తామంటూ ఎన్నికల ముందు హామీ ఇచ్చి. . . మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత దానిపైనే సంతకం చేశారు కూడా. అప్పటికే వడ్డీ వ్యాపారుల రుణభారంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతన్నలను ఆదుకునేందుకు చట్టాల్లో మార్పులు చేశారు. వడ్డీలపై మారటోరియాన్ని విధించారు.



## రైతన్నల కోసం జలయజ్ఞం

తొమ్మిదేళ్ల కరువు నేర్పిన పాఠాలతోనే ఆయన జలయజ్ఞానికి శ్రీకారం చుట్టారు. సముద్రంలోకి వృథాగా పోతున్న నీళ్లను ఒడిసి పట్టి రిజర్వాయర్లలో నిలిపితే కరువు సమయంలో రైతన్నలను ఆదుకోవచ్చనే ఉద్దేశంతో వేల కోట్ల రూపాయలతో ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టారు. దశలవారీగా దానిని విస్తరించి. . . లక్ష కోట్ల రూపాయల వ్యయంతో 81 ప్రాజెక్టులను నిర్మించి కోటి ఎకరాలకు నీరందించాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టుల నిర్మాణానికి నడుంకట్టారు. పాతికేళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉన్న పథకాల్లోనూ జీవం కల్పించారు. ఇప్పటికే 12 ప్రాజెక్టులు పూర్తి చేశారు. మరెన్నో నిర్మాణంలో ఉన్నాయి కూడా.

## అభాగ్యులకు అండగా . . .

ఇక, ఏ ఆసరా లేని వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఎందరో పాదయాత్ర సందర్భంగా తమ గోడును వైఎస్‌కు వినిపించారు. చాలీచాలని పింఛనుతో అయినవాళ్ల ఆదరణ కోల్పోయి జీవచ్ఛవాలుగా బతుకుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి అభాగ్యులను ఆదుకోవాలన్న ఉద్దేశంతోనే భారీగా పింఛన్లు ఇచ్చారు. పింఛను మొత్తాన్ని రూ. 200కు పెంచారు. వికలాంగుల పింఛను మొత్తాన్ని రూ. 500 చేశారు. నెలనెలా పింఛన్లు ఇచ్చే ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 70 లక్షల మందికి పింఛను పథకాన్ని విస్తరించారు.

## అద్వితీయ పథకం ఆరోగ్యశ్రీ

పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రిగా వై.యస్ ప్రవేశపెట్టిన అద్వితీయ పథకం ఆరోగ్యశ్రీ. చిన్న, పెద్ద వ్యాధులు వచ్చినా చికిత్స చేయించుకోలేని నిరుపేదలు ఎందరికో ఈ పథకం ప్రాణం పోసింది. నిరుపేదలకు కార్పోరేట్ ఆస్పత్రుల్లో చికిత్సకు మార్గం సుగమం చేసింది. తెల్లకార్డు ఉంటే చాలు... ఎటువంటి వ్యాధి వచ్చినా. . . ఎంతటి నిరుపేదలైనా. . చేతిలో పైసా ఉన్నా లేకపోయినా. . రెండు లక్షల రూపాయల వరకూ. . . కార్పోరేట్ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకొనే సదవకాశాన్ని నిరు పేదలకు ఈ పథకం కల్పించింది.

## వైద్య చరిత్రలో సంచలనం '108'

వై.యస్. రాజశేఖరరెడ్డి అనగానే ఇటీవల గుర్తుకొచ్చే పేరు 108. రాష్ట్రవ్యాప్తంగా బహిరంగ సభల్లో ప్రసంగిస్తున్న సమయంలో కూడా 'కుయ్. . కుయ్. .కుయ్. . .' అంటూ మిమిక్రీ చేసి ప్రజల్లో 108 పై విస్తృత

అవగాహన కల్పించారు. 108 ఆవిష్కరణ రాష్ట్ర వైద్య చరిత్రలోనే ఓ సంచల నంగా నిలిచింది. ఆపత్కాలంలో ఆస్పత్రికి చేరాలంటే ఎన్నో కిలోమీటర్లు నడక మార్గంలో ప్రయాణించి. . ప్రైవేటు ఆటోలను పట్టుకుని వెళ్లే దుస్థితి నుంచి 108 తప్పించింది. ఒక్క ఫోన్‌కాల్ చేస్తే చాలు. . . నిమిషాల్లో అంబులెన్స్ బాధితుల చెంతకే చేరడమే కాకుండా. . . ప్రాణాపాయ పరి స్థితుల్లో వారికి అండగా నిలిచింది.

## ఎందరికో వరం. . . పావలా వడ్డీ

రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలకు ఆయన ఇచ్చిన వరం 'పావలా వడ్డీ'. తొలుత స్వయం సహాయక సంఘాల మహిళలకే కల్పించిన ఈ పథకాన్ని అనంతరం రైతులతోపాటు వివిధ వర్గాలకు విస్తరించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు పావలా వడ్డీకే రుణాలను ఇప్పించి. . . వాటితో వివిధ వ్యాపారాలు చేసుకొనేలా వారిని ప్రోత్సహించి. . . తమ కాళ్లపై తాము నిలబడేలా మహిళా సాధికారత దిశగా ముఖ్యమంత్రి వై.యస్. కృషి చేశారు. గత ఐదేళ్లలోనే సుమారు 85 లక్షల మంది మహిళలకు ఏడు వేల కోట్ల రూపాయలను బ్యాంకుల ద్వారా పావలా వడ్డీకే రుణాలు ఇప్పించేందుకు ఆయన కృషి చేశారు. రైతన్నలు సాగు కోసం వడ్డీ వ్యాపారుల నుంచి రుణాలు తెచ్చుకుంటే రెండు నుంచి మూడు రూపాయల వడ్డీ చెల్లించాల్సిన పరిస్థితి. . పావలా వడ్డీకే వారికి రుణాలు కల్పించి వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల నుంచి వారికి విముక్తి కల్పించారు.

## అందరికీ ఇల్లు. . ఇందిరమ్మ

పాదయాత్ర సందర్భంగా లక్షలాది మంది వైఎస్‌కు వినతి పత్రాలను ఇచ్చారు. వాటిలో అత్యధికం తమకు ఇల్లు కావాలనే. తమకు ఓ గూడు కల్పించాలనే. అందుకే 'ఇందిరమ్మ' పథకాన్ని ప్రారంభించారు ముఖ్యమంత్రి వై.యస్ అడిగిన వారందరికీ ఇళ్లు మంజూరు చేయాల్సిందిగా అధికారుల ను ఆదేశించారు. కేవలం రూ.30 వేలకే ఇల్లు కట్టుకునేలా ఈ పథకాన్ని ఆయన తీర్చిదిద్దారు. ఆ తర్వాత దశలవారీగా ఈ మొత్తాన్ని పెంచారు. గ్రామీణ పట్టణ ప్రాంతాలన్న తేడా లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మందికి ఇళ్లను మంజూరు చేశారు. ఇప్పటికే 36 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మరెన్నో లక్షల ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి.

## ప్రతి ఒక్కరికీ 'ఉపాధి హామీ'

ఇక. . వైయస్ పాలనాకాలంలో కలికితురాయిగా మిగిలే మరో కార్యక్రమం ఉపాధి హామీ. వాస్తవానికి ఇది రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన పథకం కాదు. ఇది కేంద్ర ప్రభుత్వం పథకం. కానీ మన రాష్ట్రం సమర్థంగా అమలు చేయడంతో ఈ పథకం దేశానికే తలమానికంగా నిలిచింది. తొమ్మిదేళ్లపాటు కరువుతో అతలాకుతలమై . . .. ఆ తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక అతలాకుతలమైన లక్షలాదిమంది ప్రజలకు ఈ పథకం జీవనోపాధిగా నిలిచింది. పనుల్లేని నిరుపేద కూలీలకు ఏడాదికి 180 రోజులపాటు ఉపాధి కల్పించే ఈ పథకంలో దశలవారీగా మార్పులు చేసుకుంటూ వచ్చారు. రోజుకు కూలీకి తొలుత రూ.80 ఇచ్చేవారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తార్వాత ఈ మొత్తాన్ని రూ. 100కు పెంచారు. దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా చూసేందుకు పోస్టాఫీసుల ద్వారా, బ్యాంకు అకౌంట్ల ద్వారా నేరుగా లబ్ధిదారులకే కూలీ మొత్తం అందేలా చర్యలు తీసుకున్నారు. దేశవ్యాప్తంగా అత్యధిక మొత్తాన్ని వెచ్చించి కూలీలకు ఉపాధి కల్పించారు. సామాజిక తనిఖీ ద్వారా దుర్వినియోగాన్ని గణనీయంగా తగ్గించారు.

## విద్యార్థులకు ఊరట. . ఫీజుల రీ యింబర్స్‌మెంట్

చిన్నతనంలో. . తన గ్రామంలోనే. . . ప్రతిభావంతులైనా డబ్బు లేని కారణంగా ఎంతోమంది చదువుకు దూరమయ్యారన్న విషయాన్ని ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా వై.యస్. రాజశేఖరరెడ్డి గుర్తు పెట్టుకున్నారు. అటువంటి పరిస్థితి రాష్ట్రంలో మరెవరికీ కలగకూడదనే ఉద్దేశంతోనే ఆయన ప్రవేశపెట్టిన పథకం ఫీజుల రీ యింబర్స్‌మెంట్. భారీ ఫీజులను కట్టలేక తమ చిన్నారులను మధ్యలోనే చదువు మాన్పించేస్తున్న ఎంతోమందికి ఈ పథకం ఊరట కల్పించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఇంజనీరింగ్, మెడికల్ విద్య వరకూ చదువుకొనేందుకు ఈ పథకం ద్వారా అవకాశం కల్పించారు. డబ్బు లేదని చదువు నిరాకరించవద్దని విద్యా సంస్థలకు, అధికారులకు స్పష్టం చేశారు. ఫీజుల రీ యింబర్స్‌మెంట్ పథకం విద్యారంగంలో పెను మార్పులకు శ్రీకారం చుట్టింది.

## మహిళలకు ఆసరా

అసంఘటిత రంగంలోని మహిళలకు కూడా. . . వృద్ధాప్యంలో ఆసరాగా నిలిచే పింఛను పథకానికి శ్రీకారం చుట్టిన ఘనత ముఖ్యమంత్రి వై.యస్‌దే. అదే అభయహస్తం పథకం. రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న నిరుపేద మహిళలు నెలనెలా కొంత మొత్తాన్ని పొదుపు చేస్తే. . .ప్రభుత్వం మరికొంత మొత్తాన్ని వేసి 60 ఏళ్లు దాటిన తర్వాత వారికి నెల నెలా పింఛను అందేలా ఏర్పాటు చేయడమే అభయహస్తం లక్ష్యం. ఇటీవల ఎన్నికలకు ముందు ఈ పథకానికి శ్రీకారం చుట్టి, అధికారంలోకి వచ్చిన తర్వాత అమల్లోకి తీసుకొచ్చారు.

## నిరుపేదలకు రూ. 2 కిలో బియ్యం

రెండు రూపాయలకే కిలో బియ్యం అనగానే స్ఫురించే పేరు దివంగత ఎన్టీ రామారావుది. ఆ తర్వాత అదే పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి వై.యస్.దే. బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్న సమయంలో నిరుపేదలకు ఆసరాగా నిలిచేందుకు అధికారంలోకి వచ్చిన తొలి పాలనాకాలంలోనే ఈ పథకాన్ని ఆయన ప్రవేశపెట్టారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిని మరింత విస్తరించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటి వరకూ ఈ పథకం కింద ఒక్కో మనిషికి ఇచ్చే నాలుగు కిలోల బియ్యాన్ని ఆరు కిలోలకు పెంచారు.

## పారిశ్రామిక రంగంపై బలమైన ముద్ర

రాష్ట్ర పారిశ్రామిక రంగంపైనా వై.యస్. బలమైన ముద్ర స్పష్టంగా కానవస్తుంది. ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖరరెడ్డి హయాంలో పారి శ్రామిక రంగానికి ఎంతో ప్రాధాన్యమిచ్చారు. భారీ పరిశ్రమల స్థాపనకు చేయూతనిచ్చారు. అధికారం చేపట్టిన కొద్దిరోజులకే నూతన పారిశ్రామిక విధానం (2005–10) ప్రవేశపెట్టారు. కడపలో బ్రాహ్మిణి ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఫ్యాబ్‌సిటీ తీసుకొచ్చారు. అయిదేళ్ల కాలంలో 60కి పైగా పరిశ్రమల శంకుస్థాపనలు రాష్ట్రంలో జరిగాయి. నెల్లూరు జిల్లాల్లో అపాచి, విశాఖలో బ్రాండిక్స్, రంగారెడ్డి జిల్లాల్లో వజ్రాలు, రత్నాల పరిశ్రమలు ఉత్పత్తులు ప్రారంభించాయి.

102 ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్)లకు అనుమతులు పొంది మన రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ప్రతిష్ఠాత్మకమైన కాకినాడ-విశాఖతీరం పెట్రోలియం పెట్రోకెమికల్స్ పెట్టుబడుల ప్రాంతానికి (పీసీపీఐఆర్) ఆమోదం లభించింది. చిన్న మధ్యతరహా పరిశ్రమలకు పావలా వడ్డీ పథకాన్ని ప్రవేశపెట్టారు. మౌలిక వసతుల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి ఓడరేవులు, విమానాశ్రయాలను దాని పరిధిలోకి తెచ్చారు. కృష్ణపట్నం, గంగవరం ఓడరేవుల నిర్మాణాలు జరిగాయి. దళితులను పారిశ్రామికవేత్తలను చేసే ఉద్దేశంతో ఆయన పూచీకత్తు హామీ పథకాన్ని ప్రకటించారు. రిజర్వ్‌బ్యాంకు అనుమతి లభించక అది అమలు కాలేదు.

అయిదున్నరేళ్ల పదవీ కాలంలో మౌలిక సదుపాయాలు, స్థిరాస్తి, గనులు, సిమెంటు పరిశ్రమ గణనీయ పురోగతి సాధించాయి. పైగా రాష్ట్రానికి చెందిన పలువురు పారిశ్రామికవేత్తలతో ఆయనకు ప్రత్యక్ష సంబంధాలు కూడా ఏర్పడ్డాయి. దీంతో ఆయన ఇక లేరనే వాస్తవాన్ని వారు జీర్ణించుకోలేక పోతున్నారు. వ్యవసాయ రంగానికే తన ప్రాధాన్యం అంటూ మొదటి నుంచీ చెప్పుకొచ్చిన రాజశేఖరరెడ్డి అదే సమయంలో పారిశ్రామిక రంగాన్ని నిర్లక్ష్యం చేయలేదు. పరిశ్రమలను ఆకర్షించేందుకు తన వంతు ప్రయత్నం చేశారు.

## స్థిరాస్తి రంగానికి అండదండలు

రాజశేఖరరెడ్డి తొలిసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించగానే పారిశ్రామిక రంగానికి విద్యుత్తు ఛార్జీలను స్వల్పంగా తగ్గించారు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పెద్దఎత్తున చేపట్టడంతో నిర్మాణ కంపెనీలకు ఇబ్బడిముబ్బడిగా ప్రాజెక్టులు లభించి పెద్దఎత్తున విస్తరించాయి. ఎన్నడూ లేని విధంగా నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టినందున ఇక్కడి కంపెనీలు టర్నోవర్లను గణనీయంగా పెంచుకునే అవకాశం ఏర్పడింది. మరోపక్క ఇందిరమ్మ పథకం కింద బలహీన వర్గాల గృహ నిర్మాణాన్ని ప్రోత్సహించారు. దీనివల్ల ఇక్కడి సిమెంటు కంపెనీలకు అమ్మకాలు అనూహ్యంగా పెరిగాయి.

ఇక హైదరాబాద్ చుట్టూ అవుటర్ రింగ్‌రోడ్డు నిర్మాణం, శంషాబాద్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం, హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రదేశాల్లో ప్రత్యేక ఆర్థిక మండళ్లకు అనుమతులు ఇవ్వడం వంటి నిర్ణయాలతో రాష్ట్రంలో స్థిరాస్తి రంగం శరవేగంగా విస్తరించింది.

రాష్ట్రానికి ఏదో ఒక భారీ పరిశ్రమను ఆకర్షించడం ద్వారా ఉత్పత్తి రంగంలో 'మదర్ ఇండస్ట్రీ' లేదనే కొరతను తీర్చేందుకు ఆయన ప్రయత్నించారు. అందులో భాగంగానే అధికారంలోకి రాగానే హైదరాబాద్ శివార్లలో హార్డ్‌వేర్ పార్కులో సెమ్ ఇండియా సెమీకండక్టర్ ప్రాజెక్టును గట్టి పోటీ మధ్య రాష్ట్రానికి రప్పించారు. కానీ దురదృష్టవశాత్తూ ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చలేదు. తర్వాత ఆటోమొబైల్ పరిశ్రమ కోసం ప్రయత్నించారు. ఈ క్రమంలో వోక్స్‌వ్యాగన్ సంస్థ యూనిట్‌ను సాధించేందుకు ఎన్నో రాయితీలతో ముందుకు వెళ్లారు. అక్కడా సమస్య ఎదురైంది. అయినప్పటికీ, ఏదో ఒక కార్ల కంపెనీ రాష్ట్రంలో ఉండాలనే ఉద్దేశ్యంతో ఇక్కడిదే అయిన లోకేష్ మెషీన్స్ లిమిటెడ్ అనే సంస్థను కార్ల తయారీ యూనిట్ ఏర్పాటు నిమిత్తం ప్రోత్సహించారు. ఓ పక్క ఉత్పత్తి రంగంలో రకరకాల యత్నాలు చేస్తూనే అప్పటికే ఎంతగానో నిలదొక్కుకున్న ఐటీ రంగానికీ సహకారం అందించారు. ఐటీ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఎగుమతులకు సంబంధించి భారీ లక్ష్యాలను నిర్దేశించి వాటి అమలుకు అధికార్లను పురమాయించారు. ఆర్భాటాలకు, హంగులకు తావులేకుండా పలు ఐటీ కంపెనీల శంకుస్థాపనలు, ప్రారంభ కార్యక్రమాలకు హాజరై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి మద్దతు కావాల న్నా ఇస్తామని గట్టి హామీ ఇచ్చి వెళ్లేవారు.

## ఒకసారి చెప్తే, పని పూర్తి

సూటుబూటు, ఖరీదైన కార్పోరేట్ వాతావరణంలో మసిలే పారిశ్రామికవేత్తలకు ఖద్దరు దుస్తుల్లో సామాన్యుడిలా వచ్చి ఓ రెండు మూడు నిమిషాలు మాట్లాడి వెళ్లిపోవడం మొదట్లో అంతగా నచ్చకున్నా.. రానురాను ఆయన వ్యవహారశైలికి ఆకర్షితులయారనే చెప్పొచ్చు. ఎక్కడికి వెళ్లినా పది నిమిషాల్లో కార్యక్రమాన్ని పూర్తి చేసుకొని తాను చెప్పాల్సింది నిక్కచ్చిగా చెప్పి వచ్చేవారు. ఆయన ఒకసారి చెబితే వెనక్కి తగ్గేవారు కాదు. పది రోజుల్లో మీ పని పూర్తవుతుందని అంటే కచ్చితంగా ఆ పని జరిగేది.

## పట్టుదలతో సాధించిన భెల్-ఎన్‌టీపీసీ యూనిట్

భెల్ - ఎన్‌టీపీసీ సంయుక్తంగా నెలకొల్పదలచిన విద్యుత్తు ఉపకరణాల తయారీ యూనిట్‌ను రెండో విడత అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి తీసుకురావడానికి వై.యస్. తీవ్రంగా ప్రయత్నించారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు కోసం ఇతర రాష్ట్రాలు కూడా పోటీపడినా, కేంద్రంలో కొన్ని శక్తులు అడ్డుపుల్లలు వేసే యత్నం చేసినా వెనక్కి తగ్గక దాన్ని సాధించారు. వేల సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, రాష్ట్రానికి విశాఖ స్టీలు ప్లాంటు తర్వాత దాదాపు అంతే ప్రాధాన్యం ఉన్న ప్లాంటు రావడం ఇదేనని చెప్పారు. కానీ దాన్ని చూడకుండానే ఆయన అనంత లోకాలకు వెళ్లిపోయారు. కలల ప్రాజెక్టు కనులారా చూడకముందే వై.యస్. రాజశేఖరరెడ్డి మృతి చెందారు. ఇతర రాష్ట్రాలతో పోటీ పడి మరీ కేంద్రంపై ఒత్తిడి తెచ్చి చిత్తూరు జిల్లా మన్నవరంలో రూ.6 వేల కోట్ల ఎన్టీపీసీ, బీహెచ్ఈఎల్ పరిశ్రమ సాధించడం ఆయన పారిశ్రామిక విజయాల్లో ఒకటి. దీనికి సెప్టెంబర్ నెల 5,6 తేదీల్లో శంకుస్థాపన జరగాల్సి ఉండగా అది అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. ప్రధానితో ఫోన్‌లో మాట్లాడి ఇదే నెల 16,17 తేదీల్లో శంకుస్థాపనకు ఒప్పించారు. తన కలల ప్రాజెక్టుగా ఈ పరిశ్రమ గురించి చెప్పుకొన్న ఆయన దాన్ని చూడకుండానే కన్ను మూశారు.

ఆయన ఆకస్మిక మరణాన్ని రాష్ట్ర పారిశ్రామిక రంగం జీర్ణించుకోలేకపోతోంది.

## చిత్ర పరిశ్రమకు ఊపిరి పోశారు

వై.యస్.రాజశేఖరరెడ్డి 2004లో ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తరువాత- చిత్ర రంగ ప్రముఖులు పరిశ్రమ సమస్యలను ఆయనకు తెలియజెప్పారు. ముఖ్యంగా శ్లాబ్ విధానం మూలంగా నిర్మాతలు, ఎగ్జిబిటర్లు నష్టపోతున్న తీరుపై విజ్ఞాపనలు అందించారు. సినిమా హాళ్లు కళ్యాణ మండపాలుగా, గోదాములుగా మారుతున్న పరిస్థితిని వై.యస్.కి విశదీకరించారు. దీనిపై సాధ్యాసాధ్యాల్ని పరిశీలించి.. శ్లాబ్ విధానాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. టిక్కెట్ పన్ను విధానాన్ని అమలు చేసేందుకు అంగీకరించారు. అంతేకాదు పన్ను విధానంలోనూ మార్పులు తీసుకొచ్చారు.

"శ్లాబ్ విధానాన్ని రద్దు చేయడం అనేది తెలుగు చిత్ర పరిశ్రమకు ఊపిరి పోసిందని" చిత్రసీమ యావత్తు హర్షం వ్యక్తం చేసి వై.యస్.ని ఘనంగా సత్కరించింది. ఆ వేడుకలో ఆయన చాలా నిరాడంబరంగా స్పందించారు. "వేలాది మందికి ఉపాధినిస్తోన్న చిత్ర పరిశ్రమను ఆదుకోవాలనుకోవడం నా గొప్పదనం కాదు. ప్రభుత్వాధినేతగా మా బాధ్యతను నిర్వర్తించామంతే. ఖాయిలాపడే పరిశ్రమలకు ప్రభుత్వం చేయూతనిస్తున్నట్లే దీనికీ చేశాం. తెలుగు సినీ రంగం హైదరాబాద్‌లోనే కాకుండా, విశాఖపట్నంలోనూ అభివృద్ధి చెందాలన్నది నా ఆకాంక్ష" అన్నారు. విశాఖలో చిత్రసీమ అభివృద్ధికి తోడ్పడేవాళ్లకి ప్రోత్సాహకాలిస్తానని కూడా వై.యస్ అప్పట్లో ప్రకటించారు.

## సమస్యల పట్ల తక్షణ స్పందన

ఆ సత్కార వేదికపైనే చిరంజీవి ఓ వరం అడిగారు. "శ్లాబ్ రద్దు చేసి, సినీ పరిశ్రమను బతికించినందుకు రాజశేఖర్‌రెడ్డి గారికి కృతజ్ఞతలు, ఆయన ఎన్నో వరాలిచ్చారు. పెట్టిన అమ్మనే అడగాలనిపిస్తుంది. మరో వరం అడగాలని ఉంది. సినిమా విడుదలైన తొలి వారం రోజులు టిక్కెట్ ధరను నిర్ణయించుకునే హక్కు థియేటర్ యాజమాన్యాలకు ఇస్తే బాగుంటుంది. దీనివల్ల బ్లాక్ మార్కెట్‌కి గండిపడుతుంది. ఆ వరం ఇవ్వండి" అన్నారు చిరంజీవి. ఆ తరువాత ఈ విషయంలోనూ వై.యస్. సినీ పరిశ్రమ అభిప్రాయానికి అనుగుణంగా నడుచుకున్నారు. తొలి రెండు వారాలు టిక్కెట్ ధర పెంచుకొనేందుకు అనుమతిచ్చారు. అయితే ఇది చిన్న చిత్రాల మనుగడకు దెబ్బగా మారిందని తెలిసిన తరుణంలో ఆ విధానం రద్దు చేయమంటే... అందుకు సంసిద్ధత వ్యక్తం చేసి టిక్కెట్ ధరలను తగ్గించారు.

వై.యస్. ముఖ్యమంత్రి అయిన తొలినాళ్లలో మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆయన్ని కలిసి పైరసీ నిర్మూలనకు చట్టం చేయాలని కోరింది. అందుకు అనుగుణంగా ఓ చట్టాన్ని కూడా తీసుకొచ్చారు. అలాగే నాగిరెడ్డి, చక్రపాణిల పేరిట పురస్కారాలు ఏర్పాటు చేసేందుకు అంగీకారం తెలిపారు. రఘుపతి వెంకయ్య పురస్కారం మొత్తాన్ని కూడా పెంచారు.

## చిన్న నిర్మాతల ఇబ్బందుల నివారణ కోసం . . .

గత కొంతకాలంగా చిత్ర పరిశ్రమలో చిన్న నిర్మాతలకు ఎదురవుతున్న ఇబ్బందులు చర్చనీయాంశంగా మారాయి. ఈ విషయమ్మీద నిర్మాతల మండలి ప్రతినిధులు పలు దఫాలుగా వై.యస్.ని కలిశారు. చిన్న చిత్రాలకు పన్నును రద్దు చేసే దిశగా కూడా ఆయన ఆలోచనలు చేశారని నిర్మాతలు చెబుతున్నారు. ఇటీవలే దీనిపై ఓ కమిటీని కూడా నియమించారు. ప్రస్తుతం ఈ విషయాలపైనే చర్చలు సాగుతున్నాయి. ఇంతలోనే ఈ విషాదం జరిగింది.

## అమ్మలకు కొడుకుగా, చెల్లెళ్లకు అన్నలా . . .

ఏ మహిళా ఇబ్బందులకు లోనుకాకూడదని... వారి కష్టాలకు వెంటనే వై.యస్.స్పందించేవారు 'అమ్మా... నీ సమస్యేంటి' అని పెద్ద కొడుకులా పలకరిస్తాడని ... 'నీకేం భయంలేదు... నేనున్నా కదమ్మా' అని ఆడపడుచుల్ని ఊరడిస్తాడని... అన్నా అంటే 'నేనున్నా' అన్నట్టు స్పందిస్తాడని... ఖ్యాతి గడిచిన వైఎస్ మహిళల సంక్షేమం దిశగా అమలు చేసిన పథకాలు చాలానే ఉన్నాయి.

పేద మహిళలకు పెళ్లిచేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన వై.యస్. ఆ కార్యక్రమానికి ఇతోధిక ప్రోత్సాహమిచ్చారు. తితిదే సహాయ సహకారాలతో 'కళ్యాణమస్తు' పేరుతో ఇప్పటి వరకు నాలుగు విడతలుగా జరిగిన కార్యక్రమం అది. దానితో ఇప్పటిదాకా సుమారు ఇరువై ఎనిమిది వేల మంది అమ్మాయిలకు వివాహం జరిగింది. వారి జీవితాల్లో కొత్త వెలుగులు నిండాయి.

## మహిళలను లక్షాధికారులను చేయాలని . . .

ఆంధ్రరాష్ట్రంలోని ప్రతి మహిళని లక్షాధికారిని చేయాలన్నది ఆయన స్వప్నం. ఆ లక్ష్యంతో ఆరంభించిన పథకమే పావలావడ్డీకి రుణాలు. మహిళల్లో చైతన్యం తెచ్చి వారిని స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించడమే దీని ఉద్దేశం. 2004 జులైలో పదకొండు వందల కోట్ల రూపాయల రుణ వితరణ లక్ష్యంతో మొదట దీనికి శ్రీకారం చుట్టారు. అందుకోసం వెచ్చించే మొత్తాన్ని ఏటికేడాది గణనీయంగా పెంచుతూ పోయారు. ఫలితంగా రాష్ట్రంలో 'పొదుపు' అనే నిశ్శబ్ద విప్లవం విస్తరించి 88 లక్షల మంది మహిళల జీవితాల్లో కొత్త వెలుగులు చోటు చేసుకున్నాయి. ఆర్థిక స్వావలంబన సాధ్యపడింది.

ఇంటి ఇల్లాలంటే ఒక్క కుటుంబ బాధ్యతలే కాదు. కుటుంబ శ్రేయస్సు కూడా ఆమె పైనే ఉంటుంది. అది గుర్తించిన వై.యస్. గ్రామీణులకు, ముఖ్యంగా మహిళలకు ఉపకరించేలా వైద్య ప్రణాళికలు సిద్ధం చేశారు. '104' పేరుతో సంచార వైద్య కేంద్రాలను ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మూడు కిలోమీటర్ల పైబడి దూరంగా ఉన్న ప్రతి గ్రామానికి నెలకోసారి ఈ సంచార వైద్య కేంద్రాలు తరలివెళతాయి. వైద్య సేవలందిస్తాయి. బీపీ, మధుమేహం వంటి పరీక్షలు చేయడంతో పాటు, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారు. పౌష్టికాహారం, ఆరోగ్యశ్రీ గురించి వివరించే 'ఆశ' కార్యకర్తల వ్యవస్థను ఆయన బలోపేతం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డెబ్బై వేల మంది కార్యకర్తలకు సెల్‌ఫోన్‌లూ అందించారు. దానికీ ఓ కారణం ఉంది. అత్యవసర పరిస్థితుల్లో వైద్యసాయం అవసరమైన వారికి '108' సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు అది ఉపయోగపడుతుంది.

వృద్ధాప్యంలో ఏ ఆసరా లేక అవస్థలు పడే మహిళలను ఆదుకోవాలని ఎన్నాళ్లుగానో ఆలోచించారు. ఆఖరుకి ఆ దిశగా ఆరంభించిన పథకమే.. అభయహస్తం. అరవై ఏళ్లు పైబడిన మహిళలకు ప్రతి నెలా ఐదు వందల రూపాయలను పింఛన్‌గా ఇవ్వడం దీని ప్రత్యేకత.

తండాల్లోని మహిళల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ప్రత్యేక చర్యలు... పశుక్రాంతి పేరుతో పాడిపరిశ్రమను అభివృద్ధి పరిచే ప్రణాళికలు... మహిళల పొదుపుకి అంతే సమానమొత్తం కలిపి దాన్నుంచి పింఛన్ అందించే పథకం... ఇలా ఏవి తీసుకున్నా మహిళల సంక్షేమానికి, పురోభివృద్ధికి ఆయన కృషి చేసిన తీరు కళ్లకు కడుతుంది. అతివలను అభివృద్ధి పథంలో నడిపించాలన్న తపన ద్యోతకమవుతుంది. మహిళలకు కీలకమైన మంత్రి పదవులు కేటాయించడం, స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి యాభైశాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రతిపాదన ఉన్నత లక్ష్యాల దిశగా ఆయన చేసిన ఆలోచనలే.

*– టి. నర్మద*



# ఆరని దు:ఖం – తీరని సంతాపం

**నిత్యం జనంతో మమేకమయే నేత వై.యస్.రాజశేఖరరెడ్డి ఇక లేరని తెలిసిన క్షణం..... ఒక్కసారి రాష్ట్రం నివ్వెరపోయింది. అది నిజం కాదని లక్షల మంది కోరుకున్నారు. ముక్కోటి దేవుళ్లకు ముడుపులు కట్టి మొక్కుకున్నారు. అయినా అపర భగీరథుడు అమరపురికి చేరాడన్న వార్తతో, దు:ఖం నిండిన హృదయాలతో కోట్లాది ప్రజలు జననేతకు జోహార్లు పలికారు. రాష్ట్రం నల ుమూలలే కాదు, దేశం యావత్తూ అయిన మరణంతో దిగ్భ్రమకు లోనైంది. ఊ రూ వాడా, పల్లె పట్నం, పిల్లలు, యువకులు, మహిళలు, వృద్ధులు, కార్మికులు, కర్షకులన్న తేడా లేదు... లోకమంతా నివ్వెరపోయింది. వై.యస్. లేరన్న నిజం జీర్ణించుకోలేక పలువురి గుండె ఆగిపోయింది. కొందరు ఈ చేదు నిజాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకున్నారు.**

జనం ఉన్న ప్రతి చోటా... ప్రతి దారిలో ఇదే చర్చ. ఎక్కడ చూసినా వైఎస్ చిత్రపటాన్ని ముందు పెట్టుకుని భోరుభోరున విలపిస్తున్న దృశ్యాలే. జనం మదిలో నిత్యం కదలాడే వై.యస్. చిరునవ్వు ఇక ఉండదని తెలిసి కోటానుకోట్ల జనం ఆయనకు నీరాజనాలు పలికారు. ఎంత అన్యాయం చేశావు దేవుడా.... అని గొంతుపగిలేలా ఏడ్చారు. ఎక్కడికక్కడ ప్రజలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఎప్పుడేం జరుగుతుందో తెల ుసుకోవడానికి జనమంతా టీవీల ముందు కూర్చోవడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోయాయి. తమ నేతను కడసారి చూడటానికి రాష్ట్రం నలుమూలల నుంచి వేలవేల సంఖ్యలో జనం హైదరాబాద్ నగరానికి వచ్చారు.

సెప్టెంబర్ 2వ తేదీ ఉదయమే ఆయన హెలికాప్టర్ ప్రమాదంలో చిక్కుకోగా, 3వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు ఆయన మరణ వార్తను అధికారికంగా ధ్రువీకరించారు. కర్నూలు, ప్రకాశం జిల్లాల సరిహద్దులోని వెలుగోడుకు సమీపంలోని రుద్రకోడూరు కొండగుట్టల్లో ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌ను 3వ తేదీ ఉదయం వైమానికదళ విమానం గుర్తించింది. తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో సు–ఖోయ్ విమానం ఇచ్చిన సమాచారంతో రంగలోకి దిగిన హెలికాప్టర్లు సంఘటనా స్థలం దిశగా గాలింపును ముమ్మరం చేశాయి. రాడార్ నుంచి అనుసంధానం కోల్పోయిన 23 గంటల ఉత్కంఠ తర్వాత ఉదయం 8:45 గంటల సమయంలో హెలికాప్టర్ శకలాలను గుర్తించగలిగాయి. ఈ వార్తను వైమానిక దళ కమాండెంట్ సాగరభారతి ధృవీకరించడంతో రాష్ట్రంలో ఒక్కసారిగా ఉద్విగ్న వాతావరణం నెలకొంది.

2వ తేదీ ఉదయం 11 గంటల నుంచి ఆందోళన చెందుతున్న జనం 3వ తేదీ తెల్లవారు జాము నుంచి ఎనిమిది గంటల వరకు క్షణమొకయుగంలా ఊపిరి బిగపట్టి గడిపారు. సంఘటనా స్థలాన్ని గుర్తించిన విమానం నుంచి సరిగ్గా 9:30 గంటల ప్రాంతంలో భూమిపైకి ఒక చిట్టీ పడింది. అందులో రాసి ఉన్న 'క్రాష్ సైట్' పదం అందరినీ విషాదంలో ముంచేంసిది. ఆ కాగితం పడిన విషయాన్ని ప్రసార సాధనాలు ప్రజలకు తెలియజేస్తుండగానే ఢిల్లీలో ఉన్న సోనియా రాజకీయ సలహాదారు అహ్మద్‌పటేల్ రాష్ట్ర ముఖ్యమంత్రి చనిపోయారంటూ ప్రకటించారు. ఈ విషయాన్ని తెలుగు చానెళ్లు ప్రకటించడంతో అప్పటివరకు చివరి ఆశతో ఎదురుచూసిన హృదయాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.

అయినా... ఎక్కడో చిన్ని ఆశ... కేంద్రం ఇంకా ప్రకటించలేదు కదా అని. అప్పటికే జాతీయ, స్థానిక మీడియా పూర్తిగా ధ్రువీకరించింది... ముఖ్యమంత్రి ప్రయాణిస్తున్న హెలికాప్టర్ మంటల్లో కాలిపోయిందని, అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు దుర్మరణం పాలయ్యారని, వారి మృతదేహాలను కూడా విమానాలు గుర్తించాయని చెప్పాయి. ఆ సమయంలోనే ముఖ్యమంత్రి చనిపోయిన విషయాన్ని ఢిల్లీలోని ప్రధాని కార్యాలయ వర్గాలు కూడా ప్రకటించాయి. హోంమంత్రి చిదంబరం అధికారికంగా ఈ విషయాన్ని ప్రకటించారు. ఆ తర్వాత మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో ఆర్థిక మంత్రి రోశయ్య 'సిఎం మరణవార్తను ప్రకటించడం నాకు చాలా బాధాకరంగా ఉంది' అంటూ ప్రకటించారు. ఇంకేముంది... రాష్ట్రం నివ్వెరపోయింది. రాష్ట్ర రాజధాని నుంచి మారుమూల పల్లెల వరకు ఒక్కసారిగా ఘొల్లుమన్నాయి.

వైఎస్ అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలే కాక, అన్ని పార్టీల శ్రేణులు, అన్ని వర్గాల ప్రజలు దు:ఖసాగరంలో మునిగిపోయారు.



## క్రియాశీల నేత

దూరదృష్టి, ధైర్యం, దార్శనికత, దృఢత్వం ఉన్న క్రియాశీల నేత వై.యస్. కఠోరంగా శ్రమించే నాయకుడిని కోల్పోయాం. నిరంతరం సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి, ప్రధానంగా రైతులు, బడుగువర్గాల అభివృద్ధి కోసం ఆయన శ్రమించారు. సమాజంలో ప్రతి వర్గాన్ని పైకి తీసుకుని రావాలని తపించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ వై.యస్. సేవలను ఎప్పటికీ మరచిపోలేరు. అలుపెరగని శ్రమతో ప్రజలకు ఎంతో సేవ చేశారు. ఎన్నికల సమయంలో తన మీద విశ్వాసం ఉంచాలని, పార్టీని ఖచ్చితంగా గెలిపిస్తానని ధీమంగా చెప్పేవారు. ఆయన మృతి ఎంతో వేదన కలిగించింది. నా ఆవేదన చెప్పటానికి మాటలు రావటం లేదు. ఆయన కుటుంబ సభ్యులందరికీ ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాను.

*- యుపిఎ చైర్‌పర్సన్ శ్రీమతి సోనియా గాంధీ*

## నేతలందరికీ స్ఫూర్తి

ప్రజల బాగుకోసం అహరహం పాటుపడి, ఎందరికో ఆదర్శంగా నిలిచిన గొప్ప నేతను కోల్పోయింది. ఆయన సేవలు కలకాలం గుర్తుండి పోవటమేకాదు, రాబోయే కాలంలో పలువురికి స్ఫూర్తి దాయకంగా నిల ఎస్తాయి. వై.యస్. ప్రజల నుంచి పుట్టుకొచ్చిన నేత. వై.యస్. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో, చేపట్టిన ప్రతి పదవిలోనూ తనదైన ప్రత్యేక ముద్ర వేశారు. ఆయన చేపట్టిన పాదయాత్ర చరిత్రాత్మకం. ముఖ్యమంత్రిగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఆయన పడిన తపన, ఆయన పరిపాలనా నైపుణ్యం కలకాలం నిలిచిపోతాయి. ఆయన చేపట్టిన పనులన్నీ పేదలను, సమస్యల్లో ఉన్నవారిని దృష్టిలో ఉంచుకుని చేపట్టినవే.

*- ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్*



## గ్రామీణ పేదల సంక్షేమానికి పరితపించిన నాయకుడు

ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి పట్ల, ప్రత్యేకించి వెనుకబడిన ప్రాంతాల్లోని గ్రామీణ పేదల సంక్షేమం గురించే ఆయన ఎప్పుడూ పరితపించేవారు. అంతేకాదు, మహిళా సాధికారతపై పదే పదే మాట్లాడేవారు. ఇలాంటి డైనమిక్ ముఖ్యమంత్రిని కోల్పోవడం దేశానికి తీరని లోటు.

*- రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభాపాటిల్*

## గొప్ప రాజనీతిజ్ఞుడు, పాలనాదక్షుడు

వై.యస్. మృతి పట్ల కేంద్ర మంత్రివర్గం తీవ్ర సంతాపాన్ని ప్రకటించింది. రాజకీయంగా ప్రజాదరణ పరంగా శిఖరాగ్రానికి చేరుకున్న సమయంలోనే విధి ఆయనను వంచించిందని ఆయన మృతితో దేశం ఓ గొప్ప నాయకుడు, రాజనీతిజ్ఞుడు, పాలనాదక్షుడు, మానవతావాది, పేదల పాలిటి పెన్నిధిని కోల్పోయిందని వ్యాఖ్యానించింది. వై.యస్. మృతి వార్త తెలిసిన వెంటనే ప్రధాని నివాసంలో కేంద్ర మంత్రివర్గం అత్యవసరంగా సమావేశమైంది. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ 2 నిమిషాలు మౌనం పాటించింది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ తీర్మానం చేసింది.



దేశ రాజధాని ఢిల్లీ, మిగతా రాష్ట్రాల రాజధానుల్లో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని అవనతం చేయాలని నిర్ణయించింది. సుమారు అరగంట సేపు సాగిన ఈ సమావేశంలో హోంమంత్రి చిదంబరం ప్రమాదం జరిగిన తీరుతెన్నులను సహచరులకు వివరించారు. మంత్రివర్గ సమావేశం అనంతరం కేంద్ర సమాచార, ప్రసారశాఖల మంత్రి అంబికాసోని విలేఖర్ల సమావేశంలో తీర్మాన ప్రతిని చదివి వినిపించారు. 'వర్తమాన రాజకీయాల్లో వై.యస్. ఓ గొప్ప నాయకుడు. ముందుచూపు, పరిపాలనా దక్షతతో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేశారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల పై ఆసక్తి చూపిన ఆయన మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ద్వారా గాఢమైన స్ఫూర్తి పొందారు. 28 ఏళ్ళ వయసులోనే అసెంబ్లీలో అడుగుపెట్టారు. నాలుగుసార్లు లోక్‌సభ సభ్యుడిగా పని చేశారు.

2003లో చారిత్రాత్మక పాదయాత్ర చేపట్టి ప్రజల కష్టనష్టాలను కళ్లారా చూసి, సామాన్యుడి సంక్షేమం కోసం పనిచేయాలని సంకల్పించుకున్నారు. 2004లో కాంగ్రెస్‌కు అఖండ విజయం చేకూర్చి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మొదటి ప్రయత్నంలోనే జలయజ్ఞం, ఇందిరమ్మ ఇళ్ల వంటి

కార్యక్రమాలు మొదలెట్టారు. స్వయం సహాయక సంఘాలకు జవజీవాలు కల్పించి మహిళా సాధికారతలో ఆంధ్రప్రదేశ్‌ను ముందువరుసలో నిలిపారు. సాగునీటి సౌకర్యం విస్తరించడంతో పాటు, విద్యుత్తు ఉత్పత్తి పైనా దృష్టి సారించారు. ఆయన పరిపాలనకు ఇవే చోదకశక్తిగా నిలిచాయి. ఆరోగ్యశ్రీ, పావలావడ్డీ పథకాలతో ఆకట్టుకున్నారు.

పథకాలలో పేదల ప్రయోజనాలకే పెద్దపీట వేశారు. సంస్కరణలు, సామాజిక న్యాయాన్ని విజయవతంగా మిళితం చేశారు. పథకాలు, కార్యక్రమాలతో వివిధ వర్గాల్లో ఆయన విపరీతమైన అభిమానాన్ని కూడగట్టుకున్నారు. అందువల్లే 2009 ఎన్నికల్లో గెలిచి రెండోసారి అధికార పగ్గాలు చేపట్టారు. ఆయన పాలన ఇతర రాష్ట్రాలకూ మార్గదర్శకంగా నిలిచిందని తీర్మానంలో పేర్కొన్నారు.

## ఆయన లేని లోటు పూడ్చలేనిది

### *సీఎం మృతికి రాష్ట్ర మంత్రివర్గం సంతాపం*

ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆకస్మిక మృతిపట్ల రాష్ట్ర మంత్రివర్గం తీవ్ర సంతాపం ప్రకటించింది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. సెప్టెంబర్ 3 వ తేది సాయంత్రం 4:30 గంటల ప్రాంతంలో తాత్కాలిక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన శ్రీ కొణిజేటి రోశయ్య నేతృత్వంలో మత్రివర్గం సమావేశమైంది. హెలికాప్టర్ ప్రమాదంలో వైఎస్ మృతి చెందడం దిగ్భ్రాంతికి గురి చేసిందని మంత్రివర్గం పేర్కొంది. ఆయన రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించి ప్రగతి పథంలో నడిపించారని కొనియాడింది.

ఈ సందర్భంగా శ్రీ రోశయ్య మాట్లాడుతూ, వై.యస్. వృత్తిరీత్యా వైద్యుడు కావడంతో ప్రజల నాడి తెలుసుకొని, వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేశారని, అనేక ప్రజా సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేశారని ప్రశంసించారు. నిరుపేదల అట్టడుగు వర్గాలు, మహిళలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అయన పాలనలో నూతన అధ్యాయం ప్రారంభమైందన్నారు. వై.యస్. హయాంలో రాష్ట్రం అభివృద్ధి, శాంతి భద్రతల అదుపు వంటి అంశాల్లో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని అన్నారు. నిరంతరం శ్రమించే తత్వం కలిగిన రాజశేఖర్ రెడ్డి ఇకలేరన్న విషయాన్ని నమ్మలేకపోతున్నామని పేర్కొన్నారు. అయన లేనిలోటు ఎవరూ పూడ్చలేనిదని వ్యాఖ్యాంచారు.

హెలికాప్టర్ ప్రమాదంలో సిఎంతో సహా మృతి చెందిన అయన ముఖ్య కార్యదర్శి పి. సుబ్రహ్మణ్యం, ప్రధాన భద్రతా అధికారి ఏసీఎస్ వెస్లీ, పైలెట్లు సునీల్‌కుమార్ భాటియా, ఎం.ఎస్. రెడ్డిలకు కూడా మంత్రివర్గం సంతాపం ప్రకటించింది. సుబ్రహ్మణ్యం ప్రభుత్వం అశించిన రీతిలో పనిచేశారని పేర్కొంది. ప్రధాన భద్రతా అధికారి వెస్లీ నిబద్ధత కలిగిన వ్యక్తిగా పేరు తెచుకున్నారని తెలిపింది.

రాష్ట్రం మంచి అధికారులను కోల్పోయిందని విచారం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రిని క్షేమంగా గమ్యస్థానానికి చేర్చేందుకు పైలెట్లు ఎంతగానో కృషిచేసినా, వారి యత్నం విఫలమైందని, ఆ పైలెట్లు మృతి చెందడం దురదృష్టకరమని వెల్లడించింది. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించింది.

## పూడ్చలేని శూన్యత

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖరరెడ్డి హఠాన్మరణంతో ఏర్పడిన రాజకీయ శూన్యత పూడ్చలేనిదంటూ కాంగ్రెస్ కోర్ కమిటీ ఆయనకు ఘనంగా నివాళులు అర్పించింది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే ఆయన మరణించటం తీరని లోటని పేర్కొంది. 3వ తేదీన ప్రధాని నివాసంలో సమావేశమైన కోర్ కమిటీ వై.యస్.ని దక్షిణ భారతదేశంలోనే ఘనమైన, శక్తివంతమైన నేతగా అభివర్ణించింది.

కేంద్రంలో కాంగ్రెస్ 2004, 2009ల్లో అధికారంలోకి రావటంలో వై.యస్. చేసిన కృషి మరవలేనిదని కొనియాడింది. ప్రధాని మన్మోహన్‌తో పాటు కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, ప్రణబ్ ముఖర్జీ, ఎ.కె. ఆంటోనీ, అహ్మద్ పటేల్, హోంమంత్రి పి. చిదంబరం ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ ప్రమాదం నుంచి వై.యస్. క్షేమంగా తిరిగి వస్తారనే సమాచారం కోసం కోర్ కమిటీ సభ్యులు 40 నిమిషాల సేపు వేచి చూశారు.

ఆంధ్రప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రాల్లో ప్రాంతీయ, ఉపప్రాంతీయ పార్టీల ను ఎదుర్కోటంలో వై.యస్. రక్షణ కవచంలా నిలిచారని కమిటీ అభి ప్రాయపడింది. ఈ శక్తులన్నింటినీ ఆయన అదుపులో పెట్టటమే కాదు, కాంగ్రెస్ పతాకాన్ని దిగ్విజయంగా ఎగిరేలా చేశారని వివరించింది. ఆయన మరణంతో రాష్ట్ర కాంగ్రెస్ పరిస్థితి హఠాత్తుగా చుక్కాని లేని నావగా మారిందని తెలిపింది. కేంద్ర క్యాబినెట్ సమావేశం నిర్వహించి, వై.యస్. అకాల మృతి పట్ల సంతాప తీర్మానం చేయాలని. . వై.యస్. మృతి, రాష్ట్ర రాజకీయాల్లో పడే ప్రభావం గురించి చర్చించటానికి అత్యవసరంగా సీడబ్ల్యూసీ సమావేశం ఏర్పాటుచేయాలని కోర్ కమిటీ నిర్ణయించింది.

## ధైర్యం, దార్శనికత కలిగిన నాయకుడు

వై.యస్. మరణంతో తీవ్ర దిగ్భ్రాంతికి లోనైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించింది. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో వై.యస్ కృషిని కొనియాడుతూ తీర్మానం చేసింది. ఆయన గొప్ప దార్శనికుడని. . . ధైర్యం, చొరవ గల నాయకుడని ప్రశంసించింది. ఆయన అవిరళ కృషి ఫలితంగానే పదేళ్ల అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని పేర్కొంది. అంతేకాదు ఆయన నేతృత్వంలో 2009లోనూ ఘన విజయం సాధించిందని, ఇది తాము కేంద్రంలో అధికారంలోకి రావటానికీ తోడ్పడిందని వివరించింది. వై.యస్. కుటుంబ సభ్యులకు సీడబ్ల్యూసీ సంతాపాన్ని తెలిపింది. సమావేశం సందర్భంగా దుర్ఘటన వివరాలను హోంమంత్రి చిదంబరం సభ్యులకు వివరించారు.

వై.యస్. ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ఆత్మకూరు నుంచి దక్షిణ దిశగా వెళ్లాల్సి ఉంది, కానీ అది తూర్పు వైపు మళ్లిందని ఆయన వివరించారు. ఇదే చివరికి ప్రాణాంతకంగా మారిందని, దీనిపై విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు. మొత్తం 30 నిమిషాల సేపు జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ప్రధాని, సోనియా, రాహుల్‌తో పాటు 20 మంది సభ్యులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో ఉదయం నుంచే విషాద వాతావరణం నెలకొంది.

*– టి.ఎస్.*

# దండారి

**- ఫణికుమార్**

**"ఈ దండారిల దీపావళికి బూసిమెట్టకెల్లి గుసాడీలు వస్తరంట గదా - ఇంక దీపావలి రెండు రోజులే వుంది, ఆల్లకు పెట్టేందుకు యింట్ల గింజల్లేవు - ఏం జెయ్యాలె?" మేటి గూడ గోండు పటేల్ కోటనాక మాన్కు భార్య రాంబాయి భర్త నడిగింది.**

**దసరా నుండి దీపావళి తరవాత కొన్ని రోజుల వరకూ వున్న కాలాన్ని గోండులు దండారి అంటారు. దండారి పండుగల కాలంలో పనులేమీ చెయ్యరు. నాట్యాధి దేవత ఎత్మాసూర్‌పెన్‌కు పూజచేసి పొరుగూళ్ల నుంచీ వచ్చే గుసాడీలకు మర్యాద చేయాలి. ఆ మర్యాదలు కూడా సంప్రదాయికంగా ఎవరింట్లో 'పారా', 'తూర్పలి', 'దస్మా' (మృదంగ విశేషాలు)లు వుంటాయో వారే చేయాలి.**

ప్రతివూళ్లో కొందరు గోండులు దండారి సమయంలో దీక్ష తీసుకుని, గోచి లేక లుంగీ లాంటి బట్టతప్ప మరే ఆచ్ఛాదనా వుంచుకోరు. వళ్లంతా



భస్మం రాసుకుని తలకు నెమలి యీకల కిరీటం పెట్టుకుంటారు. దీక్షా సమయంలో మహానిష్ఠగా వుండటమేగాక, స్నానం చేయటం, కాలకృత్యాదులు తీర్చుకున్న తరువాత దేహాన్ని శుభ్రం చేయడం కూడా చెయ్యరు. వీళ్లని గుసాడీలంటారు. దండారి కాలంలో వీళ్లకు దైవత్వం ఆపాదించబడుతుంది. గుసాడీల తల్లిదండ్రులు కూడా గుసాడీలకు పాదాభివందనం చేస్తారు.

కేరామేరి గ్రామం నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో అడవి మధ్యలో వున్న మేటిగూడ గ్రామంలో నలభై గోండు కుటుంబాలున్నాయి. దిన వెచ్చాలవేృ కొట్టు, కూరగాయలు కూడా మేటిగూడలో లేవు. దేనికైనా కేరామేరి రావల సిందే. ఈ గ్రామ గోండులకు పటేలు (పెద్ద) పాతికేళ్ల వయసున్న కోటనాక మాన్కు - మాన్కు యింట్లో తరతరాలుగా తుర్పులి, పారా, గఫాలున్నాయి. గుసాడీలకైనా, పొరుగూరి నుంచి వచ్చే ఎవరికైనా ఆతిధ్యం పటేలింట్లోనే - కాలగతిలో వున్న భూమి కాస్తా గిరిజనేతరుల పాలైనా యీ మర్యాదల భారం మాత్రం మిగిలిపోయింది. మామూలుగా ధాన్యం పుష్కలంగా వుండవల సిన దండారి కాలంలో దారిద్ర్యం. ఈ ఏడాది గుసాడీలు వస్తున్నారు. దైవ సమానులైన వారి కేం పెట్టాలి!

"ధాన్యం లేకపోతే యాడికన్నా ఎల్లి అడుక్కు రావాలె - గుసాడీలను రావొద్దని సెప్తామా" అన్నాడు మాన్కు భార్యతో!

"ఏపొర్కాడుతావ్? ఉట్నూరుకు పోయి పీవో సాబ్ (పి.ఓ.ప్రాజెక్ట్ ఆఫీసరు ఐటిడిఏ) ను అడగరాదూ - యిస్తడేమో?"

"మంచిగుంది. పీవో సాబ్ మనకు పెన్ సర్కా (దేముడిలాగా) వున్నా, గుసాడీలొస్తే ధాన్యం,

లగ్గమైతే కట్నం యిస్తడా – అడుగుడు మంచి గుంటదా" అని భార్యకు చెప్పాడు కానీ, ధాన్యం ఎక్కణ్ణుంచి తేవాలో మాన్కుకు బోధపడలేదు. ఎవర్నడుగుదామన్నా అందరిళ్లల్లో విషపు దుంపలే వున్నాయి. గంటలు గంటలు వుడికితేగానీ వాటి విషం పోదు. విషంతోపాటు రుచి కూడా పోతుంది. ఆ దుంపలే పండుగ రోజు కూడా గుసాడీలకు పెట్టడమా – దీపావళి యింక మూడు రోజులే వుంది. దండారి కాలంలో వూరికొచ్చిన గుసాడీలకు యింత తిండి పెట్టలేకపోతే గోండు పటేల్ గిరీ ఎందుకు? ఎంత నామోషీ!

కేరామేరీ, వుట్నూరుల మధ్య నుండే జైనూరు పెద్దవూరు. నాలుగైదు దుకాణాలున్నాయి. బియ్యం, జొన్నలు, మొక్కజొన్న ఏ ధాన్యం కావాలంటే ఆ ధాన్యం ఎంత కావాలన్నా – నాలుగైదు బస్తాలైనా సరే దొరుకుతుంది. తనకు నాలుగైదు ధాన్యం ఎరువిచ్చిన మహ్మద్ కుద్దూస్ నడిగి జూస్తే ...

"రాంబాయి, యిదో నేను జైనూరు పోతుండా – ఆదున్నాడు గదా తురక సేటు – ఆణ్ణడిగి జూస్త – యిస్తడేమో" అని తలపాగా చుట్టుకుని చేతిలో ఖాళీ సంచీ, చేతి కర్ర తీసుకుని కాలినడకన జైనూరు బయల్దేరాడు. సుమారు యిరవై మైళ్ళ దూరం. మధ్యలో కేరామేరి పాన్‌తేలా (కిళ్లీకొట్టు) దగ్గర బస్సయితే వుంది గానీ చార్జీలకు డబ్బుల్లేవు. వున్నా ఆ డబ్బుతో చక్కర కొని గుసాడీలకు మిఠాయి చేయొచ్చు.

సాయంకాలానికి జైనూరు చేరేసరికి, సేటు అప్పటికే ఆదిలాబాదు వెళ్లాడని తెలిసింది. ఉదయాన్నే ఫస్టు బస్సు కొస్తాడంట. ఫస్టు బస్సు వచ్చేసరికి ఎనిమిదవుతుంది. మళ్ళీ మేటిగూడ వెళ్లి రావడం అసాధ్యం. ఉసూరుమనుకుంటూ సేటు దుకాణం ముందు వరండాలో తలపాగా విప్పి పరచుకుని పడుకున్నాడు. మార్లవాయి గ్రామం నుంచీ హన్నుమాస్టర్ తాలూకు వాళ్లు బళ్లల్లో రావడం గుసాడీలకు పెట్టడానికి ధాన్యం సరుకులు వేరే దుకాణాల్లో కొనుక్కు పోవడం గమనిస్తూనే వున్నాడు. హన్ను మాస్టర్ కేం వున్నవాడు ఆస్తి అలాగే నిలుపుకొన్నాడు. కష్టాలన్నీ తనలాంటి వారికే.

రాత్రి ఎముకలు కొరికేసే చలి. కప్పుకోడానికి గొంగళి తెచ్చుకునుంటే బావుండేది. పరచిన తలపాగా గుడ్డతీసి, విదిల్చి నేలమీద పడుకుని ఆ గుడ్డ దుప్పటిగా కప్పుకున్నాడు. మగత నిద్ర....

దీపావళి రోజున గుసాడీలు యింటికొచ్చినట్టు, వాళ్ళకు తను భోజనం పెట్టలేకపోయినట్టు, 'గుసాడీలకు యింత కబళం పెట్టలేని నువ్వేం పటేలువని' వాళ్ళు నిలదీసి అడిగినట్టు ఎత్మాసూర్ పేన్ దేవత శపించినట్టు, పెర్సాపేన్(పెద్ద దేముడు), అకిపెన్ (గ్రామ దేవత) తన వూరి నుంచి వెళ్లిపోయినట్టు భయంకరమైన కల.

"కూనీ చేసైనా గుసాడీలకు కిలాయిస్తను – శాపం పెట్టద్దమ్మా" అని గట్టిగా అరచి లేచి కూచున్నడు. నిర్మానుష్యంగా వున్న జైనూరు రోడ్లు, దూరంగా నక్కల అరుపులు తప్ప మరేతోడూ లేరు.

ఉన్న కాస్తా నిద్ర పోయింది.

దుప్పటి చుట్టుకుని గొంతుకూర్చున్నాడు.

రాంబాయి నిద్రపోతుంటుందా – పెళ్లయిన వరకూ కూడా రవికె వేసుకునేది లేదు. ఏదలాపురం (అదిలాబాద్)లో ఆడాళ్లను చూసి తానే నేర్పాడు. వేసుకోవడం ఆరంభించి రెండేళ్లయినా యింకా అలవాటు కాలేదు. ఇప్పటికీ యింట్లో వేసుకోదు. ఎదురొమ్ము మీద చీర కూడా వుండదు. ఈ వూహ రావడంతో మాన్కు వళ్ళు వేడెక్కింది. కాళ్ళు బిగుసుకున్నాయి. కోరికను నొక్కిపడుతూ –

అంతలో తెల్లవారింది.

ఎదురుగా మార్వాడీసేటు హోటల్ తెరచి పొయ్యి మీద పాలు, టీ కాసే హడావిడి మాన్కును వాస్తవ ప్రపంచంలోకి తెచ్చింది. గుబాళిస్తున్న చాయ్ వాసన నోరూరిస్తుంది. పైసల్లేనప్పుడు వచ్చే ఆకలి కంటే నరకం వుండదనుకున్నాడు.

పోచంలొద్ది స్కూలు టీచర్లు చాయ్‌కోసం అంత దూరం నడచి వచ్చి ఒక్కొక్కరూ రెండు మూడు కప్పులు తాగుతున్నారు. ఏదలాపురంలో కొత్త మరాఠీ సినిమా వచ్చిందట. దాని కథ ఒకడు మిగిలిన వాళ్ళకు చెపుతున్నాడు. దీపావళి రోజు ఏదలాపురం పోయి ఆ సినిమా చూద్దామని అందరూ అక్కడికక్కడే నిశ్చయించుకున్నారు.

పైసలు తర్వాత యిస్తానంటే మార్వాడ్ సేట్ ఛాయ్ పోస్తాడా? ఇవ్వనంటే ఎంత అవమానం. ఛ ఆలోచన ఎందుకొచ్చింది. రాజగోండు చాయ్ కోసం ఎందుకు ముష్టెత్తాలి?

బారెడు పొద్దెక్కగానే ఆదిలాబాదు బస్సు విసుగ్గా వచ్చింది. మాన్కుకు కన్నుల పండుగ చేస్తూ కుద్దూస్ సేటు బస్సు దిగాడు – బస్సు దిగి యింట్లోకి వెళ్లబోతుండగా మాన్కు అభివాదం చేశాడు "రామ్ రామ్ సేఠ్ – నిన్నటి సంది యింత జాగ్ చేస్తుండ నీకోసం"

'గట్టనా – ఏంపని – జర్రాగు మొగంగిట్ట కడుక్కొనొస్త – ఇత్మినాన్ గా మాట్లడొచ్చు" అని యింట్లోకి వెళ్లి ముస్తాబయి రెండు గంటల తరువాత చేతిలో సెగలు కక్కుతున్న టీ కప్పుతో దుకాణంలో కొచ్చాడు కుద్దూస్ సేటు.

"ఏం పటేలా – ఏంది కత – జెప్పు – మీ కాడ యిప్పుడు దండారి గదా – తినేటందుకు ఏమైనా దెచ్చినవా" అనడిగాడు సేటు.

"తినేటానికి లేకగదా రేపు పండుగంటే జైనూరు వచ్చింది. ఈ దీపావళికి బూసిమెట్ట గుసాడీలు మావూరు వస్తరంట – నీ కెరికే గదా పారా, తూర్పులి, దస్మా మా యింట్ల వున్నాయి. మస్తు పీడీ (తరాలు)ల కెల్లి అన్నం గిట్ల మాయింట్లోనే – పెట్టక పోతే ఎత్మాసూర్ పెన్ నారాజవుతుంది. నాకు యీసారికి బస్తా జొన్నలు కావాలె సేటూ – మిత్తి (వడ్డీ) ఎంతయితే అంతిస్తా – పండినంక మొత్తం వాపసు జేస్తా' అన్నాడు మాన్కు

"మీ గోండోళ్లకు పనిబడితె యింత మంచిగ వస్తరు లేకపోతే మాట యింటరా – ఈ ఫసలీల పంటల్లేవు గద మనతాలూ కాల. నువుగెట్ల వాపసు చేస్తవయ్యా – ఇది జరిగే పనా?"

"గట్టవద్దు సేటూ – ఇస్తనంటే యిస్త – వున్న జమీను నీకు అమ్మయినా యిస్తా, గోండోడు మాట తప్పింది చూసినవా గెప్పుడైనా"

"పటేలా – నీ జాతి కిలాఫ్ మాట్లాడతాననుకోవద్దు. ఈరోజు నాకు జమీనమ్ముతావు – రేపు పీవోసాబ్ దగ్గర కేసు పెడతావ్ – ఆ పీవో సాబ్ గోండోళ్ళ మాట తప్ప మా మాట ఎవరి మాట యినడు. ఈ తరీకల నువ్వు వాపసు యిచ్చుట జరగని పని – జరిగే పని చెప్తా – యిను. బస్తా జొన్నలు కావాలె గదా – గెట్లనో యిస్తా.

ఏదలాపురాల నా యిల్లుంది జూడు. దాని మిద్దె ఏసుడుకు కట్టె కావాలె.

మీ యింటి ఎనకంతా అడవేగదా – పదిటేకు దూలాలు తోలిచ్చు – నీ లెక్కా నా లెక్కా కతం" తన మనసులో కోరిక బయట పెట్టాడు కుద్దూస్ సేట్ –

చెళ్లుమని చెంపదెబ్బ తిన్నట్టు ఎగిరి పడి "సేటూ నా ముంకిన్ (సాధ్యంకాని) పనులు చెప్పొద్దు. జంగ్లా తోళ్లు (ఫారెస్టు డిపార్ట్‌మెంట్) కేసులు పెడతారు. యిండ్లు పీకుతారు తెలిస్తే. మొన్న పీవో సాబ్ కూడా జంగలేమో కట్టె కొట్టద్దన్నాడు. నేను కొడ్తే మంచిగుంటుందా" అన్నాడు మాన్కు.

"నీ మర్జీ బిడ్డా – పీవో సాబ్ మాటినుు – మంచిదే మళ్లా ఎత్మాసూర్ పెన్ ఏమంటుందో జరసూడు నేనైతే కట్టెలేకుండా జొన్నలివ్వ" – అని యింట్లోకి వెళ్లి పోయాడు కుద్దూస్ సేటు.

ఫారెస్టు వాళ్ల భయమూ, పీవో గారు ఏమనుకుంటారోనన్న సందేహమూ వకవైపు, ఆకలితో వెళ్ళిపోతున్న గుసాడీలు, శాపమిస్తున్న ఏత్మాసూర్ పెన్, తన యిల్లు వదలి వెళ్లిపోతున్న తుర్పులి, పారా, దస్మా మృదంగాలు మరొక వైపు ఘర్షణ పడుతున్నాయి.

ఏత్మాసూర్ పేన్ బృందం గెలిచింది.

ఒక నిశ్చయానికి వచ్చి సేటుని పిలిచాడు. ఎందుకు పిలిచావన్నట్టు చూసిన సేటుతో "సరే సేటూ, జొన్నలియ్యి – యిదో సంచీ" అన్నాడు.

సేటు సంచీ తిరిగి యిస్తూ "నీకు ఫికర్ ఎందుకు పటేలా – నేనిస్తానన్న గద – ముందు కట్టె కొట్టు రాత్రికి కేరామేరి దన్క బండ్లో తీస్కరా – కేరామేరిలో నా ట్రాక్టర్ వుంటుంది. దాన్ల కట్టెలోడేయ్. జొన్నలు కూడా దాంట్లనే వుంటాయి. తీస్కపో – సమజయిందా" అనడిగాడు.

రాజగోండు మాటకూడా నమ్మని రోజులొచ్చాయి గదా అని బాధగా ఖాళీ సంచీ తీసుకుని వడిగా మేడిగూడ వైపు నడక సాగించాడు. ఊరు చేరే సరికి యింకా మూడుగంటల పొద్దుంది. రాంబాయి పెట్టిన దుంపలు పుల్లిపాయలతో నంజుకుని తింటూ విషయమంతా వివరించాడు. సేటు ప్రవర్తనకు రాంబాయి తనలాగే ఆశ్చర్య పోలేదు. సేటు అడిగిందాంట్లో తప్పు కూడా కనిపించలేదామెకు.

"జంగల్ మనది. మనం ఆడే పుట్టి పెరిగినం – నాలుగైదు టేకు చెట్లు కొడితే ఏం తప్పు" అనడిగింది.

మాన్కు విసుగ్గా "నీకు తెలుస్తలేదు – మొన్న పీవో సాబ్ ఏం చెప్పిండు? ఒక టేకు చెట్టు ఎన్నో వేల రూపాయలవుతుందని చెప్పిండు. సేటుకు పది దూలాలు కావాలంట. బస్తా జొన్నలు యిస్తడంట – బస్తా జొన్నలు సౌరుప్యా కంటే తక్కువ ఎరికేనా?" అన్నాడు.

రాంబాయి కోపంగా "ఏందిగట్ల మాట్లాడతావే – టేకు చెట్టు వేల రూపాయిలు పెట్టి నువ్వు కొన్నావా – పీవో సాబ్ కొనిండా?– ఇంటెనక వుండే చెట్టది. గట్లాంటి చెట్లు ఎన్ని లక్షలున్నాయ్ జంగలేల? సేటైతే జొన్నలు పండించదుగద – ఎక్కడో పైసలిచ్చి కొనిండు గదా – నీకు సమజైతలేదా" అంది.

"నీకు నేను చెప్పేది తెలుస్తలేదు – సప్పుడు సేయద్దు" అని కోప్పడి భోజనం ముగించుకుని వూర్లో కెళ్లాడు మాన్కు. పదుగురిని పోగుచేసి అడవిలో కొన్ని గంటల తరువాత సేటుకు యివ్వవలసిన దానికంటే నాలుగైదు చెట్లు ఎక్కువే కొట్టారు. మళ్ళీ అవసరం రావొచ్చు అనుకుంటూ ఎక్కువగా కొట్టిన చెట్లు అక్కడే వుంచి సేటు కివ్వవలసినవి బండ్లలో కెక్కించారు.

"ఇదంతా పచ్చి కట్టె గదా – దీన్ని ఎండబెట్టి మిల్లుకు తోలాలే – మిల్లు జైనూరులో లేదు – ఉట్నూరుకో, జన్నారంలో బోవాలే సేటు యివన్నీ చేస్తంటే జంగ్లాతోళ్ళు పట్టుకోరా" అని వాళ్ళలో ఒకడడిగాడు.

"గవన్నీ మనకెందుకు భాయి" –అంటూ మాన్కు తన బండిని కేరమేరి వైపు నడిపించాడు. ఆ బండి వెనుక యింక మూడు బళ్ళు.

రాత్రి చల్లగా వుంది. పడిన శ్రమంతా మరచి బళ్ళలో నిద్రపోయారు. దారెరిగిన ఎద్లు నమ్మకంగా కేరామేరి వేపు సాగుతున్నాయి. బరువుగా వుండడం మూలంగా రెండుగంటల తరువాత గాని కేరామేరి పొలిమేరలకు చేరలేదు. కేరామేరి అంతదూరంలో వుండగానే ట్రాక్టర్‌లో వచ్చిన సేటు కొడుకు బషీర్, మరి నలుగురు బళ్ళాపి మాన్కును నిద్రలేపారు "ఏం పటేలా నిద్రపోతుండావా – నేను లేపక పోతే పోలీస్ ఠానాలో జగాయించేటోల్లు నిన్ను" అని నవ్వాడు బషీరు.

బళ్ళు ఆపి, ఎడ్లను కట్టేయ్యగానే మాన్కు అతని మిత్రుల చేతే లోడింగ్ చేయించాడు. జైనూరు వెళ్ళి వచ్చి, చెట్లు కొట్టి, లోడింగ్ చేయడంలో మాన్కు అవయవాలేవీ స్వాధీనంలో లేవు. మాన్కుతో వచ్చిన గోండు యువకుల పరిస్థితి దాదాపు అట్లాగే వుంది.

లోడింగ్ పూర్తయింతర్వాత ట్రాక్టర్‌కు అటువైపున్న జొన్నల బస్తా చూపించి బషీరు "గోండాయినా, అది నీకే – అందరికీ రేపు దావత్ చేస్తావంటగదా – నన్ను రమ్మంటావా –నాకైతే ముర్గీ కావాలె" అని పెద్దగా నవ్వాడు.

బషీరు మాటల్లోని ఎగతాళి అర్థం కాలేదు మాన్కుకు. అతనికి కనపడుతోందల్లా జొన్నల బస్తా మాత్రమే. అర్జునునికి చెట్టుమీద పిట్టకన్నులాగ. బషీరుకు నమస్కరించి "మీ పున్నెమా అని గుసాడీలకు రేపు అన్నం పెడుతున్నా సేటూ రామ్ రామ్" అన్నాడు కృతజ్ఞతో.

బస్తాను బండిలో వేసుకుని అర్థరాత్రి దాటిం తర్వాత యిల్లు చేరుకున్నాడు. రాంబాయిని నిద్రలేపి చూపుదామా అనిపించింది ఒక్కక్షణం. అది నిద్రపోతోంది. మళ్లీ కోడి కూసే ముందే లేస్తుంది. పైగా రేపు దీపావళి. గుసాడీలకు అన్నం వండాలె. నిద్రపోనీ.

ఒకసారి కావలించుకని ముద్దుపెట్టుకుంటే ! కేవలం ముద్దు పెట్టుకుని ఆపేస్తాడా తను? అప్పుడైనా నిద్రలేస్తుంది కదా – ఉహూ వద్దు, పడుకోనీ ఇవన్నీ రేపు రాత్రి – విశ్రాంతిగా – హాయిగా – ఇంటి ముందు పందిరి కింద పడుకున్నాడు. పడుకున్నాడో లేదో నిద్రపట్టేసింది. రాంబాయి కుదిపి కుదిపి లేపే వరకూ మెలకువ రాలేదు.

"మావా, లెయ్‌వా – గుసాడీలు వస్తరు – ఇంత జామ్ చెయ్యాలె" అంది రాంబాయి.

రాంబాయి చెయ్యి పట్టుకుని నిమురుతూ "లేస్త గానీ జొన్నలు చూసినవా" అనడిగాడు.

రాంబాయి ముసిముసి నవ్వులు నవ్వుతూ మాన్కు నుదురు నిమురుతూ "చూసినా నువ్ తెస్తవని నాకెరికే" అంది అలా అన్నప్పుడు భర్త ప్రయోజకత్వంలో అచంచల విశ్వాసం కనిపించింది ఆమె మోహంలో.

ఆ క్షణంలో మాన్కు మూడు లోకాలకు అధిపతి – సర్వ శక్తిమంతుడు

సర్వ వ్యాపి – సార్వభౌముడు – పెర్సాపేన్ – పక్క మీంచి లేచి స్నానాది కాలు పూర్తి చేసుకోగానే బూసి మెట్ట గుసాడీలు వస్తున్నారని కబురొచ్చింది. ఊరంతా ఎదురేగి వెళ్లారు. అందరికంటే ముందు కోటనాక మాన్కు పటేల్, ఆయన కుటుంబం – గుసాడీలకు రామ్‌రామ్ చెప్పి పాదాలు కడిగారు. సగౌరవంగా మాన్కుపటేల్ యింటికి తెచ్చి నులక మంచాలపై కూచోపెట్టారు.

సంప్రదాయకంగా గ్రామ పటేలుకు, గుసాడీ అతిథులకు మధ్య జరగ వలసిన కుశల ప్రశ్నాదికాలు పద్ధతిగా జరిపారు.

ముందు మాన్కుపటేల్ కుశలమడిగాడు.

"రామ్‌రామ్, సందీర్ చౌకటే మాన్తిత్ – రామ్ రామ్ అందరూ కులాసాయేనా?"

"మారిమియార్‌చౌకడ్ మాన్తిత్ – అమ్మాయిలూ, అబ్బాయిలూ అందరూ కులాసాయేనా!"

బూసి మెట్ట గుసాడీలు జవాబుగా – "రామ్‌రామ్ సందీర్ చౌకడ్ – రామ్ రామ్ (అందరూ కులాసాయే) మాన్తోమ్ – "

"మారి మియార్ చౌకడ్ మాన్తేర్ (పిల్లందరూ కులాసాయే)"

మళ్ళీ మాన్కు ప్రశ్న: "బాయ్ బాయేలా చౌకడ్ మాన్తిత్"

(మీ అందరి) అమ్మా, నాన్న కులాసాయేనా

బూసి మెట్ట గుసాడీలు జవాబు: "మయోత్ సందీర్ మారి మియార్, బాబల్ బాయే చౌకడ్ మాన్తోయ్"

మేమందరూ – పిల్లలూ, తల్లిదండ్రులూ కులాసాయే –

ఈ లాంఛనాలు గుసాడీలు వెళ్లే ప్రతివూళ్లో జరుగుతాయి. ఇవి పూర్తయిం తర్వాతే గుసాడీల నృత్యం. ఊళ్లో అందరూ, అన్ని వయస్సుల వారూ గుసాడీలకు పాదాభివందనం చేశారు. వారి రాకతో మాన్కు యిల్లు, వూరు పవిత్ర మయ్యాయని, వారు తృప్తిగా భోంచేసి వెళితే వారి ఆశీర్వాద ఫలంగా బాగా వర్షాలు పడి పుష్కలంగా జొన్నలు పండుతాయనీ ఒకరితో ఒకరు చెప్పుకుని సంతోష పడుతున్నారు.

రాంబాయి వంటలో మునిగిపోయింది.

ఊరిమధ్యలో శుభ్రం చేసి ముగ్గులు వేసిన విశాలమైన స్థలానికి గుసాడీల ను తీసుకెళ్లాడు మాన్కు. తన ఇంట్లోంచి తర్పులి, దస్మా, పారా కూడా తెచ్చాడు. ఆ స్థలంలో ఒక చివర చిదుగులు పేర్చి, మంట పేర్చి ఈ తోలు వాద్యాలన్నిటినీ వేడిచేసి శృతి సరిచేసుకున్నారు. ఒక గుసాడీ 'మన గోండోల్లమైతే ఎత్మాసూర్‌పేన్ పూజ చేస్తాం – ఏదలాపురం ఏం జేస్తరో ఎరి కేనా – పటాకాలు కాలుస్తారు – ఢాం ఢాం అంటాయ్' అన్నాడు.

"పటాకాలంటే ఏంది" అనడిగాడు వూళ్లో వృద్ధు ఒకతను.

"పటాకాలంటే లోపట మందుంటది – పైన బత్తి వుంటది – ఎలిగిస్తే ఢాం అంటది – మస్తు పైసలయితది అన్నాడు గుసాడీ –

"పైసల పెట్టే ఢాం ఢాం అని కాల్చుడు ఎందుకు – ఆళ్లకు పైసలె క్కువున్నాయ్యా" అడిగాడు వృద్ధు.!

"ఔ" అన్నాడు గుసాడీ –

ఏదలాపురంలో టపాకాయలు కాల్చే డబ్బులు తగలేసే వారున్నారని తెలిసి మేటి గూడ గోండుల్లో చాలా మంది ఆశ్చర్యపోయారు.

గుసాడీలు తయారయేంతలో మిగతా జనం వెళ్లి భోంచేసి రావచ్చు అని ప్రకటించాడు మాన్కు. అంతలో జీపు శబ్దం వినిపించింది. వెళుతున్న జనం జీపు వస్తున్న చప్పుడు విని ఆగారు. పీవోసాబ్ గాని వస్తున్నాడా అనడిగాడు ఒక గుసాడీ – మాన్కు "పీవో సాబ్ జీపుల ఎందుకొస్తడు? ఆయనకు కారుంది" అన్నాడు. జీపు దగ్గరవగానే పోల్చుకున్నాడు, "ఇది జంగ్లాతోళ్లది–వురకండి" తను పరుగెత్తుతూ

అంతలో జీపు వేగంగా వారి మధ్యకొచ్చి ఆగింది. ఫారెస్టు డిపార్టుమెంట్ ఫ్లయింగ్ స్క్వాడ్ వాళ్లది అది. అందులోంచి ఫారెస్టు ఆఫీసరు దిగి – "అందరూ ఇక్కడే వుండండి – ఎవరూ పారిపోవడానికి ప్రయత్నించకండి – మిమ్మల్ని ఏమీ అనం" అన్నాడు.

గుసాడీలతోసహా అందరూ భయంభయంగా చూస్తున్నారు ఆయనకేసి

"మీలో కోటనాక మాన్కు ఎవరు" అనడిగాడు ఆయన మాన్కు ముందుకొచ్చి "నేనే దొరా" అన్నాడు. అడవిలో ఆ టేకు చెట్లన్నీ కొట్టింది నువ్వేనా

"ఔ దొరా"

"నీతో యింకా ఎవరున్నారు"

"ఎవరూ లేరు దొరా – నేనొక్కణ్ణే"

ఆయనతో వున్న గార్డు "యీడు పెద్ద హీరోసార్. యీణ్ణి పట్టుకు పోతే నాలుగుతంతే అన్నీ తెలుస్తాయి" అన్నాడు.

ఔనన్నట్టు తలూపాడు ఆఫీసరు. తల వూపడం ఆలస్యం మాన్కును జీపెక్కమన్నారు. మాన్కు దీనంగా "దొరా – యీరోజు యిడ్చిపెట్టు, యింట్లో గుసాడీలున్నారు. – రేపు పట్కపో" అని ప్రార్థించాడు.

గార్డు "రేపొస్తే నువ్వు దొరుకుతావురా – పారిపోవూ – ఊ – ఎక్కు" అని గద్దించాడు.

మాన్కు ఎక్కగానే జీపు స్టార్టయింది.

అప్పటికి యీ విషయం తెలిసిన రాంబాయి రొమ్ము బాదుకుంటూ "దొరా – ఆణ్ణి యీరోజు యిడ్సిపెట్టు – ఆణ్ణి యిడ్సిపెట్టకపోతే నన్ను కూడా తీస్కపో" ఏడుస్తూ జీపు వెంట పరుగెత్తింది.

జీపులో గార్డుల మధ్య వున్న మాన్కు వుగ్రుడై పోయాడు. జీపులోంచి తన చేతి కర్రను బలంగా రాంబాయి మీదికి విసిరాడు. అది తగిలి రాంబబాయి కిందపడ్డది.

వేగం పుంజుకుంటున్న జీపులోంచి శివమెత్తినట్టు అరిచేడు మాన్కు "ముండా, నిన్ను తీస్కపోతే గుసాడీలకు అన్నం ఎవరు పెడతారే – నేను తురకసేటు కాళ్మొక్కింది, చెట్లు కొట్టిందీ, జైలుకు పోతుందీ నిన్ను తీస్కపోయేటందుకా – ఫోయే – ఫో – గుసాడీలకు అన్నం పెట్టు"

పూనకం వచ్చిన వాడల్లే వూగిపోతున్న మాన్కును బలవంతంగా కూచోబె ట్టాడు గార్డు.

జీపు వెళ్లిపోతూ లేపిన దుమ్ము భూమ్మీద స్పృహ లేకుండా పడున్న రాంబాయినీ, దూరంగా నుంచుని యిదంతా చూస్తున్న గుసాడీలనూ కప్పేసింది.

**(ఆంధ్రజ్యోతి 1989 దీపావళి సంచిక నుంచి పునర్ముద్రితం)**

# స్థానిక ప్రభుత్వాలు - జనన మరణ రిజిస్ట్రేషన్ల ఆవశ్యకత

**పుట్టిన ప్రతిబిడ్డకు వ్యక్తిగత గుర్తింపు లభింపజేయడం అత్యంత ముఖ్యమైన అంశం, ఇది పిల్లలకు ముఖ్యమైన హక్కు. ఈ హక్కును సార్థకం చేయడంలో స్థానిక సంస్థలు (పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పోరేషన్లు) అత్యంత ప్రముఖ పాత్ర పోషించవలసియుంటుంది. సివిల్ రిజిస్ట్రేషన్ చట్టం ఆవశ్యకతను గూర్చి ప్రజలకు తెలియ చెప్పటం స్థానిక సంస్థల అధికారులు, ప్రజాప్రతినిధులు తమ వంతు కృషి చేయాలి.**

1969 జనన మరణాల నమోదు చట్టం ప్రకారం దేశవ్యాప్తంగా జననాలు, మరణాలు, నిర్జీవ జననాల నమోదు తప్పనిసరి. ఇందుకు సంబంధించిన నిబంధనలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రమంతటికి వర్తింపచేయడం జరిగింది. 2010వ సంవత్సరంనాటికి, నూటికి నూరుశాతం జననమరణాల నమోదును సాధించటం జాతీయలక్ష్యం. ఇందుకు అనుగుణంగా మన రాష్ట్రంలో కూడ జనన మరణాల నమోదు విధానాన్ని మెరుగుపరచుకోవలసిన అవసరం దృష్ట్యా,రాష్ట్ర ప్రభుత్వం కొత్తరూపు సంతరించుకొన్న రిజిస్ట్రేషన్ పద్ధతిని అమలు పరచడానికి అంతకుమునుపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1977 సంవత్సరంలో జారీచేసిన నిబంధనల స్థానే కొత్తగా 1999లో రూపొందించిన జనన మరణ రిజిస్ట్రేషన్ నియమావళిని, తేది: 01-01-2000 సంవత్సరం నుండి ప్రవేశపెట్టడం జరిగింది.

## సివిల్ రిజిస్ట్రేషన్ విధానం

జననం, మరణం, వివాహం మొదలగు ప్రధాన సంఘటనలు జరిగినప్పుడు వాటిని, వాటి స్వభావాలను గురించి నిరంతరం శాశ్వతంగా తప్పనిసరిగా రికార్డు చేయడాన్ని **" సివిల్ రిజిస్ట్రేషను "**అంటారు. జనన నమోదు ప్రతి శిశువుకు తొలిహక్కు, సంబంధిత రిజిస్ట్రారు వద్ద రిజిస్ట్రేషను చేయించడం తల్లిదండ్రుల ప్రాథమిక బాధ్యత. ఈ విషయాలను గూర్చి ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత స్థానిక సంస్థలపై కూడా ఉన్నది. ఎందుకంటే గ్రామపంచాయతీ స్థాయిలో జనన మరణాల నమోదు చేసే అధికారి పంచాయతీ కార్యదర్శి. పంచాయతీ కార్యదర్శి జననమరణ రిజిస్ట్రారుగా వ్యవహరిస్తారు.(1994 ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం నందలి సెక్షన్ 45 నందలి సబ్‌సెక్షన్ X ను అనుసరించి మరియు జి.ఓ.యం.యస్.నెం. 199 పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి (యం.యస్.డి- డిపార్టుమెంటు తేదీ: 18-5-2007) కాబట్టి జనన మరణాల రిజిస్ట్రేషన్ ఆవశ్యకతను గూర్చి ఆయా స్థానిక సంస్థల పరిధిలో నివసించే కుటుంబాలు, హాస్పటల్, సంస్థలు, మొదలగువారికి అవగాహన కల్పించుటలో ముందు వుండాలి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జననమరణ రిజిస్ట్రేషను వ్యవస్థ ఈ క్రింది విధంగా ఉన్నది.

### జనన మరణాలు రిజిస్ట్రేషన్ చేసుకోవటంవలన కలిగే ప్రయోజనాలు వ్యక్తి పరంగా

జనన మరణాలు నమోదు చేయటం వలన జనన, మరణ ధృవపత్రాలు పొందుటకు వీలుకలుగుతుంది. పాఠశాలలో చేరేటప్పుడు, ఉద్యోగంలో చేరేటప్పుడు, ఓటుహక్కు పొందటానికి, డ్రైవింగ్ లైసెన్సు ధరఖాస్తునకు, బీమాపాలసీలు తీసుకోవటానికి, విదేశాలకు వెళ్లేటప్పుడు అవసరమైన పాస్‌పోర్టు పొందడానికి, వీసా, గ్రీన్ కార్డులు, మొదలగునవి పొందటానికి జనన ధృవపత్రాలు తప్పనిసరి.

కొన్ని సమయాల్లో జనన తేదీ నిర్ధారణ కొరకు కూడా సివిల్ రిజిస్ట్రేషన్ అత్యంత అవశ్యకం.

### 2.ప్రభుత్వపరంగా సివిల్ రిజిస్ట్రేషను వల్ల ఈ క్రింది ప్రయోజనాలు కలుగుతున్నాయి.

1. జనన మరణాలు నమోదు చేసుకోవటం వలన ఏ ప్రాంతంలో ఎంత జనాభా పెరుగుతున్నదో తెలుసుకోవచ్చు.
2. తల్లి, బిడ్డల సంరక్షణకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టటానికి వీలుకలుగుతుంది.
3. ప్రభుత్వ ప్రణాళికల రూపకల్పనకు ఉపయోగపడుతుంది.
4. శిశువులు ఎంతమంది జన్మించినది తెలుసుకొన్న తరువాత ప్రభుత్వం ప్రాథమిక అరోగ్య కార్యక్రమాలు చేపట్టటానికి వీలుకలుగుతుంది.
5. స్త్రీ, పురుషుల జనాభా నిష్పత్తిని తెలుసుకోవచ్చు.
6. ప్రైవేటు, కార్పోరేటు సంస్థలు,ప్రభుత్వసంస్థలయందు ఉద్యోగంలో చేరటానికి.

| క్రమ సంఖ్య | రిజిస్ట్రారు పేరు | రిజిస్ట్రారులు బాధ్యతలను నిర్వర్తించే ప్రభుత్వ అధికారులు |
|---|---|---|
| 1. | రాష్ట్ర జననమరణాల చీఫ్ రిజిస్ట్రారు | **ఆరోగ్యశాఖ డైరెక్టరు** |
| 2. | రాష్ట్ర అదనపు చీఫ్ రిజిస్ట్రారు | 1. వైద్య, ఆరోగ్య శాఖ సర్వీసుల అదనపు డైరెక్టరు<br>2. మున్సిపల్ పరిపాలన కమీషనరు, డైరెక్టరు<br>3. డిప్యూటి కమీషనరు ఆఫ్ పంచాయతీరాజ్ |
| 3. | రాష్ట్ర ఉప-ముఖ్య రిజిస్ట్రారు | **వైద్య ఆరోగ్యసర్వీసుల ఉపసంచాలకులు** (గణాంకము) |
| 4. | జిల్లా రిజిస్ట్రారు | **జిల్లా వైద్య ఆరోగ్య అధికారి** |
| 5. | జిల్లా అదనపు రిజిస్ట్రార్లు | 1. జిల్లా రెవిన్యూ అధికారి, 2. జిల్లా పంచాయతీ అధికారి 3. మున్సిపల్ కమీషనరు |
| 6. | మండల రిజిస్ట్రారు | **మండల తహసీల్దారు** |
| 7. | రిజిస్ట్రారు (గ్రామీణ) | **పంచాయతీ కార్యదర్శి** |
| 8. | పట్టణ ప్రాంతంలో కమీషనర్లు | **మున్సిపాలిటీల ఆరోగ్య అధికార్లు / మున్సిపల్ కమిషనర్లు** |

## జనన మరణాలు నమోదు చేసే విధానం

1. అందరు వ్యక్తులు/ సంస్థలు/ కుటుంబ యాజమానులు జనన మరణాలు సంభవించిన రోజునుండి 21 రోజుల లోపు సంబంధిత జనన మరణ రిజిస్ట్రారుకు తెలియజేసి నమోదుచేయించుకోవాలి.

2. జననాలు, మరణాలు, నిర్జీవ జననాల సమాచారం గ్రామ / పట్టణ పరిధిలోని కుటుంబ యాజమానులు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, నర్సు, మిడ్‌వైఫ్ మొదలైనవారు సంబంధిత రిజిస్ట్రారుకు 1,2, 3 ఫారంలు అందజేసి రిజిస్ట్రేషను చేయించుకోవచ్చు.

3. నిరక్షరాస్యులైన కొందరు వ్యక్తులు మాట ద్వారా సమాచారాన్ని రిజిస్ట్రారుకు తెలియజేసినట్లయితే రిజిస్ట్రారుచే స్వయంగా అన్ని వివరాలు పూరించి సమాచారం తెలిపిన వ్యక్తి సంతకాన్ని లేక వేలిముద్రను తీసికొంటారు.

4. జనన మరణాలు ఇంటియందు జరిగిన యెడల ఇంటియజమాని లేదా సమీపబంధువు లేదా కుటుంబంలో పెద్ద వయస్సు కలిగిన వ్యక్తి సంబంధిత రిజిస్ట్రారుకు తెలియజేయవలెను.

5. ఆసుపత్రి, ఆరోగ్య కేంద్రం, నర్సింగ్‌హోం లేదా ఇతర వైద్య సంస్థలు అయినట్లయితే వైద్యాధికారి లేదా వారిచే నియమించబడిన ఇతర అధికారి ద్వారా జనన మరణ రిజిస్ట్రారుకు తెలియజేయవలెను.

6. చౌల్ట్రీ, సత్రం, దర్మశాల, వసతి గృహం, టూరిస్టుహొటల్ లేదా పబ్లిక్ రిసార్ట్సు నందు జనన మరణాలు జరిగినట్లయితే సదరు సంస్థల అధిపతులు విధిగా సంబంధిత పరిధిలోని జనన మరణ రిజిస్ట్రారుకు తెలియజేయవలసి ఉంటుంది.

7. గ్రామ సరిహద్దులోపల పబ్లిక్ స్థలాలలో కనుగొనబడిన పుట్టినబిడ్డ లేదా శవం ఉన్నట్లయితే ఆ గ్రామపెద్ద లేదా గ్రామాధికారి, పంచాయతీ కార్యదర్శి. ఇతర ప్రదేశాలలో అయితే ఆ ప్రాంత పోలీస్ స్టేషను అధికారి సంబంధిత జననమరణ రిజిస్ట్రారుకు సమాచారం ఇవ్వవలసి ఉంటుంది.

8. భూమి పై గాని లేదా గాలియందు లేదా నీటిపైన తిరిగే వాహనాల యందు జనన మరణాలు జరిగినట్లయితే సదరు వాహనాన్ని నడిపేవారు లేదా అధికారి, లేదా యజమాని జననమరణ రిజిస్ట్రారుకు సమాచారం అందించాలి.

## ఆలస్యంగా తెలియజేసే జనన, మరణాలను ఏ విధంగా నమోదు చేయించుకోవాలి

1. సంఘటన జరిగిన 21 రోజులలోపు ఏ విధమైన రుసుం తీసుకోలేకుండా నమోదు చేయించుకోవచ్చు.

2. సంఘటన జరిగిన 30 రోజులలోపు రెండు రూపాయలు ఆలస్యరుసుం చెల్లించి జనన మరణాలను సంబంధిత రిజిస్ట్రారు వద్ద నమోదు చేయించుకోవచ్చు.

3. 30 రోజుల నుండి ఒక సంవత్సరం లోపు జరిగిన జనన మరణాలను **"ఆఫిడవిట్ - పబ్లిక్‌నోటరీ"** ద్వారా లేదా నిర్దేశించిన అధికారి ద్వారా పొంది అయిదు రూపాయలు ఆలస్యరుసుం చెల్లించి సంబంధిత రిజిస్ట్రారు కార్యాలయం వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు.

4. జనన మరణాలు జరిగిన ఒక సంవత్సరం తరువాత మొదటి తరగతి ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ (సబ్ కలెక్టరు/రెవిన్యూ డివిజనలు అధికారి) ఉత్తర్వులతో పది రూపాయలు ఆలస్యరుసుం చెల్లించి రిజిస్ట్రరు చేయించుకోవచ్చు.

5.బిడ్డ పేరు లేకుండా జననాన్ని నమోదు చేసిన సందర్భంలో జననం నమోదుచేసిన 12 నెలలలోపున బిడ్డ పేరును తెలియపరచవలెను. 12 నెలల తరువాత 15 సంవత్సరాలలోపు అయిదు రూపాయల ఆలస్య రుసుంతో బిడ్డ పేరును నమోదు చేయించుకోవచ్చు.

## జనన, మరణ ధృవపత్రాలు పొందే విధానం

1. 1969 జననమరణ రిజిస్ట్రేషను చట్టంనందలి సెక్షను 12 ప్రకారం జనన ధృవపత్రం ఫారం-5 లోను, మరణ ధృవపత్రం ఫారం-6 లోను జననమరణాలు తెలియజేసిన 30 రోజులలోపుల సంబంధిత రిజిస్ట్రారు వద్దనుండి ఉచితంగా పొందవచ్చు.

2. మొదటి సంవత్సరంలో జననమరణాల నమోదు వెదకటానికి రెండురూపాయలు, తరువాత వెదికిన ప్రతి సంవత్సరానికి రెండు రూపాయలు, జనన మరణ ధృవపత్రం జారీచేయయటానికి అయిదు రూపాయలు చెల్లించవలసి ఉంటుంది.

3. ఒకవేళ జననమరణ రిజిస్ట్రారు పరిధిలో జనన, మరణాలు రిజిస్టర్ కానట్లయితే **"లభ్యము కాలేదని"** (NonAvailability) ధృవ పత్రాన్ని రెండురూపాయలు ఫీజు చెల్లించి ధృవపత్రాన్ని ఫారం-10లో తీసుకోవచ్చును

## జనన మరణ రిజిస్ట్రార్లు (పంచాయతీ కార్యదర్శులు / మున్సిపల్ ఆరోగ్యఅధికార్లు/ మున్సిపల్ కమీషనర్లు తీసుకోవలసిన జాగ్రత్తలు

1. జనన మరణ రిజిస్ట్రారు తన కార్యాలయంలో అందరికీ కనబడే విధం ఉంచాలి.

2. జనన మరణ రిజిస్ట్రారు తన కార్యాలయాన్ని తనకు కేటాయించిన స్థానిక ప్రాంతంలోనే నిర్వహించవలసి ఉంటుంది.

3. జనన మరణ రిజిస్ట్రారు తన కార్యాలయం బయట తలుపుదగ్గర గాని లేదా తలుపునకు గాని ప్రజలకు కనబడే విధంగా బోర్డు పెట్టాలి. బోర్డుపై స్థానిక భాషలో రిజిస్ట్రారు పేరు, ప్రాంతం, జననమరణ రిజిస్ట్రారు కార్యాలయం అనే విషయం, హజరయ్యే రోజులు, సమయం, వివరాలు వ్రాయాలి.

4. తమ అధికార పరిధిలోని అన్ని జనన మరణాలను తెలియజేసే విధంగా చర్యలు చేపట్టి, అట్టి జనన మరణాలను స్వయంగా ధృవపరుచుకొని నమోదుచేయాలి.

5. రిజిస్ట్రేషను అవశ్యకత, విధివిధానాల గూర్చి ముఖ్యమైన అంశాలను ప్రజలకు తెలియజేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలి.

6. నమోదు చేసిన వెంటనే, దాని విజ్ఞాపన అందిన తరువాత జనన, మరణ ధృవత్రాలు జారీచేయాలి. ప్రజలకు సకాలంలో సేవలు అందించాలి.

7. రిజిస్ట్రేషన్ ప్రాముఖ్యతను ఆ ప్రాంతంలో ఆయా ప్రాంతాల పరిస్థితులకు అనుగుణంగా ప్రచారం చేయాలి.

8.రిజిస్ట్రేషన్ అవశ్యకత, సందేశాన్ని ప్రచారం చేయటం స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల సహకారం తీసుకోవడం ఎంతో అవసరం.

జనన, మరణం తప్పనిసరిగా రిజిస్ట్రరు చేయించడం తల్లి దండ్రుల చట్టబద్ధమైన బాధ్యత. ఎట్టి పరిస్థితులలోను బిడ్డ జననం నమోదు చేయించడం మరచిపోకూడదు. జననమరణాలు రిజిస్ట్రేషన్ చేయించేటప్పుడు ఎట్టి పరిస్థితులలోను తప్పుడు సమాచారం ఇవ్వకూడదు. తప్పుడు సమాచారం ఇవ్వటం శిక్షర్హమైన నేరం. అటువంటి నమోదును సంబంధిత అధికారి రద్దు చేస్తారు. తప్పుడు సమాచారం ఇచ్చినందుకు ఇచ్చిన వారిని ప్రాసిక్యూట్ కూడా చేయవచ్చు. జనన ధృవ పత్రం బిడ్డకు చట్టపరమైన మొట్టమొదటి గుర్తింపు అనే విషయం మరచిపోకూడదు.

***డా॥పి.వి.శేషారెడ్డి,*** యం.ఎ., యం.ఫిల్,పి.హెచ్‌డి.,
డివిజనల్ పంచాయతీ అధికారి, చిత్తూరు

# బుడిగె జంగాలు

చరిత్రకందనంతవరకు నాటి నుండి నేటి దాకా తమ 'కళ'నే నమ్ముకొని జీవనం సాగిస్తున్న జానపద గాయకులు 'జంగాలు'. తెలుగు సాహిత్యంలో పలు గ్రంథాలలో గల వీరి ప్రస్తావన వారి ప్రాధాన్యతను తెలియజేస్తున్నది. ఇతిహాసపు చీకటి కోణంలో వీరి గత వైభవం మ్రగ్గిపోయినా కాలపరీక్షలను తట్టుకుంటూ తాత తండ్రులందించిన పాటనే పాడుకుంటూ, భిక్షాటనయే వృత్తిగా బతుకును వెళ్ళబుచ్చుతున్న 'జంగాలు' జానపద సాహిత్యబ్రహ్మలు. చితికిపోయిన వీరినెవ్వరిని కదిలించిన హృదయాలను కదలింపజేసే, కరగింపజేసే గేయగాథలు పొంగివస్తాయి.



### కావ్యాల్లో 'జంగములు'

పాల్కురికి సోమన, శ్రీనాధుడు వంటి పూర్వకవులు 'జంగము' అనే పదాన్ని తమ కృతులలో ప్రయోగించారు.

*'నీటుగ విభూతిరేఖలు దీర్చియు నిల్వుటంగేల్డొడిగే వేటురుమలాల్ పేటు*
*పొగాల్వలై వాటు లొనరదాల్చు*
*పోడమిగా చేబూని సితారా భుజమున ధరియించీ*
*గజ్జెలు మువ్వలు అందెలు పదముల ఘల్లని మ్రోయగనూ*
*తరుణత తకయనినాట్యము సల్పుచు తంబుర మీటుచునూ*
*సంగతిగా సభవారికెల్ల ప్రసంగపూర్వకముగా*
*చెంగున దుముకుచు జంగంబులకును జీవనధనమనగా'*

అని 'జంగం కథ' గూర్చి 'ధేనువకొండ' జంగం కథలలో చెప్పబడింది. ఆడిదం సూరకవి తన 'రామలింగేశ్వర శతకం'లో 'జంగంపాలు దేవాంగుల విత్తంబు' అని వర్ణించారు. ఇంత ప్రాధానాన్ని సంతరించుకున్న జానపద గాయకులైన 'జంగాల' చరిత్ర ఇది.

### బుడిగె జంగాలూ - జంగం కథలూ

జంగాలు తెలంగాణా ప్రాంతంలో అంతటా ఉన్నారు. వీరు వాయించే వాద్యం పేరు 'బుడిగె'.. పాట పాడుతున్నప్పుడు బుర్రల వంటి వానిని వాయించుతారు. వాటినే జంగాలు 'బుడిగెలు' అని వ్యవహరిస్తారు. బుడిగెలు వాయించేవారు కాబట్టి కాలక్రమేణా వీరు 'బుడిగె జంగాలు' అయ్యారు. శారదకాండ పాటలో వంతపాడే వారు పట్టుకొని వాయించే బుర్రల కన్నా చిన్నగా ఉండే ఈ 'బుడిగెలు' ఇత్తడి లేక కంచుతో చేయబడతాయి. బెత్తపు చట్రాల్లో బిగించే బుడిగె జంగాలకు ఒకవైపు తోలుతో మూయబడుతుంది. రెండోవైపు కూజా మూతి ఆకారంలో తెరచి ఉంటుంది. వాటిని మెడకు వ్రేలాడదీసుకొని కడుపునకు ముందు భాగాన పొందుపరచి రెండు చేతులతో 'బుడిగెలు' వాయించుతారు.

### జంగాలు - శైవమతం

జంగాలు శైవ మతస్థులు, శివుడు వారి ఆరాధ్య దైవం. ఇతర జానపద గాయకుల జీవనవిధానంతో పోల్చి చూస్తే 'జంగాలు' సంస్కృతీపరంగా కొంత ముందున్నట్టు కన్పిస్తారు. 'రేగడ'ను పోలిన గీతాలను ఆలపిస్తారు. ఇది క్వాచిత్కంగా వీరి 'పాండితి ప్రకర్ష'ను తెలియజేస్తుంది.

## వేషధారణ - కథాగానం

నిలువుటంగీ తొడుక్కొని తలవెనకకు వ్రేలాడేట్టు రుమాలు చుట్టుకొని, నొసలుకు విభూతి రేఖలు దిద్దుకొని తంబూరా అందెలు చేత పట్టుకొని కథాగానానికి ఉపక్రమిస్తాడు కథకుడు. బుడిగెలు ధరించిన ఇరువురు వంతలుగా వీరావేశంతో కథకునితో పాడుతూ సహకరిస్తారు. నల్లగొండ జిల్లా ఆలేరు మండలం శర్బనాపురం గ్రామానికి చెందిన బుడిగె జంగం శ్రీ సిరిగిరి యాదగిరి నీ విషయాలపై తన అభిప్రాయం చెప్తూ, తమ తాత స్వర్గీయ ఇస్తారి కాలం నుండే పురుషుడు కథ చెబుతుంటే స్త్రీ వంత పాట పాడుతూ బుడిగె వాయించే పద్ధతి ఉన్నదన్నారు. ఇప్పుడు దాదాపుగా తమ కులానికి చెందిన వారంతా ఈ సంప్రదాయాన్నే అనుసరిస్తున్నట్టు చెప్పారు. ఎక్కువగా భర్త కథ చెబుతుంటే భార్య వంత పాడడం జరుగుతున్నదన్నారు.

## జంగాలు చెప్పే కథలు

తొలుత 'బుడిగె జంగాలు' శైవకథలు చెప్పేవారు. కాని తరువాత కాలంలో అన్ని రకాల కథలు చెప్పడం ఆరంభించారు. విరాటపర్వం, భళ్ళాణ, సిరియాళ, దేవయాని, వామన విజయం, అంబరీషోపాఖ్యానం వంటి పౌరాణిక కథలతో పాటు కామమ్మ, బాలనాగమ్మ, సుగుణావతి, మైనావతి, చంద్రావతి, నాగరాజు, అరె మరాఠీలు, బరూరి కొండయ్య, ఎరుకల నాంచారి, బాలగాంధారి మొదలైన జానపద కథలను జంగం కథలుగా చెప్తుతారు.

## గేయాలూ - రీతులూ

సరస్వతీ ప్రార్థనతో 'జంగాలు' కథను ప్రారంభిస్తారు.

*"అంబ బ్రోవుమా*
*జంగదాంబ బ్రోవుమా*
*జనని శారద కరుణ బ్రోవుమా*
*భారతి సరస్వతి మందరవేణి*
*ఎల్ల జగముల మాతల్లివేయిల"*
**ఇలా సాగుతుందీ గేయం.**
***"రామ శ్రీ రఘురామ జయరామ"***
**అనే పల్లవితో ప్రారంభమై**
***''ఎక్కడో ఒక పట్నము కలదు***
***యాద***
***ఒక పట్నము కలదు?***
***శామపురి పట్నము కలదు***
***రాజు కాంభోజరాజు - ఓ రామ"***

అంటూ కథ నడుస్తుంది. పక్కవంతగా ఉన్న స్త్రీ "రామ శ్రీరఘురామ జయరామ" అని ప్రతి నాలుగు చరణాల తరువాత పల్లవిని అందుకుంటుంది. కొన్ని కథలతో 'తందాన తాన' అనే పల్లవిగా ఉంటుంది.

'బాలనాగమ్మ' బాలవర్థి రాజుతో

*నిన్ను ఏమి చేతురా*
*నా కొడుకా*
*బాలవద్ది మా రాజా*
*నిన్ను ఇచ్చినా*
*దేవుడొచ్చినా బబతందాన తానబబ*
*ఈ దేవికట్నం*
*ఒక జెప్పెద*
*పందుకోర*
*బాలవద్ది మారాజా*

దీన్ని చాలా కరుణ రసాత్మకంగా ఆలపిస్తారు. దరువులకనుగుణంగా పాటలలో వైవిధ్యం కన్పిస్తుంది. ఆవేశప్రధానంగా 'వీరరసాన్ని' పోషించేప్పుడు ఒక్కో పాదాన్ని రెండు సార్లు పల్లిస్తాడు కథకుడు.

*"అడవిల పెద్దపులిరా (రెండుమార్లు)*
*బళానోయ్ బాయ్ తమ్ముడా"*

వంటి బుర్రకథ పల్లవిని కూడా జంగాలు తమ కథల్లో ఉపయోగిస్తారు.

## కాలపరిణామంలో 'జీవిక' కోసం...

బుడిగె జంగాలు గ్రామగ్రామంలో సంచరిస్తూ కలవారిని ఆశ్రయిస్తూ కథలు చెప్పి కడుపు నింపుకునేవారు. కాని మారిన దేశ, కాల పరిస్థితులు వారిని కృంగదీశాయి. గత వైభవం, ఆదరణ కరువయ్యాయి. జీవిక కోసం ఇంకా 'జంగరి కథ'నే నమ్ముకున్న తాము పిల్లలకు కడుపునిండా 'తిండి' పెట్టలేని స్థితికి చేరుకున్నామని శ్రీ సిరిగిరి యాదగిరి చెప్పారు. ఎలాంటి ఆస్తులు, స్థిరగృహాలు తమ కుటుంబాలకు లేవని ఆయన అన్నారు. దాదాపు సినిమా, దూరదర్శన్‌లు వచ్చాక తమ కథలనాదరించే వారే కరువయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

తాము కుటుంబాలతో తెలంగాణాలో అన్ని జిల్లాలకు భిక్షాటనకు వెళ్ళుతుంటామని ఆయన చెప్పారు. ఇవాళ ఎక్కడా ఎవరూ ఆదరించని పరిస్థితిని ఆయన వివరిస్తూ నలభయ్యేళ్ళు 'నాకథ' నాకు అన్నం పెట్టింది. ఇప్పుడు లేదు."నేనూ నా భార్య తంబూర, బుడిగెలు పక్కకు పెట్టి కూలీ పనికి పొలాలకు పోతున్నాము" అని యాదగిరి తెలిపారు.

నల్లగొండ జిల్లా ఆలేరు మండలంలోని గొలనుకొండ, ఆత్మకూరు మండలంలోని కొరటికల్, వరంగల్లు జిల్లా జనగాం మండలాలలోని కళ్ళెంలతోపాటు రంగారెడ్డి, నిజామాబాద్, మెదక్‌తో పాటు రాయలసీమ, ఆంధ్రలోని కొన్ని జిల్లాలలో తమ కుటుంబాలు ప్రస్తుతం ఉన్నాయని ఆయన చెప్పారు.

## ఆదరణకై ఎదురు చూపు

పూర్వుల నుండి వచ్చిన 'కథ'నే నమ్ముకొని జీవిస్తున్న తమను ప్రభుత్వం ప్రోత్సహించాలని, ఆర్థిక సహకారాన్ని అందించాలని, తమ పిల్లలకు ఉపకార వేతనం అందించాలని, వృద్ధులకు కళాకారుల కిచ్చే ఫించను సౌకర్యం కలిగించాలని 'బుడిగె జంగాలు' కోరుతున్నారు.

ఇప్పటికే 'జంగం కథ' ఈ తరానికి తెలియకుండా పోతున్నది. దాదాపు అంతరించిపోయే దశకు చేరుకుంది. తెలుగుగాథలో సగం వీరగాథలను పాడే గాయకులు జంగాలు. యక్షగాన రీతిలో పద్యాలను, కీర్తనలను కలబోసి తమదైన 'ముద్ర'తో 'జంగం కథ'ను రూపొందించుకున్న ఈ జానపద గాయకుల 'అమూల్య కళ'ను కాపాడుకోవలసిన బాధ్యత మనపై ఉంది.

**- ఎ.ఎమ్.ఫీచర్స్**

# తెల్ల కాగితాల (సాదాబైనామాల) ద్వారా జరిగిన భూమి కొనుగోళ్లు క్రమబద్ధీకరించు కోవాలంటే?



**రెవిన్యూ అధికారుల నుండి రకరకాల రికార్డుల కాపీలు అవసరం లేకుండా పట్టాదారు పాసు పుస్తకం, టైటిల్ డీడు (భూ యాజమాన్యపు హక్కు పత్రం) పట్టాదారు తీసుకొని, భూమి అమ్మకాలు, కొనుగోళ్లు, వివిధ ఋణ సంస్థల నుండి ఋణ సదుపాయాలు పొందడానికి వీలుగా, ఆంధ్ర ప్రదేశ్ భూమి హక్కులు, పట్టాదారు పాసు పుస్తకాల చట్టాన్ని 1971 సంవత్సరంలో తీసుకొనిరావడమైనది.**

ఈ చట్టం ప్రకారం, భూమి హక్కుల రికార్డును క్రొత్తగా తయారు చేయడం, ఎప్పటి కప్పుడు తాజా పరచడం, తప్పులను సరిదిద్దడం, రికార్డును నిర్వహించడం వంటివి జరిగాయి. హక్కుల రికార్డు తయారు చేయబడిన తరువాత యాజమాన్యపు హక్కులున్న రైతులకు పట్టాదారు పాసు పుస్తకం, టైటిల్ డీడు ఇవ్వడం జరిగింది.

హక్కులలో మార్పులు జరిగినప్పుడు వాటిని రికార్డులలో సవరణలు నమోదు చేసిన తరువాత ఆ పాసు పుస్తకాలలో మార్పులు చేస్తారు.

మన రాష్ట్రంలోని చాలా ప్రాంతాలలో, ముఖ్యంగా తెలంగాణా ప్రాంతంలో ఎక్కువ మంది పేదవాళ్లు 30, 40 సంవత్సరాల క్రితం నుండి భూయజమానుల నుండి తెల్లకాగితం మీద (సాదాబైనామా) వ్రాసుకొని భూములు కొనుగోలు చేసిన సందర్భాలు చాలా వున్నవి. అట్లా కొనుగోలు చేసిన భూములు అప్పటినుంచి వారి ఆధీనంలో ఉన్నా కూడా తెల్లకాగితాలపై జరిగిన కొనుగోలు కాబట్టి వారి పేర్న రిజిష్టరు కాలేదు. అందువలన వారి పేర్లు రెవెన్యూ రికార్డులలో పట్టాదారులుగా నమోదు కాలేదు. కావున వారు ఋణ సంస్థల నుండి ఋణ సదుపాయాలు పొందలేకుండా ఉన్నారు.

1989 సంవత్సరంలో పై చట్టానికి చేసిన సవరణ ద్వారా సెక్షను 5-ఎ వలన రిజిష్టరుకాని బదిలీలు క్రమబద్ధీకరించుకొనుటకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.

## అట్టి కొనుగోళ్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ

1. తేది 31-12-2000 కి ముందు తెల్ల కాగితం ద్వారా జరిగిన కొనుగోళ్లు మాత్రమే క్రమబద్ధీకరించుకోవటానికి అవకాశం కల్పించింది.

2. ప్రస్తుతమున్న ప్రభుత్వాదేశాల ప్రకారం తేది 28.02.2009 లోగా తహశీల్దారు గారికి సమర్పించిన దరఖాస్తులు మాత్రమే పరిగణనలోనికి తీసుకుంటారు.

3. కొనుగోలు చేసిన భూమి దరఖాస్తుదారు అనుభవం ఉండాలి.

4. కొనుగోలు దారు సంబంధిత తహశీల్దారుకు ఫారం - 10 నమూనాలో ఈ క్రింద తెలియపరచిన వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి.

ఎ) కొనుగోలు దారు వివరాలు అనగా పేరు, తండ్రి పేరు మొదలగునవి.

బి) బదిలీ చేసిన వ్యక్తి పేరు, తండ్రి పేరు, అతని వృత్తి, నివాస స్థలము, చిరునామా.

సి) కొనుగోలు చేసిన భూమి వివరాలు అనగా గ్రామం, సర్వే నంబరు, సబ్ డివిజను నంబరు, విస్తీర్ణం, పట్టా నెంబరు, మాగాణీ లేక మెట్ట, కొనుగోలు చేసిన విస్తీర్ణం, కొనుగోలు చేసిన తేదీ.

డి) కొనుగోలు చేసిన భూమి, భూసంస్కరణల చట్టం, షెడ్యూల్డు ప్రాంతాలలో బదిలీ నిబంధన చట్టం, అసైన్డ్ భూముల బదలాయింపు నిషేధ చట్టాలలోని నిబంధనలకు వ్యతిరేకం కాదు.

ఇ) దరఖాస్తుతో పాటు కొనుగోలు వ్రాసుకున్న పత్రం జతపరచాలి.

ఎఫ్) కొనుగోలు చేసిన భూమికి సబ్-రిజిస్ట్రారు నిర్ణయించిన స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, ఉత్తర్వులు/సమాచారం అందిన నెలలోగా చెల్లించగలవాడను.

దరఖాస్తు అందిన తరువాత, సంబంధిత తహశీల్దారు తెల్ల కాగితం (సాదాబైనామా) పై భూమిని అమ్మిన వారికి, భూమికి సంబంధించిన ఇతర వ్యక్తులకు నోటీసుల జారీ చట్టంలోని నిబంధనల మేరకు సమగ్ర విచారణ జరిపి, ఆ భూమి కొనుగోలు సరియైనదేనని నిర్ధారణకు వచ్చిన పిమ్మట సంబంధిత సబ్- రిజిష్టారును, ఆ భూమిపై, కొనుగోలు చేసిన తేదీ నాటికి ఉన్న భూమి విలువపై చెల్లించవలసిన స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుం తెలియ జేయవలసినదిగా నోటీసు మూలకంగా కోరుతారు.

పై వివరాలు అందిన పిమ్మట సబ్-రిజిష్టారు తెలియజేసిన స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుం నోటీసు అందిన నెల రోజులలోగా చెల్లించవలసినదిగా భూమి కొనుగోలు చేసిన వారిని కోరుతారు. ఆ సొమ్ము చెల్లించిన మీదట, సంబంధిత తహశీల్దారు భూమి కొనుగోలుదారుకు ఆ భూమి కొనుగోలు ధృవపత్రాన్ని జారీచేసిన తేదీ నుండి సరియైనదేనని ధృవీకరిస్తూ ఒక ధృవపత్రం జారీచేస్తారు.

పై ధృవపత్రం ఆధారంగా చేసుకొని, భూమి హక్కుల రిజిష్టరులో అనగా ఫారం-1, 1-బి రిజిష్టర్లలో భూమి కొనుగోలు చేసిన వ్యక్తిని ధృవపత్రాన్ని జారీ చేసిన తేదీ నుండి భూయజమానిగా నమోదుచేస్తారు. గ్రామ లెక్కలలో కూడ నమోదుచేస్తారు.

పై విధంగా భూమి హక్కుల రిజిష్టరులో నమోదు చేసిన పిమ్మట భూమి కొనుగోలుదారుకు పట్టాదారు పాసు పుస్తకం, టైటిలు డీడు జారీచేస్తారు.

***బి.వెంకటేశ్వరరావు,*** కన్సల్టెంటు, ల్యాండ్ సెల్, అపార్డు

# గ్రామీణ ప్రాంతాలలో 'వరి'కి ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా సక్రమ నీటి యాజమాన్యం

**వర్షాధార వ్యవసాయం మీద ఆధారపడే రైతాంగం ప్రస్తుత వర్షాభావం లాంటి వాతావరణ ప్రతికూల పరిస్థితులు లాంటి ఎన్నో తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారు. మెట్ట పంటలలో సమర్థవంతమైన భూమి, నీటి యాజమాన్యం ద్వారా స్థిరమైన దిగుబడులను, ఆదాయాన్ని పొందవచ్చు. సరియైన నీటి యాజమాన్యం ద్వారా మెట్ట ప్రాంత రైతాంగం ఉత్పత్తి ఖర్చులు తగ్గించుకొనటమే కాకుండా స్థిరమైన పంటల ఉత్పత్తి చేపట్టవచ్చు.**

మెట్ట ప్రాంతాలలో ప్రత్యేకంగా వర్షాభావ పరిస్థితులలో సహజ వనరులలో ఒకటి అయిన "నీరు", నీటి యాజమాన్యం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. దేశంలోని ఎన్నో రాష్ట్ర ప్రజలకు ముఖ్యమైన ఆహార పంట "వరి"ని మన రాష్ట్రంలో వర్షాధార పంటగా కూడా సాగు చేస్తున్నారు. కాని వరి సాగు అధికంగా నీటిని వినియోగించుకోవటం వలన వర్షాధార ప్రాంతాలలో వరి సాగు సమస్యాత్మకంగా మారుతున్నది. ముఖ్యంగా ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు లాంటివి ఎదుర్కొన్నప్పుడు మాత్రమే కాకుండా సాధారంగా భూగర్భ జలాలు, నీటి నిల్వలు అడుగంటి పోవడంతో కూడా వరి సాగు కీలక దశలలో నీటి కొరత ఏర్పడి రైతులు తగినంత దిగుబడులు సాధించలేక నష్టపోతున్నారు.

పైన పేర్కొన్న పరిస్థితులను అధిగమించుటకు ఎక్కువ నీరు వినియోగిస్తున్న వరి లాంటి పంటల సాగు స్థానంలో ప్రత్యామ్నాయంగా తక్కువ నీటిని వినియోగించుకునే పంటలు పండించడం ద్వారా పంట కాలంలో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను / నీటి కొరతను తట్టుకుని, దిగుబడులను సాధించడంతో పాటు స్థిరమైన ఆదాయాన్ని పొందే అవకాశాలు ఉన్నాయి.

మహబూబ్ నగర్, అనంతపూర్ మొదలైన జిల్లాలోని వర్షాభావ ప్రాంతాలలో 'క్రీడా' వారు జరిపిన డి.ఎఫ్.ఐ.డి., యు/సి వారి ప్రాజెక్ట్‌లో క్షేత్ర స్థాయి వ్యవసాయ సాంకేతక పరిజ్ఞాన వినియోగం ద్వారా వెలికి వచ్చిన అంశాలలో ప్రధానమైనది. వరికి ప్రత్యామ్నాయమైన మెట్ట పంటల సాగు ద్వారా, తక్కువ నీటి వినియోగమే కాకుండా, అదే నీటి పరిమాణంలో ఎక్కువ పొలం విస్తీర్ణంలో ఇతర పంటలను సాగుచేస్తూ, అధిక దిగుబడులు పొందవచ్చును.

అంతేకాక పైన పేర్కొన్న పంటలలో అధిక నీటి వినియోగ సామర్థ్యం






అనగా ఒక మి.మీకి నీటి పరిమాణ వినియోగానికి వచ్చే ఆదాయం వరి – వరిలో రూ.5.0 గా ఉంటే, వరి – వేరుశనగలో రూ.7.83 మరియు వరి – మొక్కజొన్నలో రూ.6.64, వరి–శనగలో రూ.6.12గా రాబడి ఉంది.

రబిలో వరిని పండించడానికి తగినంత నీటివసతి లేదని కొంత మంది రైతులు పొలాన్ని బీడుగా వదిలేయటమో లేక, చాలీ చాలనంత నీటి వసతిలో వరిని సాగు చేసి దిగుబడులు లేక నష్టాలను పొందుతున్నారు. అలా కాక ఖరీఫ్‌లో వరిని వేసి, రబిలో వరికి ప్రత్యామ్నాయ పంటలైన వేరుశనగ, శనగ, మొక్కజొన్న, రాగి వంటి పంటలను సాగు చేయటం వలన తక్కువ నీటి వినియోగంతో స్థిరమైన దిగుబడులను, అధిక లాభాలను పొందవచ్చును.

ఉదాహరణకు వరికి ప్రత్యామ్నాయంగా మెట్ట పంటలైన వేరుశనగ, శనగ, రాగి, మొక్కజొన్న, కొన్ని పశుగ్రాస పంటలను తక్కువ నీటి వినియోగంతో వరితో పోలిస్తే ఎంత అధిక విస్తీర్ణంలో సాగు చేయగలిగే వీలు ఉన్నది. ఈ దిగువ పట్టికలో పొందుపరచడమైనది.

**వరి, ఇతర పంటల సాగు విస్తీర్ణం, నీటి వినియోగం**

| పంట | నీటి వినియోగ (మి.మీ) పరిమాణం | వరికి సమానమైన ప్రత్యామ్నాయ పంట విస్తీర్ణం (హెక్టార్లలో) |
|---|---|---|
| వరి | 1200 | – |
| వేరుశనగ | 400 | 3.0 |
| మొక్క జొన్న | 400 | 3.0 |
| శనగ | 250 | 4.8 |
| రాగి | 400 | 3.0 |

పైన పేర్కొన్న పంటలలో వేరుశనగ అధిక ఆదాయం ఇస్తుందని 'క్రీడా' వారి అనుభవంలో తెలిసింది. ఖరీఫ్, రబీ సీజన్‌లలో తగినంత నీటి వసతి ఉన్నప్పుడు వరుసగా వరి – వరి సాగు చేయడం వలన నికర ఆదాయం రూ. 36,000 గా ఉంటే వరి – వేరుశనగ సాగు చేయడం వలన నికరాదాయం రూ.37,560గా ఉంది. అదే రబీలో కొంత విస్తీర్ణానికి మాత్రమే పరిమిత నీటి వసతి ఉన్నప్పుడు వరి – వరి సాగు చేయగా రూ. 24,400 ఉండగా వరి–మొక్కజొన్న, వరి–శనగ మొదలగు పంటల సాగుకి రూ. 31, 854 మరియు రూ. 27,936 గా ఆదాయం వచ్చింది.

**డా॥ నాగశ్రీ, డా॥ సి. రామారావు,**
**డా॥ వి. మారుతి, డా॥ హెచ్. ఉస్మాన్,**
**డా॥ కె.వి. సుబ్రహ్మణ్యం**
శాస్త్ర వేత్తలు,
కేంద్రీయ మెట్ట వ్యవసాయ
పరిశోధన సంస్థ (క్రీడా), హైదరాబాద్

# నవకవనంలో నానారకాలు




***స్వీ**యశైలిగల ప్రముఖ కవుల కవితలననుకరించే ఈ కార్యక్రమంలో నా అభిమాన కవులనే ఎంపిక చేసుకున్నాను. వారి కవితా వైభవాలకు ఇది నేనిచ్చే నివాళి. ఒక వస్తువుని చూపినపుడు ఒక్కోకవి ఒక్కొక్క విధంగా అనుభూతి చెంది, ఒక్కొక్క కోణం నుంచి పరిశీలించి తమ శైలిని అనుసరించి కవితను రచిస్తాడు.*

*నెమలిని జాతీయ విహంగంగా నిర్ణయించిన సందర్భాన కవి సమ్మేళనం జరిగితే వారి వారి కవితలు ఎలా ఉంటాయి అనే ఊహకు రూపకల్పనే ఈ పేరడీ.*

## కృష్ణశాస్త్రీయం




గంధర్వ లోకంలో కవితా విపంచిపై వియోగగీతాలు ఆలాపించే కవి దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రి గారు. అయిదు దశాబ్దాల క్రితం భావ కవికి నిర్వచనంగా నిలిచారు. ఆంగ్లేయుల కాల్పనికవాదం, తెలుగు వారి మెళుకువలు, లలిత లలితమైన పదజాలం శాస్త్రి గారి స్వార్జితాలు. వారి గీతిక ఇలా విన్పిస్తుంది.



*"శిశర శిశర బందు*
*మధుర వేదన రగిలి*
*సోలియున్నది మనసు*
*చూపకే నీ వింత సొగసు*
*ఏలనే నీ కంత అలుసు?*
*కరిమబ్బు మేనితో*
*స్వామి వచ్చే వేళ*
*చివరాకు జొంపాల*
*పురివిప్పి యాడేవు*
*భ్రమసి పోతివో యేమొ*
*అలసి పోదువొ యేమొ?*
*బృందావనమ్మెల్ల*
*నీ మాటె, నీ ఆటె*
*ఏ నాటి పుణ్యామో*
*ఏ నోము ఫలమొ?'*

☆

## కవికుల తిలకుడు




దేవరకొండ బాలగంగాధర తిలక్ గారిది అనుభూతి వాదంలో నిండిన రమణీయశైలి, నిడివైన సమాసాలు, అభివ్యక్తిలో గ్రాంధిక ఛాయలూ, సంస్కృతాంగ్ల శబ్దాల వాడుక - ప్రాచీన కావ్య కవితాశిల్పానికి దగ్గరగా వుండే రీతి, తిలక్ పలుకు :




*"నీ రెక్కల సవ్వడికి సప్తతంత్రుల విపంచి*
*తూరువు ఆకాశం నుండి మహాభి*
*నిష్క్రమణం చేసినపుడు,*
*నీ కనురెప్పల నీలి నీడల్లో*
*ఒక అజంతా వెలవెల బోయినపుడు*
*నీ మేని - దిగంత పరివ్యాప్త అరూప*
*సుప్తసౌందర్యాంబుధి*
*తరంగంతో ఆప్లావితమైనపుడు*
*నీ నడల గని నాగ లోక నర్తకి*
*అందియలు*
*మూగ వోయినపుడు,*
*నేను కాంక్షించాను - నువ్వు జాతీయ*
*విహంగం కావాలని*
*జాతి అంతా పునర్ జాగృతం కావాలని.*

☆

## శ్రీరంగ కవితలు

**ఆ**వేదనకి, ఆవేశానికి శ్రీకారం శ్రీశ్రీ. మాటల పొదుపు, ఉక్తిలో నవ్యత, బిగింపుగల భాష ఈయనకు మహాకవి యోగ్యత పట్టడానికి గల అర్హతలు. "అనితర సాధ్యం నా మార్గం" అని చెప్పుకున్న శ్రీరంగం శ్రీనివాసరావ్ గారి వెంట నాలుగు అడుగులు....



"నట్టడవి లోంచి
నయాదిల్లీకి
మహాప్రస్థానం
మర్చిపోకు నేస్తం
నీ వాణ్ణి నేను
జాతీయ జంతువుని
మనిషిని
అక్బర్ నామా
పీకాక్ త్రోన్
బ్రిటిష్ రాణీ
గతం గత:
పక్షులు
అక్షులు
కుక్కలు
రుక్కులు
అన్నీ వొకటే రష్యాలో
ఇక్కడ మాత్రం వొకటొకటే!



☆


## సినారె బాణి

నవ కవనానికి నాడి
కైతల రాణికి సాంబ్రాణి
నారాయణ రెడ్డి బాణి
పాపం! ఒక్కొక్కసారి
ప్రాసక్రీడలో భావం బలి.


అయన గారి కవిత ఇలా వుంటుంది -

"జాతీయ విహంగం
సౌందర్య తరంగం
కాళిదాస కావ్య మటటటరందం
పురివిప్పిన విపిన మరందం

వనమాలి మౌళిపై
ఎలమావి కొమ్మపై
నర్తించే మయూరి
నందవని వొయారి
.... .... .... .....
.... .... .... ....
జనతా మబ్బుల మాటున
సత్యమనే పురివిప్పి
నువ్ చేసే నృత్యం
కోరలున్న విషనాగుల
కోరాడే కోలాటం"



☆



## నగరంలో కుందుర్తి

స్వాతంత్ర్యానంతర తెలుగు కవితా రంగంలో - అధునాతన భావాలు గల సనాతనుడు కుందుర్తి. నిశితమైన పరిశీలన, విశృంఖలమైన భాష వీరి సొత్తు. ఆధునికుల్లో చాలా మందికి వీరి కవిత ఒరవడి అయింది. కుందుర్తి కృతి :

అంబరాన పోయే బోయింగ్ విమానాన్ని చూసి
మేఘమనే భ్రాంతిలో పురివిప్పింది నెమలి.
యూనిఫారాలతో వెళ్ళే కాన్వెంట్ పిల్లల్ని చూసి
సజాతి జాలం అనుకుని చూపు సారించింది.

ఆకాశవాణి నిలయం ముందు పారేసిన శ్రోతల అభిప్రాయాల
లేఖల్ని విరిపాన్పుగా భ్రమసి ఒకసారి ఒళ్ళు విరుచుకుంది.
శిథిల సౌధాలను, కూలిన ఖిల్లాలను ఆత్రంగా చూసే
గత వైభవ జాడ లేదు. స్మృతులన్నీ విషాద శ్రుతులే.
హైకో ఫాబ్రిక్స్ ముందు అరనిముషం ఆగింది.
లేపాక్షి ఎంపోరియం దగ్గర అదీ లేదు,
కళాభవన్ దగ్గర కాసేపు కూర్చుంది నిట్టూరుస్తూ.

☆

## మోహన ప్రసాదం

ఆధునికుల్లో ఆధునికుడు వేగుంట మోహన్‌ప్రసాద్ గారు. అనుభూతి వాదానికి పరాకాష్ఠ వీరి వచన కవిత. ఒంటరిగా స్వీయశైలీ విన్యాసం చేస్తున్న ఏకాకి కవి. వేగుంట అయితే ఇలా:



వొలికిన విస్కీ సీసాలోంచి
రెండు పెగ్గుల వూదారంగు పరిమళం
మొహమల్ రగ్గు కప్పుకుని
పల్లకీలో వెళ్తోంది మాంసపు ముద్ద.
కీట్స్ కలం బొదిలైర్ బ్రెయిను.
దాలీ కుంచె

*పారిస్ ఆర్టిస్టు పాలెట్ నైపూ*
*అర్ధరాత్రి తినేసింది నెమలి.*
*టెలివిజన్ తెర ఆత్మహత్య చేసుకున్నపుడు*
*మెరీనా అంచున మెరిసే ఇసుకలో*
*తన కళ్ళను వెదుక్కుంటోంది నెమలి.*

## దాశరథీయం

**స**ంస్కృతాంధ్ర కావ్యాల్నీ, గాలిబ్, మీర్, జఫర్, ఇక్బాల్‌లాంటి ఉరుదూ కవులను కలగూరగంపగా జీర్ణం చేసుకొని, చివరకు "బహుచ్ఛత్రధారి" అయి, అభ్యుదయ కవితా రంగంలో మహారథి అయినాడు దాశరథి. 'ముషాయిరా' లో దాశరథి గారి గజల్ ఇలా విన్పిస్తుంది:



*నీవు పురివిప్పి నపుడీ మామూలు నేల*
*సంకీర్ణ చిత్రమై తోచునేల?*

*నీ చక్కని చిక్కని రూపం*
*ఇలకు దిగివచ్చిన ఇంద్రచాపం.*

*స్వామి శిఖిపింఛ మకుటంబకుట!*
*రాధ సిగలోన పూవుగా అందగించె.*

*సొగసు కా మేను యిరుకైన చొప్పుతోచు*
*నెమలి నేత్రాలనుండి జాల్వారుచుండు.*

## శేషేంద్రజాలం

**సి**ంబాలిజాన్ని సంస్కృత పదాలతో రంగరిస్తే శేషేంద్రశర్మ గారి కవితా శైలి ఆవిర్భవిస్తుంది. "పద్యమా లేక ఫ్రెంచి మద్యమా" అన్నాడు రెంటి రుచీ తెలిసిన శ్రీశ్రీ వీరి కావ్య శిల్పాన్ని ప్రశంసిస్తూ - శేషేంద్ర వాణి:




*ఏ కవితాత్మ రాల్చిన అక్షరానివి?*
*ద్రాక్షారస అనులేపంతో*
*విశ్వసౌందర్యాన్ని నీ మేనికి నలుగు*
*పెట్టిందెవరు?*

*హృదయాన్ని చీల్చే తూణీరాలను*
*కప్పుకొని*
*కోటి ఇంద్రధనుస్సులను జీర్ణం*
*చేసుకున్నావ్.*

*నా కనుల వేదికపై నిర్దయగా*
*నువ్ నృత్యం చేసినప్పుడు*

*యూకలిప్టస్ ఛాయల్లో*
*మంచు దారాలతో అల్లిన సెల్లా కొంగు సాచి*
*పిడికెడు సౌందర్యపు భిక్షకోసం*
*స్రవించే క్షణాలను ఆపలేక*
*నిస్సహాయంగా నిల్చున్న రక్తరేఖని....*

## ఆరో రుద్రుడు



**ఆ**రుద్ర గారిని అరుద్రుడని కొందరంటే కాదు ఆరో రుద్రుడని చాలా మంది అన్నారు. వ్యంగ్యం, చక్కని ధ్వని వీరి కవితలకు అలంకారాలు. పేరడీలు, లిమరిక్కులు వీరి కవితల్లో ఎక్కువగా కన్పించే ఋక్కులు. అక్షరశిల్పి ఆరుద్ర కవిత :



*ఒళ్ళంతా కళ్ళైనప్పుడు*
*ఇంద్ర పదవి దక్కదా మరి?*
*దేముడికే శిరోధార్యమైనపుడు*
*మన సంగతి చెప్పాలా మరి*

*చెప్పాలంటే నీ సొంపు*
*అదో టెక్నీ కలర్ లాంపు*

*నీ నెక్ దగ్గరి వొంపు*
*లక్ష విస్కీ సీసాల దిగతుడుపు*
*నీ పేరిట పోస్టల్ స్టాంపు*
*ఇదే నీకు దక్కు మెప్పు."*

## నగ్న కవిత

**అం**బరం నుంచి దిగంబరానికి దిగి వచ్చింది కవిత. దిగంబర కవులు ఆవిర్భవించారు. వీళ్ళవి వచనకవితలు కావు(ట). వీరి కవితల్ని దిక్కులుగా వ్యవహరిస్తారు. సమాజానికి క్రొత్తరక్తం ఇంజెక్టు చెయ్యాలనుకున్న వాళ్ళు, ప్రస్తుతం ప్రాక్టీసు లేని డాక్టర్లు. వీరి నుండి దూసుకు వచ్చే కేకలు:

(వీరిలో మళ్ళీ ఎవరి శైలి వారితే అయినా జనరలైజ్ చేసి ఒక శాంపిల్ మాత్రమే యిస్తున్నా.)

*కళ్ళతోనే వ్యభిచరించే కొజ్జా వాళ్ళ*
*కళ్ళకి నెమలి తప్ప యింకెవరు కనిపిస్తారు?*
*జాతీయత పక్షుల పరం చేసేసి*
*మీరంతా పక్షుల్లా పూరేగండి.*
*చరిత్ర పునరావృతమౌతుంది.*

# 'ఉత్తమ ఆచరణ' లపై వ్యాసాలకు ఆహ్వానం

**పంచాయితీ రాజ్ సంస్థలకు ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులు, పంచాయితీరాజ్ అధికారుల నుంచి ఉత్తమ ఆచరణపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం.**

73వ రాజ్యాంగ సవరణ తరువాత జిల్లా, మండల, గ్రామ స్థాయి పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం పెరిగింది. ప్రజలచేత, ప్రజల కోసం ప్రణాళికలు రూపొందించి వారిచేతే అమలు చేయవలసిన ఆవశ్యకత కూడా పెరిగింది. ఈ నూతన బాధ్యతను నెరవేర్చేందుకు కావలసిన స్థోమత పంచాయితీ రాజ్ ప్రజాప్రతినిధులకు, అధికారులకు 'అపార్డ్' సంస్థ నిరంతరం కల్పిస్తోంది. దీని వలన నాయకులలో చైతన్యం పెరిగి 'ఉత్తమ ఆచరణ' పథకాలను చాలా చోట్ల చేపడుతున్నారు. కాని సరైన ప్రచారం లేక పోవటం వల్ల ఆయా వివరాలు ఆయా ప్రాంతాలకే పరిమితం అవుతున్నాయి. వేరే ప్రాంతాల నాయకులకు స్ఫూర్తిని కలిగించలేక పోతున్నాయి.

'స్థానిక పాలన– గ్రామీణ వికాస మాస పత్రిక' ప్రతి నెల అన్ని గ్రామ పంచాయితీలకు, మండలాలకు, జిల్లా పరిషత్‌లకు ఎన్నుకోబడిన ప్రతినిధులకే కాక సంబంధిత అధికారులకు అందుతున్న విషయం మీకు తెలిసిందే. ఇదే కాక రాష్ట్ర స్థాయిలో అధికారులకు, మంత్రులకు, ప్రభుత్వ సలహాదారులకు, ముఖ్య మంత్రి కార్యాలయాలకు కూడా అందుతోంది. అందువల్ల ఉత్తమ ఆచరణల విస్తృత ప్రచారానికి ఈ మాస పత్రిక ఒక సాధనంగా ఉపయోగపడేందుకు వ్యాసాలు రాయమని కోరుతున్నాం. ఉత్తమ ఆచరణలలో ఈ అంశాలపై సవివరణమైన వ్యాసాలు రాస్తే బాగుంటుందని మా ఆలోచన.


- ★ పరిపాలనా వికేంద్రీకరణ, ప్రజల భాగస్వామ్యం.
- ★ ప్రకృతి వనరుల నిర్వహణ, అటవీ ఉత్పత్తులు, వంట చెరకు, పశుగ్రాసం
- ★ పారిశుద్ధ్యం, మంచినీరు, ఆరోగ్యం.
- ★ మౌలిక సదుపాయాల కల్పన– రోడ్లు, ఇంళ్లు, విద్యుత్తు లాంటివి.
- ★ బలహీన వర్గాల రక్షణ, వారి అభివృద్ధి
- ★ విద్యాభివృద్ధి– ముఖ్యంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మౌలిక సదుపాయాలు, ప్రోత్సాహకాలు
- ★ ఉపాధి కల్పన
- ★ వ్యవసాయం, భూమి అభివృద్ధి నీటి యాజమాన్యం, మార్కెట్లు
- ★ పశు సంపద, మత్స్య సంపద, పక్షి సంపద
- ★ మరేదైనా మంచి కార్యక్రమం

మీ గ్రామ పంచాయితీలో చేపట్టిన ఉత్తమ ఆచరణ గురించి వ్యాసాలు రాయమని మనవి చేస్తున్నాం. నాలుగు పేజీలు మించకుండా అందరికీ అర్థమయ్యే తెలుగులో రాయాలి. చేపట్టిన కార్యక్రమం ప్రతిబింబించే ఒకటి లేక రెండు ఫొటోలు (వెనుక వివరణతో) పంపాలి. ప్రచురించిన ప్రతి పేజీ వ్యాసానికి రూ.500 పారితోషికం (మొత్తం రూ. 2000 మించకుండా) ఇవ్వబడుతుంది.

**– కమీషనర్, 'అపార్డ్'**

*తెల్లవాడు నల్లవాణ్ణి,*
*వున్నవాడు లేని వాణ్ణి*
*దోపిడీ! దోపిడీ! దోపిడీ*

*మీరు పెద్దలకేసే పిండాలను*
*ప్రేతాత్మల తృప్తి కై తినే కాకి,*
*కుళ్ళును, కల్మశాన్ని పాయసంలా*
*తిని ప్రజా సేవచేసే వాయసం*



*కాదు ఎందుకో జాతీయవిహంగం?*
*చీడమూసి పీటలు చేసే*
*పుండాకోర్లు! దగాకోర్లు.*

★


## భావ కవిత్వం

**"అం**త్య ప్రాస చాలు కవిత్వానికి" అని సిన్సియర్‌గా నమ్మి రచనలు చేసి భావుకులు వీధికొకరు వున్నారు. వాళ్ళ రచన కంటే వారు చదివే తీరు ఉత్సాహంగా వుంటుంది.

*'జాతీయ విహంగం*
*జాతికే కురంగం*
*ఆహా ! ఏమి నీ అందం*
*జోహారు అంటోంది నా డెందం*
*నిన్ను గద్దె ఎక్కించే సమయం*
*మధురం మధురం'*

ఇలాగే రబ్బర్‌లా సాగిపోతుంది.

★



# ముఖ్యమంత్రిగా శ్రీ రోశయ్య ప్రమాణం

**రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆర్థికశాఖ మంత్రి శ్రీ కొణిజేటి రోశయ్య ప్రమాణ స్వీకారం చేశారు. సెప్టెంబర్ 3న రాజ్‌భవన్‌లో నిరాడంబరంగా జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఎన్డీ తివారీ ముఖ్యమంత్రిగా రోశయ్యతో ప్రమణ స్వీకారం చేయించారు. సాయంత్రం నాలుగు 34 నిమిషాలకు రాజ్ భవన్‌కు రోశయ్య చేరుకున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రమాకాంతరెడ్డి గవర్నర్ అనుమతిని తీసుకున్నారు.**

**జాతీయ గీతాలాపన అనంతరం గవర్నర్ రోశయ్య తెలుగులో ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు వీరప్పమొయిలీ. పృథ్వీరాజ్ చౌహాన్, పీసీసీ అధ్యక్షుడు డి. శ్రీనివాస్, పీసీసీ మాజీ అధ్యక్షుడు కె.కేశవరావు, పలువురు రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు.**

### భారమైన హృదయంతో బాధ్యతలు: రోశయ్య

బాధాకర పరిస్థితుల్లో విషాదం, బరువెక్కిన హృదయంలో తానీ బాధ్యతలు స్వీకరిస్తున్నానని రోశయ్య పేర్కొన్నారు. సీఎల్పీ నేతగా ఓ సముచితమైన నేతను ఎన్నుకునే వరకు అధిష్టానం నిర్ణయం మేరకు బాధ్యతలు చేపట్టానని వివరించారు. ప్రమాణస్వీకారం అనంతరం రాజ్‌భవన్‌లో ముఖ్యమంత్రి రోశయ్య విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం 'కేర్‌టేకర్' ప్రభుత్వం ఉండదు కాబట్టి ముఖ్యమంత్రిగానే ప్రమాణం చేశానని తెలిపారు. ఈ బాధ్యత తనకు శక్తికి మించినదని పేర్కొన్నారు. ఆయన తలపెట్టిన కార్యక్రమాలను పూర్తి చేయడానికి సహకరించాలని కోరారు.

రాష్ట్ర సంక్షేమం కోసం సోనియా, ప్రధాని మన్మోహన్‌లు అందిస్తున్న తోడ్పాటుతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేసేందుకు మంత్రులు, నాయకులు, మీడియా తనకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రోశయ్య ఆంధ్రప్రదేశ్ 22వ సీఎం. వ్యక్తుల పరంగా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన 16వ వారు.

*– కె.ఎస్.*

**శ్రీ రోశయ్య జీవిత విశేషాలు**

| | | |
|---|---|---|
| పూర్తిపేరు | : | కొణిజేటి రోశయ్య |
| పుట్టిన తేదీ | : | 4.7.1933 |
| జన్మస్థలం | : | వేమూరు, గుంటూరు జిల్లా |
| చదువు | : | బికాం (హిందూ కాలేజీ, గుంటూరు). విద్యార్థి నాయకుడిగా ఎన్నిక. |
| రాజకీయ గురువు | : | స్వాతంత్ర్య సమరయోధుడు ఎన్‌జిరంగా |
| కుటుంబ వివరాలు | : | సతీమణి శివలక్ష్మి, ముగ్గురు కుమారులు, కుమార్తె |
| ఎమ్మెల్సీగా | : | 1968లో తొలిసారిగా ఎన్నిక. 1974, 1980, 2009 |
| ఎమ్మెల్యే | : | 1989, 2004 |
| ఎంపీ | : | 1998 (నరసరావు పేట) |
| మంత్రి పదవి | : | 1978లో తొలిసారి. తర్వాత ప్రతి కాంగ్రెస్ ప్రభుత్వంలో |
| ప్రతిపక్ష నేత | : | 1978లో శాసన మండలిలో |
| పీసీసీ అధ్యక్ష పదవి | : | 1995 నుంచి 1997 వరకూ |

***ముఖ్యమంత్రులు చెన్నారెడ్డి, అంజయ్య, కోట్ల విజయ భాస్కరరెడ్డి, నేదురుమల్లి జనార్దనరెడ్డి, వై.ఎస్ రాజశేఖరరెడ్డి మంత్రివర్గాల్లో సభ్యుడు. ఇప్పటికి మొత్తం 14 సార్లు రాష్ట్ర బడ్జెట్‌ను సమర్పించారు.***



# చదరంగపు రారాణి కోనేరు హంపి

**విజయనగర సామ్రాజ్య రాజధానీ నగరమైన హంపిలోని అద్భుతమైన శిల్పాలను ప్రస్తుతిస్తూ, 1960ల దశకంలోనే ఒక సినీగేయ రచయిత “శిలలపై శిల్పాలు చెక్కినారు, మనవాళ్లు సృష్టికే అందాలు తెచ్చినారు” అని రాశారు.**

నాలుగు దశాబ్దాల తరువాత, తెలుగు ప్రజలు, నిజానికి మొత్తం దేశ ప్రజలు హంపిని కీర్తిస్తూ గానం చేయటం ప్రారంభించారు. అయితే, ఈసారి ఈ కీర్తిగానం వస్తువు మాత్రం శ్రీ కృష్ణదేవరాయల ప్రాచీన రాజధానీ పట్టణమైన హంపి కాదు. అదే పేరున్న ఒక చిన్న బాలిక. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లాకు చెందిన ఈ బాలిక ప్రపంచ చెస్‌లో గ్రాండ్‌మాస్టర్ (పురుషుల విభాగం) అయిన అతిచిన్న వయస్కురాలు.


కృష్ణాజిల్లాలోని గుడివాడ అనే చిన్న పట్టణంలో పుట్టిన ఈ అమ్మాయి జూనియర్ బాలికల విభాగంలో ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ సాధించటమేకాక, ప్రపంచంలోని మేటి మహిళా చెస్ క్రీడాకారిణుల్లో రెండవ స్థానానికి (హంపి ప్రస్తుత స్థానం ఇదే) చేరుకుంది. మొదటి స్థానంలో జుడిట్ పోల్గార్ ఉండగా, తరువాతి స్థానం హంపిదే.



64 గళ్లున్న చదరంగపు బల్లపై ఆమె సాధించిన విజయాల పరంపర అనేక సానుకూల పరిణామాలకు దారి తీసింది. రాష్ట్రంలో పలువురు చెస్ క్రీడాకారులకు హంపి విజయాలు ఉత్తేజాన్ని, ప్రేరణని కలిగించాయి. అనేకమంది చెస్ క్రీడాకారులు తయారవటానికి దోహదం చేశాయి. ద్రోణవల్లి హారిక, పి. హరికృష్ణ ఆ విధంగా ఉత్తుంగ తరంగంలా లేచినవారే. హారిక, హరికృష్ణ కూడా తమ తమ విభాగాల్లో ప్రపంచ ఛాంపియన్‌షిప్ సాధించారు.

ఆ విధంగా రాష్ట్రం చదరంగపు క్రీడలో ముగ్గురు ప్రపంచ ఛాంపియన్‌లకు జన్మనిచ్చినట్లయింది. నమ్మశక్యం కాకపోయినా ఇది నిజం. మన రాష్ట్రం సాధించిన ఈ ఘన విజయం గురించి ఎక్కువమందికి తెలియదు కూడా.

తమిళనాడు రాష్ట్రం చాలాకాలంగా చదరంగపు క్రీడకు పెట్టని కోటలా ఉండేది. కాని ఇప్పుడు కాదు. ఇందుకు కారణం ఇటీవలి సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్‌కి చెందిన చెస్ క్రీడాకారులు ఇతరులను వెనక్కునెట్టి ముందంజ వేయటమే. ప్రఖ్యాతి చెందిన విజయనగర సామ్రాజ్య రాజధానీ నగరమైన









హంపి పేరు తమ కుమార్తెకు పెట్టుకున్న కోనేరు అశోక్, కోనేరు లతలు ఆమెను ఒక ప్రపంచ స్థాయి చెస్ క్రీడాకారిణిగా కూడా తీర్చిదిద్దారు.

1987, మార్చి 31న జన్మించిన హంపి ఆరేళ్ల వయస్సులోనే చెస్ ఆడటం ప్రారంభించింది. అందులో మెళకువలను కూడా తొందరగానే నేర్చుకుంది. పువ్వు పుట్టగానే పరిమళించిన విధంగా ఆమె ఆట ముందంజ వేసింది. ఉంగరాల జుట్టుతో ముచ్చటగా ఉండే హంపి ఏడేళ్ల చిరుప్రాయంలోనే విజయవాడలో మొదటి టైటిల్ గెలుచుకుంది. అది తరువాత సాధించిన అనేక సంచలనాత్మక విజయాలకు ఆరంభం మాత్రమే. తన కుమార్తెలో ఉన్న అసమాన ప్రతిభా పాటవాలను గమనించిన కోనేరు అశోక్ తన లెక్చరర్ ఉద్యోగానికి రాజీనామా చేసి, తన మొత్తం సమయాన్ని కూతురికి శిక్షణ ఇవ్వటంలోనే గడిపారు.

దేశ విదేశాల్లో జరిగే అన్ని టోర్నమెంట్లకు ఆయన కుమార్తెతో వెళ్లాల్సిందే. 1980ల దశకంలో కోనేరు అశోక్ కూడా చెస్ ఆడేవారు. ఆయన సౌత్ఇండియా ఓపెన్, కొన్ని రాష్ట్ర టోర్నమెంట్లలో విజయం సాధించారు. హంపిని ప్రపంచస్థాయి క్రీడాకారిణిగా తీర్చిదిద్దినందుకు 2006లో ఆయనకు 'ద్రోణాచార్య' అవార్డు దక్కింది. క్రీడల కోచ్‌లకు లభించే అత్యున్నత స్థాయి పురస్కారం అది.

రాష్ట్రంలోనూ, దేశంలోనూ అతిచిన్న వయస్సులోనే విజయాలు సాధించిన హంపి తన మొదటి ప్రపంచస్థాయి టైటిల్ 'అండర్-10 ప్రపంచ ఛాంపియన్‌షిప్'ను 1997 లో ఫ్రాన్స్‌లో గెలుచుకుంది. తరువాతి సంవత్సరంలో స్పెయిన్‌లో జరిగిన 'అండర్-12' టైటిల్ చేయిజారిపోగా, రన్నరప్‌గా నిలిచింది. కాని అదే సంవత్సరం అహమ్మదాబాద్‌లో జరిగిన జాతీయ బాలుర టైటిల్‌ను గెలుచుకుని, ఆ ఘనత సాధించిన మొదటి భారతీయ బాలికగా రికార్డు నెలకొల్పింది. తరువాత సంవత్సరం జరిగిన జాతీయ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-14 బాలుర టైటిల్‌ను గెలుచుకుంది.

అంతకుముందు 1998లో ఆసియా సబ్ జూనియర్ బాలుర (అండర్-12) టోర్నమెంట్‌ను హంపి గెలుచుకుంది. ప్రస్తుతం చెస్‌లో ప్రథమ స్థానంలో ఉన్న మహిళా క్రీడాకారిణి హంగేరీకి చెందిన జుడిట్ పోల్గార్ కూడా ఈ ఘనతను సాధించింది. తద్వారా ఇంటర్నేషనల్ బాలుర ఈవెంట్‌ను గెలిచిన రెండవ బాలికగా హంపి రికార్డు నెలకొల్పింది. విశ్వనాథన్ ఆనంద్‌ను కూడా హంపి మించిపోయింది. 14 ఏళ్ల వయస్సు నాటికే నాలుగు ప్రపంచ స్థాయి టైటిళ్లు (అండర్-10, అండర్-12, అండర్-14, వరల్డ్ జూనియర్స్ అండర్-20) గెలుచుకుంది. 1999-2000లో తన ఇంటర్నేషనల్ ఉమెన్స్ మాస్టర్‌ను సాధించే నాటికి హంపి వయస్సు కేవలం 12 సంవత్సరాలు. అత్యధికంగా 23 సార్లు ప్రపంచస్థాయిలో నెంబర్‌వన్ చెస్ క్రీడాకారిణి (బాలికల్లో) గా హంపి విజయ పతాకం ఎగరవేసింది.

అప్పటికి ఏడేళ్లుగా హంపి చెస్ ఆడుతోంది. పురుషుల గ్రాండ్‌మాస్టర్ టైటిల్‌ను కూడా సాధించింది. మహిళా విభాగంలో ఆడుతూ ఉంటే పెద్దగా ముందుకెళ్లలేనని, పురుషుల విభాగంలోనే భవిష్యత్తు ఉందని అప్పుడే హంపి గుర్తించింది. ఇందుకోసం దేశంలో జరిగే జాతీయ మహిళల ఛాంపియన్‌షిప్‌లను కూడా ఆమె వదిలిపెట్టింది.

అంతర్జాతీయ చదరంగపు సంస్థ అయిన ఎఫ్ఐడిఇ చెస్ క్రీడాకారులు సాధించిన ఇఎల్‌వో పాయింట్ల ఆధారంగా పురుషులు, మహిళా క్రీడాకారుల ర్యాంకింగ్‌ను నిర్ణయిస్తుంది. మహిళల ఈవెంట్లు,







## హంపి విజయ పథం

1987: ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా గుడివాడలో జననం
1993: చదరంగపు క్రీడలో ప్రవేశం
1994: విజయవాడలో మొదటి టైటిల్ కైవశం
1997: ఫ్రాన్స్‌లోని కేన్స్‌లో జరిగిన అండర్-10 పోటీల్లో ప్రపంచ టైటిల్ గెలుపు
1998: స్పెయిన్‌లో జరిగిన అండర్-12 పోటీల్లో ప్రపంచ విజేత
1999: స్పెయిన్‌లో జరిగిన అండర్-12 ఛాంపియన్ షిప్స్‌లో ప్రపంచస్థాయిలో రెండవ స్థానం.
1999: 12 సంవత్సరాల నాలుగునెలల వయస్సులో ఇంటర్నేషనల్ ఉమెన్స్ మాస్టర్ టైటిల్ సాధించి, తద్వారా ఆ టైటిల్‌ను సాధించిన అతి చిన్న ఆసియన్‌గా రికార్డు స్థాపన.
1999: అహమదాబాద్‌లో జరిగిన ఆసియా సబ్ జూనియర్ బాలుర పోటీలో టైటిల్ కైవశం. హంపి సాధించిన విజయాల్లో ఇది ముఖ్యమైనది. ఎందుకంటే అప్పటివరకు బాలుర విభాగంలో ఆసియాకు చెందిన ఏ బాలికా టైటిల్ గెలుచుకోలేదు.
2000: అహమదాబాద్‌లో జరిగిన అండర్-14 జాతీయ బాలుర విభాగంలో టైటిల్ గెలుపు సాధించింది. అప్పటివరకు భారతదేశంలో ఏ బాలికా బాలుర విభాగంలో జాతీయ స్థాయి టైటిల్‌ను గెలుచుకోలేదు.
2000: స్పెయిన్‌లో జరిగిన అండర్-14 బాలికల ఛాంపియన్ షిప్స్‌లో ప్రపంచవిజేత.
2001: 2001 జూన్‌లో హంగేరీలో జరిగిన ఏడవ కేటగరీ టోర్నమెంట్‌లో 14 సంవత్సరాల 84 రోజుల వయస్సులో మొదటిసారి పురుషుల గ్రాండ్ మాస్టర్ టైటిల్ కైవశం
2001: యుగోస్లావియాలోని బెల్‌గ్రేడ్‌లో 2001 అక్టోబర్‌లో జరిగిన గ్రాండ్ మాస్టర్ టోర్నమెంట్‌లో 14 సంవత్సరాల 213 రోజుల వయసులో రెండవసారి పురుషుల గ్రాండ్‌మాస్టర్ టైటిల్ కైవశం.
2002: హంగరీలోని బుడాపెస్ట్‌లో 2002 మేలో జరిగిన ఎలెక్స్ మెమోరియల్ గ్రాండ్ మాస్టర్ చెస్ టోర్నమెంట్‌లో మూడవసారి గ్రాండ్‌మాస్టర్ టైటిల్ కైవశం. ఈ టైటిల్‌లో ప్రపంచస్థాయి అగ్రస్థాయి చెస్ క్రీడాకారిణి జుడిత్ పోల్గార్ 15 సంవత్సరాల 4 నెలల 27 రోజుల వయసులో సాధించగా, మన కోనేరు హంపి 15 సంవత్సరాల ఒక నెల 27 రోజుల వయసులో సాధించింది.

## ప్రపంచస్థాయి ఛాంపియన్‌షిప్‌లలో విజయాలు

★ **ప్రపంచ జూనియర్ చెస్ ఛాంపియన్‌షిప్**
(2001), ఏథెన్స్, గ్రీస్. ● మొదటి స్థానం

★ **ప్రపంచ అండర్-14 చెస్ ఛాంపియన్‌షిప్**
(2000), స్పెయిన్ ● మొదటి స్థానం

★ **ప్రపంచ అండర్-12 చెస్ ఛాంపియన్‌షిప్**
(1999), స్పెయిన్ ● రెండవ స్థానం

★ **ప్రపంచ అండర్-12 చెస్ ఛాంపియన్‌షిప్**
(1998), స్పెయిన్ ● మొదటి స్థానం

★ **ప్రపంచ అండర్-10 చెస్ ఛాంపియన్‌షిప్**
(1997), ఫ్రాన్స్ ● మొదటి స్థానం

## గెలుచుకున్న టైటిళ్లు

★ 2001: బెల్‌గ్రేడ్‌లో జరిగిన థర్డ్ శాటర్‌డే గ్రాండ్ మాస్టర్ టోర్నమెంట్
బుడాపెస్ట్‌లో జరిగిన ఫస్ట్ శాటర్‌డే గ్రాండ్ మాస్టర్ టోర్నమెంట్
హంగేరీలో జరిగిన హోటల్ లిపా గ్రాండ్ మాస్టర్ టోర్నమెంట్
బుడాపెస్ట్‌లో జరిగిన ఫస్ట్ శాటర్‌డే గ్రాండ్ మాస్టర్ టైటిల్, (ప్రపంచ గ్రాండ్ మాస్టర్ టైటిల్ కూడా కైవశం)

★ 2000: సంగ్లిలో జరిగిన కామన్‌వెల్త్ చెస్ ఛాంపియన్ షిప్ (అండర్ 16 బాలికల విభాగం)
సోమర్ సెట్‌లో జరిగిన బ్రిటిష్ ఉమెన్ ఛాంపియన్‌షిప్
ముంబైలో జరిగిన ఆసియా జూనియర్ చెస్

★ 1999: మైండ్ స్పోర్ట్స్ ఒలింపియాడ్ (అండర్-21)
మైండ్ స్పోర్ట్స్ ఒలింపియాడ్ (మహిళా విభాగం)
ఆసియా అండర్-12 బాలుర ఛాంపియన్ షిప్, అహ్మదాబాద్.



పురుషుల ఈవెంట్ల కంటే తక్కువ పాయింట్లు కలిగి ఉంటాయి. అందువల్లనే, చదరంగపు క్రీడలో త్వరగా ఎదడడానికి పురుషుల ఈవెంట్లలో ఆడాలని హంపి నిశ్చయించుకుంది. మొన్న జులైలో ప్రకటించిన ర్యాంకింగ్‌ల ప్రకారం హంపి 2623 పాయింట్లు సాధించింది. ఈ ప్రపంచ స్థాయి ర్యాంకింగ్‌ల ప్రకారం జుడిట్ పోల్గార్ తరువాత స్థానం హంపిదే. 2007లో ఎఫ్ఐడిఇ ప్రకటించిన ఇఎల్ఓ పాయింట్ల రేటింగ్‌లను పరిశీలిస్తే, హంపి 2606 పాయింట్ల వద్ద ఉందని తెలుస్తుంది. దీని ప్రకారం కూడా హంపి ప్రపంచంలో రెండవ స్థానంలో నిలిచింది. రెండవ స్థానంలో ఉన్న సుసాన్ పోల్గార్‌ను పక్కకునెట్టి హంపి ఈ ఘనత సాధించింది. 2600 ఇఎల్ఓ పాయింట్లు సాధించిన మహిళా క్రీడాకారిణులు ప్రపంచం మొత్తం మీద ఇద్దరే ఇద్దరు ఉన్నారు. వారు జుడిట్ పోల్గార్, కోనేరు హంపి.

అయితే పురుషుల విభాగంలో పాల్గొనటంపై శ్రద్ధపెట్టిన హంపి మాత్రం పురుష క్రీడాకారులతో పోలిస్తే మహిళా క్రీడాకారులు పెద్దగా ఆడలేరనే అభిప్రాయాన్ని ఎంత మాత్రం అంగీకరించదు. పురుషుల ఈవెంట్లలోకి మరింత మంది మహిళలు ప్రవేశించాలని, అప్పుడవి మరింత పోటీతత్వాన్ని సంతరించుకుంటాయని ఆమె అభిప్రాయపడుతుంది. ఉదాహరణకు, 1999లో గుంటూరులో ఆమె చదివిన పాఠశాల చలపతి రెసిడెన్షియల్ నిర్వహించిన ఒక టోర్నమెంట్‌లో గ్రాండ్‌మాస్టర్, మాజీ జాతీయ ఛాంపియన్ అయిన ప్రవీణ్ తిప్‌సేను హంపి ఓడించింది.

క్రికెట్, టెన్నిస్ వంటి క్రీడల మాదిరిగా, చెస్‌కి స్పాన్సర్ చేయడానికి పెద్దగా ఎవరూ ముందుకు రారు. హంపికి అదే ఒక సమస్య. ఆమె చదరంగపు క్రీడలో అడుగుపెట్టిన తొలి సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడి నుంచి, బ్యాంక్ ఆఫ్ బరోడా, చలపతి రెసిడెన్షియల్ పాఠశాల వంటి సంస్థల నుంచి ఆమెకు మంచి సహాయం, మద్దతు లభించాయి. పాఠశాలలో ఆమెకు అన్ని సదుపాయాలు ఉచితంగా లభించగా, ఉపాధ్యాయులు ఆమె కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించేవారు.

2006 లో దోహాలో జరిగిన ఆసియా క్రీడల్లో మహిళా విభాగపు ర్యాపిడ్‌ఫైర్ చెస్‌లో హంపి బంగారు పతకం సాధించింది. అంతేకాక 2007 లో పద్మశ్రీ అవార్డు, అర్జున అవార్డు, 2008 లో రాజా – లక్ష్మీ అవార్డు కూడా ఆమెను వరించాయి.

హంపి సాధించిన అనేక అవార్డుల్లో 1997లో, 1998లో స్పోర్ట్స్‌స్టార్ యంగ్ అచీవర్ అవార్డులు, 1999లో లండన్‌లో మైండ్ స్పోర్ట్స్ ఒలింపియాడ్‌లో రెండు బంగారు పతకాలు, ప్రతిష్టాత్మకమైన 'యునెస్కో' వారి మిలినియం (డీమర్) అవార్డు ఉన్నాయి.

– దాసు కేశవరావు

– అనువాదం: వై. సరోజ ●






# మహనీయుల చతురోక్తులు

– పోలాప్రగడ సత్యనారాయణమూర్తి

## తెల్లకాగితాల్లో వల్లమాలిన అర్థాలు

**తెలుగు కవితకు వెలుగు దివిటీలు పట్టి, ఆంధ్ర సరస్వతికి అక్షర నీరాజనాలందించి సాహిత్యానికి చేయూతనిచ్చిన ప్రభువులలో రాజరాజనరేంద్రుడు, కృష్ణదేవరాయలు, మనుమసిద్ధి వంటి మహనీయుల తర్వాత పేర్కొనవలసిన వ్యక్తి పిఠాపురం జమీందారులైన శ్రీ రావు వేంకట కుమార మహీపతి సూర్యరాయ బహద్దూరుగారు. ఆంధ్ర సాహిత్య పరిషత్తుకి ప్రధాన పోషకులై సూర్యరాయాంధ్ర నిఘంటువు కొరకు తన యావదాస్తినీ వినియోగించిన మహోదారుడాయన.**

– స్వతహాగా గ్రాంథిక భాషావాదే అయినా, ఆయన్ని ఆశ్రయించడానికి నవకవులు కూడా కొందరు పిఠాపురం వచ్చేవారు. అలా ఓ మారు ఆయన ఆస్థానానికి ఒక నవ్య కవి వచ్చి, తన కావ్యాన్ని వినిపించారు. సభలో పానుగంటి, దర్భా, వెంపరాల వంటి దిగ్దంతులు కూర్చుని ఉన్నారు. వచ్చిన కవిగారు, అద్భుతమైన అనుభూతిని వర్ణించవలసి వచ్చిన సందర్భంలో, చుక్కలూ, గీతలూ ఉపయోగించి, అదేమిటంటే, "నా భావం చాలా బరువైంది. అక్షరాలూ, శబ్దాలూ దాన్ని మొయ్యలేవు. అందువల్ల చుక్కలూ, గీతలూ పెట్టాను. వాటి భావం అపరిమితం. మీరే అర్థం చేసుకోండి" అన్నారు. పెద్దలంతా తెల్లబోయి ఊరుకున్నారు.

పానుగంటివారు మాత్రం అలా ఊరుకోలేదు. మర్నాడు ఓ బైండు బుక్ పట్టుకు వచ్చి "ఇది నా మహాకావ్యం. చిత్తగించండి" అంటూ సూర్యారావుగారికి ఇచ్చారు. జమీందారుగారు పేజీలు త్రిప్పి "ఇదేవిటి? ఇందులో ఏం లేదు. తెల్లకాగితాల పుస్తకం ఇది" అన్నారు. దానికి పానుగంటివారు "కాదు మహాప్రభో! నిన్నటి కవిగారి భావాల్ని, చుక్కలైనా మొయ్యగలిగాయి. నా భావాలు ఇంకా బలమైనవి. చుక్కలు కూడా మొయ్యలేవు. అందువల్ల చుక్కలు కూడా పెట్టకుండా వదిలేశాను. ఇది నా మహాకావ్యమే" అన్నారు.

జమీందారుగారితో సహా అందరూ పానుగంటివారి కొంటెతనానికి ఫక్కున నవ్వారు "అవును మరి –అక్షరాలకి అర్థం పరిమితం –తెల్ల కాగితాలకి అపరిమితం" అనుకుంటూ. ☆

## పద్యమో, వైద్యమో చంపడం ముఖ్యం

**కంఠాభరణం వంటి నాటకాల ద్వారానూ, సాక్షి వ్యాసాల ద్వారానూ ఒకనాడు ఆంధ్ర ప్రేక్షక, పాఠకలోకాన్ని ఉర్రూతలూగించిన శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావు స్వతహాగా మాటకారీ, చతుర వచో విలాస సంపన్నుడూను.**

ఆనాటి ఆయన చతురోక్తుల్ని తమ చతురోక్తులుగా ఇవాళ ఎందరో చలామణి చేసుకోవడం జరుగుతోంది.

ఓనాడు పానుగంటి వారి దర్శనానికి ఒక వ్యక్తి వచ్చి, స.ప.స.సా అని నాలుగు పొడి అక్షరాలు ఒక కాగితం మీద రాసి లోపలికి పంపాడు. అతణ్ణి లోపలికి రమ్మని పానుగంటివారు కబురంపారు.

అతను లోపలికి వచ్చాడు. అతణ్ణి చూస్తూనే పానుగంటివారు –

"నువ్వటోయ్ సాంబయ్యా" అన్నారు.

"చిత్తం" అన్నాడతను.

"ఈ పొడి అక్షరాలేమిటి?"

"నా బిరుదులూ, నాపేరూనండి."

"స.ప.స.సా అంటే."

"సహజ పండిత సంపద సాంబయ్య"

"ఓయి నీ అసాధ్యంగూల! ఎవరిచ్చారీ సహజ పండిత బిరుదు?"

"ఎవరూ ఇవ్వలేదండి, స్వయంగా నేనే తొడుక్కున్నాను."

"అలాగా? నువ్వు పూర్వం వైద్యం చేసే వాడివి కదా, ఇప్పుడు చేస్తున్నావా?"

"లేదండి – మానేశాను."

"మరేం చేస్తున్నావు?"

"వైద్యం మానేసి కవిత్వం రాస్తున్నా" నన్నాడు సాంబయ్య.

వెంటనే పానుగంటివారు –

"ఏదైతేనేంలే, మనుష్యుల్ని చంపడానికి" అన్నారు తాపీగా. ☆

## విశ్వనాథ విసుర్లు

**ఆనాటి కళాశాలలు నిజంగా కళాత్మకంగా వుండేవి. సమర్థులైన ప్రిన్సిపాల్స్, నిష్ణాతులైన లెక్చరర్లు – విజ్ఞానతృష్ణ గల విద్యార్థులు. లోకంలో జరిగే ఎన్నో విశేషాలు. లోకజ్ఞతతో కూడిన ఎన్నో కబుర్లు, మధ్య మధ్య మాట విరుపులు. అంతలోనే పంతాలు–పందేలు–పట్టుదలలు. అతణ్ణిమించి ఇతడు – ఇతగాణ్ణి మించి అతగాడు.**

ఓ లెక్చరర్ వచ్చి క్లాసులో ఓ జోకు విసిరితే మరో లెక్చరర్ వచ్చి ఆ జోకుకి మరో జోకు జోడించడమో, తిప్పి కొట్టడమో చేసేవారు.

ఈ పోటీ ముఖ్యంగా విజయవాడ ఎస్.ఆర్.ఆర్.సి.వి. ఆర్. కాలేజిలో పనిచేసే ఇద్దరు మహామహులమధ్య మరీ వుండేది.

ఒకరు ఆంగ్లోపన్యాసకులైన జొన్నలగడ్డ సత్యనారాయణగారూ, మరొకరు ఆంధ్రోపన్యాసకులైన కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారూ.

ఇద్దరూ మంచి మిత్రులే – పరస్పరం గౌరవం వున్నవారే.

ఓ రోజున జొన్నలగడ్డవారు మాటల సందర్భంలో "మీరు తెలుగేం నేర్చుకుంటున్నారురా – సమ్ రాట్! అవునా?" అన్నారు, కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారిని మనస్సులో పెట్టుకుని – ఆ మాట ఏ విద్యార్థో వెళ్ళి విశ్వనాథ చెవిలో ఊదాడు. ఆ తర్వాత క్లాసుకి ఆయన వచ్చి'

"శ్రీ నాథుడు ఏమన్నాడంటే –

*'జొన్నకలి – జొన్న అంబలి – జొన్నన్నమ్ జొన్నపిసరు –*

*జొన్నలె తప్పన్ సన్నన్నము సున్నసుమీ. . . '*

అంటూ రాగయుక్తంగా పాడి జొన్నలగడ్డవారిని స్ఫురింపజేసి క్లాసంతా నవ్వులతో ముంచెత్తారు.

☆

## గ్రామీణాభివృద్ధి పథకాలపై ఫిర్యాదులకు

# టోల్ ఫ్రీ నెంబర్ 155321

**గ్రామీణాభివృద్ధి పథకాలకు సంబంధించి ఎదురవుతున్న పలు సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. పథకాలకు సంబంధించిన సమస్యలు, అవకతవకలు, తదితరాలపై ఫిర్యాదులు చేయడానికి వీలుగా 155321 టోల్ ఫ్రీ నెంబర్‌తో ఈ కాల్‌సెంటర్ ఏర్పాటైంది. సెప్టెంబర్ 19వ తేదీన గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శ్రీ వట్టి వసంత్‌కుమార్ ఈ కాల్ సెంటర్‌ను ప్రారంభించారు.**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని పథకాలు చాలా బాగా అమలు జరుగుతున్నాయని, అయినా అక్కడక్కడ లోపాలు తలెత్తడం సహజమని, చిన్న చిన్న లోపాలతో కూడా లబ్దిదారులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశ్యంతో ఫిర్యాదుల కోసం ఈ కాల్‌సెంటర్‌ను ప్రారంభించామని వివరించారు.



ఉపాధిహామీ, ఇందిరాక్రాంతి పథం, పావలా వడ్డీ, అభయహస్తం, ఫించన్లు, ఇందిరమ్మ, ఇందిర జీవిత బీమా, తదితర పథకాలపై ఏవయినా ఫిర్యాదులున్నా, సమస్యలున్నా 155321 అనే టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్‌చేసి వివరాలు తెలియజేయవచ్చని మంత్రి తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పని కల్పించకపోయినా, చేసిన పనికి సకాలంలో డబ్బు చెల్లించకపోయినా, పనుల్లో ఎక్కడైనా అవకతవకలు, అవినీతి జరిగినా బిఎస్ఎన్ఎల్ ఫోన్‌తో టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్‌చేసి తెలియజేయవచ్చని శ్రీ వసంతకుమార్ చెప్పారు.

కాల్ సెంటర్‌లోని ప్రతినిధులు ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత అధికారికి తెలియజేసి తగిన చర్యలు చేపడతారని, ఫిర్యాదు అనంతర పరిణామాలను, ఫలితాలను ఫిర్యాదుదారులకు ఫోన్ ద్వారా, ఎస్.ఎం.ఎస్ ద్వారా తెలియజేస్తారని మంత్రి వివరించారు.

రోజుకి 500 కాల్స్‌ను రికార్డు చేసే సామర్థ్యం ఈ కాల్ సెంటర్‌కి ఉందని, ప్రస్తుతానికి బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ ద్వారా ఉచితంగా కాల్ సెంటర్‌కి ఫోన్ చేయవచ్చని, రెండు మూడు నెలల్లో ఇతర నెట్‌వర్క్‌ల ఫోన్ల నుంచి కూడా ఉచిత సదుపాయం కల్పిస్తామని శ్రీ వసంత్‌కుమార్ చెప్పారు. 108, 104 సర్వీసుల్లాగా ఈ కాల్ సెంటర్ కూడా తక్షణమే స్పందిస్తుందని, ఫిర్యాదులు తెలియజేయవచ్చని ఆయన వివరించారు. ఆదివారాల్లోనూ ఈ కాల్ సెంటర్ పనిచేస్తుందని, కొన్ని ప్రత్యేకమైన పండుగల సమయంలో మాత్రం సెలవు ఉంటుందని ఆయన చెప్పారు.

ప్రజలు ఫిర్యాదు చేసిన వెంటనే ఆన్‌లైన్‌లో సంబంధిత అధికారులకు ఫిర్యాదు వెళ్తుందని, వారు దానిపై విచారణచేసి ఫిర్యాదు పరిష్కరిస్తారని మంత్రి చెప్పారు. కాల్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి తానే మొదటి కాల్ చేశారు. కాల్ సెంటర్ నుంచి స్పందించిన అధికారి వెంటనే ఆ ఫిర్యాదు స్వీకరించారు.

నంద్యాలలోని బ్యాంక్ మేనేజర్ ఐకెపీ మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించారని, ఈ సమస్య పరిష్కారానికి ఏం చేస్తారని మంత్రి కాల్ సెంటర్ అధికారులను ప్రశ్నించారు. అందుకు వారు స్పందిస్తూ, సంబంధిత అధికారులకు మెసేజ్ పంపిస్తామని చెప్పారు.

గ్రామీణాభివృద్ధి శాఖలోని సొసైటి ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ ఉద్యోగులకు జీవిత బీమా పథకాన్ని కూడా మంత్రి ప్రారంభించారు. ఇందులో పనిచేస్తున్న 6000 మంది ఉద్యోగులకు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు మంత్రి చెప్పారు. వీరంతా ఉద్యోగుల సొసైటీ సంక్షేమ నిధి ద్వారా బీమా సౌకర్యాన్ని పొందనున్నారు. బీమా సంస్థలతో సంబంధం లేకుండా ప్రభుత్వరంగ సంస్థల్లో ఈ తరహా బీమా సౌకర్యం కల్పించడం ఇదే మొదటిసారని మంత్రి చెప్పారు.

ఉద్యోగి సహజ మరణం, శాశ్వత వైకల్యం పొందితే 5 లక్షల రూపాయలు, ఉద్యోగి కుటుంబంలోని నలుగురికి 3 లక్షల రూపాయల వరకు ఏటా వైద్య బీమా తదితర సదుపాయాలు ఈ పథకం కింద కల్పిస్తారు. ఇందులో ఉద్యోగి 1500 రూపాయలు చెల్లిస్తే, ప్రభుత్వం మరో 1500 రూపాయలు చెల్లిస్తుంది.

– ఆర్.కె.



కీర్తి శేషులు

## డా. పి. సుబ్రహ్మణ్యం గారు....

# గిరిజనాభివృద్ధికై చేసిన కృషి

**సెప్టెంబర్ 2, 2009 నాడు నల్లమల అడవులలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో డా. పి. సుబ్రహ్మణ్యం గారు చనిపోయినందుకు చింతిస్తున్నాము. ఎంతో కష్టపడి చదువుకుని 1983 బాచ్‌లో ఐ.ఏ.యస్. కు ఎంపిక అయ్యారు. తరువాత డాక్టరేటు పట్టాను కూడా పొందారు. సహృదయులు, మితభాషి. అందరిని చిరునవ్వుతో పలుకరించడం వారి ప్రత్యేకత. వారి మరణంతో రాష్ట్ర ప్రభుత్వం ఒక మేధావి, నిజాయితీపరుడైన అధికారిని కోల్పోయింది. నేను ఒక మంచి మిత్రుడిని కోల్పోయాను.**

మహబూబ్ నగర్ జిల్లాలో 1984లో అసిస్టెంట్ కలెక్టరుగా శిక్షణ పొందుతున్నప్పుడు ఆయన నల్లమల అడవులలోని అమరాబాద్ ప్రాంతంలో చెంచుల సమస్యలపై రాసిన వ్యాసం అందరి దృష్టిని ఆకర్షించింది. ముఖ్యంగా చెంచుల భూమి సమస్య, ఆహార-ఆరోగ్య సమస్యలపై వారు తెలిపిన విషయాలపై ప్రభుత్వం వెంటనే స్పందించి మన్ననూర్‌లో 'మాడా' ఆఫీసు నెలకొల్పిందన్న విషయం కొద్ది మందికే తెలుసు. నిజామాబాద్ జిల్లాలో సబ్ కలెక్టర్‌గా పనిచేసినప్పుడు జోగినుల సమస్యపై స్పందించి ఎన్నో పునరావాస కార్యక్రమాలు చేపట్టారు. తరువాత 1987సెప్టెంబర్‌లో ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు కేంద్రంగా గల సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థకు ప్రాజెక్టు అధికారిగా చేరేరు. అప్పటి నుంచి సుమారు మూడేళ్ళు (27-09-1987 నుండి 22-06-1990) ఆయన తిరగని గిరిజన గ్రామం లేదు. కలవని గిరిజనుడులేదు అనేది అతిశయోక్తి కాదు. చేరిన కొద్ది కాలంలోనే 'గోండి' గిరిజన భాషను నేర్చుకున్నారు. తెలుగురాని గోండు మహిళలతో వారు గోండి భాషలో, వారి పడికట్టు మాటలతో మాట్లాడి వారికి స్నేహపాత్రుడు అయ్యారు. వారి సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కారాలు యోచించి, సాధ్యమైనంత తొందరలో అమలు పరిచేవారు. 1987-88 ప్రాంతంలో వారితో పాటు అదనపు ప్రాజెక్టు అధికారిగా అదే కార్యాలయంలో పనిచేయటం నాకు సంతోషం కలిగించిన ఉద్యోగాలలో ఒకటి.

గిరిజనుల భూమి, అడవి సమస్యలు తీరనంత కాలం వారిలో అలజడి తగ్గదని ప్రగాఢంగా నమ్మేవారు. గిరిజనుల్లో బాగా వెనుకబడిన కొలాంజాతి అభివృద్ధికి ఎంతో కృషి చేసేరు. గిరిజనుల విద్యాభివృద్ధికి కూడా ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు.

కొంత కాలం సెక్రటేరియట్‌లో, మరి కొంతకాలం బంగ్లాదేశ్‌లో పనిచేసిన తరువాత ముఖ్యమంత్రి కార్యాలయంలో సెక్రటరీగా చేరిన దగ్గర నుంచి గిరిజనుల సమస్యలపై దృష్టి సారించారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన అటవీ హక్కుల చట్టం అమలు వేగవంతం చేయటం కోసం ముఖ్య మంత్రిగారికి తగిన సమయంలో తగిన సలహాలు ఇవ్వటంద్వారా, మన రాష్ట్రంలో- ఇప్పటకే 13.66 లక్షల ఎకరాలపై 1.73 లక్షల గిరిజన కుటుంబాలకు హక్కు కల్పించటానికి కారకులు అయ్యారు.

ఆంధ్రప్రదేశ్ గిరిజనులు, ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లా గిరిజనుల హృదయాలలో ఎప్పటికి సుబ్రహ్మణ్యం గారు ఒక ఆత్మీయుడుగా నిలిచిపోతారు.

**డా. వి.ఎన్.వి.కె. శాస్త్రి, సలహాదారు (ప్రచురణలు), అపార్డ్.**

Printed & published by Phani Kumar, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. **Editor : Phani Kumar**



# గ్రామీణ కథలు, హాస్యకథల పోటీ

సాహిత్య ప్రక్రియల్లో కథ స్థానం కథదే. అయితే, రాను రాను హృదయాన్ని తాకే మంచి కథలు కరువయిపోతున్నాయి. అందువల్ల మంచి కథకి పట్టం కట్టాలని 'స్థానిక పాలన' పత్రిక నిర్ణయించింది.

ఈ దీపావళి సందర్భంగా గ్రామీణ కథలు, హాస్య కథలు అనే రెండు విభాగాల్లో పోటీ నిర్వహిస్తున్నాం. గ్రామీణ నేపథ్యం ఉండి, గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే కథలు ఒక విభాగంలోను, హాస్య కథలను మరొక విభాగంలోను పరిగణనలోకి తీసుకోవటం జరుగుతుంది.

## బహుమతుల వివరాలు

*రెండు విభాగాలకు విడివిడిగా ఈ కింద పేర్కొన్న బహుమతులుంటాయి.*

| | |
|---|---|
| ఉత్తమ గ్రామీణ కథ | రూ.15, 000 |
| ఉత్తమ హాస్య కథ | రూ.15, 000 |
| ద్వితీయ ఉత్తమ గ్రామీణ కథ | రూ.10,000 |
| ద్వితీయ ఉత్తమ హాస్య కథ | రూ.10,000 |
| తృతీయ ఉత్తమ గ్రామీణ కథ | రూ. 8,000 |
| తృతీమ ఉత్తమ హాస్య కథ | రూ. 8,000 |
| ప్రతి విభాగంలో మూడు కన్సోలేషన్ బహుమతులు (ఒక్కొక్క కథకి) | రూ. 5,000 |
| సాధారణ ప్రచురణకు ఎంపికైన గ్రామీణ, హాస్య కథలకు | రూ. 2,000 |

## గ్రామీణ, హాస్య కథల పోటీకి కథలు పంపే రచయిత(త్రు)లు ఈ కింది సూచనలను గమనించాలి:

☆ కథలు కింద పేర్కొన్న చిరునామాకు నవంబర్ 1వ తేదీ లోగా అందే విధంగా పంపాలి.
☆ ఒక్కొక్కరు ఎన్ని కథలయినా పంపవచ్చు ☆ రెండు విభాగాల పోటీలలోను పాల్గొనవచ్చు.
☆ కథ రాతప్రతి మీద కథ పేరు మాత్రమే ఉండాలి. రచయిత పేరు కథకి జతపరిచే హామీ పత్రంలో వుంటే చాలు.
☆ కథ నిడివి చేతి రాతలో A4 సైజు కాగితాల్లో 6 పేజీలు మించకూడదు. సైజుకు మించిన కథలను పరిశీలించటం సాధ్యపడదు.
☆ పేజీకి ఒక పక్క మాత్రమే, దస్తూరీ అర్థమయ్యే విధంగా, స్పష్టంగా రాయాలి.
☆ సామాజిక అంశాలతో పాటు అన్ని అంశాలపై కథలు పంపవచ్చు. అశ్లీలత, అసభ్యత, కులమతాలను రెచ్చగొట్టే ధోరణులు, రాజకీయాలు, వ్యక్తిగత దూషణ, వెకిలితనం లేకుండా ఉండే కథలు పంపాలి.
☆ పోటీకి పంపే కథలు తెలుగు సంస్కృతికి దగ్గరగా ఉండాలి. అరువు తెచ్చుకున్న కథాంశాలు, విదేశీ సంస్కృతీ కథలో ప్రతిఫలించకూడదు. అనుకరణ పాత్రలతో కూడిన కథాంశాలకు దూరంగా ఉండాలి.
☆ ఎంపిక కాని కథలపై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు ఉండవు. ఎంపికకాని పక్షంలో తమ కథలను త్రిప్పి పంపాలని కోరుకునేవారు అందుకు అవసరమైన స్టాంపులు అంటించిన కవర్లను కూడా తప్పక జతచేయాలి.
☆ న్యాయనిర్ణేతల కమిటీ మాత్రమే బహుమతి పొందే కథలను నిర్ణయిస్తుంది.
☆ ఎంపికైన కథలు 'స్థానిక పాలన' పత్రికలో ప్రచురితమవుతాయి.
☆ ఫలితాలను డిసెంబర్ 2009 'స్థానిక పాలన' పత్రికలో చూడవచ్చు.


చిరునామా:
ఎడిటర్, **'స్థానిక పాలన'**
ఎ.ఎం.ఆర్. అపార్డ్, రాజేంద్రనగర్,
హైదరాబాద్-500 030. ఆంధ్రప్రదేశ్, ఇండియా.
ఫోన్: 040-24018656, ఫ్యాక్స్: 040-24017005
E-mail: phanikumar@ap.gov.in




# మూడు రోజుల ఉత్సవం దీపావళి



Printed at: Caxton Offset Pvt. Ltd., Hyd.